

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 34

శుక్రవారం 26-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 34

శుక్రవారం 26-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+10 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 34

శుక్రవారం 26-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



పసిడి పోరుకు ధీరజ్ టీమ్

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–1 టోర్నీ రికర్వ్ టీమ్ విభాగంలో ఫైనల్స్‌కు భారత్ - 11లో




6,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్

ఈ ఏడాది టెక్ మహీంద్రా ప్రణాళిక.. త్రైమాసిక ఫలితాలు విడుదల - 11లో

ల్యాండ్ టైట్లింగ్ చట్టం చేయాలని చెప్పింది కేంద్రమే

2019లో ముసాయిదా చట్టం చేసిన కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం



- దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం చేయాలని సిఫారసు
- ఆ క్రమంలో తొలిసారి చట్టం చేసిన ఏపీ
- బీజేపీ అన్ని రాష్ట్రాల్లో చేయాలని చెబుతున్న చట్టాన్ని వ్యతిరేకిస్తున్న బాబు
- ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని ఆ పార్టీ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వైనం
- స్వార్థం కోసం ప్రజలకు అవసరమైన చట్టంపై దుష్ప్రచారం
- వాస్తవానికి ఈ చట్టం గెజిట్ మాత్రమే విడుదలైంది
- నిబంధనలు, మార్గదర్శకాలు వచ్చాకే అమలు
- అయినా అమలు జరిగి పోతుందంటూ విష ప్రచారం

2 లో



వైఎస్సార్ జిల్లా పులివెందులలో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

మన కల్చర్

మంచి చేయడమే.. మాట తప్పకపోవడమే

పులివెందుల బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- తెలుగు నేలపై నమ్మకాన్ని అణువణువునా నింపింది పులివెందుల బిడ్డలే
- పులివెందులంటే ఓ నమ్మకం, అభివృద్ధి, సక్సెస్ స్టోరీ
- టీడీపీ మాఫియా దుర్మార్గాలను ఎదిరించే ధైర్యాన్నిచ్చింది
- ప్రతి కష్టంలోనూ నా వెంట నడిచింది
- మీ బిడ్డను ఎదుర్కోలేక బాబు, దత్తపుత్రుడు, వదినమ్మ, ఎల్లోమీడియా ఏకమయ్యారు.. వారి కుట్రలో నా ఇద్దరు చెల్లెళ్లూ భాగస్వాములయ్యారు
- వైఎస్సార్ లెగసీ లేకుండా చేయాలని చూసిన పార్టీలో చేరారు.. వైఎస్సార్ శత్రువులతో చేతులు కలిపి మోకరిల్లిన వీళ్లా వైఎస్సార్ వారసులు?
- మహానేతకు వారసులు ఎవరనేది ప్రజలే చెప్పాలి
- పథకాలు, ప్రజలకు మంచి చేయడంలో మీ జగన్‌ను ఎవరూ కొట్టలేరు

7 లో



సీఎం వైఎస్ జగన్ నామినేషన్ దాఖలు 7 లో

వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఆర్వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలపై సంతకం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

28 నుంచి సీఎం జగన్ ఎన్నికల ప్రచారం

తాడిపత్రిలో ఉదయం నిర్వహించే సభతో ప్రచారానికి శ్రీకారం 2 లో

ప్రతి రోజూ 3 నియోజకవర్గాల్లో సభలు

రేపు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల

వైఎస్సార్‌సీపీలోకి కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి

మాజీమంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు శ్రీనాథరెడ్డి దంపతులు కూడా..

సీఎం జగన్ సమక్షంలో చేరిక 8 లో



ముస్లిం రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమే!

- పరోక్షంగా స్పష్టం చేసిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ రిజర్వేషన్లనే ఆమోదిస్తాం
- ఇవి కాకుండా మరే రిజర్వేషన్లనైనా వ్యతిరేకిస్తామని స్పష్టీకరణ
- గత ఐదేళ్లలో ఏపీలో అభివృద్ధి నిలిచిపోయిందని వ్యాఖ్య
- చంద్రబాబుతో గంటకు పైగా కేంద్ర మంత్రి భేటీ

10 లో



జేఈఈలో తెలుగువెలుగులు

- దేశవ్యాప్తంగా మొత్తం వంద పర్సంటైల్ సాధించినవారు 56 మంది.. వీరిలో 22 మంది తెలుగు విద్యార్థులు
- జేఈఈ మెయిన్ రెండు సెషన్లలో 14.10 లక్షల మంది హాజరు
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2,50,284 మంది ఎంపిక.. 27 నుంచి అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- మే 26న అడ్వాన్స్‌డ్ పరీక్ష.. జూన్ రెండో వారంలో ఫలితాలు

9 లో

కొనసాగుతున్న వడగాడ్పులు

మరో మూడు రోజులు ప్రభావం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం కూడా పలుచోట్ల 43–45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 72 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 102 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. శుక్రవారం 56 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 174 మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. శనివారం 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 170 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం నంద్యాల జిల్లా నందవరంలో 45.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రాజాం (విజయనగరం)లో 45.5, కొండయ్యగూడెం (అల్లూరి జిల్లా)లో 45.1, కాజీపేట (వైఎస్సార్)లో 44.7, కోడుమూరు (కర్నూలు)లో 44.2, దేవరాపల్లి (అనకాపల్లి)లో 44.1, నందరాడ (తూర్పు గోదావరి), రావిపాడు (పల్నాడు), కొల్లివలస (శ్రీకాకుళం)లలో 44 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో పలుచోట్ల 43–44 డిగ్రీలు, కొన్నిచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశాలున్నాయి. కోస్తాంధ్రపై ఉన్న ఉపరితల ఆవర్తనం గురువారం బలహీన పడింది. ఈ ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర కోస్తా తమిళనాడు ఉత్తర కర్ణాటక వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం ఉత్తర కోస్తాంధ్రలో ఒకట్రెండుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉంది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.4	28.3
కర్నూలు	43.7	28.3
కడప	42.6	26.8
విజయవాడ	42.0	28.0
మార్కాపురం	42.0	27.0
రాజమహేంద్రవరం	42.0	26.0
ఏలూరు	42.0	25.0
తిరుపతి	42.0	23.0
నెల్లూరు	41.2	27.6
విజయనగరం	40.0	35.0
విశాఖపట్నం	39.0	26.0

ల్యాండ్ టైట్లింగ్ చట్టం చేయాలని చెప్పింది కేంద్రమే

2019లో ముసాయిదా చట్టం చేసిన కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం

దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం చేయాలని సిఫారసు

ఈ చట్టం కోసం 40 ఏళ్లుగా ప్రయత్నాలు

ప్రస్తుతం బ్రిటిష్ హయాంలో రూపుదిద్దుకున్న భూ రికార్డులే ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. బ్రిటిష్ వాళ్లు భూమి శిస్తు వసూలు కోసం భూ రికార్డులు తయారు చేశారు. ఆ రికార్డులతో భూ యజమానులకు ఊహాజనిత హక్కులే ఉన్నాయి. దీనివల్ల ఎవరైనా, ఎప్పుడైనా ఆ హక్కుల్ని సవాల్ చేసే పరిస్థితి నెలకొంది. అందుకే కచ్చితమైన హక్కులు ఇచ్చేలా టైటిల్ గ్యారంటీ చట్టాన్ని తేవాలని 40 ఏళ్లుగా దేశంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక కచ్చితమైన హక్కులతో ఆధునిక భూ రికార్డులు తయారు చేయాలనే ఉద్దేశంతో లాండ్ టైట్లింగ్ చట్టాన్ని ప్రతిపాదించింది. అన్ని రాష్ట్రాలూ అమలు చేయాలని సూచించింది. దాని ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని రూపొందించింది.



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టంపైనా చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారానికి దిగింది. ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే లాండ్ టైట్లింగ్ చట్టాన్ని నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. ఈ మేరకు 2019లో కేంద్రం ఓ ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని సూచించింది. దీనికి అనుగుణంగానే ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా కట్టుదిట్టమైన చట్టాన్ని రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూపొందించింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ చట్టం రాలేదు. వాస్తవంగా ఈ చట్టం ఇంకా రాష్ట్రంలో అమలులోకి రాలేదు. గెజిట్ మాత్రమే జారీ చేసింది. అమలుకు అవసరమైన నిబంధనలు, మార్గదర్శకాలను ఇంకా జారీ చేయలేదు. అవి జారీ అయ్యాక చట్టం అమలవుతుంది. ఇంకా ఏమీ లేకుండానే టైటిల్ రిజిస్టర్ అధికారిగా ఎవరు ఉంటారో తెలియకుండానే, చాలా అంశాలపై స్పష్టత రాకుండానే దానిపై రాజకీయ, స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు బ్యాచ్ దుష్ప్రచారం చేయడం విస్మయం కలిగిస్తోంది.

ఇదేమి తీరు బాబూ..

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో తేవాలని చెబుతున్న చట్టాన్ని చంద్రబాబు వ్యతిరేకించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకొని అదే బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన చట్టాన్ని వద్దనడం ఏమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని రద్దు చేస్తామని కూడా చంద్రబాబు నిస్సిగ్గుగా ప్రకటించారు. దీన్నిబట్టి చంద్రబాబుకి ఒక విధానం అంటూ ఏమీ ఉండదన్న విషయం మరోసారి నిరూపించుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్రం చెప్పిన చట్టాన్ని కేవలం భూములు కొల్లగొట్టడానికి చేస్తున్న చట్టంగా ఆయన చిత్రీకరిస్తుండటం చంద్రబాబు విపరీత పోకడలకు నిదర్శనమే. కేవలం జగన్ ప్రభుత్వం తెచ్చిన చట్టంపై ప్రజల్లో దుష్ప్రచారం చేసి, లబ్ధి పొందడమే బాబు లక్ష్యమని, ఇక్కడ కూడా ప్రజల మేలు ఆయనకు పట్టదని టీడీపీ నేతలే చెబుతున్నారు. భూ రికార్డుల వ్యవస్థను సమూలంగా మార్చి, భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ మారడం ఆయనకు ఇష్టం లేదని, ప్రజలు భూ వివాదాలతో కునారిల్లిపోవాలని ఆయన కోరుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి ఎల్లోమీడియా వంతపాడుతూ రాష్ట్రానికి ఎంతగానో ఉపయోగపడే చట్టంపై ప్రజల్లో వ్యతిరేకత కలిగేలా అడ్డగోలు వాదనలు చేస్తూ స్వార్థ శక్తులకు అనుకూలంగా కథనాలు రాస్తోంది. అసలు చట్టం, దానిలో వాస్తవాలను పరిశీలిస్తే..

కోర్టుల్లో సవాల్ చేయడం కుదరదనేది అపోహే

ఆస్తికి సంబంధించి టీఆర్‌వో చేసిందే తుది నిర్ణయమని, దాన్ని సాధారణ సివిల్ కోర్టుల్లో సవాల్ చేయడం సాధ్యం కాదనే ప్రచారం నిజం కాదు. టీఆర్‌వో టైటిల్ రిజిస్టర్‌ను నిర్వహించేది ఒక క్లర్క్ మాత్రమే. టైటిల్ అప్పిలేట్ అథారిటీ చెప్పింది చేయడం తప్ప దేనిపైనా సొంతంగా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉండదు. రిజిస్ట్రేషన్లు, కోర్టు ఆర్డర్ల ప్రకారమే రిజిస్టర్‌లో అతను మార్పులు చేసే వీలుంటుంది. అభ్యంతరం ఉంటే అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. అప్పటికీ సంతృప్తి చెందకపోతే హైకోర్టును ఆశ్రయించవచ్చు.

ఆస్తిని టీఆర్‌వో వివాదాల రిజిస్టర్‌లో చేరిస్తే దానిపై హైకోర్టులో తప్ప కింది కోర్టుల్లో సవాలు చేయడానికి అవకాశం ఉండదనే ప్రచారం కూడా నిజం కాదు. ఏదైనా ఆస్తిని వివాదాల రిజిస్టర్‌లో చేర్చడంపై అభ్యంతరం ఉంటే అప్పిలేట్ అథారిటీ దగ్గర అప్పీల్ చేసుకోవచ్చు. అక్కడా న్యాయం జరగలేదనుకుంటే హైకోర్టుకు వెళ్లవచ్చు. ఆస్తికి సంబంధించిన అన్ని వ్యవహారాలు టీఆర్‌వో కనుసన్నల్లోనే ఉంటుందని ప్రజలను భయపెట్టేలా ప్రచారం చేస్తున్నారు. టైటిల్ రిజిస్టర్‌లో రికార్డులు భద్రంగా, సురక్షితంగా ఉంటాయి. అత్యంత కట్టుదిట్టంగా, పారదర్శకమైన విధానంలో టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి వాటిని నిర్వహిస్తారు. టీఆర్‌వో అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే లేదా ఎంపీ చేతిలో ఉంటారని, రికార్డును ఎప్పుడైనా మార్చేయవచ్చన్నది కూడా విష ప్రచారమే. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు ఉన్నట్టే టీఆర్‌వో కూడా ఉంటారు. ఇప్పుడున్న రెవెన్యూ అధికారులు ఇష్టం వచ్చినట్లు భూమి రికార్డులు మార్చేస్తున్నారా? సెటిల్మెంట్ రికార్డు (ఆర్ఎస్ఆర్)ను రెవెన్యూ వ్యవస్థే తయారు చేసింది. ప్రస్తుతం భూములకు సంబంధించిన బలమైన సాక్ష్యం ఆ రికార్డే. అందులో కోర్టు జోక్యం లేదు. ఈనాం రైత్వారీ పట్టాలిచ్చింది వాళ్లే. ఎస్టేట్ అబాలిషన్ కింద తుది హక్కులు నిర్ధారించింది రెవెన్యూ అధికారులే. ఇప్పుడున్న రికార్డులన్నీ రెవెన్యూ తయారు చేసినవే. అలాంటప్పుడు లాండ్ టైట్లింగ్ చట్టం ప్రకారం కొత్త రికార్డులు తయారు చేసే పనిని వారికి కాకుండా ఎవరికి ఇస్తారు? టైటిల్ రిజిస్టర్ ఆన్‌లైన్‌లో ఉంటుంది. అందులో ఏమైనా మార్పులు చేయాలంటే అది అప్పిలేట్ అథారిటీ లేదా కోర్టు ఆర్డర్ ద్వారానే జరుగుతాయి తప్ప వేరే విధంగా అవకాశం ఉండదు. అది కూడా ఆటో మ్యుటేషన్ ద్వారానే జరుగుతాయి. ఇంతకంటె పారదర్శకం, పటిష్టమైన విధానం ఏముంది? లాండ్ టైట్లింగ్ యాక్ట్ వచ్చింది వివాదాలు లేని సమాజాన్ని తీసుకువచ్చి ప్రజలను ఆ వివాదాల నుంచి విముక్తి చేయడం కోసమే.

టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి సర్వస్వం కాదు

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం ప్రకారం నియమితుడయ్యే భూ ప్రాధికార సంస్థ, టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్‌వో) పరిధిలోకి ప్రజల స్థిరాస్తులన్నీ వెళ్లిపోతాయన్నది తప్పుడు ప్రచారమే. లాండ్ టైట్లింగ్ అప్పిలేట్ అథారిటీ ఆర్డర్ లేకుండా టీఆర్‌వో టైటిల్ రిజిస్టర్‌లో ఏ మార్పూ చేసే అవకాశం ఉండదు. టీఆర్‌వో ప్రజల ఆస్తి హక్కుల టైటిల్ రిజిస్టర్‌ను మాత్రమే నిర్వహిస్తారు. అప్పిలేట్ అథారిటీ ఇరు పార్టీల వాదనలు విన్న తర్వాతే ఆర్డర్ ఇస్తారు. ఈ అధికారి జాయింట్ కలెక్టర్, అంతకంటే పైస్థాయి అధికారి మాత్రమే ఉంటారు. నిజానికి అప్పిలేట్ అధికారి ఆర్డర్ ఇచ్చాక కూడా టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి నేరుగా దాన్ని రిజిస్టర్‌లో మార్పు చేయలేరు. ఆర్డర్ ప్రకారం ఆటో మ్యుటేషన్ జరిగిపోతుంది. ఇక్కడ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సివిల్ కోర్టుల జోక్యం ఉండదు. దీనివల్ల ప్రజల ఆస్తికి పూర్తి భద్రత ఏర్పడుతుంది. స్థిరాస్తిని కొనుక్కుంటే రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత దాన్ని టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి దగ్గర తిరిగి నమోదు చేయించుకోవాలనేది కూడా స్వార్థపరులు సృష్టించిన అపోహ. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యుటేషన్ జరిగిపోతుంది. అలాంటప్పుడు తిరిగి టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి దగ్గర నమోదు చేయించుకోవాలని చెప్పడం ప్రజలను వంచించడమే.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- 25 లోక్‌సభ స్థానాలకు 965 మంది.. 175 అసెంబ్లీ స్థానాలకు 5,460 మంది
- నేడు పరిశీలన.. ఉపసంహరణకు 29 వరకు గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ముగిసింది. ఏప్రిల్ 18న ఈ ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజైన గురువారం అభ్యర్థులు భారీస్థాయిలో నామినేషన్లు దాఖలు చేశారు. 2019తో పోలిస్తే 2024 ఎన్నికల్లో పోటీకి ఎక్కువమంది నామినేషన్లు వేశారు. 2019 ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు 4,299 నామినేషన్లు, 25 పార్లమెంటు స్థానాలకు 770 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పుడు అసెంబ్లీకి 5,460, పార్లమెంటుకు 965 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం నామినేషన్లు దాఖలు చేసిన ప్రముఖుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (పులివెందుల), బొత్స సత్యనారాయణ (చీపురుపల్లి), అంబటి రాంబాబు (సత్తెనపల్లి), కొడాలి నాని (గుడివాడ) తదితరులు ఉన్నారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలించి నిబంధనలు పాటించని అభ్యర్థులను తిరస్కరిస్తారు. ఆమోదం పొందిన నామినేషన్లను ఈ నెల 29వ తేదీలోగా ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంది. 29వ తేదీ సాయంత్రానికి ఒక్కో నియోజకవర్గంలో ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్న విషయంపై స్పష్టత వస్తుంది.

28 నుంచి సీఎం జగన్ ఎన్నికల ప్రచారం

- తాడిపత్రిలో ఉదయం నిర్వహించే సభతో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- ప్రతి రోజూ మూడు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు
- రేపు వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- కూటమి కూసాలు కదిలించేసిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో అగ్రభాగాన నిలిపేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఈనెల 28 నుంచి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార భేరి మోగించనున్నారు. ప్రతి రోజూ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభలలో పాల్గొంటారు. ఈనెల 28న (ఆదివారం) ఉదయం పది గంటలకు తాడిపత్రిలో నిర్వహించే బహిరంగ సభ ద్వారా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వెంకటగిరిలో, 3 గంటలకు కందుకూరులో జరిగే బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఈనెల 28వతేదీ నుంచి మే 1 వరకు సీఎం వైఎస్ జగన్ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి ఒక రోజు ముందు అంటే 27న (శనివారం) వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు.

కదన కవాతు..

వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేస్తూ భీమిలి (ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల (దక్షిణ కోస్తా)లలో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన 'సిద్ధం' సభలు జనసంద్రాలను తలపించాయి. ఒకదానిని మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి రాష్ట్రం, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభలు అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచిపోయాయి. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి మేమంతా సిద్ధం బస్సు యాత్ర చేపట్టిన సీఎం జగన్ బుధవారం శ్రీకాకుళం జిల్లా అక్కవరం వద్ద నిర్వహించిన సభతో ముగించారు. 22 రోజుల పాటు 23 జిల్లాలు, 86 నియోజకవర్గాల్లో 2,188 కి.మీ. మేర సాగిన బస్సు యాత్ర పొడవునా స్కూలు పిల్లల నుంచి అవ్వాతాతల వరకూ సీఎం జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన 16 బహిరంగ సభలకు సముద్రంతో పోటీ పడుతూ జనం తరలి వచ్చారు. దేశ రాజకీయ చరిత్రలో సీఎం జగన్ బస్సు యాత్ర అరుదైన ఘట్టంగా నిలిచిపోతుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు జనసేన, బీజేపీలతో జతకట్టినా ప్రజల స్పందన కరువైంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి కలిసి నిర్వహిస్తున్న సభలకు జనం మొహం చాటేయడమే అందుకు నిదర్శనం. రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిన సీఎం జగన్ బస్సు యాత్రతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదనోత్సాహంతో దూసుకెళ్తుంటే కూటమి శ్రేణులు నైతిక స్థైర్యం కోల్పోయి చెల్లాచెదురవుతున్నాయి.

మంచిని వివరిస్తూ.. మోసాలను ఎండగడుతూ

ఎన్నికల మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేసిన సీఎం జగన్ ప్రజల్లో విశ్వసనీయతను చాటుకున్నారు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలతో సుపరిపాలన అందిస్తున్నారు. డీబీటీ రూపంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లను జమ చేశారు. నాన్ డీబీటీ ద్వారా మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. దేశ చరిత్రలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో ఈ స్థాయిలో ప్రజలకు లబ్ధి చేకూర్చిన దాఖలాల్లేవు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సంస్కరణలతో రాష్ట్రాన్ని ప్రగతిపథాన నిలిపారు. ఇదే అంశాన్ని సిద్ధం సభల్లో, బస్సు యాత్రలో సీఎం జగన్ ప్రజలకు వివరించారు. విభజన తర్వాత 2014 ఎన్నికల్లో జనసేన–బీజేపీతో జట్టు కట్టి 650కిపైగా హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను వంచించటాన్ని, నాటి అరాచకాలను ప్రజలకు గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు అదే కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తోందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు. తాజాగా విడుదల చేయనున్న మేనిఫెస్టోను సీఎం వైఎస్ జగన్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లనున్నారు.

28 నుంచి మే 1 వరకూ సీఎం జగన్ బహిరంగ సభలు ఇలా..

తేదీ	ఉదయం 10 గంటలు	మధ్యాహ్నం 12.30 గంటలు	మధ్యాహ్నం 3 గంటలు
28.04.2024	తాడిపత్రి	వెంకటగిరి	కందుకూరు
29.04.2024	చోడవరం	పి.గన్నవరం	పొన్నూరు
30.04.2024	కొండెపి	మైదుకూరు	పీలేరు
01.05.2024	బొబ్బిలి	పాయకరావుపేట	ఏలూరు

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు చేసిన ఏకైక సీఎం జగన్
- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీదే
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

నెల్లూరు (దర్గామిట్ట)/కందుకూరు: సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. నెల్లూరు, కందుకూరులో గురువారం ఆయన పర్యటించారు. రెండుచోట్లా మీడియాతో మాట్లాడుతూ.. బీసీ నాయకులు సిద్ధరామయ్య, స్టాలిన్, నితీష్‌కుమార్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పటికీ బీసీలకు న్యాయం చేయలేకపోయారని, కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని కృష్ణయ్య చెప్పారు. బీసీలకు మేలు చేసే విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాదిరిగా ధైర్యం చేయలేకపోయారన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఆంధ్రప్రదేశ్‌వైపు చూస్తున్నారని, ఇక్కడ అమలు చేస్తున్న పథకాలను తమ రాష్ట్రాల్లో కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతి పేద కుటుంబంలో సభ్యుడిగా మారారని తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి పేదలకు మొండిచేయి చూపారని ఎద్దేవా చేశారు.

విద్యారంగానికి పెద్దపీట

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా.. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను అమలు చేయడం వల్ల పేద పిల్లలకు అవకాశాలు పెరుగుతున్నాయని కృష్ణయ్య చెప్పారు. కలెక్టర్, డాక్టర్, ఇంజినీర్లుగా తయారవడమే కాకుండా విదేశాలకు పెద్దఎత్తున పేద వర్గాల పిల్లలు వెళ్తున్నారని వివరించారు. విదేశీ విద్య కోసం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సాయం కూడా అందుతోందన్నారు. గత ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాల ప్రజలకు కేవలం సుత్తి, పార, ఇస్త్రీ పెట్టె వంటి పనిముట్లు ఇచ్చేందుకు పరిమితమైతే.. సీఎం జగన్ రాష్ట్ర బడ్జెట్‌లోను, అధికారంలోను ప్రత్యేక వాటా ఇస్తున్నారని వివరించారు.




మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

వంగా గీత చేతిలో పవన్ ఓటమి : జూపూడి

ప్రభుత్వ న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద వర్గాలు, పెత్తందార్ల మధ్య, ప్రోగ్రెసివ్, ఫ్యూడలిజం మధ్య, భూస్వామ్య వర్గాలు, పేదల పక్షాన నిలబడే వారి మధ్యే ప్రస్తుతం పోటీ జరుగుతోందన్నారు. ప్రజలు ఎవరి పక్షాన నిలబడాలో ఆలోచించుకుని ఓట్లు వేయాలని కోరారు. పిఠాపురంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీత చేతిలో పవన్ ఓడిపోతున్నారని చెప్పారు. పార్టీ పెట్టి మూసేసిన చిరంజీవిని పవన్ ఎన్నికల ప్రచారానికి తెచ్చుకుని ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయోజనాలే మాకు ముఖ్యం: హైకోర్టు

సాక్షి, అమరావతి: గంగవరం పోర్టులో కార్మికుల సమ్మెతో బొగ్గు సరఫరాలో ఏర్పడిన కొరతవల్ల విశాఖ ఉక్కు కర్మాగారం మూతపడే పరిస్థితి ఏర్పడటం దురదృష్టకరమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో.. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయోజనాలను పరిరక్షించడం తమకు ముఖ్యమని హైకోర్టు స్పష్టంచేసింది. కార్మికుల సమ్మె పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ చూపాల్సిందని తెలిపింది. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తి నిమిత్తం అవసరమైన బొగ్గును సరఫరా చేసేందుకు గంగవరం పోర్టులో ఉన్న బొగ్గు నిల్వల ఓడను విశాఖపట్నం పోర్టుకు మళ్లించాలని గంగవరం పోర్టు యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం నుంచి తగిన వివరాలు తీసుకుని వాటిని తమ ముందుంచాలని ప్రభుత్వ న్యాయవాది (జీపీ)ని ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విశాఖ పోలీస్ కమిషనర్‌లను ప్రతివాదులుగా చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అప్పుడు వారికి తగిన ఆదేశాలిచ్చేందుకు వీలుంటుందంది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య గురువారం ఉత్తర్వులిచ్చారు. గంగవరం పోర్టులో కార్మికుల సమ్మెవల్ల విశాఖ ఉక్కు కర్మాగారానికి బొగ్గు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, దీనివల్ల ప్లాంట్‌కు తీవ్రనష్టం కలుగుతోందని, ఈ నేపథ్యంలో బొగ్గు సరఫరాకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వెంకట దుర్గాప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య మరోసారి విచారణ జరిపారు.


Aakash
Medical | IIT-JEE | Foundations
JEE (MAIN) 2024లో
నిరంతరం ఛాంపియన్లను తయారు చేస్తున్న ఏకైక సంస్థ
Karnataka Topper
1st ALL INDIA FEMALE TOPPER
AIR 34
100 Percentile in Phy. & Maths
100 PERCENTILE OVERALL Sanvi Jain 4 Yr. Classroom
Star of Telugu States
AIR 15
100 PERCENTILE OVERALL M. Sai Divya Teja Reddy 2 Yr. Classroom
Star of Telugu States
AIR 19
100 PERCENTILE OVERALL Rishi Shekher Shukla 2 Yr. Classroom
Punjab Topper
AIR 25
100 Percentile in Phy. & Maths
100 PERCENTILE OVERALL Rachit Aggarwal 4 Yr. Classroom
AIR 65
100 Percentile in Phy. & Chem.
99.99 PERCENTILE Sri Ram A 2 Yr. Classroom
AIR 72
100 Percentile in Phy. & Maths
99.99 PERCENTILE Krishna Sai Shishir Vuppala 4 Yr. Classroom
AIR 81
100 Percentile in Physics
99.99 PERCENTILE Agrim Bhanot 2 Yr. Classroom
Scan code to check all the ranks & watch what the toppers have to say
13379#
(12424 Classroom + 955 Distance & Digital)
#Still Counting
Aakashians Qualified for
JEE (Adv.) 2024
1288 99 Percentile & above
9 in Top 100 AIR (All India Rank)
52 in Top 500 AIR (All India Rank)
*1 out of 3
Aakashians gets a Top College
*As per count of total Aakashians appeared in JEE 2024
మా క్లాస్ రూమ్ ప్రోగ్రామ్ నుండి అత్యుత్తమ టాపర్లు
West Bengal Topper
AIR 104 100 Percentile in Maths 99.99 PERCENTILE Rudra V Vuppuluri 4 Yr. Classroom
AIR 106 100 Percentile in Physics 99.99 PERCENTILE Sagarika Sinha 2 Yr. Classroom
AIR 139 100 Percentile in Physics 99.99 PERCENTILE Viswanath K S 4 Yr. Classroom
AIR 162 100 Percentile in Maths 99.99 PERCENTILE Shreshtha Gupta 4 Yr. Classroom
AIR 171 100 Percentile in Chemistry 99.99 PERCENTILE Naqsh Imam 2 Yr. Classroom
AIR 175 99.99 PERCENTILE Priyanshu Kumar 4 Yr. Classroom
AIR 177 100 Percentile in Maths 99.99 PERCENTILE Hardik Aggarwal 2 Yr. Classroom
AIR 223 100 Percentile in Maths 99.99 PERCENTILE Ayush Pandey 2 Yr. Classroom
AIR 228 100 Percentile in Maths 99.99 PERCENTILE Gorang Rathi 2 Yr. Classroom
and many more...
తెలుగు రాష్ట్రాల క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్‌ల నుండి ఇతర టాపర్స్
AIR 139 100 Percentile in Physics 99.99 PERCENTILE Viswanath K S 4 Yr. Classroom
AIR 243 100 Percentile in Physics 99.99 PERCENTILE Ujjwal Singh 4 Yr. Classroom
AIR 268 99.98 PERCENTILE Perumalla Rithvik 2 Yr. Classroom
AIR 1077 99.94 PERCENTILE K Pratheek Reddy 2 Yr. Classroom
AIR 1743 99.89 PERCENTILE Guru Jahnavi M 4 Yr. Classroom
AIR 1872 99.89 PERCENTILE Siddharth M Patel 2 Yr. Classroom
99.86 PERCENTILE K R Ritwik Saketh 4 Yr. Classroom
99.83 PERCENTILE N Ryan Ashraf 2 Yr. Classroom
and many more...
Though every care has been taken to publish the result, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.
అడ్మిషన్లు జరుగుచున్నవి
CLASS 8th-10th
Integrated Courses
for NTSE / Olympiads / School Boards
CLASS 11th
2 Year Integrated Courses
for NEET / JEE (Main & Adv.) / EAPCET
CLASS 12th
1 Year Integrated Courses
for NEET / JEE (Main & Adv.) / EAPCET
లాంగ్ టర్మ్ బ్యాచ్‌లు
for NEET / JEE | EAPCET 2025
Hurry! Batches Filling Fast
iACST
తక్షణ ప్రవేశం మరియు స్కాలర్‌షిప్ పరీక్షకోసం హాజరు అవ్వండి.
90% వరకు
స్కాలర్‌షిప్ పొందండి*
ఉచితంగా
*Terms & Conditions apply.
Are you EXAM ready?
Boost your Preparation with
All India
NEET 2024 Mock Test
All India Rank
Latest NEET Pattern
Real Exam Experience
28th April
Sunday | 2 pm
REGISTER FOR FREE
Hurry! Registrations Closing on 26th April, 2024
11 Branches in Andhra Pradesh
Guntur: 8800971868
Kadapa: 8800898028
Kakinada: 8800789546
Kurnool: 8800013008
Nellore: 8800012982
Rajahmundry: 8800012983
Tirupati: 8800013010
Vijayawada: 8800013015
VISAKHAPATNAM
Dwarka Nagar: 8800013011
Gajuwaka: 8800013012
Madhurawada: 8800548130
SCAN FOR NEAREST BRANCH
Aakash BYJU'S Information Centre: Vizianagaram: 8448799006
CALL (TOLL-FREE): 1800-102-2727
VISIT: aakash.ac.in
For Franchise Enquiry: Email ID: franchise@aesl.in
Aakash
Medical | IIT-JEE | Foundations

వారితో ఇంకా ఇలా అను: 'ఒకవేళ అల్లాహ్ మీకు కీడుచేయదలిస్తే, లేదా కరుణించ దలిస్తే ఆయన నుండి మిమ్మల్ని తప్పించేవాడెవడు?' మరియు వారు అల్లాహ్‌ను వదలి ఇతరుణ్ణి ఎవడినీ సంరక్షకునిగా గానీ లేక సహాయకునిగా గానీ పొందలేరు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 26 ఏప్రిల్ 2024

వృద్ధులకు ఆరోగ్య ధీమా!

అరవై అయిదేళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లకు ఇది అక్షరాలా ఆనందం కలిగించే వార్త. పిల్లలు, విద్యార్థులు, గర్భిణులు, సీనియర్ సిటిజన్లతో సహా అన్ని వర్గాలకూ ఆరోగ్య బీమా పాలసీలు అందివ్వాలనే కొత్త నిర్ణయం వచ్చింది. దేశంలోని బీమా పాలసీలకు సంబంధించి అత్యున్నత నియంత్రణ సంస్థ అయిన 'భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ' (ఐఆర్‌డీఏఐ) ఆ మేరకు బీమా సంస్థలన్నిటికీ ఆదేశాలు జారీ చేసింది. ఇకపై క్యాన్సర్, హృద్రోగం, మూత్రపిండాల వైఫల్యం, ఎయిడ్స్ లాంటి వ్యాధులున్నాయని ఆరోగ్య బీమా పాలసీలు నిరాకరించడానికి వీల్లేదని తేల్చింది. అదే సమయంలో, నియమ నిబంధనలు పాటిస్తూ ఆ యా వయసుల వారికి తగ్గట్టుగా ప్రత్యేకమైన బీమా పాలసీలు రూపొందించుకొనే స్వేచ్ఛ సంస్థలకు ఇచ్చింది. దీంతో, ఇప్పుడిక 65 ఏళ్ళు, ఆపై బడిన తర్వాత కూడా కొత్తగా ఆరోగ్య బీమా పాలసీ తీసుకొనే వీలు చిక్కింది. 70 ఏళ్ళ పైబడిన ప్రతి ఒక్కరినీ కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం కిందకు తెస్తామని అధికార పక్షం పేర్కొన్న కొద్ది రోజులకే ఈ నిర్ణయం రావడం గమనార్హం.

అలాగే, సీనియర్ సిటిజన్ల సమస్యలు, ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికై ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీమా సంస్థలకు ప్రాధికార సంస్థ సూచించింది. పాలసీ కొనడానికి ముందే ఆరోగ్య ఇబ్బందులు ఉన్నప్పటికీ వారికి తగిన ఆరోగ్య బీమా పాలసీలు తప్పక ఇవ్వాలని పేర్కొంది. ముందుగానే ఉన్న వ్యాధుల (పీఈడీ) విషయంలో బీమా రక్షణకు నిరీక్షించే కాలాన్ని మునుపటి 48 నెలల నుంచి 36 నెలలకే తగ్గించింది. బీమా అంశంలో ఈ సరికొత్త సంస్కరణలు అటు ఊహించని ఆరోగ్య ఖర్చులు ఎదురైన వృద్ధులకే కాక, వయసు మీద పడ్డ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్న ఉద్యోగులకూ పెద్ద ఊరట. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, వ్యాధుల బారి నుంచి తమకు ప్రేమాస్పదులైన వ్యక్తులకు రక్షణనిచ్చేందుకు కొండంత అండ. వయోవృద్ధులకు పరిమిత ప్రయోజనాలే అందిస్తున్న ప్రస్తుత ధోరణి నుంచి బీమా సంస్థలు బయటకొచ్చి, తల్లితండ్రులతో సహా పాలసీదారు కుటుంబం మొత్తానికీ సమగ్ర బీమా వసతి కల్పించేలా కొత్త పాలసీలు తేగలుగుతాయి. ఇప్పటికే ఉన్న పాలసీలను సైతం మార్చగలుగుతాయి.

నిజానికి, వయసు మీద పడ్డాకనే ఎవరికైనా ఆరోగ్య బీమా మరింత అవసరం, ఉపయోగం. ఇప్పటి దాకా నిర్ణీత వయసు దాటాక వ్యక్తిగత ఆరోగ్య బీమాకు వీలుండేది కాదు. కానీ, కొత్త సంస్కరణలతో ఆ అడ్డంకి తొలగింది. ప్రత్యేకించి రానున్న రోజుల్లో మన దేశ జనాభాకు ఇది కీలకం. 2011 తర్వాత దేశంలో జనగణన జరగలేదన్న మాటే కానీ, ఐరాస జనాభా నిధి, ఇతర నిపుణుల లెక్క ప్రకారం భారత జనాభా చైనాకు సమానంగా ఉంది. 2023లో ఒక దశలో మనం చైనాను దాటినట్టు కూడా అంచనా. ఈ ఐరాస అంచనాల ఆధారంగా నిరుడు 'భారత వార్ధక్య నివేదిక – 2023'ను సిద్ధం చేశారు. దాని ప్రకారం దేశంలో 10 శాతమున్న సీనియర్ సిటిజన్ల జనాభా వచ్చే 2050 నాటికి ఏకంగా 30 శాతానికి పెరగనుంది. మరోమాటలో అరవై ఏళ్ళ పైబడిన వారి సంఖ్య 2022 నాటి 14.9 కోట్ల నుంచి 34.7 కోట్లకు చేరుతుంది. అది అమెరికా ప్రస్తుత జనాభా కన్నా ఎక్కువ.

ఒక్క భారత్‌లోనే కాదు... అభివృద్ధి చెందిన అనేక దేశాల్లో వయోవృద్ధులు దాదాపు 16 నుంచి 28 శాతం దాకా ఉన్నారు. మెరుగైన ఆరోగ్య వసతులు, పెరిగిన ఆయుఃప్రమాణం వల్ల ఈ సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సీనియర్ సిటిజన్ల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వ నిధులతో ప్రజారోగ్య వ్యవస్థలున్నా, ఇతర దేశాల్లో మాత్రం ఖరీదైన ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణే దిక్కు. అలాంటి చోట్ల ఖర్చెక్కువ, వయసు పెరిగే కొద్దీ ఆరోగ్య బీమాకు చెల్లించాల్సిన ప్రీమియమ్‌లూ ఎక్కువన్నది నిజమే. కానీ, 65 ఏళ్ళు దాటితే కొత్తగా ఆరోగ్య బీమా తీసుకోవడానికి వీలు కాదనే నిబంధన చాలా దేశాల్లో లేదని గమనించాలి. ఇప్పుడు మన దేశమూ ఆ మార్గంలోకి వచ్చి, గరిష్ఠ వయఃపరిమితి షరతు లేకుండా, అన్ని వయసుల వారికీ ఆరోగ్య బీమా పాలసీలు అందుబాటులోకి తెచ్చిందన్న మాట. దానికి తోడు పీఈడీ నిరీక్షణ కాలాన్ని తగ్గించడం, తీవ్ర వ్యాధులున్నా సరే బీమా ఇవ్వాలనడం ప్రజానుకూల, ప్రశంసాత్మక నిర్ణయాలు.

ప్రాధికార సంస్థ ఆ మధ్య జీవిత బీమా పథకాల సరెండర్ ఛార్జీల విషయంలో సంస్కరణలు తెచ్చింది. మళ్ళీ ఇప్పుడిలా వినియోగదారుల పక్షాన మరోసారి మరికొన్ని నిబంధనల్ని సవరించడం విశేషం. అయితే, అదే సమయంలో బీమా సంస్థలు తమ ఉత్పత్తులను వినియోగదారులకు స్నేహపూర్వకంగా ఉండేలా చూడడం అవసరం. ప్రాధికార సంస్థ ఆదేశాల స్ఫూర్తిని విస్మరించి, అందుబాటులో లేని అతి ఖరీదైన పాలసీలను సంస్థలు తీసుకొస్తే నిష్ప్రయోజనం. అర్థం కాని సాంకేతిక పదజాలం, సంక్లిష్టతలతో పాలసీలు తీసుకొచ్చినా కస్టమర్లు విముఖత చూపుతారు. పాలసీలలో పారదర్శకత పాటిస్తూ, ఇబ్బంది లేకుండా సులభంగా క్లెయిమ్‌లు పరిష్కారమయ్యే మార్గాన్ని బీమా సంస్థలు అనుసరిస్తే మంచిది. అప్పుడే వినియోగదారులు ఉత్సాహంగా ముందుకు వస్తారు. తాజా బీమా సంస్కరణల తాలూకు ఫలితమూ సమాజానికి అందివస్తుంది. దేశంలోని సీనియర్ సిటిజన్లలో నూటికి 98 మందికి ఇవాళ్టికీ ఆరోగ్య బీమా లేకపోవడం సిగ్గుచేటు. అంతకంతకూ పెరుగుతున్న వైద్య, ఆరోగ్యసేవల ఖర్చు రీత్యా బీమా ఆపత్కాలంలో బలమైన భరోసా. జీవితం పొడుగునా కుటుంబానికీ, సమాజానికీ తమ వంతు సేవ చేసి, ప్రకృతి సహజపరిణామంగా వయసుపై పడ్డ ఈ పండుటాకుల గురించి పాలకులు లోతుగా ఆలోచించాలి. బీమా పాలసీలొక్కటే సరిపోవు. ఆర్థికంగానే కాక ఆరోగ్యపరంగానూ వారి బాగు కోసం ఇతర ప్రత్యామ్నాయాలనూ అన్వేషించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి: బ.విదియ ఉ.6.23 వరకు, తదుపరి తదియ,
నక్షత్రం: అనూరాధ రా.2.26 వరకు, తదుపరి జ్యేష్ఠ,
వర్జ్యం: లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.10 నుండి 8.58 వరకు
తదుపరి ప.12.23 నుండి 1.11 వరకు,
అమృతఘడియలు: ప.3.24 నుండి 4.56 వరకు.

సూర్యోదయం : 5.41
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

తప్పుడు ప్రకటనలకు విరుగుడు ఎలా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

తప్పుదోవ పట్టించేలా ప్రకటనలిచ్చారంటూ పతంజలి సంస్థ విషయంలో సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరు అందరి దృష్టినీ ఆకర్షించింది. 1954 నాటి చట్టం కొన్ని రకాల వ్యాధులకు మందులను ప్రకటించడంపై నిషేధం విధిస్తోంది. అయినా ఫలానా ఔషధాలతో అద్భుతాలు జరుగుతాయనడం, వాటి సామర్థ్యంపై చిలువలు పలువలుగా చెప్పడం కొనసాగుతూనే ఉంది. తప్పుదోవ పట్టించే ప్రకటనల జారీ కేవలం ఒక్క సంస్థకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రాయోజిత కార్యక్రమాల రూపంలో ఎన్నో తప్పుడు చికిత్సావిధానాలు, మందుల గురించి ప్రచారం జరుగుతోంది. దేశంలోని చట్టాలు సరిపోకపోవడమో, శక్తిమంతంగా లేకపోవడమో ప్రస్తుత సమస్యకు కారణం కాదు; చట్టాల అమలులో ఉదాసీనంగా ఉండటమే అసలు సమస్య.

సుప్రీంకోర్టులో ఇటీవల ఓ ఆసక్తికరమైన వ్యవహారం నడిచింది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలిచ్చారంటూ పతంజలి ఆయుర్వేద వ్యవస్థాపకుడు బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ విషయంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం వ్యవహరించిన తీరు అందరి దృష్టినీ ఆకర్షించింది. కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందేననీ, ధిక్కరణ కేసు విషయంలో క్షమాపణలు స్పష్టంగా, బహిరంగంగా తగు ప్రాధాన్యంతో చెప్పాల్సిందేననీ సుప్రీంకోర్టు పట్టుబట్టిన విషయం తెలిసిందే. తుది తీర్పు మాటెలా ఉన్నా... ఈ కేసు అటు మందుల తయారీదారుకు, ఇటు నియంత్రణ వ్యవస్థలు, ప్రభుత్వాలు, వినియోగదారులకు చాలా పాఠాలు నేర్పింది.

ఇంతకీ ఏమిటీ కేసు? అన్నింటికీ కేంద్రంగా ఉన్నవి 1954 నాటి డ్రగ్స్ అండ్ మేజిక్ రెమిడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనల) చట్టం; 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం... దీని కింద 1945లో రూపొందించిన నిబంధనలను రామ్‌దేవ్ బాబాకు చెందిన సంస్థలు ఉల్లంఘించాయన్నది ఆరోపణ. 1954 చట్టం కొన్ని రకాల వ్యాధులకు మందులను ప్రకటించడంపై నిషేధం విధిస్తోంది. కొన్ని రకాల మందుల ప్రకటనకు సంబంధించి పరిమితులు విధిస్తోంది. క్యాన్సర్, మధుమేహం, వంధ్యత్వం, ఎయిడ్స్, ఊబకాయం, తక్కువ వయసులోనే వృద్ధాప్య లక్షణాలు కనిపించడం, అంధత్వం వంటి సమస్యల పరిష్కారానికి మందులున్నాయని ప్రకటనలు జారీ చేయకూడదు... ఔషధాలతో అద్భుతాలు జరుగుతాయనడం, వాటి సామర్థ్యంపై చిలువలు పలువలుగా చెప్పడం వంటివి. 1940 నాటి చట్టం... భారత్‌లో మందులు, సౌందర్య సాధనాలు, వైద్య పరికరాలు తదితరాల తయారీ, పంపిణీ, అమ్మకాలకు సంబంధించిన ప్రాథమిక చట్టం.

పతంజలి సంస్థ మధుమేహం మొదలుకొని థైరాయిడ్ సంబంధిత సమస్యలు, ఆఖరికి క్యాన్సర్ వ్యాధికీ మూలిక సంబంధిత మందులు ప్రతిపాదిస్తున్న విషయం తెలిసిందే. కోవిడ్ కాలంలో ఈ సంస్థ వ్యాధిని నయం చేస్తుందని చెబుతూ 'కరోనిల్'ను ప్రవేశ పెట్టింది. అప్పటి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ దీనికి మద్దతు పలికారు. ఈ మందుపై అభ్యంతరాలు వ్యక్తమైనప్పుడు మార్కెటింగ్‌లో 'చికిత్స' స్థానంలో 'నిర్వహణ' అని మార్చి చేతులు దులుపుకుంది పతంజలి. ఎన్నో వ్యాధులకు చికిత్స కల్పిస్తామని ప్రకటనలు జారీ చేయడమే కాకుండా, ఆధునిక వైద్య పద్ధతినీ లక్ష్యంగా చేసుకుని విమర్శలకు దిగింది. ఈ అంశంపై విసుగు చెందిన కొందరు ఆరోగ్య కార్యకర్తలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు.. చట్టాల ఉల్లంఘన జరిగిందని ఫిర్యాదు చేశారు. కోర్టు తగదని వారించినా తప్పుడు ప్రకటన జారీ మాత్రం ఆపలేదు. ఫలితంగా కోర్టు ధిక్కరణకూ పాల్పడినట్లు అయ్యింది.



తప్పుదోవ పట్టించే ప్రకటనల జారీ కేవలం పతంజలి సంస్థకు మాత్రమే పరిమితం కాలేదు. నిర్దిష్ట సమయాల్లో దేశంలోని పత్రికలు, న్యూస్ ఛానెళ్ల కూడా ప్రాయోజిత కార్యక్రమాల రూపంలో ఎన్నో తప్పుడు చికిత్స పద్ధతులు, మందుల గురించి ప్రచారం చేస్తూంటాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లోనైతే ఇలాంటివి కుప్పలు తెప్పలు! తాజాగా సోషల్ మీడియా 'ఇన్‌ఫ్లుయెన్సర్లు' రంగంలోకి దిగారు. ప్రమాదకరమైన ఉత్పత్తులను కూడా వీరు ఆరోగ్యం పేరిట అమ్మడం, ప్రచారం చేయడం మొదలుపెట్టారు. పెద్ద కంపెనీలు నేరుగా ప్రకటనలు జారీ చేసే విషయంలో కొంత నిగ్రహం పాటిస్తాయి. బదులుగా పెయిడ్ న్యూస్, వైద్య సంబంధిత సదస్సుల ప్రాయోజకత్వం, వైద్యులకు గిఫ్టులు ఇవ్వడం వంటి అనైతిక చర్యల ద్వారా తమ ఉత్పత్తులకు ప్రచారం కల్పించుకునే ప్రయత్నం చేస్తూంటాయి. కొన్నేళ్ల క్రితం తగినన్ని సాక్ష్యాలు లేకపోయినా కొన్ని ఔషధాల సామర్థ్యం విషయంలో ఐఎంఏ స్వయంగా మద్దతు పలకడం చెప్పుకోవాల్సిన అంశం. వైద్యుల అనైతిక చర్యల విషయంలోనూ ఐఎంఏ రికార్డు ఏమంత గొప్పగా లేదు.

దేశంలోని చట్టాలు సరిపోకపోవడమో, శక్తిమంతంగా లేకపోవడమో ప్రస్తుత సమస్యకు కారణం కాదు. ప్రభుత్వాలు చట్టాలను అమలు చేసే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తూండటమే అసలు సమస్య. నియంత్రణ సంస్థలు కూడా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నాయి.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు చికిత్స కల్పిస్తామంటూ రామ్‌దేవ్ చేసిన ప్రకటనలను 2008లో నేను ఖండించాను. స్వయంగా వైద్యుడైన అన్బుమణి రామ్‌దాస్ నేతృత్వంలోని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ రామ్‌దేవ్‌కు నోటీసు జారీ చేసింది. కొంత కాలం గడిచిందో లేదో... మంత్రి 'యూ టర్న్' తీసుకున్నారు. గురుగ్రామ్‌లో రామ్‌దేవ్ బాబాతో కలిసి యోగా సెషన్‌లో కనిపించారు. ఆ వేదికపై కూడా రామ్‌దేవ్ హెచ్ఐవీ/ఎయిడ్స్‌ల చికిత్సకు తన మందులు ఉపయోగపడతాయని ప్రకటించుకున్నారు. దాదాపు ఈ సమయంలోనే సీపీఎం ఎంపీగా ఉన్న బృందా కారత్ ఈ రామ్‌దేవ్ వ్యవహారాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

ప్రస్తుత కేసు సంగతికి వద్దాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ సంస్థలు కలిసికట్టుగా ఉదాసీన వైఖరిని అవలంబించాయి. ఫలితంగా రామ్‌దేవ్ బాబా తన తప్పుడు ప్రకటనల జారీని యథేచ్ఛగా కొనసాగించగలిగారు. కేరళకు చెందిన ఆరోగ్య కార్యకర్త, ఆర్టీఐ ఉద్యమకారుడు డాక్టర్ కేవీ బాబు పతంజలి సంస్థపై వరుసగా ఫిర్యాదు చేస్తూ వచ్చారు. ఉత్తరాఖండ్‌లోని స్టేట్ లైసెన్సింగ్ అథారిటీకి పలుమార్లు లేఖలు రాశారు. దాంతో అధికారులు పతంజలి సంస్థ అలాంటి ప్రకటనలు జారీ చేయడం మానుకోవాలని లేఖ రాశారు. అంతేగానీ, అధికారం ఉన్నప్పటికీ చర్యలు చేపట్టలేదు. పైగా తప్పించుకునేందుకు మార్గమూ చూపించారు. 1954 చట్టం కింద కాకుండా డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్‌లోని నిర్దిష్ట నిబంధన కింద నోటీసు జారీ చేశారు. ఈ నిబంధనపై అప్పటికే ముంబై హైకోర్టులో ఓ కేసు నడుస్తూ ఉంది. దీంతో పతంజలి సంస్థ ఆ కేసును చూపి ప్రకటనల జారీ కొనసాగించింది. ప్రశ్నార్థకమైన ఈ నిబంధనను 2018లో ఒక సవరణ ద్వారా కలిపారు. ఆరోగ్య సంబంధిత ప్రకటనల జారీలో ముందస్తు అనుమతులను అది తప్పనిసరి చేసింది.

ఆహార పదార్థాల ప్రకటనల్లో సెలబ్రిటీలు పాల్గొనడం, వాటి గురించి ఊదరగొట్టడం కూడా ఒక సమస్య. ఇలాంటి కేసుల్లోనూ ఫుడ్ సేఫ్టీ రెగ్యులేటర్ పనితీరును నత్తను తలపించేదే. న్యూట్రాస్యూటికల్స్, ఫుడ్ సప్లిమెంట్స్‌లకు సంబంధించిన ప్రకటనల విషయంలో ఇప్పటికైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. దేశంలో మారిపోతున్న మీడియా వ్యవహారాలను దృష్టిలో ఉంచుకుంటే... ప్రత్యక్ష, పరోక్ష ప్రకటనలకు ఉన్న అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం దేశంలో అమల్లో ఉన్న చట్టాల (ఔషధాలు, సౌందర్య సాధనాలకు సంబంధించినవి) సంపూర్ణ సమీక్ష అవసరం. మందులు, ఆహార పదార్థాలు, సప్లిమెంట్ల వంటి అన్ని అంశాలకు సంబంధించిన, భారతీయ వైద్య విధానానికి సంబంధించిన చట్టాలను కూడా పూర్తిగా సమీక్షించాలి. తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో చాలా కఠినంగా వ్యవహరించాలని ప్రస్తుతమున్న చట్టాలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫుడ్ అండ్ డ్రగ్ రెగ్యులేటరీ ఏజెన్సీల పని తీరునూ సమీక్షించాలి. తగినన్ని వనరులు, అధికారాలు సమకూర్చడం, స్వతంత్రంగా వ్యవహరించేందుకు అవకాశం కల్పించడం ద్వారా పరిస్థితిలో ఏదైనా మార్పు వచ్చే అవకాశం ఉంటుంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

మనం చేస్తే...



భద్రతా కారణాల రీత్యా యునైటెడ్ స్టేట్స్ ఇప్పుడు చైనీస్ యాప్ టిక్‌టాక్‌ను నిషేధిస్తోంది. ఈ పని ఇండియా 2020లో చేసింది. కానీ అప్పుడు మతిభ్రష్ట కమ్యూనిస్టులు ఇండియాను ఎలా ఎగతాళి చేశారో గుర్తుందా?

– మోనికా వర్మ, జర్నలిస్ట్

అనవసర ఆందోళన



సంపద మీద విధించే అవకాశం ఉందేమో అనుకుంటున్న ఒక పన్ను గురించి టిపికల్ భారతీయులు ఆందోళన చెందుతున్నారు. కానీ 99 శాతం మందికి అంత డబ్బూ లేదు, ఎటూ చెల్లించనూబోము.

– అమీత్ దత్తా, న్యాయవాది

పాటే తూటా



2022 నాటి ఇరాన్ నిరసనల్లో ప్రముఖ పాత్ర పోషించినవారిలో ఒకరైన ర్యాపర్ తూమజ్ సలేహీ (33)కి మరణ శిక్ష విధించారు. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆయన తన సంగీతాన్నే ఆయుధంగా ఉపయోగించారు.

– ఫాజిలా బలోచ్, యాక్టివిస్ట్

చరిత్ర పునరావృతం?



అమెరికా విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లోని యూదు వ్యతిరేకత 1930లలో జర్మన్ విశ్వవిద్యాలయాల్లో ఏం జరిగిందో గుర్తు చేస్తోంది. ప్రపంచం ఊరికే చూస్తూ ఉండకూడదు.

– బెంజమిన్ నెతన్యాహూ, ఇజ్రాయెల్ ప్రధాని

ఏది పాడైనట్టు?



పాలకుల భక్తుల వాదన ఎలా ఉంటుంది? 'ఈ ఆలుగడ్డ పాడైంది.' భక్తుడు: పాకిస్తాన్, అమెరికాల్లో ఇంకా ఎక్కువ పాడైన ఆలుగడ్డలు ఉన్నాయి తెలుసా? 'ఈ ఆలుగడ్డ పాడైంది.' భక్తుడు: నువ్వు టమోటాలు తింటే పోతుందిగా? 'ఈ ఆలుగడ్డ పాడైంది.' భక్తుడు: మనం అత్యుత్తమ వరి పండిస్తాం తెలుసా? 'ఈ ఆలుగడ్డ పాడైంది.' భక్తుడు: దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయకు, తిను.

– డాక్టర్ సర్కార్, ప్రొఫెసర్

మేమూ అనగలం!



యూఎస్ యూనివర్సిటీల్లో నిరసనల దృష్ట్యా, 'భావ స్వేచ్ఛ, బాధ్యత, ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల మధ్య సరైన సమతూకం ఉండా'లని వాషింగ్టన్‌కు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ గుర్తుచేసింది. గతంలో ఇండియాలో జరిగిన నిరసనల మీద యూఎస్ చేసిన వ్యాఖ్యలు దీనికి నేపథ్యం.

– సిద్ధాంత్ సిబల్, జర్నలిస్ట్

ఎండలుంటే మాత్రం...



బెంగళూరు సహా దక్షిణ కర్ణాటక ప్రాంతాల్లో సాధారణ ఎన్నికలు (నేడు రెండవ దశ పోలింగ్). బెంగళూరు ప్రజలారా! ఈసారి పెద్ద సంఖ్యలో వెళ్తారు కదా? నేను అంటున్నది పోలింగ్ బూతులకు! దగ్గరున్న హిల్ స్టేషన్లకు కాదు!!

– యూసుఫ్ ఉంర్ఘూవాలా, సంపాదకుడు

ఇన్ బాక్స్

సిద్ధం – మేమంతా సిద్ధం!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ముగిసింది. అదే విధంగా దీనికంటే ముందు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 'సిద్ధం' సభలకు విశేష స్పందన లభించింది. ఈ రెండు కార్యక్రమాలకు ప్రజానీకం పెద్ద ఎత్తున తరలివచ్చి జగన్‌కు కృతజ్ఞతగా తామంతా అండగా ఉంటాం అని చాటి చెప్పారు.


జగన్‌ను ప్రజలు ఇంతగా అక్కున చేర్చుకోవడానికి కారణాలు సుస్పష్టం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజలు 90 శాతం మంది ఉన్నారు. వీరందరూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారే. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి పూర్తి స్థాయిలో వీరి అభివృద్ధి, సంక్షేమానికి తగిన ప్రాధాన్యం దక్కలేదు. వై.ఎస్. జగన్ సీఎం అయిన తరువాత ఈ 90 శాతం ఉన్న వర్గాల సంక్షేమం, అభివృద్ధులే ప్రధాన ఎజెండాగా పాలన చేస్తున్నారు. పేద వర్గాల భవిష్యత్తుకు చదువు చాలా ప్రధానమైనదిగా గుర్తించారు. ఇంగ్లీషు మీడియం విద్యను పాఠశాలల్లో ప్రవేశ పెట్టడంతో పాటు 'అమ్మ ఒడి', ఫీజు రీయింబర్స్‌మెంట్, 'వసతి దీవెన', 'విద్యా దీవెన' వంటి పథకాలను అమలు చేసింది ప్రభుత్వం. 'నాడు–నేడు' కార్యక్రమం కింద పాఠశాలల ఆధునికీకరణ జరిగింది. ప్రభుత్వ పథకాల ఫలాలు ఇంటి గడప దగ్గరికే ప్రభుత్వం చేరుస్తోంది. మహిళల పేరనే నివాస స్థల పట్టాలు ఇచ్చింది. 'చేయూత', 'చేదోడు', 'ఆసరా' వంటి సంక్షేమ పథకాలు వారికెంతో మేలు చేశాయి. రైతులకు ప్రత్యేకంగా 'రైతు భరోసా', ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలు అందిస్తూ వీరి అభ్యున్నతికి జగన్ దోహదపడ్డారు. తద్వారా ఆయన ఆ యా వర్గాల గుండెల్లో ప్రత్యేక స్థానం పొందగలిగారు.

ఇదంతా చూసి జగన్ రెండవసారి కూడా అధికారంలోకి వస్తే పేదలు బలమైన శక్తిగా ఎదుగుతారనీ, తమకు ఇక రాజకీయ భవిష్యత్తు ఉండదనే భయంతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి జగన్‌ను టార్గెట్ చేస్తోంది. అయినా 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ఊరూవాడా బ్రహ్మరథం పట్టాయి. జగన్ పాలనలో మేలుపొందిన ప్రతి కుటుంబం ఈ ఎన్నికల్లో మళ్లీ ఆయన వైపే నిలుస్తున్నది. 'మేమంతా సిద్ధం' అని ఎలుగెత్తి చెబుతున్నారు జనం.

– గుంటూరు కృష్ణ | వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి

అన్ని రంగాల్లో ఎన్డీయే ప్రభుత్వ వైఫల్యం

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

దేశంలో సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. కొద్దిరోజుల్లో 10 సంవత్సరాల మోదీ పాలన ముగుస్తుంది. తిరిగి ఎన్నికల్లో గెలిసి అధికారం చేపట్టాలని మోదీ నాయకత్వాన ఎన్డీయే కూటమి, తాను వల్లించే ప్రజాస్వామ్యాన్ని కూడా కాల రాస్తున్నది. ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ మోదీ ప్రభుత్వం పూర్తి చేయలేదు. అన్ని రంగాలూ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

భారతదేశంలో పని చేసే జనాభాలో 60 శాతం మందికి పని కల్పిస్తున్న వ్యవసాయ రంగం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. పంటలకు న్యాయమైన ధరలు లభించక రైతాంగం అప్పుల పాలయ్యారు. జాతీయ స్థాయిలో సగటు రైతు కుటుంబం అప్పు 80 వేల పైబడి ఉంది. 10 ఏళ్ల మోదీ పాలనలో లక్షా 50 వేల మంది రైతులు అప్పులు తీర్చలేక ప్రాణాలు కోల్పోయారు. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించకుండా, అందుకు భిన్నంగా 3 వ్యవసాయ చట్టాలు చేసి మద్దతు ధరల ప్రకటన, పంటల కొనుగోళ్ల నుండి తప్పుకుని రైతాంగాన్ని బడా వ్యాపారుల పాలబడేలా చేసింది ప్రభుత్వం. సుదీర్ఘ పోరాటం ద్వారా రైతులు మూడు చట్టాలు రద్దు చేయించారు.

దేశ ప్రయోజనాలను విస్మరించి సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడే విధానాలను మోదీ ప్రభుత్వం తీవ్రతరం చేసింది. పదేళ్లలో లాభాల్లో ఉన్న 64 ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం మూసి వేసి వాటిని అమ్మకానికి పెట్టింది. మోదీ పాలనలో పెట్టుబడిదారులు బ్యాంకులకు బాకీపడ్డ రూ.10 లక్షల కోట్లను 'మొండి బకాయిల' పేరుతో రద్దు చేసింది. కార్పొరేట్ సంస్థలకు 10 శాతం పన్ను తగ్గించి దేశానికి లక్షా 84 వేల కోట్ల నష్టాన్ని కలిగించింది.

మోదీ పాలనలో దేశ, విదేశీ అప్పులు విపరీతంగా పెరిగాయి. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం దేశ జీడీపీలో 40 శాతం వరకు అప్పులు చేయవచ్చు. 2022 ఆర్థిక సంవత్సరం నాటికి మోదీ ప్రభుత్వం 54 శాతం అప్పు చేసింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ అంతా దారుణంగా ఉందని కాగ్ పేర్కొంది.



నిరుద్యోగం ఎప్పుడూ లేని విధంగా తీవ్ర స్థాయికి చేరుకుంది. 2014 ఎన్నికల ప్రచారంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే ప్రతిఏడాది 2 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ మాయ మాటలు చెప్పి యువత ఓట్లను పొందారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ కల్పనలో దారుణంగా విఫలమయ్యారు.. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్‌లు పూర్తి చేసిన యువతలో నిరుద్యోగం గత పదేళ్లలో రెట్టింపయ్యింది. 2021 ప్రారంభం నుండి 2.5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు.

బీజేపీ మొదటి నుండి కార్మిక వర్గ వ్యతిరేకత కలిగి ఉంది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణకు పూనుకుంది. 2015లో బహిరంగంగా మోదీ ఈ విషయం వెల్లడించారు. పరిశ్రమాధిపతుల ప్రయోజనాల కొరకు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్ (నియమాలు)లుగా మార్చి కార్మిక హక్కులను హరించారు. 300 మంది లోపు ఉన్న పరిశ్రమల్లో ఉద్యోగుల తొలిగింపుకూ, పరిశ్రమల మూసివేతకూ యజమానులకు హక్కులు కల్పించారు. సమ్మె నోటీస్ కాలాన్ని 60 రోజులకు పెంచారు. కార్మికుల చేత రోజుకు 12 గంటలు పని చేయించుకోవటానికి అవకాశం కల్పించారు. ఈ విధంగా 4 లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులను బానిసలుగా మార్చారు.

విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న డబ్బులు తెప్పించి ప్రతి కుటుంబానికి 15 లక్షలు ఇస్తానని చెప్పారు మోదీ. అధికారంలోకి వచ్చాక దాని ఊసే ఎత్తలేదు. రాష్ట్రాల నామమాత్రపు హక్కులను కూడా రాజ్యాంగ సవరణల ద్వారా హరిస్తున్నారు. ఈడీ, సీబీఐల ద్వారా ప్రతిపక్ష పార్టీల నాయకులపై కేసులు బనాయిస్తున్నారు. పౌరసత్వ చట్ట సవరణ చేసి మతాల మధ్య ఘర్షణలను ప్రేరేపిస్తున్నారు.

ఈ విధంగా పది సంవత్సరాలగా మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నది. అందుకే ఎన్డీయేను ప్రజలందరూ వ్యతిరేకించాలి.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం (ఏపీ), రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

మంత్ర బలం

ఒక నామాన్ని పదే పదే కొన్ని వందల, వేల, లక్షల సార్లు పఠించటం వల్ల అనంతమైన శక్తి సొంతం అవుతుందని ఆధ్యాత్మికవాదులు చెబుతారు. శాస్త్రీయంగా కూడా అది నిరూపితమైన సత్యం. మంత్రం ద్వారా వెలువడే శబ్దం ఉన్నత పరిధిలోకి చేరి విశ్వంతో మీరు కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. స్వీయపరివర్తనకు, స్వస్థతకు, ఆధ్యాత్మిక వికాసానికి మంత్రసాధనను మించినది మరొకటి లేదు. అమెరికాకు చెందిన థామస్ ఆష్లే ఫరాండ్ స్వీయ అనుభవంతో మంత్ర సాధనలోని ఔన్నత్యాన్ని గ్రహించాడు. 'హీలింగ్ మంత్రాస్' అన్న తన పుస్తకంలో సంస్కృత మూలంతో ఉన్న 50 శ్లోకాలను వాటి అర్థాలతో వివరించాడు. మన ఇష్టదైవాన్ని ఆధారంగా చేసుకుని, ఏ సమస్యకు ఏ మంత్రం పఠించాలో కూడా ఆయన చెప్పటం విశేషం. ఇందులో మనకు బాగా పరిచయం అయిన 'ఓం'; 'ఓం నమః శివాయ'; 'ఓం నమో భగవతే వాసుదేవాయ'; 'హరే రామ హరే రామ, రామ రామ హరే హరే... హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే'; 'ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ (గాయత్రీ మంత్రం)'; 'ఓం శ్రీమాత్రే నమః' తదితర మంత్రాలు కనిపిస్తాయి. ఆరోగ్యాభివృద్ధికి 'హమ్ ఫట్ స్వాహా' వంటి మంత్ర సాధన వల్ల ప్రయోజనం కలుగుతుందని రచయిత చెబుతారు.

హృదయ పూర్వకంగా, భక్తి పూర్వకంగా సాధన చేసినప్పుడే వీటి వల్ల ఫలితం ఉంటుంది. నామ జపం ఫలితం ఇవ్వాలంటే మొక్కు బడిగా కాకుండా కనీసం లక్షా పాతిక వేలసార్లు జపించాలని థామస్ ఆష్లే చెబుతున్నారు. మంత్రాన్ని జపించినప్పుడు మీరు కంపనాన్ని మేల్కొలుపుతారు. 'ఓం' అనేది వేదాల్లోని మొదటి మంత్రం. సృష్టి, నిర్వహణ, విధ్వంసాన్ని అది సూచిస్తుంది. ఓం సాధన ద్వారా కూడా అత్యున్నత ఆధ్యాత్మిక అనుభూతులను సొంతం చేసుకోవచ్చు. మంత్రం... సాధకునికి ముక్తిని ప్రసాదిస్తుంది. తన ఆధ్యాత్మిక స్పృహను విశ్వవ్యాప్త స్పృహలో విలీనం అయ్యేలా చేస్తుంది. స్వీయ సాధనతోనే మంత్రబలంలో ఉన్న శక్తి ఎవరికైనా అర్థం అవుతుంది.

– డా॥ పార్థసారథి చిరువోలు

నేడు తిరుపతికి ఉపరాష్ట్రపతి

తిరుపతి అర్బన్: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం ఉదయం తిరుపతి చేరుకోనున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారమే తిరుపతి చేరుకున్నారు. తిరుమల–తిరుపతి పర్యటనలో భాగంగా ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ శుక్రవారం ఉదయం 10.30గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు తిరుమలకు చేరుకుని శ్రీవారి దర్శనానంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు బయలుదేరి, 1 గంటకు తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం చేరుకుంటారు. అక్కడ జరిగే వర్సిటీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ మేరకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

బర్డ్, పద్మావతి ఆస్పత్రులను సందర్శించనున్న గవర్నర్

గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉపరాష్ట్రపతికి శుక్రవారం ఉదయం స్వాగతం పలికిన అనంతరం 11.10 గంటలకు తిరుపతి బర్డ్ హాస్పిటల్, శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్‌సెంటర్‌లను సందర్శిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు వీడ్కోలు పలికి అనంతరం విజయవాడ తిరుగు ప్రయాణం అవుతారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు



ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. తొమ్మిదోరోజు గురువారం రాత్రి రుత్వికులు శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు పూజా సామగ్రి సమర్పించారు. కంకణదారు రాజేష్ భట్టార్ ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, కుంభ జలప్రోక్షణ నిర్వహించారు. ధ్వజస్తంభం పైనుంచి గరుడ పతాకాన్ని కిందకు దించారు. శుక్రవారం సాయంత్రం 6 నుంచి పుష్పయాగం నిర్వహిస్తారు.

బీజేపీ అభ్యర్థిగానే బరిలో ఉంటా

నామినేషన్ వేసిన పరిపూర్ణానంద



పుట్టపర్తి రూరల్: హిందూపురం లోక్‌సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా తానే బరిలో ఉంటానని పరిపూర్ణానంద స్వామి ధీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో ఆర్వో అరుణ్‌బాబు వద్ద స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు నామినేషన్లు వేయడంతో తనకు క్లారిటీ ఉందన్నారు. అధిష్టానానికే ఇంకా క్లారిటీ లేదన్నారు. ఈ నెల 29లోపు తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తారన్న నమ్మకం ఉందని చెప్పారు.

సుజనా అప్పుల లెక్క తీయండి

రిజల్యూషన్ ప్రొఫెషనల్ మధుసూదనరెడ్డికి ఎన్‌సీఎల్‌టీ సూచన

- వాటిని సుజనా ఎలా తీరుస్తారో బెంచ్‌కు తెలియజేయాలి
- ఆయన పరిష్కారానికి రుణదాతలు అంగీకరిస్తే సరి
- లేదంటే దివాలా ప్రక్రియ మరింత ముందుకు
- తీర్పు పూర్తి కాపీని విడుదల చేసిన ఎన్‌సీఎల్‌టీ



సాక్షి, హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు, విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ వై. సుజనా చౌదరి వ్యక్తిగత దివాలా ప్రక్రియకు రిజల్యూషన్ ప్రొఫెషనల్‌గా మలిగి మధుసూదన రెడ్డిని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ నియమించింది. సుజనా చౌదరి అప్పుల లెక్కలు తీయాలని ఆదేశించింది. సుజనా చౌదరి దివాలా పరిష్కార ప్రక్రియకు ఇప్పటికే అంగీకరించిన ఎన్‌సీఎల్‌టీ.. ఆ తీర్పు పూర్తి ప్రతిని తాజాగా విడుదల చేసింది. దివాలా ప్రక్రియ ముగిసే వరకు సుజనా (రుణగ్రహీత) ఆస్తుల క్రయవిక్రయాలు, ఇతరుల పేరిట బదిలీ చేయడం లాంటివి చెల్లవని తేల్చిచెప్పింది. దివాలా ప్రక్రియ అంతా ఎలా నిర్వహించాలో ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యుడు రాజీవ్ భరద్వాజ్, టెక్నికల్ సభ్యుడు సంజయ్‌పూరి ధర్మాసనం రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు స్పష్టంగా వివరించింది. దివాలా ప్రక్రియకు వెళ్లిన స్ప్లెండిడ్ మెటల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎస్‌బీఐకి రూ. 562,84,30,310 (అసలు, వడ్డీ కలిపి) రుణ బకాయి పడిందని, దీనికి సుజనా చౌదరి వ్యక్తిగతంగా గ్యారెంటీ ఇచ్చినందున, ఆయనను దివాలాదారునిగా ప్రకటించి, రుణ పరిష్కార ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ బ్యాంకు 2021లో ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. దీనిపై విచారించిన ఎన్‌సీఎల్‌టీ మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషల్ (ఐఆర్‌పీ)గా మధుసూదన్ రెడ్డిని నియమించింది. వ్యకిగత హామీదారుకు రుణాల చెల్లింపు కోసం బ్యాంక్ సమయం ఇచ్చిందని, అయినా చెల్లించడంలో ఆయన విఫలమయ్యారని ఐఆర్‌పీ నివేదిక అందజేశారు. పిటిషన్‌ను అనుమతించి దివాలా ప్రక్రియను ప్రారంభించవచ్చని చెప్పారు. ఈ నివేదికను పరిశీలించి, ఇరుపక్షాల వాదనలు విన్న ఎన్‌సీఎల్‌టీ తీర్పు వెలువరించింది.

తీర్పులో ప్రధానాంశాలు..

సుజనా చౌదరిపై దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభిస్తున్నాం. ఆయన వ్యక్తిగత హామీదారుగా ఉన్నందున అన్ని అప్పులపై 180 రోజుల పాటు మారటోరియం వర్తిస్తుంది. ఈ సమయంలో ఆయన తన ఆస్తుల క్రయవిక్రయాలు, ఇతరులకు బదిలీ వంటి లావాదేవీలు నిషేధం. మా ఉత్తర్వుల కాపీ ఎన్‌సీఎల్‌టీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన 7 రోజుల్లోగా సుజనాకు అప్పులు ఇచ్చిన వారి నుంచి వివరాలు కోరుతూ రిజల్యూషన్ ప్రొఫెషనల్ పూర్తి వివరాలతో పబ్లిక్ నోటీస్ జారీ చేయాలి. వ్యక్తిగత హామీదారు సుజనా, కార్పొరేట్ రుణగ్రహీత స్ప్లెండిడ్ కంపెనీ ఉంటున్న రాష్ట్రంలో విస్తృత సర్క్యులేషన్ ఉన్న ఆంగ్ల, మాతృ భాష (తెలుగు) పత్రికల్లో ఈ నోటీసులు ప్రచురించాలి. ఆ తర్వాత రుణ దాతలు క్లెయిమ్‌లు సమర్పించేందుకు 21 రోజుల సమయం ఇవ్వాలి. 30 రోజుల్లోగా రిజల్యూషన్ ప్రొఫెషనల్ రుణదాతల జాబితా, ఇతర వివరాలన్నీ సిద్ధం చేయాలి. రుణదాతలకు ఎలా చెల్లింపులు చేస్తారో సుజనా నివేదిక ఇవ్వాలి. రుణదాతల జాబితా, సుజనా నివేదికను ఎన్‌సీఎల్‌టీ బెంచ్ (అడ్జ్యుడికేటింగ్ అథారిటీ)కి రిజల్యూషన్ ప్రొఫెషనల్ అందజేస్తారు. చివరి క్లెయిమ్ అందిన 21 రోజుల్లోగా ఈ ప్రక్రియ అంతా పూర్తి కావాలి. అప్పటి నుంచి 28 రోజుల్లోగా రిజల్యూషన్ ప్రొఫెషనల్ రుణదాతలతో సమావేశం ఏర్పాటు చేయాలి. ఈ సమావేశం అవసరం లేదని రిజల్యూషన్ ప్రొఫెషనల్ సిఫార్సు చేస్తే, దానికి కారణాలను తెలపాలి. సుజనా నివేదికను రుణదాతలకు అందజేసి, వారి అభిప్రాయం తీసుకుని, ఆ వివరాలను ఎన్‌సీఎల్‌టీకి సమర్పించాలి' అని పేర్కొంది. సుజనా చెల్లింపుల విధానానికి రుణదాతలు అంగీకరిస్తే అంతటితో ప్రక్రియ ముగుస్తుంది. లేదంటే ఆస్తులు వేలం వేసి చెల్లించేలా దివాలా ప్రక్రియ ముందుకు వెళ్లనుంది.

● లోకకల్యాణార్థం శ్రీశైలం శ్రీ భ్రమరాంబాదేవికి శుక్రవారం సంప్రదాయబద్ధంగా కుంభోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవంలో ఉదయం మొదటి విడత సాత్వికబలిగా గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నపురాశి మొదలైనవి అమ్మవారికి సమర్పిస్తారు.

సుజనా ఆస్తులు, అఫిడవిట్‌పై అనుమానాలు

- తన ఆస్తులు కేవలం రూ.34 కోట్లేనని తెలిపారు
- మరి ఎస్‌బీఐకి రూ.500 కోట్లకు గ్యారెంటీ ఎలా ఇచ్చారు?
- అఫిడవిట్‌తో పాటు ఆయన ఆస్తులపై విచారణ జరగాలి: ఎంపీ కేశినేని నాని



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సుజనాచౌదరి ఆస్తులు, ఆయన సమర్పించిన అఫిడవిట్లపై అనుమానాలున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని నాని ఆరోపించారు. సుజనా తన ఆస్తులు కేవలం రూ.34 లక్షలుగా చెప్పారని, కానీ ఎస్‌బీఐకు రూ.500 కోట్లకు గ్యారెంటీ ఎలా ఇచ్చారో, వాటిని బ్యాంకులు ఎలా ఆమోదించాయో అర్థం కావడంలేదన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని 51వ డివిజన్ కొండ ప్రాంతంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మీడియాతో మాట్లాడారు. ఇటీవల ఎస్‌బీఐ సుజనాపై కోర్టుకు వెళ్లగా బ్యాంకుకు మద్దతుగా తీర్పు ఇచ్చిందన్నారు. ఎన్నికల అఫిడవిట్‌తో పాటు.. ఆయన ఆస్తులపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

వేసవి సెలవుల్లో ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రత్యేక వారాంతపు రైళ్లను నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంద్రూప్‌కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక రైలు (ట్రైన్ నంబర్ 07234) ఈ నెల 28నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం సికింద్రాబాద్ నుంచి సంత్రగచి వరకు నడుస్తుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో రాత్రి 11.40 బయలుదేరి నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్, కుర్దారోడ్డు, భువనేశ్వర్, కటక్, బద్రాక్, ఖరగ్‌పూర్ మీదుగా మంగళవారం ఉదయం 5 గంటలకు సంత్రగచి చేరుతుందన్నారు. ఈ ట్రైన్ (నంబర్ 07235) తిరిగి ఈనెల 30వ తేదీ నుంచి జూలై 2 వరకు మంగళవారాల్లో సంత్రగచిలో మధ్యాహ్నం 12.20కి బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. విజయవాడకు బుధవారం ఉదయం 8.45కు వస్తుంది. 18 బోగీలతో నడిచే ఈ రైళ్లలో ఎటువంటి రిజర్వేషన్ సౌకర్యం ఉండదన్నారు. స్టేషన్‌లలో బుకింగ్ కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని తెలిపారు. యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు.

రఘురామకు శివరామ ఝలక్

- ఉండిలో నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్యే వేటుకూరి
- ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలోకి



ఉండిలో నామినేషన్ వేస్తున్న టీడీపీ రెబెల్ ఎమ్మెల్యే అభ్యర్థి శివరామరాజు

ఉండి: టీడీపీ తరఫున ఉండి టికెట్ దక్కించుకున్న రఘురామకృష్ణ రాజుకు మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ఝలక్ ఇచ్చారు. తనకు టికెట్ ఇవ్వకుండా అవమానించిన పార్టీకి గట్టి దెబ్బ కొట్టడానికి సిద్ధమయ్యారు. పశ్చిమగోదావరిజిల్లా ఉండి నియోజకవర్గం నుంచి వేటుకూరి వెంకట శివరామరాజు గురువారం ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తొలుత స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్టు ప్రకటించిన ఆయన.. నాటకీయ పరిణామాల మధ్య ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నానని గమనించిన టీడీపీ నేతలు తన పేరుకు దగ్గరగా ఉన్న, తన పేరుతో ఉన్న కొంతమందితో నామినేషన్లు వేయిస్తున్న విషయం తనకు తెలిసిందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని శివరామరాజు చెప్పారు. జాతీయ పార్టీ తరఫున పోటీ చేస్తే పోలింగ్ జాబితాలో తనకు ప్రాధాన్యత ఉంటుందని, అలాగే ఆ పార్టీ గుర్తు అయిన పులి బొమ్మ కూడా తన ప్రచారానికి సులువుగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు



అస్సాంలో బ్రహ్మపుత్ర నది మీదుగా బాగ్‌మోరా ఛపోరీ ద్వీపంలో పోలింగ్ కేంద్రానికి పడవలో బయల్దేరిన ఎన్నికల సిబ్బంది

నేడే రెండో దశ

13 రాష్ట్రాల్లో 88 స్థానాలకు ఎన్నికలు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక పోరులో రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రెండో దశలో 13 రాష్ట్రాల్లోని 88 స్థానాల్లో నేడు ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ నిర్వహించనున్నారు. 16 లక్షలకుపైగా సిబ్బందితో పోలింగ్‌కు ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. వాస్తవానికి 89 స్థానాల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. కానీ మధ్యప్రదేశ్‌లోని బైతూల్‌లో బీఎస్పీ అభ్యర్థి హఠాన్మరణంతో అక్కడ ఓటింగ్‌ను మే 7వ తేదీకి వాయిదావేశారు. ఈరోజు కేరళలోని అన్ని 20 స్థానాలకు ఒకేసారి పోలింగ్ నిర్వహించనున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈ 89 స్థానాల్లో ఎన్డీఏ కూటమి 56 చోట్ల, యూపీఏ కూటమి 24 చోట్ల విజయం సాధించాయి. ఇప్పటికే తొలి దశలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 102 స్థానాలకు ఏప్రిల్ 19వ తేదీన జరిగిన ఓటింగ్‌లో 65.5 శాతం పోలింగ్ నమోదైన విషయం విదితమే. నేతల మాటల మంటలు ఎన్నికల వేడిని మరింత రాజేసిన నేపథ్యంలో ఎండవేడిమిని సైతం తట్టుకుని ఈదఫా ఓటర్లు ఏ మేరకు పోలింగ్‌శాతాన్ని పెంచేస్తారో నేటితో తేలిపోనుంది. ఎండవేడి కారణంగా బిహార్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో పోలింగ్ సమయాన్ని పెంచారు.

బరిలో కేంద్ర మంత్రులు

రెండోదశ పోలింగ్ ఉన్న స్థానాల్లో కేరళలోని వయనాడ్ స్థానంలో రాహుల్ గాంధీ, సీపీఐ నాయకురాలు అన్నీ రాజా, బీజేపీ నుంచి కె. సురేంద్రన్ బరిలో నిలిచారు. తిరువనంతపురంలో నాలుగోసారి గెలవాలని శశిథరూర్ ఆశపడుతుండగా ఆయనను నిలువరించేందుకు కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ రంగంలో దిగారు. కర్ణాటకలోని బెంగళూరు సౌత్‌లో బీజేపీ నేత తేజస్వీ సూర్య, కాంగ్రెస్ నాయకురాలు సౌమ్యా రెడ్డి మధ్య పోటీ నెలకొంది. ఉత్తరప్రదేశ్ నుంచి హేమామాలిని, అరుణ్ గోవిల్ పోటీచేస్తున్నారు. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ జోధ్‌పూర్ నుంచి మూడోసారి గెలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఓం బిర్లా, డీకే సురేశ్(కాంగ్రెస్), కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి(జేడీఎస్), ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ భఘేల్(రాజ్‌నంద్‌గావ్), సుకాంత మజుందార్(బీజేపీ), రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్, వైభవ్ గెహ్లోట్, వి.సోమన్న, మన్సూర్ అలీ ఖాన్, కైలాశ్ చౌదరి సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కేరళలో 20 సీట్లకుగాను ఓడిపోయిన ఏకైక అలప్పుజ సీటును ఈసారి ఎలాగైనా గెలవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కాంగ్రెస్ కూటమి బరిలో నిలిపింది.

రాష్ట్రం	సీట్లు
కేరళ	20
కర్ణాటక	14
రాజస్థాన్	13
మహారాష్ట్ర	8
ఉత్తరప్రదేశ్	8
మధ్యప్రదేశ్	6
అస్సాం	5
బిహార్	5
ఛత్తీస్‌గఢ్	3
పశ్చిమబెంగాల్	3
మణిపూర్	1
త్రిపుర	1
జమ్మూకశ్మీర్	1

కేరళలో బీజేపీ బోణీ కొట్టేనా?

కేరళలో ఎలాగైనా బోణీ కొట్టేందుకు బీజేపీ కంకణం కట్టుకుంది. అందుకే తొలి దశ ఎన్నికలు పూర్తయ్యాక కొత్తగా కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేస్తోందని తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. ఓబీసీలకు కేటాయించిన కోటాలోనే ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తూ వారిపై కాంగ్రెస్ అతి ప్రేమ చూపిస్తోందంటూ మోదీ చేస్తున్న తీవ్ర విమర్శలు కేరళలో పాగా వేసేందుకు పనికొస్తాయా అనే చర్చ సర్వత్రా నెలకొంది. ముస్లింలను చొరబాటుదారులంటూ, హిందూ మహిళల మంగళసూత్రాలు, బంగారం లాగేసుకుని ముస్లింలకు పంచనుందన్న మోదీ ప్రసంగాలు ఏ మేరకు ముస్లిమేతర ఓట్లను బీజేపీ తన వైపునకు తిప్పుకోనుందో చూడాలి.

రెండో విడత 88 స్థానాలు

జనరల్	73
ఎస్టీ	6
ఎస్సీ	9
మొత్తం అభ్యర్థులు	1,202
పురుషులు	1,098
మహిళలు	102
థర్డ్ జెండర్	2
మొత్తం ఓటర్లు	15.88 కోట్లు
పురుషులు	8.08 కోట్లు
మహిళా ఓటర్లు	7.8 కోట్లు
థర్డ్ జెండర్	5,929
తొలిసారి ఓటర్లు	34.8 లక్షలు
పోలింగ్ స్టేషన్లు	1.67 లక్షలు



ఎన్నికల వి-చిత్రం

రెండో దశ పోలింగ్ ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సామగ్రిని కొవ్వొత్తుల వెలుగుల్లోనే సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది. గురువారం అస్సాంలోని మోరిగావ్ జిల్లాలో తీసిందీ ఫొటో

కాంగ్రెస్ వస్తే దేశమంతటా కర్ణాటక మోడల్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపాటు

- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను, హక్కులను కాజేసే కుట్ర
- దొడ్డిదారిన ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ కుతంత్రం
- ఆస్తులు కాపాడుకోవడానికే రాజీవ్ గాంధీ ఎస్టేట్ డ్యూటీ రద్దు చేశారు
- ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోదీ



ఆగ్రా/మొరేనా: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడిని రోజురోజుకూ ఉధృతం చేస్తున్నారు. సంపద పునఃపంపిణీ, ఓబీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను ఇరుకున పెడుతున్నారు. ప్రజలు కష్టపడి సంపాదించి, దాచుకున్న సొమ్మును దోచేయడానికి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను, హక్కులను దొడ్డిదారిన కాజేసి, ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టడానికి కాంగ్రెస్ పెద్ద కుట్ర పన్నిందని మరోసారి నిప్పులు చెరిగారు. గురువారం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో, బరేలీ, షాజహాన్‌పూర్, మధ్యప్రదేశ్‌లోని మొరేనా నగరంలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని మండిపడ్డారు. ప్రధానమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే...

అడ్డుగోడను నేను..

''మన తల్లులు, అక్కచెల్లెమ్మల సొత్తుపై కాంగ్రెస్ నాయకులు గురిపెట్టారు. అధికారంలోకి రాగానే తస్కరించాలని కుట్ర పన్నారు. మన ఆడపడుచుల సొమ్మును ఎవరూ దోచుకెళ్లకుండా నేను కాపలాదారుడిగా పనిచేస్తున్నా. మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా. ప్రజలకు, కాంగ్రెస్‌కు మధ్య ఒక అడ్డుగోడగా నేను నిల్చున్నా. ప్రజల ఆస్తులను కాంగ్రెస్ దోచుకోకుండా కాపాడుతున్నా. జనం ఆస్తులను, సంపదను ఎక్స్‌-రే తీస్తామని కాంగ్రెస్ రాజకుమారుడు అంటున్నారు. ప్రజలపై వారసత్వ పన్ను విధించాలని మరో కాంగ్రెస్ నాయకుడు చెబుతున్నారు. ఎవరైనా ఆస్తి సంపాదించి మరణిస్తే అందులో 55 శాతం ఆస్తిని స్వాధీనం చేసుకొని, మిగతా 45 శాతం ఆస్తిని వారసులకు ఇస్తారట! ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు. మతపరమైన రిజర్వేషన్లను మన రాజ్యాంగం అనుమతించదు. అయినా కాంగ్రెస్ పార్టీ మతం ఆధారంగా మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతోంది. తద్వారా రాజ్యాంగాన్ని కించపరుస్తోంది. మతం ఆధారంగా రిజర్వేషన్ల వ్యవస్థ తీసుకొచ్చేందుకు ఇప్పటిదాకా కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలను కోర్టులు తిరస్కరించాయి. అందుకే ఆ పార్టీ దొడ్డిదారిని ఎంచుకుంది. మైనార్టీలను ఓబీసీ కోటాలో చేర్చి రిజర్వేషన్లు ఇచ్చేస్తోంది. కర్ణాటకలో ముస్లింలను ఇప్పటికే చట్టవిరుద్ధంగా ఓబీసీ కేటగిరీలో చేర్చి, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పదే పదే ఈ విషయం చెబుతోంది. మేనిఫెస్టోలో కూడా చేర్చింది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలుత ఆంధ్రప్రదేశ్‌లోనే ముస్లిం రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. కేంద్రంలో అధికారంలోకి రాగానే కర్ణాటక మోడల్‌ను దేశమంతటా అమలు చేయాలన్నదే కాంగ్రెస్ కుయుక్తి. నేను కూడా ఒక ఓబీసీనే. కర్ణాటక మోడల్ నాకు ఆందోళన కలిగిస్తోంది. ఇక సామాన్య ప్రజల సంగతి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను, హక్కులను ఎవరూ తస్కరించకుండా రక్షణ కల్పించడానికి ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని మేము అడుగుతున్నాం. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే.. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల కుటుంబాల్లో రెండు ఉద్యోగాలు ఉంటే అందులో ఒకటి బలవంతంగా లాగేసుకుంటారు. ముస్లింలకు కట్టబెడతారు. ఇలాంటి బుజ్జగింపు రాజకీయాలు మన దేశాన్ని ముక్కలు చేస్తాయని అందరూ తెలుసుకోవాలి. సంతుష్టీకరణ(ప్రజలను పూర్తిస్థాయిలో సంతృప్తిపర్చడం) ద్వారా తుష్టీకరణ(బుజ్జగింపు)ను అంతం చేయాలన్నదే మా ప్రయత్నం.

అసలు లోగుట్టు ఇదే..

ఎస్టేట్ డ్యూటీ(పన్ను)ని అప్పట్లో ప్రధాని రాజీవ్ గాంధీ రద్దు చేశారని కాంగ్రెస్ నాయకులు గొప్పగా చెబుతున్నారు. నిజానికి ఇందిరా గాంధీ మరణం తర్వాత ఆమె ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా కాపాడుకోవడానికి ఎస్టేట్ డ్యూటీని కుమారుడు రాజీవ్ గాంధీ రద్దు చేశారు. అసలు లోగుట్టు ఇదే. ఇందిరా గాంధీ నుంచి బదిలీ అయిన ఆస్తులను ఆమె కుటుంబంలో నాలుగు తరాలు చక్కగా అనుభవించాయి. ఇందిరా గాంధీ మరణం కంటే ముందు ఎస్టేట్ డ్యూటీతో భారీగా లాభపడిన కాంగ్రెస్ ఇప్పుడు అదే విధానం తీసుకురావాలని భావిస్తోంది. బీజేపీ ఉన్నంతకాలం కాంగ్రెస్ ఆటలు సాగవు. జనం ఆస్తులను కాజేసే ప్రయత్నాలను కచ్చితంగా తిప్పికొడతాం.

రాయ్‌బరేలీ నుంచి పోటీచేయను: వరుణ్

న్యూఢిల్లీ: శత్రువు బలవంతుడు కాకముందే చిత్తుచేయాలనే సిద్ధాంతాన్ని చాలా మంది నమ్ముతారు. రాయ్‌బరేలీ స్థానంలో అదే రాజకీయ ఎత్తుగడను వేయాలని బీజేపీ భావించింది. కానీ దానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. దశాబ్దాలుగా కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానంలో ఇన్నాళ్లు సోనియా గాంధీ పోటీచేసి గెలిచారు. ఈసారి ఆమె పెద్దలసభకు మారడంతో ప్రియాంక గాంధీ తొలిసారిగా ఆ స్థానం నుంచి లోక్‌సభ ఎన్నికలకు అరంగేట్రం చేయనున్నారని వార్తలొచ్చాయి. ఒకవేళ అదే నిజమైతే ఇందిరా గాంధీ, సోనియా గాంధీ తరహాలో గాంధీల కుటుంబం నుంచి మరో మహిళ దేశ రాజకీయాల్లో శక్తివంతురాలిగా ఎదిగే ప్రమాదముందని బీజేపీ ముందే పసిగట్టింది. గాంధీల వారసుడైన తమ నేత వరుణ్ గాంధీని బరిలో దింపాలని నిర్ణయానికొచ్చిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే ఫిలిబిత్ సిట్టింగ్ ఎంపీ అయిన వరుణ్ గాంధీ రాయ్‌బరేలీలో పోటీచేసేదిలేదని కరాఖండీగా చెప్పేశారట. ఎన్నికలపర్వంలో 'గాంధీ వర్సెస్ గాంధీ' అన్నట్లు ఈ స్థానం ప్రధాన ఆకర్షణగా, తీవ్ర చర్చనీయాంశంగా మారడం ఇష్టంలేకే ఆయన ఈ ఆఫర్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది.

అమెరికా నివేదికపై భారత్ సీరియస్

మానవహక్కుల ఉల్లంఘన వ్యాఖ్యలకు దీటైన జవాబు

న్యూఢిల్లీ: భారత్‌లో మానవహక్కుల ఉల్లంఘన ఘటనలు జరుగుతున్నాయంటూ అమెరికా విదేశాంగ శాఖ వెలువర్చిన మానవహక్కుల నివేదికను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. పూర్తి పక్షపాతధోరణితో వండివార్చిన నివేదిక అది అని ఆగ్రహం వ్యక్తంచేసింది. భారత్‌ను అమెరికా ఏమాత్రం అర్థంచేసుకుందో ఈ నివేదిక తేటతెల్లంచేస్తోందని, దీనిని పట్టించుకోవాల్సిన అవసరమే లేదని ఘాటుగా స్పందించింది. మణిపూర్‌లో జాతుల మధ్య వైరంతో రాష్ట్రంలో జరిగిన పరిణామాలు మానవహక్కుల ఉల్లంఘనకు సాక్ష్యాలుగా నిలిచాయంటూ అమెరికా విదేశాంగ శాఖ వార్షిక మానవహక్కుల నివేదికను ఇటీవల అమెరికా ప్రభుత్వానికి సమర్పించింది. మానవహక్కుల పరిరక్షణకు భారత్ పాటుపడాలని నివేదిక సమర్పణ సందర్భంగా అమెరికా విదేశీవ్యవహారాల శాఖ ఉన్నతాధికారి రాబర్ట్ గిల్‌క్రిస్ట్ వ్యాఖ్యానించారు. దీనిపై గురువారం భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ ఢిల్లీలో మాట్లాడారు. '' ఈ నివేదికకు ఎలాంటి విలువా లేదు. మీరు కూడా ఏమాత్రం విలువ ఇవ్వకండి' అని అన్నారు.

సీఏఏ ఎవరికి లాభం?

- లోక్‌సభ ఎన్నికల వేళ అమల్లోకి తెచ్చిన మోదీ సర్కారు
- పశ్చిమబెంగాల్లో బాగా కలిసొస్తుందని ఆశాభావం
- కేరళ, అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లోనూ ప్రభావం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఇండియా కూటమి
- అడ్డుకుంటామంటున్న మమత, విజయన్
- చిదంబరం వ్యాఖ్యలతో మళ్లీ దుమారం

సాక్షి, న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్, కేరళ, అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఫలితాలను బాగా ప్రభావితం చేసేలా కన్పిస్తోంది. ఈ చట్టానికి నాలుగేళ్ల క్రితమే పార్లమెంటు ఆమోదం లభించినా దేశవ్యాప్త వ్యతిరేకత, ఆందోళనలు తదితరాల నేపథ్యంలో అమలు మాత్రం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు సరిగ్గా ఎన్నికల ముందు దేశమంతటా సీఏఏను అమల్లోకి తెస్తూ మార్చి 11న కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాంతో మరోసారి రాజకీయ దుమారం రేగింది. ఎవరేమన్నా సీఏఏ అమలుపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పాలక బీజేపీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోలో సీఏఏ ప్రస్తావనే లేకపోవడంపై విపక్ష ఇండియా కూటమి పక్షాలతో పాటు కేరళ సీఎం విజయన్ విమర్శలు గుప్పించారు. దాంతో, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఈ వివాదాస్పద చట్టాన్ని పార్లమెంటు తొలి సమావేశాల్లోనే రద్దు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ పి.చిదంబరం ప్రకటించారు. దాంతో సీఏఏపై మరోసారి రాజకీయ వేడి రాజుకుంది.

బెంగాల్లో మతువా ఓట్లు బీజేపీకే

రాష్ట్రంలో 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సీఏఏ హామీతోనే బీజేపీ బాగా బలపడింది. రాష్ట్రంలో అధిక సంఖ్యాకులైన నామశూద్ర (మతువా) సామాజికవర్గంలో బీజేపీకి ఆదరణ పెరిగింది. దాంతో 2019 లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో బీజేపీ రికార్డు స్థాయిలో ఏకంగా 18 సీట్లు గెలిచింది. తాజాగా చట్టాన్ని అమల్లోకి తేవడం మరింతగా కలిసొస్తుందని బీజేపీ భావిస్తోంది. దళితులైన మతువాలు దేశ విభజన సమయంలో, 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం సందర్భంగా అక్కడి నుంచి భారీగా బెంగాల్లోకి వలస వచ్చారు. ఉత్తర 24 పరగణాలు, నదియా, పూర్వ బర్ధమాన్, దక్షిణ 24 పరగణాలు, కూచ్ బెహార్ జిల్లాల్లో నివసిస్తున్నారు. వీరిలో అత్యధికులకు పౌరసత్వం లేదు. అందుకే సీఏఏ చట్టానికి అత్యధికంగా మద్దతిస్తున్నది వీరే. 2019 డిసెంబర్‌లో పార్లమెంటు ఈ చట్టాన్ని ఆమోదించినప్పటి నుంచీ దాని అమలు కోసం డిమాండ్ చేస్తున్నారు. బెంగాల్లో మతువా ఓటర్లు దాదాపు 1.75 కోట్లు ఉన్నట్టు అంచనా! బొంగావ్, బసీర్హాట్, రాణాఘాట్, కృష్ణానగర్, కూచ్ బెహార్ తదితర లోక్‌సభ స్థానాల్లో వీరి ఓట్లు నిర్ణాయకం! వీటిలో ఎస్సీ రిజర్వుడు స్థానాలైన బొంగావ్, రాణాఘాట్, కూచ్ బెహార్ 2019 ఎన్నికల్లో బీజేపీ వశమయ్యాయి. బసీర్హాట్, కృష్ణానగర్ తృణమూల్ పరమయ్యాయి. బొంగావ్ సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి శంతను ఠాకూర్‌ది మతువా సామాజికవర్గమే. ఈసారి కూడా బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా 30 శాతమని అంచనా.

అసోం: అసోం (14)తో కలిపి ఈశాన్య రాష్ట్రాల్లో 25 లోక్‌సభ స్థానాలున్నాయి. వాటిలోనూ సీఏఏ ప్రభావం బాగా ఉంటుందని అంచనా. బెంగాలీ మాట్లాడే శరణార్థులందరినీ 'హిందూ-ముస్లింలు'గా, 'చొరబాటుదారులు'గా స్థానికులు పరిగణిస్తారు. వారికి పౌరసత్వమిస్తే తమ గుర్తింపు, సంస్కృతి, సామాజిక సమీకరణాల వంటివన్నీ తలకిందులవుతాయని పలు ఈశాన్య రాష్ట్రాలు ఆందోళనగా ఉన్నాయి. ముఖ్యంగా అసోం రాజకీయాలు దశాబ్దాలుగా బెంగాలీ వ్యతిరేక భావజాలం చుట్టే కేంద్రీకృతమై ఉన్నాయి. అసోంలో ముస్లింలు ఏకంగా 34 శాతం ఉన్నారు. అసోం ఒప్పందం ప్రకారం 1971 మార్చి 25కు ముందు శరణార్థులుగా వచ్చిన వారిని ఎన్‌ఆర్‌సీలో చేర్చేందుకు వీలు కల్పించారు. అలా దరఖాస్తు చేసుకున్న 3.3 కోట్ల మందిలో 19 లక్షల మందిని తుది లెక్కింపులో అనర్హులుగా ప్రకటించారు. వారిలో అత్యధికులు హిందువులే. దీన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. నిజమైన భారతీయులను పక్కన పెట్టారంటూ ఆందోళనకు దిగింది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మరో 5 లక్షల పైచిలుకు బెంగాలీ హిందువులకూ తుది ఎన్‌ఆర్‌సీలో చోటు దక్కలేదు. వారంతా ఇప్పుడు సీఏఏ నుంచి ప్రయోజనం పొందుతారు. అసోం అస్తిత్వ పరిరక్షణే ప్రధాన నినాదంగా 2016, 2021 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. రెండుసార్లూ బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. అసోంలో స్థిరపడిన మియా ముస్లింలపై స్థానికంగా ఉన్న ఆగ్రహం కారణంగా సీఏఏకు రాష్ట్రంలో బాగా మద్దతు కనిపిస్తోంది.

కేరళ: ఈ దక్షిణాది రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. హిందువులతో పాటు ఇక్కడ అధిక సంఖ్యాకులైన క్రైస్తవ ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు బీజేపీకి సీఏఏ కొత్త ఆశాకిరణంగా కనిపిస్తోంది. సీఏఏ అమలు నేపథ్యంలో వారు తమకు మద్దతిస్తారని బీజేపీ భావిస్తోంది. తిరువనంతపురంలో క్రైస్తవుల ఓట్లు 14 శాతానికి పైగా ఉన్నాయి. పథనంతిట్ట త్రిసూర్ లోక్‌సభ స్థానాల పరిధిలోనూ హిందూ, ముస్లింల కంటే క్రైస్తవులే అధిక సంఖ్యాకులు. పలు స్థానిక క్రైస్తవ మిషనరీలు ఇప్పటికే సీఏఏకు మద్దతు పలికాయి.

ఏమిటీ సీఏఏ చట్టం...?

- విదేశాల్లో మతపరమైన వివక్ష బాధితులై ఊచకోతకు గురైన మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పించడం సీఏఏ-2019 చట్టం ఉద్దేశం.
- పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌ల్లో ఇలా మత హింస బాధితులై 2014 డిసెంబర్ 31, అంతకు ముందు భారత్‌కు వచ్చిన ముస్లిమేతర శరణార్థులు ఇందుకు అర్హులు. ఈ జాబితాలో హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ, క్రైస్తవ మైనారిటీలున్నారు.
- వారికి సీఏఏ చట్టం కింద ఫాస్ట్‌ట్రాక్ విధానంలో ఆరేళ్లలో భారత పౌరసత్వం కల్పిస్తారు.

ఇదీ విపక్షాల వాదన!

సీఏఏ ప్రకారం పౌరసత్వం పొందేందుకు అర్హుల జాబితాలో ముస్లింలను చేర్చకపోవడాన్ని విపక్షాలన్నీ తీవ్రంగా తప్పుబడుతున్నాయి. పాక్, అఫ్గాన్, బంగ్లాల్లో ముస్లింలు మైనారిటీలు కారు గనకే చేర్చలేదన్న బీజేపీ వాదన సాకు మాత్రమేనని ఆక్షేపిస్తున్నాయి. పౌరసత్వం లేకుండా భారత్‌లో నివాసముంటున్న లక్షలాది మంది ముస్లింలను వెళ్లగొట్టడమే బీజేపీ లక్ష్యమని ఘాటుగా విమర్శిస్తున్నాయి. సీఏఏను నేషనల్ రిజిస్ట్రర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్నార్సీ)తో అనుసంధానించడం వెనక ఉద్దేశం కూడా ఇదేనంటున్నాయి. ఈ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలంటూ కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం తదితర పార్టీలు ఆందోళనలు కొనసాగిస్తున్నాయి.

'వాట్సాప్'లో సుప్రీంకోర్టు సందేశాలు

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: డిజిటలైజేషన్‌లో సుప్రీంకోర్టు మరో అడుగు ముందుకేసింది. ఈ-కోర్టులతో ప్రజలకు మరింత చేరువ అయిన సుప్రీంకోర్టు ఇపుడు అడ్వొకేట్ ఆన్ రికార్డ్, కక్షిదారులకు సమాచారం అందించడంలో మరో అడుగేసింది. కాజ్ లిస్ట్, కేసుల జాబితా, ఫైలింగ్, ఆర్డర్లు, తీర్పులు అన్నీ అడ్వొకేట్ ఆన్ రికార్డ్, కక్షిదారులకు వాట్సాప్ సమాచారం ద్వారా అందజేయనున్నట్లు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ పరిణామాన్ని బిగ్ బ్యాంగ్ ప్రభావంగా సీజేఐ అభివర్ణించారు. కాగితం వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం.. పట్నాలో ఆరుగురు మృతి

పట్నా: బిహార్ రాజధాని పట్నాలోని ఓ హోటల్‌లో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో ముగ్గురు మహిళలు సహా ఆరుగురు మృత్యువాతపడ్డారు. పట్నా జంక్షన్ రైల్వే స్టేషన్‌కు సమీపంలోని ఓ హోటల్‌లో గురువారం ఉదయం 11 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. అందులో మొత్తం 20 మంది చిక్కుకుపోయారు. అగ్ని మాపక సిబ్బంది కొందరిని సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారు. మొత్తం ఆరుగురు చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పాలస్తీనియన్లకు అమెరికా విద్యార్థుల సంఘీభావం

వాషింగ్టన్: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ సైన్యం దాడులను వ్యతిరేకిస్తూ అమెరికాలో విద్యార్థుల నిరసనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. గాజాలో మారణహోమాన్ని వెంటనే ఆపాలని, ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ విశ్వవిద్యాలయాల్లో ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వందలాది మంది ర్యాలీల్లో పాల్గొంటున్నారు. పాలస్తీనియన్లకు సంఘీభావం తెలియజేస్తున్నారు. ముందస్తుగా అనుమతి లేకుండా వర్సిటీ ప్రాంగణాల్లో శిబిరాలు ఏర్పాటు చేసుకొని, నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఒక్కరోజే 100 మందికిపైగా విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో గతవారం విద్యార్థుల ఆందోళన ప్రారంభమైంది. క్రమంగా దేశవ్యాప్తంగా ఇతర యూనివర్సిటీలకు వ్యాపించింది.

ఎలక్షన్ బీట్

మోదీ, రాహుల్ ప్రసంగాలపై ఈసీ సీరియస్

- బీజేపీ, కాంగ్రెస్ చీఫ్‌లకు నోటీసులు
- సోమవారంకల్లా సమాధానం ఇవ్వాలని నడ్డా, ఖర్గేలకు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలు చేసిన ప్రసంగాలపై కేంద్ర ఎన్నికల ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ ఆయా పార్టీలకు నోటీసులు జారీ చేసింది. నేతల కోడ్ ఉల్లంఘనలకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలను బాధ్యులుగా పేర్కొంది. ఏప్రిల్ 29 ఉదయం 11గంటల్లోపు సమాధానం ఇవ్వాలని గురువారం జారీ చేసిన నోటీసుల్లో ఈసీ ఆదేశించింది. 'పార్టీలు తమ అభ్యర్థుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలి. కానీ ఏకంగా పార్టీల అగ్రనేతలే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. కీలక నేతల ప్రసంగాలు ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తీవ్రమైన పరిణామాలకు దారితీసే ప్రమాదముంది. నేతలు ఈసీ నిబంధనలు అతిక్రమించినందుకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయా పార్టీల అధ్యక్షులపై ఉంది. పార్టీల అభ్యర్థులు, ప్రధానంగా స్టార్ క్యాంపెనర్ల ప్రచారసరళి, ప్రసంగాలపై ఆయా రాజకీయ పార్టీలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 77 ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నాం' అని పార్టీల చీఫ్‌లకు పంపిన లేఖల్లో ఈసీ పేర్కొంది. ప్రధానమంత్రిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద ఫిర్యాదు తీసుకుని ఈసీ స్పందించడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

నోయిడాలో డెమోక్రసీ డిస్కౌంట్

పోలింగ్ శాతాన్ని పెంచేందుకు నోయిడాలోని హోటళ్లు, హాస్పిటళ్లు పోటీ పడుతున్నాయి. ఓటర్లకు డిస్కౌంట్లు, ఆఫర్ల వర్షం కురిపిస్తున్నాయి. నోయిడాలోని గౌతమ్ బుద్ధ నగర్‌లో నేడు పోలింగ్ జరగనుంది. ఓటు వేసి వచ్చిన వారికి 'డెమోక్రసీ డిస్కౌంట్' పేరుతో బిల్లుపై 20శాతం డిస్కౌంట్ ఇవ్వాలని నేషనల్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఆర్‌ఏఐ) నిర్ణయం తీసుకుంది. ఈ నియోజకవర్గం పరిధిలో ఎన్‌ఆర్‌ఏఐ సభ్యత్వం ఉన్న తొమ్మిది రెస్టారెంట్లు రెండు రోజులపాటు ఈ డిస్కౌంట్‌ను కొనసాగిస్తాయని ఎన్‌ఆర్‌ఏఐ యూపీ యూనిట్ హెడ్ వరుణ్ ఖేరా తెలిపారు. ఓటేసి వచ్చి ఇంకు చుక్క ఉన్న వేలు చూపిస్తే చాలు.. డిస్కౌంట్ ఇచ్చేస్తారన్నమాట. ఓటింగ్ శాతాన్ని పెంచడానికే ఈ డిస్కౌంట్ మేళా అని చెబుతున్నారు రెస్టారెంట్ల యజమానులు. ఈ ఆఫర్ ఇస్తున్న రెస్టారెంట్లలో నటి సన్నీ లియోన్ రన్ చేస్తున్న 'చికా లోకా' రెస్టారెంట్ కూడా ఉంది.

ఓట్ ఫర్ హెల్దీ ఇండియా...

ఇక ఆస్పత్రులు సైతం ఇదే బాటలోనడుస్తున్నాయి. 'ఓట్ ఫర్ హెల్దీ ఇండియా' పేరుతో ఓటేసిన వారికి ఫుల్ బాడీ చెకప్ చేస్తామని చెబుతున్నాయి. నోయిడా సెక్టార్ 137లోని ఫెలిక్స్ అనే ఆస్పత్రి ఫుల్ బాడీచెకప్ ఫ్రీగా చేయనుంది. పోలింగ్ జరిగే తేది 26 నుంచి 30 వరకూ ఈ సదుపాయం కొనసాగుతుందని ఆస్పత్రి సీఈఓ, చైర్మన్ డాక్టర్ డీకే గుప్తా తెలిపారు.

బెంగళూరులో ఫ్రీ బీర్...

ఈ ఆఫర్లలో బెంగళూరు ఇంకో ముందడుగు వేసింది. ఓటు వేసిన వారికి ఉచితంగా బీరు ఇస్తామని రెస్టారెంట్లు, ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ట్యాక్సీ యాజమాన్యాలు ప్రకటించాయి. 'బెంగళూరులో తక్కువ పోలింగ్' అని తరచూ వినే వార్తల్ని తగ్గించడానికేనని చెబుతున్నాయి. నోయిడా మాదిరిగానే ఉచిత హెల్త్ చెకప్ సౌకర్యం ఇక్కడ కూడా ఉంది. అయితే ముందు ఈ ఫ్రీ ప్రకటనపై అభ్యంతరాలు వ్యక్తమవ్వగా.. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడం లేదు కాబట్టి.. బెంగళూరు హైకోర్టు బుధవారం ఓకే చెప్పేసింది. కొన్ని కెఫేలు ఉచితంగా కాఫీని, టిఫిన్ సెంటర్లు దోశలను, ఎండ వేడిని తరిమికొట్టేందుకు ఫ్రూట్ జ్యూస్ ఫ్రీగా ఇస్తామని కొన్ని ఔట్‌లెట్స్ ప్రకటించాయి. అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లా కూడా టికెట్లపై డిస్కౌంట్ ప్రకటించింది.

ఉప ఎన్నిక బరిలో కల్పనా సోరెన్

రాంచీ(జార్ఖండ్): జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పన గాండే అసెంబ్లీ సీటుకు జరిగే ఉప ఎన్నికలో పోటీ చేస్తారని జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) గురువారం ప్రకటించింది. జేఎంఎంకే చెందిన ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామాతో గిరిదిహ్ జిల్లాలో ఉన్న ఈ సీటు ఖాళీ అయ్యింది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలతోపాటుగా గాండే అసెంబ్లీ స్థానానికి మే 20వ తేదీన ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. ఆమె భర్త హేమంత్ సోరెన్‌ను మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ జనవరిలో అరెస్ట్ చేయడం తెలిసిందే.

బీజేపీని క్లీన్‌బౌల్డ్ చెయ్యండి: అఖిలేశ్

కన్నౌజ్ లోక్‌సభ స్థానానికి నామినేషన్

కన్నౌజ్ (యూపీ): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని క్లీన్‌బౌల్డ్ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన కన్నౌజ్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికలను భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌తో పోల్చుతూ బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై ఈ సందర్భంగా ఆయన స్పందించారు. 'ఓవర్‌లో ప్రతీ బాల్‌కూ మేం సిక్స్ కొడతాం. బీజేపీ వాళ్లయితే బంతి విసరలేరు. బ్యాటింగ్ చెయ్యనూ లేరు. అటువంటి వాళ్లని క్లీన్‌బౌల్డ్ చెయ్యాలి. 'అంటూ ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

మీరు సరిగా అర్థం చేసుకోలేదు

కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధానికి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర'ను ప్రధాని మోదీ సరిగా అర్థం చేసుకోలేదని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. 'న్యాయ్ పత్ర'లోని అంశాలపై వ్యక్తిగతంగా కలుసుకుని నువివరించేందుకు సమయం ఇవ్వాల్సిందిగా కోరుతూ ప్రధాని మోదీకి ఖర్గే గురువారం రెండు పేజీల లేఖ రాశారు. న్యాయ్ పత్రలో లేని అంశాలపై సైతం ప్రధానికి ఆయన సలహాదారులు తప్పుడు సమాచారం అందిస్తున్నారని అందులో పేర్కొన్నారు. 'స్వయంగా కలుసుకుని మా 'న్యాయ్ పత్ర'సారాంశాన్ని వివరిస్తే ఇకపై తప్పుడు ప్రకటనలను మీరు ఇవ్వరని నా నమ్మకం'అని ఖర్గే అందులో తెలిపారు.

మంచి చేయడమే.. మాట తప్పకపోవడమే.. మన కల్చర్

పులివెందుల బహిరంగసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





పులివెందుల సీఎస్‌ఐ చర్చి మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

పులివెందుల కల్చర్..
కడప కల్చర్.. రాయలసీమ కల్చర్..
అంటూ మనపై వేలెత్తి చూపించే
కార్యక్రమం నిత్యం జరుగుతోంది.
యస్.. మన కల్చర్ మంచి చేయటం..
మన కల్చర్ మంచి మనసు..
మన కల్చర్ మాట తప్పకపోవటం..
మన కల్చర్ బెదిరింపులకు లొంగకపోవడం..
అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు.

వైఎస్సార్ జిల్లా పులివెందుల అసెంబ్లీ స్థానానికి గురువారం వైఎస్ జగన్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పులివెందుల సీఎస్‌ఐ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..

నమ్మకం.. ధైర్యం.. అభివృద్ధి.. సక్సెస్ స్టోరీ

పులివెందుల అంటే నమ్మకం. పులివెందుల అంటే ధైర్యం. పులివెందుల అంటే అభివృద్ధి. పులివెందుల అంటే ఒక సక్సెస్ స్టోరీ. ఇది ఇక మీదట కూడా కొనసాగే విజయగాథ. కరువు ప్రాంతంగా ప్రయాణాన్ని ప్రారంభించి ఎక్కడో కృష్ణానది నీళ్లు ఈరోజు మన పులివెందులలో కనిపిస్తూ అభివృద్ధి బాటలో పరిగెత్తుతోందంటే ఈ అభివృద్ధి, ఆ మార్పులకు మూలం నా తండ్రి, మనందరి ప్రియతమ నాయకుడు దివంగత వైఎస్సార్ అయితే.. ఆయన వేసిన రెండు అడుగులకు తోడు మీ జగన్ మరో రెండు అడుగులు ముందుకు వేసింది ఈ 58 నెలల కాలంలోనే అని సవినయంగా తెలియజేస్తున్నా. పులివెందులలో ఏముంది? అని ఒకప్పుడు అడిగిన పరిస్థితుల నుంచి పులివెందులలో ఏం లేదో చెప్పాలని అడిగే స్థాయికి మన పట్టణాన్ని, నియోజకవర్గాన్ని మార్చుకుంటూ అడుగులు వేశాం. రాబోయే రోజుల్లో కూడా వేస్తాం.

నమ్మకాన్ని నింపింది పులివెందుల బిడ్డలే

ఒక్కటి గమనించండి. మనందరి పులివెందుల మనకే కాదు... రాష్ట్రానికి కూడా ఎంతో ఇచ్చింది. టీడీపీ మాఫియా నాలుగు దశాబ్దాల దుర్మార్గాలను ఎదిరించి నిలబడే ధైర్యాన్ని ప్రసాదించింది. మాట ఇస్తే మడమ తిప్పడన్న నమ్మకాన్ని, మోసం చేయడన్న విశ్వాసాన్ని తెలుగు నేలపై అణువణువునా నింపింది ఎవరంటే మీ పులివెందుల బిడ్డలే అని సగర్వంగా, సవినయంగా తెలియజేస్తున్నా. కాబట్టే ఆ చంద్రబాబుకు, ఈనాడుకు, ఆంధ్రజ్యోతికి, టీవీ, ఎల్లో మీడియాకు దశాబ్దాలుగా కోపంతో వచ్చే ఊతపదమేమిటి? పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ మనమీద వేలెత్తి చూపించే కార్యక్రమం చేస్తుంటారు. పులివెందులను తెలుగుసీమ అభిమానించింది. నమ్మింది, కలిసి నడిచింది. పులివెందుల, కడప, రాయలసీమ మంచితనం, మాటపై నిలబడే గుండెధైర్యం రాష్ట్రంలో ప్రతి ఒక్క గ్రామానికీ అర్థమైంది కాబట్టే ఓ వైఎస్సార్, ఓ జగన్‌ను మారుమూల ప్రాంతాల్లో కూడా అభిమానించే కోట్ల మంది ఈరోజు కనిపిస్తున్నారు.

కొత్తగా వైఎస్సార్ వారసులం అంటూ..

వైఎస్సార్, జగన్‌లపై లేనిపోని ముద్రలు వేసి దెబ్బ తీయటానికి చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు, ఓ వదినమ్మ ఎంత దుర్మార్గంగా ప్రయత్నిస్తున్నారో మీరే చూస్తున్నారు. వీరికి తోడు, వారి కుట్రలో భాగంగా ఈ మధ్య కొత్తగా వైఎస్సార్ వారసులం.. అంటూ మీ ముందుకు వస్తున్నారు. నేను ఈరోజు మీ అందరి సమక్షంలో అడుగుతున్నా. ఆ మహానేతకు వారసులు ఎవరో చెప్పాల్సింది ప్రజలు, వైఎస్సార్‌ను ప్రేమించేవారు కాదా? ఒక్క విషయం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయండి. ఆ దివంగత మహానేత, నాన్నగారి మీద కక్షపూరితంగా, కుట్రపూరితంగా, ఆయన చనిపోయిన తర్వాత కూడా కేసులు పెట్టింది ఎవరు? ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేసింది ఎవరు? ఆయన పేరును చివరకు సీబీఐ చార్జిషీట్‌లో పెట్టింది ఎవరు? ఒక వైఎస్సార్ లెగసీని లేకుండా చేయాలని చూస్తున్నది ఎవరు? వైఎస్సార్ కుటుంబాన్ని పూర్తిగా అణగదొక్కాలని, వారు లేకుండా చూడాలని కుట్రలు పన్నింది ఎవరు? ఇవన్నీ పులివెందుల ప్రజలకు, వైఎస్సార్ జిల్లా ప్రజలకు తెలుసు. తెలుగు నేల మీద ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసు.

వైఎస్సార్ పోరాడిన వారితో కుమ్మక్కు!

రాజకీయంగా అణగదొక్కాలని దేశంలో ఉన్న అన్ని వ్యవస్థలను మన మీద ప్రయోగించిన వారితోనే కలిసిపోయి.. కాంగ్రెస్, టీడీపీతో చేయి కలిపి, వైఎస్ అనే పేరే కనపడకుండా చేయాలని కోరుకుంటున్న వాళ్లందరితోనూ కలిసిపోయి, ఆ కుట్రలను అమలు చేస్తున్న శత్రువులతో చేతులు కలిపి వారి పార్టీల్లో చేరిపోయిన వీరా... వైఎస్సార్ వారసులు? వైఎస్సార్‌గారు బతికున్నంతకాలం ఎవరితో పోరాటం చేశారు? అని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయమని కోరుతున్నా. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌ను అభిమానించే అభిమానులు, కార్యకర్తలు ఎవరితో యుద్ధం చేశారు? అని ఆలోచన చేయమని కోరుతున్నా.

నా ప్రాణానికి ప్రాణం.. నా పులివెందుల

పులివెందుల.. నా సొంత గడ్డ, నా ప్రాణానికి ప్రాణం.. నన్ను నిరంతరం ప్రేమిస్తూ ప్రతి కష్టంలోనూ నా వెంట నిలిచే పులివెందుల అన్నదమ్ములకు, అక్క చెల్లెమ్మలకు, అవ్వాతాతలకు, ప్రతి స్నేహితుడికీ మీ బిడ్డ జగన్ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాడు. పులివెందుల అభివృద్ధికి మూలం వైఎస్సార్.

కుట్రలో భాగస్వాములు వారసులా?

వైఎస్సార్ మీద కుట్రలు, కుతంత్రాలు చేసిన ఆయన శత్రువుల ఇళ్లకు పసుపు చీర కట్టుకుని వెళ్లి, వారికి మోకరిల్లి, వారి స్క్రిప్టులను మక్కికి మక్కీ చదివి వినిపిస్తూ, వారి కుట్రల్లో భాగమవుతున్న వీళ్లా వైఎస్సార్ వారసులు? వైఎస్సార్ కీర్తి ప్రతిష్టలను, ఏకంగా ఆయన పేరునే ప్రజల మనసు నుంచి చెరిపివేయాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే ఉండకూడదని, వైఎస్సార్ విగ్రహాలు ఏ గ్రామంలోనూ ఉండకూడదని, ఆ విగ్రహాలన్నింటినీ ముక్కలు చెక్కలు చేస్తామని బహిరంగంగానే చెబుతున్న వారితో చేతులు కలిపిన వీరా వైఎస్సార్ వారసులు? ఇలాంటి వారికి ఓటు వేస్తే వైఎస్సార్ లెగసీకి ఓటు వేసినట్లా? లేక వైఎస్సార్ పేరు కనపడకుండా చేసే కుట్రలకు ఓటు వేసినట్టా? రాజకీయాలు ఏ స్థాయికి దిగజారిపోయాయో గమనించమని కోరుతున్నా.

వారి వెనుక ఎవరున్నారో కనిపిస్తూనే ఉంది

ఒక చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడు, బీజేపీ, కాంగ్రెస్.. వీళ్లందరూ సరిపోరు అన్నట్టుగా నా ఇద్దరి చెల్లెమ్మలతో కూడా కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. మీ బిడ్డ ఒక్కడి మీద ఇంత మంది కలిసి ఏకమవుతున్నారు. రాజకీయాలు ఏ స్థాయికి పతనమైపోయాయో గమనించమని కోరుతున్నా. ఇక మా చిన్నాన్న గారి విషయానికే వద్దాం. మా వివేకం చిన్నాన్నను ఎవరు చంపారో, ఎవరు చంపించారో ఆయనకు, ఆ దేవుడికి, ఈ జిల్లా ప్రజలందరికీ కూడా తెలుసు ఏం జరిగింది అన్నది. బురద జల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనుక ఎవరు ఉన్నారో కూడా మీ అందరికీ కనిపిస్తూనే ఉంది. ఆశ్చర్యం ఏమిటంటే.. వివేకం చిన్నాన్నను అతి దారుణంగా చంపి.. ఔను నేనే చంపానని అతి హేయంగా, బహిరంగంగా చెప్పుకుంటూ తిరుగుతున్న ఆ హంతకుడికి మద్దతు ఇస్తున్నది ఎవరో మీరే చూస్తున్నారు కదా! నాడు చిన్నాన్నను అన్యాయంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన వారితో, సంఖ్యాబలం లేకపోయినా కూడా ప్రలోభాలు, అధికార బలంతో ఓడించిన వారితో ఈరోజు చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారంటే దానికి అర్థమేమిటి? చిన్నాన్నకు రెండో భార్య ఉన్న మాట వాస్తవమా? కాదా? ఆ రెండో భార్యతో ఆయనకు సంతానం ఉన్న మాట వాస్తవం అవునా? కాదా? ఆనాడు ఎవరు ఫోన్ చేస్తే అవినాష్ అక్కడికి వెళ్లాడు? అవినాష్ పలు ఇంటర్వ్యూలు, ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో అడిగిన ప్రశ్నలు సహేతుకమే కదా! ఎవరైనా అవినాష్ వైపు మాట్లాడితే చాలు వెంటనే వారిపై కూడా అడ్డగోలు ఆరోపణలతో కుట్ర రాజకీయాలు చేయడం ధర్మమేనా? చిన్నాన్నను ఓడించిన వారిని గెలిపించాలని తిరగడం కంటే దిగజారుడు రాజకీయాలు ఎక్కడైనా ఉంటాయా?



వైఎస్ జగన్ మళ్లీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సభలో ఫొటోను ప్రదర్శిస్తున్న అభిమానులు

కాంగ్రెస్‌కు ఓటేస్తే బాబు, బీజేపీకి లాభం

అసలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లెన్ని వచ్చాయి? నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాని కాంగ్రెస్ పార్టీతో, రాష్ట్రాన్ని విడగొట్టిన ఆ కాంగ్రెస్ పార్టీతో, ప్రత్యేక హోదాను విభజన చట్టంలో చేర్చకుండా రాష్ట్రాన్ని దుర్మార్గంగా విడగొట్టి అన్యాయం చేసిన ఆ కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్సార్ గారి పేరును, ఆయన చనిపోయిన తర్వాత కూడా చార్జ్ షీట్‌లో చేర్పిన ఆ కాంగ్రెస్ పార్టీలో చేరి మొత్తంగా వైఎస్సార్ పేరునే తుడిచి వేయాలని, కనపడకుండా చేయాలని ప్రయత్నిస్తున్న వారికి ఓటు వేయటం అంటే దానివల్ల ఎవరికి లాభమో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయమని కోరుతున్నా. అలాంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే, మన ఓట్లు చీలిస్తే వచ్చే లాభం బాబుకు, బీజేపీ కూటమికి కాదా? ఇదంతా మన ఓట్లను విడగొట్టి వాళ్లను గెలిపించాలనే ప్రయత్నం కాదా? అసలు ఎవరికి వైఎస్సార్ గారి మీద ప్రేమ ఉందో ప్రతి ఒక్కరూ గమనించాలి. పులివెందుల, కడప గడ్డపై ఎవరికి ప్రేమ ఉందో ఆలోచన చేయండి. వైఎస్సార్, పులివెందుల, వైఎస్సార్ జిల్లా పేర్లు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిపోవాలని ఆరాటపడుతున్న వారు ఎవరు అన్నది ఆలోచన చేయండి. మరోపక్క ఈ పేర్లే లేకుండా చేయాలని ఆరాటపడుతున్న ఆ రెండు పార్టీలతో జతకట్టి తన సొంత లాభం, రాజకీయ స్వార్థం కోసం ఎవరు కుట్రలు చేస్తున్నారో గమనించమని కోరుతున్నా.

పేదలకు మంచి చేసేందుకే అధికారం

పులివెందుల ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు, మరీ ముఖ్యంగా నామీద ఆరోపణలు చేస్తున్న నా బంధువులకు ఈ సందర్భంగా ఒక్కటి చెప్పదల్చుకున్నా. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మమ్మల్ని పక్కన పెట్టాడంటున్న నా బంధువులకు తెలియజేస్తున్నా. ముఖ్యమంత్రిగా దేవుడు మీ బిడ్డకు అధికారం ఇచ్చింది డబ్బులు సంపాదించుకునేదాని కోసం కాదు. నా కుటుంబ సభ్యులను కోటీశ్వరులను చేసేందుకు కాదు. ఆ దేవుడు మీ బిడ్డకు ఈ ముఖ్యమంత్రి పదవి ఇచ్చింది పేదలందరికీ మంచి చేసేందుకు. మరొక్క విషయం కూడా నిండు మనసుతో చెబుతున్నా. వైఎస్ అవినాశ్ ఏ తప్పూ చేయలేదని నేను బలంగా నమ్మాను కాబట్టే టికెట్ ఇచ్చా. అవినాశ్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేని వీరంతా అవినాశ్‌ను దూషించడం, అతడిని తెరమరుగు చేయాలనుకోవడం ఎంత దారుణమో ప్రతి ఒక్కరూ గమనించమని కోరుతున్నా. మా అందరికన్నా అవినాష్ చాలా చిన్నోడు. అటువంటి పిల్లాడి జీవితం నాశనం చేయాలని ఇంత పెద్ద పెద్ద వాళ్లందరూ కూడా కుట్రల్లో భాగం అవుతున్నారంటే నిజంగా వీళ్లందరూ మనుషులేనా?

మన పాలనలో మనసు, మానవత్వం..

ఈరోజు పులివెందులలోగానీ, కడపలోగానీ మొత్తం తెలుగు నేలమీద గానీ ఒక జలయజ్ఞం, ఉచిత విద్యుత్, 108, 104 సేవలు, ఆరోగ్యశ్రీ.. వీటన్నింటితోపాటు మీ జగన్ తెచ్చిన అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం, నాడు-నేడు, చేయూత, వైఎస్సార్ ఆసరా, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల గృహ నిర్మాణాలు, విస్తరించిన ఆరోగ్యశ్రీ.. ఆరోగ్య ఆసరా, ఆరోగ్య సురక్ష, విలేజ్ క్లినిక్, రైతు భరోసా, ఆర్బీకేలు, సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు, డీబీటీతో బటన్ నొక్కి నేరుగా రూ.2.70 లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి జమ చేయడం.. ఇవన్నీ మన మనసు, మానవత్వాన్ని చూపే అంశాలు. ఇది నచ్చని పసుపు మూకలతో మన చెల్లెమ్మలు చేయి కలపడం కంటే దుర్మార్గమైన కార్యక్రమం మరొకటి ఏదైనా ఉంటుందా?

పులివెందులను ఆదర్శంగా తీర్చిదిద్దాం

పులివెందుల అభివృద్ధికి గత ఐదేళ్లలో తీసుకున్న చర్యలను క్లుప్తంగా వివరిస్తా. పులివెందుల ప్రజల చిరకాల కోరిక.. ఆ కనిపిస్తున్న మెడికల్ కాలేజీ. నాన్న కలలుగన్న ఆ మెడికల్ కాలేజీ ఆసుపత్రిని ఈమధ్యనే పులివెందుల ప్రజలకు అంకితం చేశాం. ఈ జూలై, ఆగస్టులో మెడికల్ కాలేజీని కూడా అంకితం చేయబోతున్నామని చెప్పడానికి గర్వపడుతున్నా. పులివెందుల మోడల్ టౌన్ ప్రాజెక్టులో భాగంగా పట్టణాన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామో మీ అందరికీ కనిపిస్తూనే ఉంది. జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానంలో భాగంగా రూ.900 కోట్లతో కాలేటివాగు సామర్థ్యాన్ని 1.02 టీఎంసీలకు పెంచి కరువు పీడిత చక్రాయపేట మండలానికి నీటిని అందించే పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గతంలో మూడు, నాలుగు టీఎంసీలకు మించి నీళ్లు నిల్వ చేయలేని పరిస్థితిని మారుస్తూ ఆర్ అండ్ ఆర్ పరిహారం దాదాపు రూ.250 కోట్లు చెల్లించాం. 2020 నుంచి క్రమంతప్పకుండా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 10 టీఎంసీల నీటిని ఏటా నింపుతూ వస్తున్నాం. పైడిపాలెం రిజర్వాయర్‌ను 6 టీఎంసీల పూర్తి కెపాసిటీతో నింపేలా చర్యలు తీసుకున్నాం. యురేనియం బాధిత గ్రామాలతోపాటు లింగాల, వేముల, వేంపల్లె మండలాలకు తాగునీరు, సాగునీరు ఇవ్వడానికి ఏకంగా రూ.1,000 కోట్లతో ఎర్రబల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులు వేగంగా జరగడం మన కళ్లెదుటే కనిపిస్తోంది. వాటర్ గ్రిడ్ ద్వారా రూ.480 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకూ తాగునీటి సరఫరా దాదాపుగా పూర్తయింది. పులివెందులలో స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ క్యాంపస్‌ను ప్రారంభించాం. ఏపీ కార్ల్‌లో న్యూటెక్ సైన్సెస్ పరిశ్రమతోపాటు వైఎస్సార్ వ్యవసాయ కళాశాల, ఉద్యాన కళాశాలలను నెలకొల్పాం. ఆదిత్య బిర్లా గార్మెంట్స్ పరిశ్రమను పులివెందులకు తెచ్చాం. కేంద్రంతో పలుదఫాలు చర్చించి హైవేలు, గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టులు సాధించాం.

ఇవన్నీ మీ బిడ్డ సీఎం కాబట్టే కదా..

పులివెందులలో కొత్త బస్టాండ్, క్రికెట్ స్టేడియం, పార్కులు లాంటివి మీరంతా చూస్తున్నారు. మొత్తంగా దాదాపు రూ.5,900 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగంగా జరగడం కళ్లెదుటే కనిపిస్తోంది. ఇవన్నీ కాకుండా మీ బిడ్డ బటన్ నొక్కి, అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పంపించిన సొమ్ము మరో రూ.2,069 కోట్లు ఉంటుందని చెప్పడానికి గర్వపడుతున్నా. మన పులివెందులలో నవరత్నాలు పథకాల ద్వారా 94.4 శాతం గడపలకు లబ్ధి చేకూరింది. చీనీ అమ్మకాలకు అనంతపురం వెళ్లాల్సిన అవసరం లేకుండా పులివెందులలోనే విక్రయించే ఏర్పాట్లు చేశాం. ఇవన్నీ చేశామంటే కారణం మీ బిడ్డ సీఎం అయ్యాడు కాబట్టే కదా అని ప్రతి ఒక్కరూ గమనించమని కోరుతున్నా.

నాన్న మరణం తర్వాత పట్టించుకున్నారా?

నాన్నగారి మరణం తర్వాత పదేళ్ల పాటు ఏ ప్రభుత్వాలైనా, ఎవరైనా మన పులివెందులను పట్టించుకున్నారా? అని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయమని కోరుతున్నా. మళ్లీ పులివెందుల దశ మారింది ఎప్పుడంటే? మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాతే, ఈ 58 నెలల్లోనే కాదా? పులివెందులను, వైఎస్సార్ జిల్లాను ఇంకా అభివృద్ధి చేయాలి. వచ్చే ఐదేళ్లలో మీ అందరి అండతో, ఆ దేవుడి ఆశీస్సులతో మీ బిడ్డ ద్వారా మన ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయి. పులివెందుల, కడప, రాయలసీమ, వైఎస్సార్, వైఎస్ జగన్.. ఇవన్నీ మనసున్న పేర్లు కాదా? ఈ పేర్లను చెరిపివేయాలనుకునే వారు ఎన్నటికీ మనకు, ఈ రాష్ట్రానికి కూడా వ్యతిరేకులేనని గమనించాలని కోరుతున్నా. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేయడం ద్వారా మరో ఐదేళ్లు మన పులివెందుల అభివృద్ధి ప్రయాణానికి, మీ జగన్ ప్రయాణానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నా. మీ బిడ్డకు చరిత్రలో కనీవినీ ఎరుగని మెజార్టీ ఇచ్చిన ఈ గడ్డను మరోసారి అలాంటి మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరుతున్నా. అవినాశ్‌ను కూడా అంతే ఆప్యాయతతో, గొప్ప మెజార్టీతో దీవించాలని మీ అందరినీ ప్రార్థిస్తున్నా.

■ ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి ప్రతినిధి, కడప



సీఎం వైఎస్ జగన్‌కు దిష్టి తీస్తున్న మహిళలు

మంచి చేయడంలో మీ జగన్‌ను కొట్టలేరు!

జగన్‌ను పథకాలలో కొట్టలేరు. పాలనలో, పనితీరులో జగన్‌ను కొట్టలేరు. పల్లెకు మంచి చేయడంలో జగన్‌ను కొట్టలేరు. జగన్‌ను పిల్లలకు చేసిన మంచిలో కొట్టలేరు. జగన్‌ను రైతులకు అందించిన రైతు భరోసా, రైతు భరోసా కేంద్రాల్లో కొట్టలేరు. జగన్‌ను అక్కచెల్లెమ్మలకు చేసిన మంచిలో, మేలులో కొట్టలేరు. జగన్‌ను అవ్వాతాతల పట్ల చూపించిన అనురాగంలో కొట్టలేరు. వారి ఆత్మగౌరవం కాపాడటంలో కూడా జగన్‌ను కొట్టలేరు. జగన్‌ను డీబీటీలో అంటే బటన్లు నొక్కడంలో కొట్టలేరు. ఏ రంగాన్ని తీసుకున్నా జగన్ మంచి చేయలేదు అని వీళ్లు చెప్పలేరు. తమ 14 ఏళ్ల పాలనలో జగన్ కంటే మంచి చేశాం అని వాళ్లు చెప్పలేరు. అందుకే ఆలోచన చేయమని అడుగుతున్నా. మన బ్రాండ్ జగన్, మన బ్రాండ్ వైఎస్సార్, మన బ్రాండ్ కడప, మన బ్రాండ్ పులివెందులను కొట్టాలనుకుంటున్న వీరందరికీ ఓటు ద్వారా గుణపాఠం చెప్పడానికి మీరంతా సిద్ధమేనా?



సీఎం జగన్‌కు ప్రజలే దేవుళ్లు

• కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలే దేవుళ్లని వైఎస్సార్‌సీపీ కడప ఎంపీ అభ్యర్థి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి చెప్పారు. సీఎం జగన్ ఐదేళ్లలో విపక్షకు తావు లేకుండా, అవినీతి రహితంగా పాలన అందించారని తెలిపారు. ప్రజల గుండెల్లో నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేకే విపక్ష పార్టీలన్నీ ఒక్కటయ్యాయని అన్నారు. సీఎం వైఎస్ జగన్ నామినేషన్ సందర్భంగా గురువారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అవినాశ్ ప్రసంగించారు. ఈ ఐదేళ్లలో పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. చిత్రావతి రిజర్వాయర్‌లో వరుసగా నాలుగేళ్లు 10 టీఎంసీలు నీరు నిల్వ చేశామని అన్నారు. 16 నెలల క్రితం ప్రాజెక్టుల సందర్శన పేరిట చంద్రబాబు పర్యటించారని, అప్పటి నుంచి వర్షాలే లేవని కరువు వచ్చి పడిందని చెప్పారు. సీఎం జగన్ ముందుచూపుతో సీబీఆర్, పైడిపాళెం ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేయడం వల్ల లింగాల, పీబీసీ కాలువలు, చెరువులకు నీరివ్వడం సాధ్యమైందన్నారు. బాబు పాలనలో జిల్లాలో పంటల బీమా రూ.750 కోట్లు మాత్రమే రాగా, సీఎం జగన్ పాలనలో రూ.1,100 కోట్లు వచ్చిందని తెలిపారు. బాబు హయాంలో జిల్లాకు రూ.40 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ లభిస్తే, సీఎం జగన్ వచ్చాక రూ.278 కోట్లు వచ్చిందని తెలిపారు. మొగమూరు నదిపై చెక్‌డ్యాంలు నిర్మించి నీరు నిల్వ చేశామని, చక్రాయపేటలో కాలేటివాగు ప్రాజెక్టు సామర్థ్యాన్ని 0.2 టీఎంసీల నుంచి 1.2 టీఎంసీలకు పెంచామన్నారు. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చెప్పడమే ఎల్లో బ్యాచ్ పని అని ఆరోపించారు. ఒక్క అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందనేది చంద్రబాబు సిద్ధాంతమని, ఎవరూ వారి ట్రాప్‌లో పడొద్దని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, యువత సీఎం జగన్‌కు అండగా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు సీఎం జగన్‌ను టచ్ కూడా చేయలేరని చెప్పారు.







సీఎం వైఎస్ జగన్ నామినేషన్ కార్యక్రమం సందర్భంగా వేదమంత్రాలతో ఆశీర్వదిస్తున్న పండితులు, ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు, క్రైస్తవ మత గురువులు

సీఎం జగన్ నామినేషన్ దాఖలు

పులివెందుల: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల అసెంబ్లీ స్థానానికి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం సీఎస్ఐ చర్చి మైదానంలో బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం 11.10 గంటలకు అంబకపల్లె రోడ్డు మినీ సెక్రటేరియట్‌లో ఉన్న ఆర్‌వో కార్యాలయానికి సీఎం రోడ్డు మార్గాన చేరుకున్నారు. 11.15 గంటలకు ముఖ్యమంత్రి జగన్ తన నామినేషన్ పత్రాలను ఆర్‌వో వెంకటేశులుకు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ వెంట ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప ఉన్నారు. అనంతరం సీఎం జగన్ భాకరాపురంలోని స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కాసేపు గడిపారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం 1.25 గంటల ప్రాంతంలో అక్కడి నుంచి కడప బయలుదేరి వెళ్లారు. హెలిప్యాడ్ వద్ద పులివెందుల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రుక్మిణి, కౌన్సిలర్ శైలజ, పలువురు మహిళలు గుమ్మడికాయతో ముఖ్యమంత్రికి దిష్టి తీశారు. కాగా, సీఎం జగన్ తరపున పులివెందులలో వైఎస్ మనోహర్‌రెడ్డి గత సోమవారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన విషయం విదితమే.

క్లుప్తంగా...

బాబూ.. నోరు అదుపులో పెట్టుకో..

స్పీకర్ తమ్మినేని సీతారాం హెచ్చరిక



ఆమదాలవలస: ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదివి తనను విమర్శించిన చంద్రబాబు నోరు అదుపులో పెట్టుకోవాలని.. లేకుంటే రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం హెచ్చరించారు. ఆమదాలవలసలో ఇటీవల చంద్రబాబు స్పీకర్ తమ్మినేనిపై విమర్శలు గుప్పించారు. దానిపై స్పీకర్ గురువారం విలేకరుల సమావేశంలో స్పందించారు. చంద్రబాబు రాక కోసం జైలు ఎదురు చూస్తున్నదని, ఎన్నికల అనంతరం ఆయన జైలుకు వెళ్లాల్సిందేనని చెప్పారు. రెండెకరాల పొలంతో రాజకీయాల్లోకి వచ్చిన బాబు వేల ఎకరాలకు ఎలా అధిపతి అయ్యారని ప్రశ్నించారు. స్కిల్ స్కామ్‌లో రూ.312 కోట్లు బొక్కేశారని, ఇది కోర్టులో తేటతెల్లమై మళ్లీ జైలుకు వెళ్తారన్నారు. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా చంద్రబాబు నిలబెట్టుకోలేదని, ఆయన సూపర్ సిక్సర్లను ఎవరూ నమ్మరని ఎద్దేవా చేశారు.

రమణ దీక్షితులకు 41ఏ నోటీసు ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి అమరావతి: తనపై తిరుపతి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ టీటీడీ మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసు ఇచ్చి రమణ దీక్షితులను విచారించవచ్చునని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీటీడీ ప్రతిష్ట దెబ్బతినేలా అభ్యంతరకర, అసంబద్ధ వ్యాఖ్యలు చేసినందుకు రమణ దీక్షితులపై అందిన ఫిర్యాదు మేరకు తిరుపతి వన్‌టౌన్ పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ రమణ దీక్షితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

చింతలపూడి టీడీపీ అభ్యర్థిపై ఫిర్యాదు

అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని ఫిర్యాదు చేసినట్లు వెల్లడించిన రిటైర్డ్ ఎంఈవో

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా చింతలపూడి టీడీపీ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సమర్పించిన నామినేషన్ అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని ఏలూరు జిల్లా జీలకర్రగూడేనికి చెందిన రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) సేవా ధర్మదాస్ చెప్పారు. వ్యక్తిగత, కుటుంబ వివరాలు గోప్యంగా ఉంచారని తెలిపారు. దీనిపై విచారించి ఆయన నామినేషన్‌ను రద్దుచేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏలూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏలూరుకు చెందిన సీనియర్ న్యాయవాది గొట్టుముక్కల రోనాల్డ్ రాజ్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు లీగల్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. రోషన్‌కుమార్ 15 ఏళ్లుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారని, ఆయన భార్య అమెరికాలో గ్రీన్‌కార్డ్ పొందిన విషయాన్ని, ఇద్దరు పిల్లలు అమెరికన్ సిటిజన్స్ అనే అంశాన్ని అఫిడవిట్‌లో తెలపలేదని చెప్పారు. అమెరికాలో ఆస్తులు, బ్యాంక్ బ్యాలెన్స్, ఇన్సూరెన్సుల వివరాలను తెలపలేదన్నారు. 2 కార్లు 2016లో కొనుగోలు చేసినట్టు తెలిపిన రోషన్‌కుమార్ వాటి ధరలు తక్కువగా చూపించారన్నారు. ఎన్‌ఆర్‌ఐ అభ్యర్థులు ఓటు నమోదు ప్రక్రియలో ఫామ్-6 (ఏ) దాఖలు చేయాల్సి ఉందన్నారు. ఇలాంటి అతి ముఖ్యమైన అంశాలన్నీ టీడీపీ అభ్యర్థి కావాలనే దాచిపెట్టారని, ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధమన్నారు. ఇలాంటి అభ్యర్థుల నామినేషన్‌ను తిరస్కరించాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని సైతం నోటీసులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

పదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి శూన్యం

- రైతులను మోసం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

సత్తెనపల్లి/కృష్ణలంక(విజయవాడతూర్పు): 'గత పదేళ్ల కాలంలో చంద్రబాబు, వైఎస్ జగన్ పరిపాలన చేశారు. రాష్ట్రం అభివృద్ధిలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. పదేళ్ల కిందట రాష్ట్రం ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉంది' అని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రత్యేక హోదా రావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కృష్ణలంకలో గురువారం జరిగిన సభల్లో ఆమె ప్రసంగించారు. 'సీఎం జగన్ నాగార్జునసాగర్ కాలువలకు మరమ్మతులు చేస్తామని, చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇస్తామని చెప్పారు. కనీసం రబీలోనూ నీళ్లివ్వలేదు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే పంట నష్టపరిహారం ఇస్తామమని చెప్పి మోసం చేశారు. రైతన్నకు మద్దతు ధర ఇస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి.. ఒక్క ఏడాదైనా అమలు చేశారా? రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏమైంది. మరి ఇలాంటప్పుడు రైతులు ఎలా బతకాలి. దివంగత సీఎం వైఎస్సార్ రుణమాఫీ చేశారు. ఈ రోజున పరిస్థితి ఎలా ఉందో ఒకసారి ఆలోచన చేయండి..' అని షర్మిల పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన 17వ డివిజన్ జనసేన కార్యకర్తలతో దేవినేని అవినాశ్



సీపీఎం, టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మొండితోక

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కంచికచర్ల/లబ్బీపేట (విజయవాడ తూర్పు)/ భవానీ పురం(విజయవాడపశ్చిమ)/నరసాపురం రూరల్: ఎన్టీఆర్ జిల్లాలోని వీరులపాడు గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ నేత యేపూరి పిచ్చయ్య, టీడీపీ నేత షేక్ అన్వర్‌తో పాటు పలువురు నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో గురువారం చేరారు. విజయవాడలోని 17వ డివిజన్‌కు చెందిన 100 మంది జనసేన కార్యకర్తలు, పలు డివిజన్‌లకు చెందిన 20 నాయీబ్రాహ్మణ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాశ్ సమక్షంలో పార్టీలో చేరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని 300-450 ఎస్ఎఫ్‌టీ గృహ సముదాయం ఓనర్స్ అండ్ టెనెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ అసిఫ్ సమక్షంలో పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం బియ్యపుతిప్పలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లాడి లక్ష్మణస్వామి తన అనుచరులు, కుటుంబీకులతో కలసి ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



పార్టీలో చేరినవారికి కండువా కప్పుతున్న పశ్చిమ అభ్యర్థి షేక్ అసిఫ్



ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేతలు, గ్రామస్తులు

ట్రెండింగ్‌లో 'వైఎస్ జగన్ నామినేషన్'

దేశంలోనే మొదటి స్థానంలో హ్యాష్‌ట్యాగ్



సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా పులివెందుల శాసనసభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయడం సోషల్ మీడియా ట్రెండింగ్‌లో టాప్‌లో నిలిచింది. ఎక్స్(ట్విట్టర్) యాప్‌లో 'వైఎస్ జగన్ నామినేషన్' హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా మొదటి స్థానం సాధించింది. నామినేషన్ వేయడానికి ముందు పులివెందులలోని సీఎస్ఐ చర్చి మైదానంలో సీఎం జగన్ నిర్వహించిన సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి.. వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు తామంతా సిద్ధమని నినదించారు. ఈ సభ విశేషాలను, సీఎం జగన్‌కు ప్రజలు నీరాజనాలు పలుకుతున్న ఫొటోలు, వీడియోలను వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పెద్ద సంఖ్యలో పోస్టులు చేశారు. వీటిని చూసిన నెటిజన్లు వైఎస్ జగన్ ప్రభుత్వ పనితీరు గురించి చర్చించుకున్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమంటూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

'పశువులు కూడా అసహ్యించుకునే స్థాయికి బాబు'

సాక్షి, అమరావతి: పులివెందులలో వైఎస్సార్ రాజకీయ వారసత్వం గురించి సీఎం జగన్ మాట్లాడిన మాటలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వక్రీకరించడంపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ వారసత్వం గురించి సీఎం జగన్ మాట్లాడితే.. చెల్లెలి పుట్టుక గురించి మాట్లాడారని వక్రీకరిస్తున్న చంద్రబాబు వికృతపు ఆలోచనలను చూస్తే ఆయన ఎంతగా దిగజారిపోయారో అర్థమవుతోందని సజ్జల మండిపడ్డారు. చివరకు పశువులు కూడా అసహ్యించుకునే స్థాయికి చంద్రబాబు వెళ్లిపోయారన్నది స్పష్టమవుతోందంటూ 'ఎక్స్'లో గురువారం ట్వీట్ చేశారు.

జగన్ పాలన చూసి ఓర్వలేకే బాబు, పవన్‌ల ఆరోపణలు

- చంద్రబాబు చెబుతున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు నమ్మడం లేదు.
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



సాక్షి,అమరావతి : సీఎం జగన్‌పై చంద్రబాబు తరచూ చేసే విమర్శలకు ఇక స్వస్తి పలకాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత కోరారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకి ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ఇది చూశాక అయినా బాబు, ఎర్ర బుక్ లోకేశ్‌లో, టీడీపీ నేతల్లో, పావలా కళ్యాణ్‌లో మార్పు రావాలన్నారు. సీఎం జగన్ పాలనలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా ఇంటి వద్దకే పథకాలు వచ్చేలా పాలన నడిచిందన్నారు. ఈ పాలనను చూసి ఓర్చుకోలేక చంద్రబాబు, పవన్‌లు ఇలా ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మళ్లీ జగనే సీఎం అవ్వాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని, వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో మళ్లీ గెలవబోతోందన్నారు. ప్రజా విశ్వాసం లేని లోకేశ్, చంద్రబాబులు మంగళగిరి, కుప్పంలో గెలిచే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు చెబుతున్న సూపర్ సిక్స్ పథకాలను జనం నమ్మకపోవడంతో.. సీఎం జగన్‌పై దూషణలు, అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగతంగా కించపరచడం వంటివి చేస్తున్నారని మండిపడ్డారు.

విద్యారంగంపై ఎల్లో మీడియాలో దుర్మార్గపు వార్తలు

విద్యారంగంపై ఎల్లో మీడియాలో దుర్మార్గపు వార్తలు రాస్తున్నారని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ ఎ.నాగ నారాయణమూర్తి మండిపడ్డారు. నాడు-నేడు కింద అభివృద్ధి జరిగిన పాఠశాలలు కనిపించడం లేదా రామోజీ? అంటూ నిలదీశారు. టీడీపీ హయాంలో స్కూల్స్ మూత వేసినట్టు ఎల్లో మీడియాలోనూ వార్తలు వచ్చాయని, ఆ మేరకు బాబు జీవోలు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా వ్యవస్థలో సీఎం జగన్ తెచ్చిన సంస్కరణలపై ఎల్లో మీడియా విషం చిమ్ముతోందన్నారు.

సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి వీరశివారెడ్డి

మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు శ్రీనాథరెడ్డి దంపతులు పార్టీలో చేరిక



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వీరశివారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్/పుంగనూరు: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని సీఎం వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో గురువారం కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆయన్ని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. వీరశివారెడ్డితో పాటు ఆయన కుమారుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. కార్యాలయ ఆవరణలో వీరశివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు వల్ల రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం లేదని చెప్పారు. చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీలో గుర్తింపులేనందువల్ల పార్టీ మారినట్లు చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌దేనన్నారు. ప్రతినెల 1వ తేదీ తెల్లవారకముందే వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే పింఛన్లు అందిస్తూ వికలాంగులు, వితంతువులకు ఇంటి పెద్దకొడుకు అనిపించుకున్నారని చెప్పారు. ఎన్ని పార్టీలు వచ్చినా, ఎన్ని కుతంత్రాలు పన్నినా జగన్‌ని ఎవరూ ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర ప్రజలందరు రెండోసారి కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎన్నిపార్టీలు ఏకమైనా జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఆపలేవన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన తనకు ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన చెప్పారు.

పార్టీలో చేరిన శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి దంపతులు



సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి దంపతులు

మాజీ మంత్రి అమరనాథరెడ్డి సోదరుడు శ్రీనాథరెడ్డి, ఆయన సతీమణి అనీషారెడ్డి గురువారం సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరేందుకు వారు చర్చలు జరిపారు. నామినేషన్ వేసేందుకు గురువారం పులివెందుల వచ్చిన సీఎంను శ్రీనాథరెడ్డి దంపతులు కలిసి పార్టీలో చేరారు. సీఎం వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో సీనియర్లుగా ఉన్న శ్రీనాథరెడ్డి, అనీషారెడ్డి వైఎస్సార్‌సీపీలోకి రావడంతో పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో టీడీపీకి ఊహించని దెబ్బ పడింది. శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆశయాలు, సీఎం పనితీరు, అభివృద్ధి, సంక్షేమం చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

చంద్రబాబూ.. డ్రామాలు కట్టిపెట్టు

- 33 మంది పెన్షన్‌దారుల మరణానికి కారకుడివి నువ్వే
- ఇప్పుడు మళ్లీ సకాలంలో పింఛన్లు ఇవ్వాలని డ్రామాలెందుకు?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంటింటి పింఛన్ల పంపిణీ నిలిచిపోయేలా చేసిన చంద్రబాబే ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టేందుకు సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలని కొత్త డ్రామాకు తెరతీశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సకాలంలో పింఛన్లు పంపిణీ చేయాలని, ఒకటోతేదీనే అందేలా చూడాలని ఎన్నికల కమిషన్‌కు బాబు లేఖ రాయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ఇలాంటి డ్రామాలు కట్టిపెట్టాలని హితవు పలికారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. వృద్ధుల పెన్షన్ల పంపిణీని అడ్డుకున్నందుకు ముందు చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలి. 33 మంది పెన్షన్‌దారులు మరణానికి కారకుడివి నువ్వే బాబు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ పేరుతో ఈసీకి వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ వద్దంది నీవు కాదా? నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఫిర్యాదుతోనే కదా పెన్షన్ల పంపిణీ ఆగింది. రమేష్ వెనక ఉన్నది నీవే అనేది రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి తెలుసు. ఆ కారణంగా రాష్ట్రంలో వృద్ధులు పెన్షన్ తెచ్చుకునే క్రమంలో 33 మందికిపైగా మరణించిన విషయం నిజం కాదా? దానికి కారణం నువ్వు చేయించిన ఫిర్యాదే కదా. ప్రజలందరికి నీ మోసపు బుద్ధులు, చిల్లర చేష్టలు తెలుసు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తామని చెప్పింది బాబు, పవన్‌కళ్యాణే. ఎన్నికలు వచ్చేసరికి వలంటీర్లను కొనసాగిస్తాం, నెలకు పదివేలిస్తామని మోసపు మాటలు చెప్పడం బాబుకే చెల్లుతుంది. నెలకు 66 లక్షల మందికిపైగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కిడ్నీరోగులకు పెన్షన్ సకాలంలో ఇంటి వద్దే అందేలా చేసిన ఘనత సీఎం జగన్‌దే.

రాష్ట్రంలో రౌడీలు రాజ్యమేలుతున్నారు

- అరాచక శక్తులను తరిమికొట్టండి
- రాజంపేట, రైల్వేకోడూరు సభల్లో చంద్రబాబు
- అన్నమయ్య జిల్లాలో పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి రౌడీపాలన: పవన్



రైల్వేకోడూరు సభలో బాబు, పవన్, కిరణ్

సాక్షి, రాయచోటి : రాష్ట్రంలో ఎక్కడ చూసినా పాపాలు పెరిగాయని, రౌడీలు రాజ్యమేలుతున్నారని, అరాచక శక్తులను తరిమికొట్టాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వేకోడూరులో జరిగిన ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగించారు. అన్నమయ్య డ్యాం కట్టలేని సీఎం మూడు రాజధానులు కడతారా అని అన్నారు. అన్నమయ్య జిల్లాలో అంతా పాపాల పెద్దిరెడ్డిదే పెత్తనమని విమర్శించారు. మాధవరానికి చెందిన లక్ష్మీప్రసన్న కుటుంబానికి చెందిన భూమిని తహసీల్దార్‌కు లంచం ఇచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆన్‌లైన్ చేసుకున్నారని, ఫలితంగా వారి కుటుంబం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. ఇక్కడ మందుబాబులు ఉన్నారని, మన (తన) హయాంలో క్వార్టర్ రూ. 200 ఉంటే, ఇప్పుడు రూ. 300 అయిందని, అదనంగా రూ. 100 వసూలు చేస్తూ దాన్ని ఈ ప్రాంత నాయకుల ఖాతాల్లోకి పంపిస్తున్నారని అన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజ్యాధికారం కొన్ని కుటుంబాలకే అందుతోందని, అందరికీ అందాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి రౌడీ పాలనే సాగుతోందని చెప్పారు. వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. మాజీ సీఎం, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజంపేట టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం కూడా మాట్లాడారు.

సీఎం జగన్, పెద్దిరెడ్డిపై అక్కసు

రాజంపేట, రైల్వేకోడూరు సభలు జనం లేక వెలవెలబోయాయి. చంద్రబాబు, పవన్, కిరణ్‌కుమార్ రెడ్డి పసలేని ప్రసంగాలు వచ్చిన వారికి కూడా విసుగు తెప్పించాయి. ప్రజలకు తాము చేసే మేలేమిటో చెప్పకుండా, సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్కసు వెళ్లగక్కడానికే పరిమితమయ్యారు. దీంతో వచ్చిన వారు కూడా మధ్యలోనే వెళ్లిపోయారు.

రేయ్.. ఆ జెండా పీకెయ్..

సభలో చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో కొందరు జనసేన జెండాలు ఊపుతుండటంతో ఆయన వారిపై విరుచుకుపడ్డారు. 'రేయ్... తమ్ముడూ.. జనసేన జెండా పీకెయ్.. టీవీకి అడ్డం.. పక్కకు దించాలి' అంటూ మండిపడ్డారు.

ఆ సామాజిక వర్గాన్ని కాపు కాయడానికే పార్టీ పెట్టావా పవన్ ?

- కాపు రిజర్వేషన్లపై కూటమి వైఖరేమిటో చెప్పండి
- పవన్ తీరుపై కాపు ఐక్యవేదిక ఫైర్

సాక్షి, అమరావతి: తాను కాపుల కోసం పార్టీ పెట్టలేదని పవన్‌కల్యాణ్ పదే పదే చెబుతున్నారని, ఆయన చెప్పింది వంద శాతం నిజమని, కేవలం కమ్మ వారికి కాపు కాయడానికి మాత్రమే జనసేన పార్టీ పెట్టినట్టు తేటతెల్లమవుతోందని కాపు ఐక్యవేదిక స్పష్టం చేసింది. రిజర్వేషన్లు, కాపుల ఓటు బ్యాంకు గురించి పవన్ మాట్లాడుతున్న తీరుపై కాపు ఐక్యవేదిక ఫైర్ అయ్యింది. ఈ మేరకు కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి అయ్యప్ప, కో-చైర్మన్ మెర్ల నాగ సత్యనారాయణ, కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్, కో-కన్వీనర్లు పంచాది రంగారావు, వంగా ఆంజనేయులు, భావన నరేష్ చంద్ర గురువారం ప్రకటన విడుదల చేశారు. పవన్ వైఖరిని గమనిస్తే ఆయన పూర్తిగా టీడీపీకి రక్షణ కవచంలా ఉండటానికి, చంద్రబాబు కోసమే జనసేన పార్టీ పెట్టినట్టు తేటతెల్లమవుతోందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేయనంటూనే పవన్ నిత్యం ఓటు బ్యాంకు కోణంలోనే అబద్ధాలు చెబుతూ కాపులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ కల్పించిన కాపు రిజర్వేషన్లకు వైఎస్సార్‌సీపీ గండికొట్టినట్టు పవన్ పేర్కొనడం ఆయన అవగాహన రాహిత్యానికి అద్దం పడుతోందన్నారు. కాపులకు టీడీపీ ఏ విధమైన రిజర్వేషన్లు కల్పించలేదన్నారు. లేని రిజర్వేషన్లను వైఎస్సార్‌సీపీ తీసేసినట్టు తప్పుడు ప్రచారం చేసి పవన్ కాపులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కాపులకు రిజర్వేషన్లు ఇస్తానని మేనిఫెస్టోలో పెట్టి మరీ బాబు మోసం చేశాడన్నారు. ఒకసారి బీసీ-ఎఫ్ ద్వారా కాపులకు 5శాతం రిజర్వేషన్లు అని, మరోసారి కేంద్రం ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ కోటాలో 5శాతం సబ్ కోటా అని చంద్రబాబు మభ్యపెట్టి కేంద్రానికి పంపేసి చేతులు దులిపేసుకున్నాడని గుర్తు చేశారు. రిజర్వేషన్ల కోసం కాపులు ఉద్యమించినప్పుడు.. చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పవన్ ఒక్కసారైనా ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వడం లేదని వితండవాదం పవన్ కాపు రిజర్వేషన్లపై అప్పుడైనా ఎందుకు ఉద్యమించలేదని ప్రశ్నించారు. కాపు రిజర్వేషన్ల అంశం తన పరిధిలోనిది కాదని, చేస్తానని చెప్పి మోసం చేయలేనని సీఎం జగన్ చెప్పి ఎన్నికలకు వెళ్లారన్నారు. చంద్రబాబు మాత్రం చేస్తానని చెప్పి కాపుల ఓట్లతో అధికారంలోకి వచ్చి మోసం చేశారన్నారు. రిజర్వేషన్ల విషయంలో బాబుతోనైనా స్పష్టమైన హామీ ఇప్పించగలరా? అని పవన్‌ను ప్రశ్నించారు. లేనిపక్షంలో కాపు రిజర్వేషన్లకు కూటమి వ్యతిరేకం అని చెప్పేయాలని, అవాస్తవాలు చెప్పి రాజకీయ లబ్ధి పొందే చర్యలు సరికాదని నేతలు హితవు పలికారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్న ప్రజలు

- చంద్రబాబుకు, ఆయన్ను నమ్ముకున్న ఎన్ఆర్ఐలకు గుణపాఠం తప్పదు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ రూరల్: రాష్ట్రంలోని ప్రజలందరూ మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని బలంగా కోరుకుంటున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆయన గురువారం గుడివాడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పట్టణంలోని క్లబ్‌రోడ్‌లో కొడాలి నాని మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పరాయి దేశంలో డబ్బు సంపాదించుకుని కులం కోసం అమెరికా నుంచి వచ్చిన ఎన్ఆర్ఐలు డబ్బు మదంతో ప్రజలను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబుతోపాటు ఆయన్ను నమ్ముకున్న ఎన్ఆర్ఐలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. 'గుడివాడ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి తాను ఎన్ఆర్ఐ అని చెప్పుకుంటున్నాడు. ఆయన ఈ 20 ఏళ్ల నుంచి ఎక్కడ ఉన్నాడో తెలియదు. ఎక్కడ నుంచి వచ్చాడో తెలియదు. చంద్రబాబు దగ్గర కోట్లు కుమ్మరించి టికెట్ తెచ్చుకుని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు. గుడివాడ నియోజకవర్గ స్థితిగతులు కూడా పూర్తిగా తెలియని అతను గుడివాడను మార్చేస్తా.. అంటూ ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉంది' అని నాని అన్నారు.

చంద్రబాబుకు ఓట్లడిగే అర్హత లేదు

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ధ్వజం



సాక్షి, అమరావతి: సీఎంగా ఉండి కూడా ప్రజోపకరమైన పనులు చేయని చంద్రబాబుకు ఓట్లు అడిగే అర్హత లేదని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. గురువారం తాడేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. రైల్వే కోడూరులో ఎన్డీఏ కూటమి సభ అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. మూడుసార్లు సీఎంగా ఉండి కూడా రైల్వేకోడూరును పట్టించుకోని బాబు అలవిగాని హామీలు ఇచ్చి ప్రజలను ఆకట్టుకోవాలనే ప్రయత్నం చేశారన్నారు. రాజంపేటను జిల్లా చేస్తానని, రైల్వేకోడూరును తిరుపతిలో కలుపుతానని కల్లబొల్లి కబుర్లు చెప్పే ప్రయత్నం చేశారని తెలిపారు. పెనగలూరుకు సోమశిల బ్యాక్ వాటర్ తెచ్చేందుకు సీఎం జగన్ రూ.కోట్లు వెచ్చిస్తున్నారని చెప్పారు.

పేదలంతా సీఎం జగన్ వైపే

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



కదిరి : జనం నుంచి దూరమైన పార్టీలతో చంద్రబాబు గుంపుగా వస్తోంటే.. జగనన్న సింహంలా సింగిల్‌గా పోటీ చేస్తున్నారని, పేదలంతా ఆయన పక్షానే నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ నామినేషన్ పర్వం గురువారం అట్టహాసంగా సాగింది. కదిరిలోని ప్రధాన వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో చంద్రబాబు ప్రజల ముందుకొస్తున్నారని, ఆయన పాలన ఎలా ఉందో గతంలో మనం చూశామని, ఇప్పుడు జగన్ పాలననూ చూస్తున్నామన్నారు. పొరపాటున చంద్రబాబుకు అధికారమిస్తే జగనన్న ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఆగిపోతాయని హెచ్చరించారు. ఏ గ్రామానికెళ్లినా సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, హెల్త్ సెంటర్లు, నాడు-నేడుతో సుందరంగా తీర్చిదిద్దిన బడులు మనకు తారసపడతాయన్నారు. చంద్రబాబు తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లినా అక్కడ కూడా అందమైన బడి..పైన ఫ్యాను కనబడతాయని సిద్ధార్థరెడ్డి వివరించారు.

జేఈఈ మెయిన్స్‌లో..

శ్రీచైతన్య విద్యార్థులు విజయహాసం

మాదాపూర్ (హైదరాబాద్): జేఈఈ మెయిన్‌లో శ్రీచైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు ఆ సంస్థ యాజమాన్యం తెలియజేసింది. 300కి 300 మార్కులతో కేసీ బసవరెడ్డి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారని, టి.నిఖిలేష్ 3వ ర్యాంక్, హిమాంషు తాలర్ 6వ ర్యాంక్, రెడ్డి అనిల్ 9వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించింది. తమ సంస్థకు చెందిన విద్యార్థులు అఖిల భారత కేటగిరీలో 10లోపు నాలుగు ర్యాంకులు, 100 లోపు 25ర్యాంకులు, 200లోపు 46 ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు చరిత్ర సృష్టించాయని ఆ సంస్థ యాజమాన్యం వెల్లడించింది. అఖిల భారత స్థాయిలో విద్యార్థులు 10 లోపు ఆరు ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి.సింధునారాయణ, శరణినారాయణ తెలిపారు. అఖిల భారత స్థాయిలో జి.నీల్‌కృష్ణ 1వ ర్యాంక్, హెచ్.విదిత్ 5వ ర్యాంక్, ఎం.అనూప్ 6వ ర్యాంక్, ఎం.సాయితేజ 7వ ర్యాంక్, సీహెచ్ సతీష్ కుమార్ 8వ ర్యాంక్, ఆర్యన్ ప్రకాష్ 10 ర్యాంక్, పి.రోహన్ సాయి 12వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. 100లోపు తమ సంస్థకు చెందిన విద్యార్థులు 14 ర్యాంకులు సొంతం చేసుకున్నట్లు వెల్లడించారు.

విశ్వభారతి విద్యార్థుల సత్తా

గుడివాడరూరల్: ఐఐటీ జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో కృష్ణాజిల్లా గుడివాడ విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థులు ఎం.సాయిదివ్య తేజరెడ్డి, పోలిశెట్టి రితీష్‌బాలాజీ, టి.జయదేవ్‌రెడ్డి, డి.శ్రీనివాస్‌రెడ్డి 100 పర్సంటైల్‌తో సంచలన విజయం సాధించారని పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ గురువారం తెలిపారు. దేశ వ్యాప్తంగా 12,57,000 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైతే 56 మంది మాత్రమే 100 పర్సంటైల్ సాధించారని, వీరిలో నలుగురు విశ్వభారతి పూర్వ విద్యార్థులు ఉండటం ఆనందంగా ఉందన్నారు.

భాష్యం ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో టాప్ ర్యాంకులు సాధించినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. తమ విద్యార్థి ఎం.జిష్ణుసాయి 300 మార్కులకు 300లతో 100 పర్సంటైల్ సాధించి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు కైవశం చేసుకున్నట్లు చెప్పారు. అదే విధంగా ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో 36వ ర్యాంకు సాధించారన్నారు. వివిధ కేటగిరీల్లో ఎం.సాయి యశ్వంత్ రెడ్డి 4వ ర్యాంకు, డి.భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కేజే వివేక్ 33వ ర్యాంకు, జి.జాన్ 49వ ర్యాంకు, కె.హర్షిత 50వ ర్యాంకు, పి.శ్యామ్ 62వ ర్యాంకు, జె.మణి ప్రదీప్ 69వ ర్యాంకు, కె.చైతన్య 77వ ర్యాంకు, ఎ.గణేష్‌దత్తా 78వ ర్యాంకు, కె.శ్రేయ 82వ ర్యాంకు పొందినట్లు తెలిపారు. 200లోపు 25, 500లోపు 54 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు.

తిరుమల విద్యార్థుల జయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్ పరీక్షలో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు యు.సుధీర్ 34వ ర్యాంకు, ఎంజీ వెంకట మహేష్ 37వ ర్యాంకు, కేజే వెంకటసాయి 57వ ర్యాంకు, ఆర్.పవిత్ర 90వ ర్యాంకు, జె.వెంకట సాయితేజ 110వ ర్యాంకు, ఎం.చరణ్ శ్రీతేజ 118వ ర్యాంకు, జి.వంశీకృష్ణ 123వ ర్యాంకు, పి.దినేష్ 141వ ర్యాంకు, ఎం.వినేష్ కుమార్ 145వ ర్యాంకు, ఎంఆర్ఎస్‌వీఎస్ శ్రీ మణికంఠ 149వ ర్యాంకు, కేయూ కార్తికేయ 155వ ర్యాంకు, పి.రాహుల్ 154వ ర్యాంకు, జీఎస్ దుర్గసాయి 168వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. 1000 లోపు 79 మంది, 5,000 లోపు 338 మంది, 10వేల లోపు 562 మంది, 20,000 లోపు 897 మంది ర్యాంకులు పొందారని తెలిపారు.

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి గురువారం తెలిపారు. ఆలిండియా కేటగిరీలో 54, 59, 78, 80, 89, 100 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. 100 లోపు ఆరుగురు, 500 లోపు 13 మంది, వెయ్యిలోపు 34 మంది, రెండు వేల లోపు 52 మంది, ఐదు వేలలోపు 110 మంది అత్యున్నత ర్యాంకులు పొందారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, కో ఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్ అభినందించారు.

కేకేఆర్ గౌతమ్‌కు ర్యాంకుల పంట

గుడివాడరూరల్: ఐఐటీ జేఈఈ మెయిన్–24 పోటీ పరీక్ష ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థులు వివిధ కేటగిరిల్లో మొదటి 100 లోపు 17 ర్యాంకులు సాధించారు. తోటంశెట్టి నిఖిలేష్ 3వ ర్యాంకు, అరిపికట్ల తేజస్వీ 8వ ర్యాంకు, పి.విద్య ప్రవీణ్ 14వ ర్యాంకు, సతివాడ జ్యోతిరాధిత్య 17వ ర్యాంకు పొందారు. మొదటి 100లోపు వివిధ కేటగిరిల్లో 3, 8, 14, 17, 20, 21, 23, 28, 31, 35, 41, 48, 55, 56, 69, 84, 99 వంటి 17 ర్యాంకులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను యాజమాన్యం అభినందించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యరామ్ తెలిపారు.

శశి వేలివెన్ను విద్యార్థుల విజయభేరి

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్ ఫలితాల్లో శశి విద్యా సంస్థ వేలివెన్ను విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో విజయభేరి మోగించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ గురువారం తెలిపారు. వివిధ కేటగిరీల్లో బి.గరిమ 44, ఆర్ఎస్‌వీ అప్పారావు చౌదరి 74, సీహెచ్ పురంధర సత్య 169, కె.సృజన్ 175, ఎస్.సుప్రియ 198, జె.శ్రీ హర్షిత్ 252, పీఎస్ సాయి పవన్ రానా 261, ఎల్.ఉదయ్ కిరణ్ 267, సీహెచ్ డేవిడ్ రూఫస్ 284 ర్యాంకులు సాధించారని చెప్పారు. 100 లోపు రెండు ర్యాంకులు, 500 లోపు 12, వెయ్యి లోపు 16 ర్యాంకులు, పొందారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించినట్ల పేర్కొన్నారు.

విజ్ఞాన్ విద్యాసంస్థల ప్రతిభ

చేబ్రోలు: జేఈఈ మెయిన్ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో విజ్ఞాన్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల కూర్మనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థుల్లో 50 శాతం మంది 90 శాతం పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఐ.హనీత్(99.67), ఎం.స్నేహ(99.46), బి.యోగ విజయ కుమార్(99.30), ఎ.రోహన్(98.69), కె.లీలావతి(98.30), వి.అభిరామ్ (96.87), కె.శివనాగ రాజు (96.47), టి.సంజయ్ తేజ(96.41), పి.గౌతమ్(96.03), ఎం.వివేక్ పూజిత్ కుమార్ (95.72), కె.కారుణ్య(94.95), జీడీవీజీ పుల్లారెడ్డి(93.78), ఎం.నాగ సాయి ప్రకాష్ ఉత్తమ పర్సంటైల్‌తో రాణించారని వెల్లడించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం

విద్యారణ్యపురి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జేఈఈ (మెయిన్స్) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, బధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. దొంతుల మనీష్ జాతీయస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 126వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. జి.నవీన్ జాతీయస్థాయిలో రిజర్వేషన్ కేటగిరిలో 5వ ర్యాంకు, ఎ.నందిని 12వ ర్యాంకు, వై.సాత్విక్ రెడ్డి 42వ ర్యాంకు, జి.కాలు 55వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వారు అభినందనలు తెలిపారు.

జేఈఈ మెయిన్‌లో తెలుగు వెలుగులు

దేశవ్యాప్తంగా మొత్తం 56 మందికి వంద పర్సంటైల్.. వీరిలో 22 మంది తెలుగు విద్యార్థులు



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ), కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇతర విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్–2024 పేపర్ 1 (బీఈ, బీటెక్) ఫలితాల్లో తెలుగు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. దేశవ్యాప్తంగా 56 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా ఇందులో 22 మంది తెలుగు విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఏడుగురు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కాగా 15 మంది తెలంగాణ వారు. ఈ మేరకు జనవరి, ఏప్రిల్ సెషన్లలో రెండు దశల్లో నిర్వహించిన జేఈఈ మెయిన్ సంయుక్త ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) బుధవారం అర్ధరాత్రి దాటాక విడుదల చేసింది. గతేడాది దేశవ్యాప్తంగా 43 మంది అభ్యర్థులకు వంద పర్సంటైల్ వచ్చిన సంగతి తెలిసిందే. ఈసారి వంద పర్సంటైల్ వచ్చిన వారిలో ఇద్దరు అమ్మాయిలు సాన్విజైన్ (కర్ణాటక), షైన సిన్హా (ఢిల్లీ) ఉన్నారు. కాగా మహారాష్ట్రకు చెందిన గజరే నీలకృష్ణ నిర్మల్ కుమార్, దక్షేష్ సంజయ్ మిశ్రా తొలి రెండు స్థానాల్లో నిలిచారు.

– సాక్షి, అమరావతి

వంద పర్సంటైల్ సాధించిన తెలుగు విద్యార్థులు.. వారి ర్యాంకులు

ఆంధ్రప్రదేశ్: చింటు సతీష్ కుమార్ (8), షేక్ సూరజ్ (17), మాకినేని జిష్ణు సాయి(18), తోటంశెట్టి నిఖిలేష్(20), అన్నరెడ్డి వెంకట తనిష్ రెడ్డి(21), తోట సాయికార్తీక్ (23), మురసాని సాయి యశ్వంత్ రెడ్డి(36).

తెలంగాణ: హందేకర్ విదిత్(5), ముత్తవరపు అనూప్(6), వెంకట సాయితేజ మాదినేని(7), రెడ్డి అనిల్(9), రోహన్ సాయిబాబా(12), శ్రీయాశస మోహన్ కల్లూరి(13), కేసం చెన్నబసవరెడ్డి(14), మురికినాటి సాయి దివ్య తేజరెడ్డి(15), రిషి శేఖర్ శుక్లా(19), తవ్వ దినేశ్ రెడ్డి(24), గంగ శ్రేయాస్(35), పొలిశెట్టి రితిష్ బాలాజీ(39), తమటం జయదేవ్ రెడ్డి(43), మావూరు జస్విత్(49), దొరిసాల శ్రీనివాసరెడ్డి (52).

- ఈడబ్ల్యూఎస్ విభాగంలో తొలి ఆరు స్థానాల్లో ఇద్దరు ఆంధ్రా, నలుగురు తెలంగాణ విద్యార్థులు ఉన్నారు. తెలంగాణకు చెందిన కేసం చెన్నబసవరెడ్డి మొదటిస్థానంలో నిలవగా, ఏపీకి చెందిన తోటంశెట్టి నిఖిలేష్ మూడో స్థానంలో నిలిచాడు.

మొత్తం 14.10 లక్షల మంది..

దేశవ్యాప్తంగా జనవరి, ఏప్రిల్ సెషన్లలో మొత్తం 14.10 లక్షల మంది జేఈఈ మెయిన్ రాశారు. ఈ రెండు సెషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్న 9.24 లక్షల మందిలో 8.22 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. 100 పర్సంటైల్ సాధించిన వారిలో 15 మంది అభ్యర్థులతో తెలంగాణ వరుసగా మూడో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. ఏడుగురు చొప్పున ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రెండో స్థానంలో, ఆరుగురితో ఢిల్లీ ఆ తర్వాత స్థానంలో ఉంది. వాస్తవానికి జనవరి సెషన్‌లో 23 మంది అభ్యర్థులు 100 పర్సంటైల్ సాధించగా ఏప్రిల్ సెషన్‌లో 33 మంది ఉన్నారు. మొత్తం 56 మంది టాపర్లలో జనరల్ కేటగిరీలో 40, ఓబీసీలో 10, జనరల్ ఈడబ్ల్యూఎస్‌లో ఆరుగురు వంద పర్సంటైల్ సాధించారు.

అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందేందుకు కేటగిరీలవారీగా జేఈఈ మెయిన్ కటాఫ్‌లు

కేటగిరీ	కటాఫ్ 2024	కటాఫ్ 2023	కటాఫ్ 2022
జనరల్	93.2	90.7	88.4
జనరల్ ఈడబ్ల్యూఎస్	81.3	75.6	63.1
ఓబీసీ	79.6	73.6	68
ఎస్సీ	60	51.9	43
ఎస్టీ	46.6	37.2	26.7

జూన్ రెండో వారంలో ఫలితాలు..

జేఈఈ మెయిన్‌లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన 2,50,284 మంది అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్టు ఎన్టీఏ ప్రకటించింది. వీరిలో ఉత్తరప్రదేశ్ విద్యార్థులు అత్యధికంగా ఉన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, తెలంగాణ నిలిచాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఏప్రిల్ 27 నుంచి మే 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అపరాధ రుసుముతో మే 10 వరకు గడువు ఉంది. మే 17 నుంచి 26 మధ్య అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి. మే 26న అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహిస్తారు. ఫలితాలను జూన్ రెండో వారంలో విడుదల చేయనున్నట్టు సమాచారం. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ద్వారా ఎన్ఐటీల్లో దాదాపు 24 వేల సీట్లు, ఐఐటీల్లో 17,385, ట్రిపుల్ ఐటీల్లో మరో 16వేల సీట్లను భర్తీ చేస్తారు.

అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు ఇలా..

అన్ రిజర్వ్‌డ్ 97,351	అన్ రిజర్వ్‌డ్ (పీడబ్ల్యూడీ) 3,973
ఈడబ్ల్యూఎస్ 25,029	ఓబీసీ 67,570
ఎస్సీ 37,581	ఎస్టీ 18,780

విశాఖ కుర్రాడికి 8వ ర్యాంకు



విశాఖపట్నంకు చెందిన చింటూ సతీష్ కుమార్ జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 2వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్న అతడు అందులోనూ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చేస్తానని వెల్లడించాడు. కొమ్మాదిలోని నారాయణ విద్యా సంస్థలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించాడు. నారాయణలో ఇంటర్ ఎంపీసీ పూర్తి చేశాడు.

చింటు సతీష్‌కుమార్, జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు

యడ్లపాడు విద్యార్థికి ఆరో ర్యాంక్



జేఈఈ మెయిన్ రెండో విడత ఫలితాల్లో పల్నాడు జిల్లా యడ్లపాడు విద్యార్థి ముత్తవరపు అనూప్ జాతీయ స్థాయిలో ఆరో ర్యాంక్‌తో సత్తా చాటాడు. జేఈఈ మెయిన్‌లో 300 మార్కులకు 300 మార్కుల్ని కైవసం చేసుకుని ప్రభంజనం సృష్టించాడు. అనూప్ తండ్రి రాజ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తల్లి పార్వతి గృహిణి. అనూప్ సోదరి హర్షిత ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ మూడో ఏడాది అభ్యసిస్తోంది.

ముత్తవరపు అనూప్, జాతీయ స్థాయిలో 6వ ర్యాంక్

శ్రీకాళహస్తి విద్యార్థికి 253వ ర్యాంకు



జేఈఈ మెయిన్‌లో శ్రీకాళహస్తి విద్యార్థి ఎస్.యశ్వంత్‌కుమార్‌రెడ్డి జాతీయ స్థాయిలో 253వ ర్యాంకు సాధించాడు. తొట్టంబేడు మండల వ్యవసాయాధికారి ఎస్.సురేంద్రరెడ్డి, పెళ్లకూరు మండల వ్యవసాయాధికారి ప్రవీణ దంపతుల కుమారుడు అయిన యశ్వంత్ రాజమండ్రిలోని తిరుమల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఇంటర్‌లో 983 మార్కులు సాధించాడు.

యశ్వంత్‌కుమార్ రెడ్డి, జాతీయ స్థాయిలో 253వ ర్యాంకు

మీలాగే సునీత ఆవేదనకు గురైంది..

సీఎం జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ బహిరంగ లేఖ



సాక్షి ప్రతినిధి, కడప: '2009లో నువ్వు మీ తండ్రిని కోల్పోయినప్పుడు ఎంతటి మనోవేదన అనుభవించావో, 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే మనోవేదన అనుభవించింది'.. అంటూ వైఎస్ వివేకా సతీమణి సౌభాగ్యమ్మ సీఎం జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. 'వివేకా హత్యకు కారణమైన వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం.. నిన్ను సీఎంగా చూడాలని ఎంతో తపించిన చిన్నాన్నను ఈ విధంగా నీ పత్రిక, నీ టీవీ చానెల్, సోషల్ మీడియా, నీ పార్టీ వర్గాలు తీవ్ర రూపంలో మాట్లాడటం.. న్యాయం కోసం పోరాటం చేస్తున్న నీ చెల్లెళ్లను హేళన చేస్తూ నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంతమంది దిగజారుతుంటే.. సునీతకు మద్దతుగా నిలిచి పోరాటం చేస్తున్న షర్మిలను కూడా టార్గెట్ చేస్తుంటే.. నీవు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏంటి? కుటుంబ సభ్యుడిగా కాకపోయినా ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం? ఇంకా బాధించే అంశం.. హత్యకు కారకులైన వారికి మళ్లీ ఎంపీగా అవకాశాన్ని నీవు కల్పించడం. ఇది సమంజసమా? ఇది నీకు తగినది కాదని విన్నవించుకుంటున్నా. చివరి ప్రయత్నంగా న్యాయం ధర్మం ఆలోచన చేయమని నిన్ను ప్రార్థిస్తున్నా'.. అంటూ ఆ లేఖలో సౌభాగ్యమ్మ పేర్కొన్నారు.

జగన్ వేదన ఇప్పుడు గుర్తుకొచ్చిందా!

విజయమ్మ మీద పోటీచేయించిన రోజు వారి మనోవేదన గుర్తులేదా?

- సంబంధంలేని వారిని టార్గెట్ చేసి ఇరికించడం నీకు తప్పనిపించడంలేదా?
- జగన్‌ను ఒంటరిని చేసి మీ స్వార్థం మీరు చూసుకోలేదా?
- సంబంధంలేని వారిని వివేకా కేసులో ఇరికించడం తప్పనిపించడంలేదా?
- ఆయన హత్యకు కారకులైన వారు మీతోనే.. మీలోనే ఉన్నారు
- వివేకా భార్య సౌభాగ్యమ్మకు వైఎస్ భాస్కరరెడ్డి సతీమణి బహిరంగ లేఖ

సాక్షి ప్రతినిధి, కడప: '2009లో తండ్రిని కోల్పోయినప్పుడు జగన్ ఎంతో మనోవేదన అనుభవించాడని ఇప్పుడు గుర్తొస్తోందా? 2010లో కాంగ్రెస్ ప్రభుత్వం జగన్‌ను చిన్నచూపు చూసినపుడు జగన్‌కు అండగా నిలిచి పెద్ద దిక్కుగా ఉండవలసిన మీరందరూ కలిసి ఒంటరివాడిని చేసి మీ స్వార్థం మీరు చూసుకున్నపుడు జగన్ మనోవేదన గుర్తుకురాలేదా'.. అని వైఎస్ భాస్కరరెడ్డి సతీమణి వైఎస్ లక్ష్మీ వివేకా భార్య సౌభాగ్యమ్మకు గురువారం బహిరంగ లేఖ రాశారు. అందులో ఆమె ఇంకా ఏం పేర్కొన్నారంటే..

2011లో నీ భర్తను నువ్వు, నీ కుమార్తె, అల్లుడు విజయమ్మపై పోటీచేయించినప్పుడు వాళ్ల మనోవేదన ఎలా ఉందో మీకు తెలీదా? నీ కుమార్తె, అల్లుడు పూలంగళ్ల వద్ద డిగ్రీ కాలేజీలో కించపరిచే మాటలు మాట్లాడినప్పుడు వారెంత మనోవేదన అనుభవించారో కూడా తెలీదా? వివేకానందరెడ్డి వైఎస్ జగన్‌ను సీఎంగా చూడాలని కోరుకున్న మాట ఎంతో వాస్తవమో, 2019 మార్చి 14 రాత్రి కూడా అవినాష్‌ను ఎంపీగా గెలిపించమని ప్రచారం చేసిన మాట కూడా అంతే వాస్తవం. ఈ విషయం స్వయంగా మీ కూతురు సునీతే మీడియాకు వెల్లడించింది. ఇప్పుడు మళ్లీ మీరే అదే ఎంపీ టికెట్ కోసం హత్య జరిగిందని తప్పుడు ప్రచారం చేయడం.. సంబంధంలేని వారిని ఈ కేసులో ఇరికించడం మీకు తప్పనిపించడంలేదా? ఎవరిని కాపాడుకునేందుకు మీరిలా చేస్తున్నారు? మీ కుమార్తె న్యాయం కోసం పోరాటం చేస్తుంటే జగన్ సంపూర్ణ మద్దతు తప్పక ఉంటుంది. అలా కాకుండా.. మీ కుమార్తె వైఎస్సార్, జగన్ శత్రువులతో చేతులు కలిపి, వారి చేతిలో పావుగా మారి సంబంధంలేని వ్యక్తులను ఈ కేసులో అన్యాయంగా ఇరికించి వారి జీవితాలు నాశనం చేయాలని చూస్తే జగన్ మీకెలా మద్దతివ్వగలడు? హత్యకు కారకులైన వారు మీతోనే ఉన్నారు.. మీలోనే ఉన్నారు. దొంగే దొంగను పట్టుకోమంటే ఎలా దొరుకుతాడు దొంగ. ఇక మాటిమాటికి హంతకులని మీరు మాట్లాడుతున్నారు.. పైగా చాలా తీవ్రమైన పదజాలంతో అవినాష్‌ను తిడుతున్నారు. న్యాయస్థానంలో కేసు నడుస్తుండగా మీరంతట మీరే హంతకుడని ఎలా మాట్లాడగలరు? అలా మాట్లాడటం మీకు తప్పనిపించడం లేదా? నీ కుమార్తెను, షర్మిలమ్మను ఎవరు టార్గెట్ చేయలేదు. వారి మాటలే ఇతరులు హేళన చేయడానికి కారణం. ఇప్పటికైనా వైఎస్సార్, జగన్ శత్రువుల చేతిలో పావుగా ఉండకుండా వారి కుట్రలు, కుతంత్రాల నుంచి బయటకొచ్చి చేసిన తప్పు తెలుసుకుని నిజమైన న్యాయ పోరాటం చేయండి. అన్యాయంగా మీవల్ల బాధపడుతున్న వారు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థంచేసుకునే ప్రయత్నం చేయండి. నిజం ఎంత లోతులో దాచినా దాగదు.. తప్పకుండా బయటపడుతుంది.

ఓపెన్ స్కూల్ ఫలితాల విడుదల

టెన్త్‌లో 18,185, ఇంటర్‌లో 48,377 మంది ఉత్తీర్ణత

సాక్షి, అమరావతి: ఓపెన్ స్కూలింగ్ విధానంలో 2024 మార్చిలో నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలను గురువారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 32,581 మంది హాజరు కాగా, 18,185 మంది (55.81%) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 53.98% కాగా, బాలికలు 57.92 శాతంగా ఉన్నారు. ఇంటర్‌లో 73,550 మందికి గాను 48,377 మంది (65.77%) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 65.43%, బాలికలు 66.35% మంది ఉన్నారు. ఈనెల 29 నుంచి మే 7వ తేదీ వరకు రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వర్‌రావు తెలిపారు. వివరాలకు https://apopenschool.ap.gov.inలో చూడవచ్చు.

ప్రశాంతంగా ఏపీఆర్జేసీడీసీ సెట్, ఏపీఆర్ఎస్ క్యాట్

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు గురువారం నిర్వహించిన ఏపీఆర్జేసీ డీసీసెట్, ఏపీఆర్ఎస్ క్యాట్ పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఆర్ఎస్ క్యాట్–2024కు దరఖాస్తు చేసిన 32,666 మందిలో 25,221 మంది హాజరైనట్లు తెలిపారు. జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏపీఆర్జేసీ సెట్‌కు దరఖాస్తు చేసిన 56,949 మందిలో 49,306 మంది, డిగ్రీలో ప్రవేశాలకు డీసీసెట్‌కు దరఖాస్తు చేసిన 1,209 మందిలో 963 మంది హాజరైనట్లు వివరించారు.

'పాలిసెట్'కు పటిష్ట ఏర్పాట్లు

రేపు ప్రవేశ పరీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 'పాలిసెట్–2024' నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ తెలిపారు. గురువారం సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వడగాడ్పుల తీవ్రత నేపథ్యంలో ఈనెల 27న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరిగే కేంద్రాల్లో చల్లని తాగునీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ.. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 442 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

పడిలేచి.. పైపైకి!

ఫెయిల్ అయిన తర్వాత మళ్లీ బడిలో చేరి ప్రతిభ చాటిన విద్యార్థులు

సాక్షి, అమరావతి: గత విద్యా సంవత్సరం (2023) పదో తరగతి ఫలితాల్లో ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయంతో మళ్లీ బడిలో చేరి మెరుగైన ఫలితాలు సాధించారు. పాఠశాల విద్యాశాఖ నిర్ణయంతో తిరిగి పదో తరగతిలో పునఃప్రవేశం పొంది ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 1,071 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గతంలో చదువులో వెనుకబడి, పరీక్షల్లో విఫలమైనవారికి పాఠశాల విద్యాశాఖ చక్కటి తోడ్పాటు అందించిందని, దీంతో ఇంత మంది విద్యార్థులకు మేలు జరిగిందని ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ దిగజారుడు రాజకీయం

మంగళగిరి, గుంటూరు పశ్చిమలో కుట్రపూరిత చర్యలు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల పేరు ఉన్న మహిళలతో నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ గుంటూరు ఈస్ట్: ఓటమి తప్పదని తేలిపోవడంతో చంద్రబాబు, లోకేశ్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ నేతలు దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నారు. ఓటర్లను గందరగోళానికి గురి చేసి, వైఎస్సార్‌సీపీ ఓట్లను తగ్గించాలన్న కుట్రతో మంగళగిరి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల పేర్లతో ఉన్న మహిళలతో నామినేషన్లు వేయించారు. మంగళగిరిలో ఇద్దరితో ఇలా నామినేషన్లు వేయించారు. గుంటూరు పశ్చిమలో ఓ దళిత మహిళ పేరిట నామినేషన్ వేయించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టి, రచ్చయింది. ఆ వీడియో బయటకు వచ్చింది. టీడీపీ నాయకులు తన కుమార్తెను కిడ్నాప్ చేశారని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఆమె పేరుతో టీడీపీ నాయకులే నామినేషన్ వేశారు. టీడీపీ నేతలు బలవంతంగా సంతకాలు పెట్టించుకున్నారని ఆ దళిత మహిళ స్పష్టం చేయడంతో వారి కుట్ర బట్టబయలైంది.



పోలీసు స్టేషన్ ముందు తండ్రి వాహనం ఎక్కుతున్న విడదల రజిని

గుంటూరు పశ్చిమలో కుట్ర బెడిసి కొట్టిందలా..

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నుంచి మంత్రి విడదల రజిని పోటీ చేస్తున్నారు. ఇక్కడ కూడా ఓటర్లను అయోమయానికి గురి చేసేందుకు అదే పేరుతో ఉన్న మరో మహిళ పేరిట నామినేషన్ వేయించారు. ఇక్కడ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి భర్త రామచంద్రరావు స్వయంగా ఈ వ్యవహారం నడిపించిన వీడియో బయటకు వచ్చింది. ఆయన శ్రీనివాసరావుపేటలో ఉంటున్న దళిత మహిళ విడదల రజిని ఇంటికి వెళ్లి నామినేషన్ వేసేలా ప్రలోభ పెట్టారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ఆమె భర్తకు ఉద్యోగంతో పాటు సొంత ఇల్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. నామినేషన్ వేసే వరకూ తమతోనే ఉండాలని, స్క్రూటినీ అయిన వెంటనే తమిళనాడులోని వేళంగిణి మాత టెంపుల్‌కు పంపిస్తామని, ఎన్నికలు ముగిసే వరకూ అక్కడే ఉండి రావాలని, ఖర్చంతా తాము పెట్టుకుంటామని చెప్పారు. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఆమెను తీసుకువెళ్లి టీడీపీ అభ్యర్థి ఉండే అపార్ట్‌మెంట్‌లోనే ఉంచారు. తన కుమార్తెను టీడీపీ నాయకులు తీసుకువెళ్లడాన్ని చూసిన మహిళ తండ్రి దేవరాజ్ తన కుమార్తెను కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంపాలెం సీఐ లోకనాథం, సిబ్బంది గాలించి నగరంపాలెం మెయిన్ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో ఉందని గుర్తించారు. ఆమెను అక్కడి నుంచి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆమె తండ్రికి పోలీసులు అప్పగించారు. ఆమె తన తండ్రితో వెళ్లిపోవడంతో టీడీపీ నాయకులు కంగుతిన్నారు. ఆమెను వైఎస్సార్‌సీపీ నాయకులు కిడ్నాప్ చేశారంటూ టీడీపీ కార్యకర్తలతో కలిసి నగరంపాలెం పోలీసు స్టేషన్ ముందు హడావుడి చేశారు. అప్పటికే ఆమె నుంచి నామినేషన్ పత్రాలపై సంతకాలు తీసుకున్న టీడీపీ నాయకులు ఆమె తరఫున నామినేషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారమంతా తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, లీగల్ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు ఝాన్సి, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, ఇతర నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని దళిత మహిళ రజినిని కిడ్నాప్ చేసిన టీడీపీ నాయకులపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

రాజకీయాల్లోకి తనను లాగొద్దన్న దళిత మహిళ

ఈ రాజకీయాల్లోకి తనను లాగొద్దని దళిత మహిళ విడదల రజిని కోరారు. ఈమేరకు ఆమె ఓ వీడియో విడుదల చేశారు. తనకు నామినేషన్ వేయడం ఇష్టంలేదని, టీడీపీ నాయకులు తన వద్ద నుంచి బలవంతంగా సంతకాలు తీసుకున్నారని స్పష్టం చేశారు.

మంగళగిరిలో ఇద్దరు లావణ్యలతో నామినేషన్లు

ఈసారి మంగళగిరిలో గెలుస్తానంటూ లోకేశ్ ప్రగల్భాలు పలుకుతున్నప్పటికీ, ఆయనపై రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన బీసీ వర్గాలకు చెందిన మురుగుడు లావణ్య పోటీ చేస్తుండటంతో ఆయన ఓటమి ముందే ఖాయమైపోయింది. దీంతో ఓటర్లను గందరగోళానికి గురి చేసేందుకు అదే పేరు ఉన్న మరో ఇద్దరు మహిళలతో ఇండిపెండెంట్లుగా చివరిరోజున నామినేషన్లు వేయించారు. వీరిలో ఓ మహిళ ఇంటిపేరు కూడా మురుగుడే కావడం గమనార్హం. రాజీవ్ గృహకల్పలో ఉండే బంగారం పని చేసే మురుగుడు సాంబశివరావు భార్య మురుగుడు లావణ్య గురువారం నామినేషన్ వేశారు. లావణ్య అనే పేరుతో ఉన్న మరో మహిళతో కూడా నామినేషన్ వేయించారు.

క్లుప్తంగా...

ముస్లింల వ్యతిరేకి ఎన్‌డీఏ

- ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా

సాక్షి, అమరావతి: ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామని బీజేపీ నేత పీయూష్ గోయల్ వ్యాఖ్యలను ఖండించలేని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ముస్లింల వ్యతిరేకులని తేలిపోయిందని ఆంధ్రప్రదేశ్ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా స్పష్టం చేశారు. పీయూష్ గోయల్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాలుగు శాతం రిజర్వేషన్లు తీసేస్తామని పీయూష్ గోయల్ వ్యాఖ్యల తర్వాత కూడా ముస్లింలు ఎన్డీఏ కూటమిని నమ్మడం అంటే మన గొంతు మనం కోసుకున్నట్లేనన్నారు. ప్రతి విషయానికి గొంతు చించుకునే పవన్ ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ నేతల ప్రకటనపై ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. ముస్లింలకు ఒక్క సీటు కూడా ఇవ్వని జనసేనను ఎందుకు ఆదరించాలని ప్రశ్నించారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా.. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లను అమలు చేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్ మాత్రమే తమ అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేనకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

ముస్లింలపై ఎన్‌డీఏ కుట్ర బట్టబయలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి దస్తగిరి

సాక్షి, అమరావతి: ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ చలించకుండా దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లను ఎత్తేసేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ చేస్తున్న కుట్ర మరోమారు బట్టబయలైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ దస్తగిరి మండిపడ్డారు. అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తేస్తామని ఇప్పటికే హోం మంత్రి అమిత్‌షా, మరో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారని, తాజాగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అదే అంశాన్ని ప్రస్తావించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ విషయమై దస్తగిరి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై చంద్రబాబు, పవన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ రాజకీయ ప్రయోజనాల కోసం వారికి అనుబంధ సంఘాలుగా పనిచేస్తున్న ముస్లిం సంఘాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు. ముస్లింల ద్రోహులు ఎవరో? ముస్లింల పక్షపాతి ఎవరో? గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎన్‌డీఏకు ఓటు హక్కుతో తగిన గుణపాఠం చెప్పాలని దస్తగిరి ముస్లింలకు పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీకే మాదిగల మద్దతు

- మాదిగ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు కొరిటెపాటి ప్రేమ్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌కుమార్

నెహ్రూనగర్: మాదిగలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, సంక్షేమ పథకాల ద్వారా మాదిగల అభివృద్ధి కోసం కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాదిగ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు కొరిటెపాటి ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు సంబంధించిన మేమంతా సిద్ధం కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ గెలుపు కోసం రాష్ట్రంలోని ప్రతి మాదిగ పల్లెకు వెళ్లి వైఎస్ జగన్ గెలుపే లక్ష్యంగా వారిలో చైతన్యం నింపేందుకు నేటినుంచి రాష్ట్రవ్యాప్త పర్యటనలు చేస్తున్నట్లు చెప్పారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మల్లవరపు రవిరాజా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ను ఓడించేందుకు ఎంతమంది వచ్చినా విజ్ఞత కలిగిన మాదిగలంతా జగన్ వెన్నంటే ఉంటారన్నారు. నాయకులు మోషే, విక్టర్, కూచిపూడి గోపి, వెంకట్, బాబు, భాను ప్రకాష్, మరియదాసు, రాజు, తిరుపతిరావు, సంగీతరావు పాల్గొన్నారు.

30 వరకు వీఐటీఈఈఈ ఎంట్రన్స్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్ కోసం వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (వీఐటీఈఈఈ) దేశవ్యాప్తంగా 125 నగరాలతో పాటు దుబాయ్, మస్కట్, ఖతర్, కువైట్, సింగపూర్, కౌలాలంపూర్‌లో ఎంట్రన్స్ పరీక్షలను ప్రారంభించింది. వీఐటీ వెల్లూర్, వీఐటీ చెన్నై, వీఐటీ ఏపీ, వీఐటీ భోపాల్‌లో ఇంజనీరింగ్ అడ్మిషన్ కోసం ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు వీటిని నిర్వహించనుంది. మే 3వ తేదీన ఫలితాలను విడుదల చేస్తామని, www.vit.ac.in వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. లక్ష లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు వీఐటీ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులని తెలిపింది. 1 నుంచి 10 లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులకు 100 శాతం ఫీజు రాయితీ ఉంటుందని వెల్లడించింది.

భూములు, ఆస్తుల విక్రయంపై యథాతథస్థితి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



- ఒక్క ఎకరా భూమిని కూడా తాకబోం
- ప్లాంట్ ఆస్తులను విక్రయించే ప్రతిపాదన ఏదీలేదు
- కేవలం పెట్టుబడుల ఉపసంహరణకే కట్టుబడి ఉన్నాం
- అది కూడా సూత్రప్రాయ నిర్ణయమే.. తదుపరి పురోగతి ఏమీలేదు
- హైకోర్టుకు నివేదించిన కేంద్ర ప్రభుత్వం.. రికార్డ్ చేసిన న్యాయస్థానం
- ఈ వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలన్న ధర్మాసనం
- తదుపరి విచారణ జూన్ 19కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారానికి చెందిన భూములు, ఇతర ఆస్తుల విక్రయం విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విశాఖ ఉక్కు కర్మాగారం ఆస్తులను విక్రయించే ప్రతిపాదన ఏదీ ఇప్పటివరకు లేదన్న కేంద్ర ప్రభుత్వ వాదనను హైకోర్టు రికార్డ్ చేసింది. కేవలం కర్మాగారంలో 100 శాతం పెట్టుబడుల ఉపసంహరణకే కట్టుబడి ఉన్నామన్న వాదనను కూడా రికార్డ్ చేసింది. కర్మాగారానికి చెందిన ఒక్క ఎకరా భూమిని కూడా తాకబోమని కూడా కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి. నరసింహశర్మ హైకోర్టుకు వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, పెట్టుబడుల ఉపసంహరణ, భూములు, ఆస్తుల విక్రయం తదితర వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

ప్రైవేటీకరణ నిర్ణయంపై 'పిల్'లు..

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలుచేస్తూ మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తో పాటు సువర్ణరాజు అనే వ్యక్తి కూడా వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. అలాగే, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, రేషన్ కార్డుదారులకు ఉద్యోగాలిస్తామన్న గత హామీ మేర ఉద్యోగాలిచ్చేలా ఆదేశాలివ్వాలంటూ పలువురు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై జస్టిస్ శేషసాయి ధర్మాసనం గురువారం వాటిపై మరోసారి విచారణ జరిపింది. గత విచారణ సమయంలో ధర్మాసనం, అసలు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఏ చట్ట ప్రకారం ప్రైవేటీకరిస్తున్నారు? ప్రైవేటీకరణకు బదులు ప్రత్యామ్నాయాలు చూడాలంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖపై ఏం నిర్ణయం తీసుకున్నారు? ప్రైవేటీకరణకు ముందు కార్మికులు, ఉద్యోగులు, కర్మాగారంతో ముడిపడి ఉన్న వారిని సంప్రదించారా? అన్న వివరాలను తమ ముందుంచాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

పాత కౌంటర్‌నే అటూఇటూగా మార్చి..

ఈ వ్యాజ్యాలు గురువారం విచారణకు రాగానే, కేంద్ర ప్రభుత్వ న్యాయవాది సీవీఆర్ రుద్రప్రసాద్ స్పందిస్తూ, గత విచారణ సమయంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల మేరకు కౌంటర్ దాఖలు చేశామని చెప్పారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్. శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ.. గతంలో దాఖలు చేసిన అంశాలనే అటూ ఇటూగా మార్చి, కొద్దిగా ఇంగ్లీష్ పదాలు చేర్చి తాజా కౌంటర్ దాఖలు చేశారని చెప్పారు. ధర్మాసనం అడిగిన వివరాలు ఆ కౌంటర్‌లో లేవని ఆయన తెలిపారు. ప్రైవేటీకరణ కాకుండా స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని సీఎం జగన్ కేంద్రానికి లేఖ రాశారని, దాని గురించి కౌంటర్‌లో ప్రస్తావనే లేదన్నారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బి. నరసింహ శర్మ స్పందిస్తూ.. ముఖ్యమంత్రి లేఖకు ఆర్థిక శాఖ 2021లోనే సమాధానం ఇచ్చారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అన్నది ఇప్పటివరకు సూత్రప్రాయ నిర్ణయమేనని, ఇప్పుడు ఎలాంటి పురోగతి లేదన్నారు. ఇక ఈ ప్లాంట్ భూములు అమ్మే ప్రతిపాదన కూడా ఏదీలేదని.. ఒక్క ఎకరా భూమిని కూడా తాకబోమన్నారు.

అలా అయితే స్టేటస్ కో కొనసాగిస్తారా?

ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. అలా అయితే స్టీల్‌ప్లాంట్ భూముల విషయంలో స్టేటస్ కో కొనసాగిస్తారా? ఆ మేర ఉత్తర్వులు జారీచేయమంటారా? అని ప్రశ్నించింది. అందుకు నరసింహ శర్మ అంగీకరించారు. ఈ సమయంలో పిటిషనర్ తరఫు న్యాయవాదుల్లో ఒకరైన యలమంజుల బాలాజీ స్పందిస్తూ.. ఏఎస్‌జీ చెప్పిన వివరాలను రికార్డ్ చేయాలని కోరగా.. ధర్మాసనం రికార్డ్ చేసి భూముల విషయంలో స్టేటస్ కో కొనసాగించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను జూన్ 19కి వాయిదా వేసింది.

ముస్లిం రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమే!

చంద్రబాబుతో గంటకు పైగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ భేటీ



మాట్లాడుతున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్, చిత్రంలో సోము వీర్రాజు

సాక్షి, అమరావతి : మతపరంగా కల్పించే ముస్లిం రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని బీజేపీ గురువారం మరోసారి స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేరుగా ఆ మాటను చెప్పకుండా పరోక్షంగా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గురువారం రాష్ట్రానికి వచ్చిన పీయూష్ గోయల్ ఉదయాన్నే టీడీపీ అధినేత చంద్రబాబుతో కరకట్టలోని ఆయన నివాసంలో గంటకు పైగా భేటీ అయ్యారు. అనంతరం విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ముస్లిం రిజర్వేషన్లపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. 'ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల రిజర్వేషన్లకు కాకుండా మరెవరికి రిజర్వేషన్లు కల్పించినా వాటికి బీజేపీ వ్యతిరేకం. ఆ నాలుగు కేటగిరీలకే రిజర్వేషన్లు కొనసాగాలన్నది మా పార్టీ విధానం. ఇవి కాకుండా మరో వర్గానికి రిజర్వేషన్లను మేం అంగీకరించం' అని కేంద్ర మంత్రి స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లపై ప్రశ్నించగా.. పరిమితికి మించి ఎలాంటి రిజర్వేషన్లు అమలు చేసినా సుప్రీంకోర్టు పరిశీలిస్తుందని వ్యాఖ్యానించారు.

హోదా, ఇతర అన్ని అంశాల్లో బాబుతో పరిష్కారం జరిగింది

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఇతర అన్ని అంశాల్లో ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు బీజేపీకి మధ్య పరిష్కారం జరిగిపోయిందని పీయూష్ గోయల్ వ్యాఖ్యానించారు. అప్పట్లో చంద్రబాబు అపార్థం చేసుకొన్నారని, అందువల్లే 2018లో ఆయన బీజేపీ కూటమి నుంచి విడిపోయారని, ఇప్పుడు పరిష్కారం అయిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేంద్రం చేసిన అభివృద్ధిని ఆయనే అభినందిస్తున్నారని చెప్పారు. ప్రత్యేక హోదా అంశంలో కేంద్రం అనేక సార్లు చాలా క్లారిటీ ఇచ్చిందని, దురదృష్టవశాత్తు దానిని రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోలేదని అన్నారు. బీజేపీ రాష్ట్రానికి చేసిన మేలును ప్రజలు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. అంటే.. అప్పట్లో కేంద్రం ప్రకటించిన ప్యాకేజీకి చంద్రబాబు మళ్లీ అంగీకరించారని మీరు అంటున్నారా అని విలేకరులు ప్రశ్నించగా.. 'అన్ని అంశాలను పరిష్కరించుకున్నాం. రాష్ట్ర అభివృద్ధికి కలిసి పనిచేస్తాం' అంటూ కేంద్ర మంత్రి బదులిచ్చారు. గత ఐదేళ్ళుగా ఏపీ చాలా వెనుకబడిందని, అభివృద్ధి నిలిచిపోయిందని అన్నారు. 2014, 2019 లలో చేసిన ఏ హామీలనూ ప్రధాని మోదీ మర్చిపోలేదన్నారు. దేశవ్యాప్తంగా 400కి పైగా స్థానాలు, రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాలను తామే గెలుచుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ వల్ల దేశానికి నష్టం జరిగిందని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంక్షేమం, అభివృద్ధి ఏక కాలంలో నడిపిస్తున్నారని చెప్పారు. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు రావడం ఖాయమని అన్నారు. విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రితో పాటు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

రూ.165.91 కోట్ల సొత్తు స్వాధీనం

- అత్యధికంగా అనంతపురం, అత్యల్పంగా నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గాల్లో సొత్తు పట్టివేత
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి



సాక్షి, అమరావతి: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటినుంచి నేటివరకూ రాష్ట్రవ్యాప్తంగా రూ. 165.91 కోట్లకు పైగా విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీటిలో రూ. 36.89 కోట్ల నగదు, రూ.20.32 కోట్ల విలువైన 6,62,402.65 లీటర్ల మద్యం, రూ.2.78 కోట్ల విలువైన 52,28,218.94 గ్రాముల డ్రగ్స్, రూ.91.26 కోట్ల విలువైన 14,73,734.46 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.90 కోట్ల విలువైన 4,88,557 ఉచితాలతోపాటు రూ.11.74 కోట్ల విలువైన 11,27,451.07 ఇతర వస్తువులు ఉన్నాయని వివరించారు. వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఓటర్లను ప్రలోభపరిచే నగదు, లిక్కర్, డ్రగ్స్, విలువైన ఆభరణాలు, ఇతర వస్తువుల అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచామన్నారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రంలోని పలు చెక్ పోస్టులు, పోలీస్, ఎక్సైజ్, ఇన్‌కం టాక్స్, ఫారెస్ట్, ఈడీ, ఎన్‌సీబీ, ఆర్‌పీఎఫ్, కస్టమ్స్ తదితర 20కి పైగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల రవాణాపై నిరంతరం నిఘా కాస్తున్నాయని తెలిపారు. ఇందులో కేవలం గడచిన 24 గంటల్లోనే రూ.8.65 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటివరకూ స్వాధీనం చేసుకున్న వాటిలో అత్యధికంగా రూ.30.66 కోట్ల విలువైన సొత్తు అనంతపురం పార్లమెంటరీ, అత్యల్పంగా రూ.1.15 కోట్ల విలువైన సొత్తును నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.కోట్లలో

అనంతపురం	30.66
తిరుపతి (ఎస్సీ)	19.37
కాకినాడ	18.18
ఏలూరు	13.77
విశాఖపట్నం	12.50
రాజంపేట	6.96
విజయవాడ	6.75
నంద్యాల	5.63
కడప	5.62
నరసరావుపేట	4.61
విజయనగరం	4.18
బాపట్ల (ఎస్సీ)	3.99
అనకాపల్లి	3.72
రాజమండ్రి	3.62
శ్రీకాకుళం	3.61
అరకు (ఎస్టీ)	3.37
నెల్లూరు	3.00
మచిలీపట్నం	2.87
గుంటూరు	2.75
కర్నూలు	2.45
చిత్తూరు (ఎస్సీ)	1.94
ఒంగోలు	1.93
హిందూపురం	1.63
అమలాపురం (ఎస్సీ)	1.52
నరసాపురం	1.15

ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే.. రాష్ట్రం మరో మణిపూరే..

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు



భవానీపురం (విజయవాడపశ్చిమ): పొరపాటున ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే.. రాష్ట్రం మరో మణిపూర్ కావడం తథ్యమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు ఆందోళన వ్యక్తం చేశారు. మైలవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో లేని బీజేపీని తీసుకొచ్చి టీడీపీ, బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కూడా మణిపూర్‌లా రావణ కాష్టం చేస్తారా? అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశంలో క్రిస్టియన్ మైనార్టీలను అనేక రకాలుగా హింసిస్తూ.. మణిపూర్‌లో వేలాదిమందిని ఊచకోత కోసి చంపుతుంటే మాట్లాడని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు క్రైస్తవుల సంక్షేమంపై వారికున్న చిత్తశుద్ధి అర్థమైపోతున్నదని విమర్శించారు. ఏపీలో బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేసి అత్యున్నత స్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అగ్రకుల ఆధిపత్యంలో ఉన్న మైలవరం నియోజకవర్గంలో ఒక సామాన్య బీసీ కార్యకర్త సర్నాల తిరుపతిరావుకు అసెంబ్లీ టికెట్ ఇచ్చి చరిత్ర తిరగరాసిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. సర్నాల తిరుపతిరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాల సామాజికవర్గానికి పిలుపునిచ్చారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి ప్రతాప్, నాయకులు గేరా సుమన్, జీ రవికుమార్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో జనజాతర

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నామినేషన్‌కు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



తిరుపతి రూరల్: వేలాది మంది జనం... ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలు... మిన్నంటిన జై జగన్... జై జై చెవిరెడ్డి నినాదాలతో గురువారం చంద్రగిరిలో జనజాతర నెలకొంది. మండుటెండను సైతం లెక్కచేయకుండా కదిలివచ్చిన వేలాది మంది చల్లని దీవెనలు అందిస్తూ వెంటరాగా... వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం కోలాహలంగా సాగింది. ముందుగా తన తల్లిదండ్రులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, లక్ష్మిలకు మోహిత్‌రెడ్డి పాదాభివందనం చేశారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రగిరి నాగాలమ్మ ఆలయం వద్ద నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దాదాపు 40 వేల మందికి పైగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన కుమారుడు మోహిత్‌రెడ్డితోపాటు ఆద్యంతం ర్యాలీలో ఉన్నారు. టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మంత్రి ఆర్కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కూడా ర్యాలీలో పాల్గొని మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం మోహిత్‌రెడ్డి తన నానమ్మ మునిరాజమ్మతో కలిసి ఆర్వో నిషాంత్‌రెడ్డికి ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందించారు. మరో సెట్ నామినేషన్ పత్రాలను మాజీ ఎమ్మెల్యే జయదేవనాయుడుతో కలిసి దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీలు, కులాలు, మతాలు, రాజకీయాలను చూడకుండ అర్హతే ప్రామాణికంగా విప్లవాత్మకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో రూ.వందలాది కోట్లతో చేసిన అభివృద్ధి, కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి చేసిన సేవా కార్యక్రమాలు, సొంత కుటుంబ సభ్యులుగా ఆత్మీయతను పంచే చంద్రగిరి ప్రజల ఆశీస్సులే ఆయుధాలుగా తాను ఎన్నికల బరిలో నిలిచినట్లు చెప్పారు.

బీజేపీని దించకపోతే దేశానికి తీవ్ర నష్టం

- ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది
- బీజేపీ పాలనలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి
- రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



భీమవరం: కేంద్రంలోని అప్రజాస్వామిక, నియంతృత్వ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే దేశం ఆర్థికంగా, సామాజికంగా తీవ్రంగా నష్టపోతుందని రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంక్షోభంలో రాజ్యాంగం–ఆర్థిక రాజకీయ మూలాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతూ దేశానికి ఎంతో నష్టం కలిగిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని చెప్పారు. ప్రజలను శాస్త్రీయంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజలను మూఢ నమ్మకాల వైపు తీసుకెళ్తోందని దుయ్యబట్టారు. వసుధైక కుటుంబం అంటూ నినాదం చేస్తున్న బీజేపీ.. దేశంలోనే వివిధ ప్రాంతాలు, మతాలు, గిరిజనుల మధ్య చిచ్చు పెడుతోందని మండిపడ్డారు. మహిళల పట్ల వివక్ష చూపుతోందని.. దేశంలో నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం 111వ స్థానానికి దిగజారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ, ఉపాధి రంగాలతో పాటు కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలను దెబ్బకొట్టడానికి ముఖ్యమంత్రులను సైతం జైలుకు పంపుతున్న కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు దిగుపాటి రాజగోపాల్, కామన మునిస్వామి, దళిత ఐక్య వేదిక నాయకుడు గంటా సుందర్ కుమార్, వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్లా పాషా, పూరిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు టీడీపీ ప్రలోభాలు

నెట్టింట వైరల్ అవుతున్న వీడియోలు



పాస్టర్లకు నగదు పంపిణీ

నందిగామ: ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో టీడీపీ ఎన్నికల ప్రలోభాలకు తెరతీసింది. నందిగామ పట్టణ శివారు ముక్కేరు సమీపంలో ఆర్ఎస్ గార్డెన్స్ కళ్యాణమండపంలో గురువారం టీడీపీ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని పాస్టర్లతో విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి తంగిరాల సౌమ్య సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీని గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం కొందరు టీడీపీ నాయకులు కొందరు పాస్టర్లకు నగదు పంపిణీ చేశారు. దీంతో మిగిలినవారు వివాదానికి దిగారు. ఈ వివాదంతో రహస్య సమావేశం బట్టబయలైంది. టీడీపీ నాయకులు పాస్టర్లతో సమావేశం నిర్వహించి నగదు పంపిణీ చేస్తున్న అంశంపై ఫిర్యాదు వచ్చిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు తెలిపారు. వచ్చిన ఫిర్యాదు, వీడియోల ఆధారంగా విచారించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బీసీవై కార్యకర్తలపై టీడీపీ దౌర్జన్యకాండ




బీసీవై ర్యాలీని అడ్డుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

శ్రీకాకుళం, శ్రీకాకుళం క్రైమ్: భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ కార్యకర్తలపై టీడీపీ దౌర్జన్యకాండకు తెగబడింది. శ్రీకాకుళంలోని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇంటి సమీపంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నామినేషన్ వేయడానికి గురువారమే చివరి రోజు కావడంతో శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్, బీసీవై పార్టీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి బూరగాపు చంద్రకళా యాదవ్ నామినేషన్లు వేయడానికి సిద్ధపడ్డారు. గురువారం ఉదయం ఆయా పార్టీల శ్రేణులు ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల్లో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లేందుకు బయల్దేరారు. కాగా.. చంద్రకళా యాదవ్ ఇటీవలే టీడీపీకి రాజీనామా చేశారు. ఆమె కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేసేందుకువెళ్తుండగా.. అప్పటికే ర్యాలీ కోసం సిద్ధంగా ఉన్న టీడీపీ నాయకులు అడ్డుకుని గొడవపడ్డారు. అదే రోడ్డులో ఉన్న ఎంపీ నివాసం వద్ద చంద్రకళను అడ్డుకుని, టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ నామినేషన్ వేయడానికి వస్తున్నారని, ఆగిపోవాలని హెచ్చరించారు. ఒకానొక సమయంలో సర్పంచ్ బైరి నరేష్ తన అనుచరులతో కలిసి బీసీవై కార్యకర్తలపై దాడికి యత్నించారు. దీంతో తోపులాట జరిగింది. ఈ హఠాత్పరిణామానికి విస్తుపోయిన బీసీవై కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. ఈ ఘటనపై బీసీవై ఎంపీ అభ్యర్థి చంద్రకళా యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. తాము ర్యాలీగా వస్తుండగా తెదేపా కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. రాజకీయాలు ఎవరికీ వంశపారంపర్యం కాదని, ఎవరి సొత్తూ కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలా ఒకరిని ఒకరు అడ్డుకోవడం తగదన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై బాబు ముసుగు తొలగింది

- ముస్లింల అభివృద్ధి కోసం వైఎస్సార్ 4 శాతం రిజర్వేషన్లు తెచ్చారు
- టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పండి
- ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పిలుపు



సాక్షి, అమరావతి: ముస్లిం రిజర్వేషన్లపై చంద్రబాబు ముసుగు తొలగిందని, ముస్లింల 4 శాతం రిజర్వేషన్లు తీసివేస్తామనేలా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నోటి వెంట బాబే చెప్పించారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ధ్వజమెత్తారు. తాను మాట్లాడాలనుకుంది కూటమిలోని బీజేపీ నేతలతో మాట్లాడించి, ముస్లిం మైనార్టీల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చారని, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ముస్లిం మైనార్టీలపై చంద్రబాబు చూపింది కపట ప్రేమేనని చెప్పారు. హఫీజ్‌ఖాన్ గురువారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు సీఎంగా ఉండగా ముస్లింలకు పదవుల్లో ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. గుంటూరులో నారాహమారా అంటూ చంద్రబాబు పెట్టిన కార్యక్రమంలో నిరసన తెలిపిన ముస్లిం యువకులపై దేశద్రోహం కేసు పెట్టించారని తెలిపారు. ముస్లిం మైనార్టీలపై చంద్రబాబు చూపిన వివక్ష, కేసులు, వేధింపులను ముస్లిం సమాజం ఎన్నటికి మరిచిపోదన్నారు. మరోసారి చంద్రబాబు అధికారంలోకి వస్తే ముస్లింలకు ప్రమాదమేనని చెప్పారు. ముస్లిం మైనార్టీలు నాడు వైఎస్సార్ పాలనలో, నేడు వైఎస్ జగన్ పాలనలో సురక్షితంగా ఉన్నారని, అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల, మైనార్టీల ప్రభుత్వమని అన్నారు. సీఎం జగన్ ఎప్పుడూ ముస్లింల మనస్సు నొప్పించేలా వ్యవహరించరని స్పష్టం చేశారు.

యావత్తు సమాజం 4% రిజర్వేషన్లు గుర్తించింది

ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను యావత్తు సమాజం గుర్తించిందని చెప్పారు. జస్టిస్ సహచార్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా అన్ని ప్రాంతాలు తిరిగి వీటిపై నివేదికలు సమర్పించారని తెలిపారు. ముస్లింలలో వెనకబడిన తనం ఉందని, ఆర్థిక స్థోమత లేదని, వారి పిల్లలు చదువుకోవడం లేదని, మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని, వారిని మెయిన్ స్ట్రీమ్‌లోకి తేవాలంటే రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవసరం ఉందని తెల్చారని అన్నారు. ముస్లిం రిజర్వేషన్లు మతపరమైనవని కేంద్ర మంత్రి అనడం సరికాదన్నారు. ఇవి మతపరమైన రిజర్వేషన్లు కాదని, ముస్లిం సామాజిక వర్గంలో చాలా కులాలకు ఈ రిజర్వేషన్లు వర్తించటంలేదని తెలిపారు. చాలా ఇబ్బందుల్లో ఉండి, రిజర్వేషన్లు అవసరమైన వారికి మాత్రమే డాక్టర్ వైఎస్సార్ ఆరోజు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చారన్నారు. కానీ, చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆయన మనసులో మాటలను ఇతరులతో మాట్లాడిస్తున్నారని చెప్పారు. ఏపీలో ప్రజలంతా సోదర భావంతో జీవిస్తుంటే దాన్ని నాశనం చేసేలా చంద్రబాబు కుట్ర చేస్తున్నారని, ఈ విషయాన్ని ముస్లింలంతా అర్థం చేసుకోవాలని అన్నారు. సీఎం వైఎస్ జగన్ మతాలు, పార్టీలు చూడరని, పేదవాడు, అర్హుడు అన్నవే చూస్తారని చెప్పారు. అందరూ బాగుండాలని, అందరి ఆరోగ్యం బాగుండాలని సీఎం జగన్ కోరుకుంటారని తెలిపారు. చంద్రబాబు ప్రత్యేక హోదా గురించి, విభజిత ఏపీకి రావాల్సిన అంశాల గురించి కేంద్ర మంత్రితో మాట్లాడించి ఉంటే బాగుండేదని, కానీ రాష్ట్రానికి మంచి జరగటం బాబుకు ఇష్టం ఉండదని చెప్పారు. ఇలాంటి నాయకులకు రాజకీయ సమాధి కట్టాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ముస్లిం మైనార్టీలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని హఫీజ్ ఖాన్ పిలుపునిచ్చారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
26-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
487	168
74,339	22,570

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	15,582	▽ 130
డోజోన్స్	38,054	▽ 407
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,079	△ 38
డాక్స్	17,917	▽ 171
షాంఘై	3,053	△ 8
నికాయ్	37,628	▽ 831

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	72,094	△ 268
బంగారం (99.5 స్వచ్ఛత)	71,805	△ 267
వెండి (కిలో)	80,898	△ 211

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.19	85.17
£	బ్రిటన్ పౌండ్	101.81	106.76
€	యూరో	87.13	91.68
¥	జపాన్ ఎన్ (100)	41.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.05	56.89
S$	సింగపూర్ డాలర్	58.96	63.67
SAR	సౌదీ రియాల్	21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	21.80	23.58
¥	చైనా యువాన్	10.38	12.45

ఓలెక్ట్రా డివిడెండ్ 10 శాతం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ మార్చి త్రైమాసికంలో రూ.4 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 40 పైసల తుది డివిడెండ్ ప్రతిపాదించింది. క్యూ4 కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.27 కోట్ల నుంచి రూ.14 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవర్ రూ.376 కోట్ల నుంచి రూ.293 కోట్లకు పడిపోయింది. 2023–24లో నికరలాభం రూ.66 కోట్ల నుంచి రూ.77 కోట్లను తాకింది. టర్నోవర్ రూ.1,101 కోట్ల నుంచి రూ.1,165 కోట్లకు ఎగసింది. 10,000 ఎలక్ట్రిక్ బస్‌ల ఆర్డర్లను అందుకున్న తొలి భారతీయ కంపెనీగా స్థానం సంపాదించామని ఓలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. ప్రస్తుతం ఈ–బస్‌ల ఆర్డర్ బుక్ 10,969 యూనిట్లు ఉందన్నారు.

6,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్

- ఈ ఏడాది టెక్ మహీంద్రా ప్రణాళిక
- మార్చి త్రైమాసిక ఫలితాలు విడుదల
- నికర లాభం నేలచూపు
- రూ. 661 కోట్లకు పరిమితం
- షేరుకి రూ. 28 తుది డివిడెండ్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 41 శాతం క్షీణించి రూ. 661 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం సైతం 6 శాతంపైగా బలహీనపడి రూ. 12,871 కోట్లకు చేరింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 28 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఆగస్ట్ 9కల్లా చెల్లించనుంది. దీంతో గతేడాదికి మొత్తం రూ. 40 డివిడెండ్ చెల్లించింది.

పూర్తి ఏడాదికి

2023–24లో టెక్ మహీంద్రా నికర లాభం 51 శాతం పడిపోయింది. రూ. 2,358 కోట్లకు పరిమితమైంది. అయితే మొత్తం ఆదాయం స్వల్పంగా 2 శాతం తగ్గి రూ. 51,996 కోట్లను తాకింది. కంపెనీ ఉద్యోగులలో త్రైమాసికవారీగా 795 మంది తగ్గారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1,45,455కు చేరింది. అయితే ప్రతీ క్వార్టర్‌కు 1,500 మంది చొప్పున ఈ ఏడాది 6,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలిచ్చే యోచనలో ఉన్నట్లు సీఈవో మోహిత్ జోషీ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో క్లయింట్ల వినియోగం పెరిగే వీలున్నట్లు కంపెనీ పేర్కొన్నారు. ఫలితంగా క్యూ1(ఏప్రిల్–జూన్) నుంచీ ప్రోత్సాహకర పనితీరు చూపగలమని భావిస్తున్నట్లు చెప్పారు. గతేడాదిలో ఐటీ సర్వీసుల రంగంలో ఎదురైన సవాళ్లు కంపెనీ ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు తెలియజేశారు.

టెక్ మహీంద్రా షేరు బీఎస్‌ఈలో స్వల్ప లాభంతో రూ. 1,190 వద్ద ముగిసింది.

వేదాంతా లాభం డౌన్

క్యూ4లో రూ. 1,369 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 27 శాతంపైగా క్షీణించి రూ. 1,369 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 1,881 కోట్లు ఆర్జించింది. ఇందుకు ట్యూటికోరన్ ఆస్తుల విలువలో నష్టం ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం సైతం రూ. 38,635 కోట్ల నుంచి రూ. 36,093 కోట్లకు బలహీనపడింది. కాగా.. 2023–24లో కంపెనీ చరిత్రలోనే రెండో అత్యధిక ఆదాయం రూ. 1,41,793 కోట్లతోపాటు.. రూ. 36,455 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) సాధించినట్లు వేదాంతా సీఎఫ్‌వో అజయ్ గోయెల్ పేర్కొన్నారు. వార్షికంగా ఇబిటా మార్జిన్ 2.4% మెరుగుపడి 30 శాతాన్ని తాకినట్లు వెల్లడించారు. వేదాంతా రిసోర్సెస్‌కు అనుబంధ కంపెనీ ట్యూటికోరన్ ఈఎస్ఎల్ స్టీల్ ఆస్తుల విలువలో రూ. 1,000 కోట్లవరకూ అకౌంటింగ్ నష్టాలు లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరుణ్ మిశ్రా తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం నీరసించి రూ. 381 వద్ద ముగిసింది.

రిలయన్స్ జ్యువెల్స్ నుంచి 'వింధ్య కలెక్షన్'



ముంబై: అక్షయ తృతీయ వేడుకలను పురస్కరించుకొని రిలయన్స్ జ్యువెల్స్ 'వింధ్య కలెక్షన్' తీసుకొచ్చింది. వారణాసిలోని రిలయన్స్ జ్యువెల్ స్టోర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బాలీవుడ్ నటి దిశా పటానీ ఈ కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించారు. ''జ్యువెల్స్ ఆఫ్ ఇండియా సిరీస్‌లో తొమ్మిదోదైన ఈ 'వింధ్య కలెక్షన్' మధ్యప్రదేశ్ సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందింది. భారతీయ కళ, హస్తకళా నైపుణ్యానికి తార్కాణంగా నిలుస్తుంది'' కంపెనీ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు. ఉజ్జయిని దేవాలయాల్లోని గొప్ప సాంస్కృతిక వారసత్వం, నిర్మాణ వైభవాలను మేళవించి తీర్చిదిద్దిన ఈ కలెక్షన్ నచ్చిందంటూ నటి దిశా పటానీ ఆనందం వ్యక్తం చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో 22% వ్యాపార వృద్ధి

గోద్రెజ్ సెక్యూరిటీస్ సొల్యూషన్స్ అంచనాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెక్యూరిటీ ఉత్పత్తుల సంస్థ గోద్రెజ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో వ్యాపార వృద్ధి 20–22 శాతంగా ఉండగలదని అంచనా వేస్తోంది. ప్రస్తుతం తమ మొత్తం వ్యాపారంలో దక్షిణాది మార్కెట్ల వాటా 31 శాతంగా ఉండగా.. అందులో తెలుగు రాష్ట్రాలది 40 శాతంగా ఉన్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పుష్కర్ గోఖలే తెలిపారు. వచ్చే రెండేళ్లలో రూ. 1,500 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ఆయన వివరించారు. ఇందుకు స్మార్ట్ సెక్యూరిటీ 4.0, సంస్థలకు అందించే ఉత్పత్తులు, సీసీ టీవీలు, హోమ్ లాకర్స్ మొదలైనవి దోహదపడగలవని గోఖలే చెప్పారు. పసిడి ధరలు పెరుగుతుండటం, బ్యాంకులు కార్యకలాపాలను విస్తరిస్తుండటం తదితర అంశాల కారణంగా తమ ఉత్పత్తులకు డిమాండ్ నెలకొందని ఆయన పేర్కొన్నారు.

ఆడి రేట్లు 2 శాతం వరకు పెంపు



న్యూఢిల్లీ: ఆడి తమ కార్ల రేట్లను 2% వరకు పెంచనున్నట్లు వెల్లడించింది. ముడివస్తువుల ధరలు, రవాణా వ్యయాల పెరగడం వంటి కారణాల రీత్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రేట్ల పెంపు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో 33 శాతం వృద్ధితో 7,027 వాహనాలను విక్రయించింది.

అయిదో రోజూ బుల్ జోరు

- ఫైనాన్స్, బ్యాంకులు, మెటల్ షేర్లకు డిమాండ్
- ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని లాభాల్లోకి సూచీలు



ముంబై: ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు అయిదో రోజూ లాభాలు ఆర్జించాయి. ఫైనాన్స్, బ్యాంకులు, మెటల్ షేర్లు రాణించడంతో గురువారం సెన్సెక్స్ 487 పాయింట్లు పెరిగి 74వేల స్థాయి పైన 74,339 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 168 పాయింట్లు బలపడి 22,570 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. కోటక్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ కొరడా, విదేశీ విక్రయాల ప్రభావంతో సూచీలు ప్రథమార్థంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి ఫైనాన్స్, బ్యాంకులు, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు నష్టాల్లోంచి లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 718 పాయింట్లు బలపడి 74,571 వద్ద, నిఫ్టీ 224 పాయింట్లు పెరిగి 22,626 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. లాభాల మార్కెట్లోనూ కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా బీఎస్‌ఈలో సర్వీసెస్ సూచీ 2%, మెటల్, ఫార్మా, పవర్, ఇంధన ఇండెక్సులు ఒకశాతం చొప్పున పెరిగాయి.

- క్రెడిట్ కార్డులు జారీ చేయొద్దు ఆన్‌లైన్ ద్వారా కొత్త ఖాతాదార్లను చేర్చుకోవద్దంటూ ఆర్‌బీఐ ఆంక్షలు విధించడంతో కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు 11% శాతం నష్టపోయి రూ.1,643 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో షేరు 13% క్షీణించి రూ.1,602 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో ఈ ప్రైవేటు రంగ బ్యాంకు ఒక్క రోజులో రూ.39,768 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది.

భారీ ఐపీవోకు స్విగ్గీ!

రూ. 10,414 కోట్లు లక్ష్యం



ఫుడ్, గ్రోసరీ డెలివరీ దిగ్గజం స్విగ్గీ భారీ పబ్లిక్ ఇష్యూపై కన్నేసింది. కొత్తగా ఈక్విటీ జారీసహా.. ప్రస్తుత వాటాదారులు షేర్లను విక్రయించడం ద్వారా రూ. 10,414 కోట్లు సమీకరించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఇందుకు వాటాదారులు అనుమతించారు. ఈ నెల 23న నిర్వహించిన వాటాదారుల అసాధారణ సమావేశం (ఈజీఎం)లో ప్రత్యేక రిజల్యూషన్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు సమాచారం.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌–నెక్ / 100కు రూ.లలో)

26-4-2024 ఫామ్ ధర...

ప్రాంతం	ధర
విశాఖ	400–00
చిత్తూరు	453–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380–00
విజయవాడ	380–00
హైదరాబాద్	350–00
వరంగల్	352–00

ఏఐతో భారత్‌కు అపార అవకాశాలు

క్వాల్‌కామ్ ఇండియా ప్రెసిడెంట్ సవీ సోయిన్



న్యూఢిల్లీ: హైబ్రిడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో దూసుకెళ్లేందుకు భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని చిప్‌ల తయారీ దిగ్గజం క్వాల్‌కామ్ ఇండియా ప్రెసిడెంట్ సవీ సోయిన్ తెలిపారు. డివైజ్‌లు, పీసీలు, ఫోన్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు మొదలైన వాటిల్లో ఏఐని ఏ విధంగా వినియోగించవచ్చనేది ప్రపంచానికి తెలియజెప్పే సామర్థ్యాలు భారత్‌కు పుష్కలంగా ఉన్నాయన్నారు. దేశీయంగా ప్రతి రంగం వృద్ధి బాటలో ముందుకెడుతోందని ఆయన పేర్కొన్నారు. దేశీ వినియోగదారుల అవసరాలకు తగ్గ స్థాయిలో ఉత్పత్తులను అందించినా బోలెడన్ని వ్యాపార అవకాశాలు ఉన్నాయని సోయిన్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మొబైల్ ఫోన్స్ వంటి ఉత్పత్తుల తయారీ సంస్థలు (ఓఈఎం) ఇటు దేశీ మార్కెట్‌తో పాటు అటు ఎగుమతుల కోసం కూడా భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తున్నాయని ఆయన తెలిపారు.

100 డాలర్ల లోపు (సుమారు రూ. 8,300) అందుబాటు ధరలో ఎంట్రీ లెవెల్ 5జీ స్మార్ట్‌ఫోన్ల కోసం కొత్త చిప్‌సెట్‌పై క్వాల్‌కామ్ కసరత్తు చేస్తోంది. భారత్‌లోని ఓఈఎంలు, ఆపరేటర్లతో కలిసి పని చేస్తోంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, నోయిడా తదితర ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రతిభావంతులకు హబ్‌గా భారత్ నిలుస్తోందని, ఇక్కడ పని చేసేందుకు బోలెడన్ని అవకాశాలు ఉన్నాయని సోయిన్ పేర్కొన్నారు. టూ–వీలర్ ఓఈఎంలు డిజిటల్ బాట పట్టేందుకు తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. వ్యూహాత్మక భాగస్వామి అయిన రిలయన్స్ జియోతో ఫిక్స్‌డ్ వైర్‌లెస్, 4జీ డివైజ్‌లపై పని చేస్తున్నామని సోయిన్ చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్

స్విమ్మర్ సామదేవ్‌కు కాంస్యం



మలేసియా ఇన్విటేషనల్ ఇంటర్నేషనల్ ఏజ్ గ్రూప్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ తీర్థు సామదేవ్ కాంస్య పతకం సాధించాడు. కౌలాలంపూర్‌లో జరిగిన ఈ టోర్నీలో 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో సామదేవ్ 16 నిమిషాల 18.31 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు.

భారత్‌కు పతకాల పంట



దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా అండర్–20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజు భారత్‌కు నాలుగు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు, మూడు కాంస్య పతకాలు లభించాయి. మహిళల లాంగ్‌జంప్‌లో పావన నాగరాజ్ (6.32 మీటర్లు)... షాట్‌పుట్‌లో అనురాగ్ (19.23 మీటర్లు)... 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో రణ్‌వీర్ (9ని:22.62 సెకన్లు), ఏక్తా డే (10ని:31.92 సెకన్లు) పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు.

పసిడి పోరుకు ధీరజ్ బృందం





షాంఘై (చైనా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–1 టోర్నమెంట్ పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్‌లతో కూడిన భారత బృందం గురువారం జరిగిన సెమీఫైనల్లో 5–1 (55–54, 55–55, 56–55)తో ఇటలీ జట్టును ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ప్రస్తుత ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ జట్టు దక్షిణ కొరియాతో టీమిండియా తలపడుతుంది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత జట్టు రెండో రౌండ్‌లో 5–3 (55–56, 54–54, 55–51, 55–53)తో ఇండోనేసియాపై, క్వార్టర్ ఫైనల్లో 5–1 (59–54, 56–55, 55–55)తో స్పెయిన్‌పై విజయం సాధించింది. దీపిక కుమారి, అంకిత, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు కథ రెండో రౌండ్‌లోనే ముగిసింది. రెండో రౌండ్‌లో భారత్ 3–5 (50–50, 55–49, 51–54, 52–54)తో మెక్సికో జట్టు చేతిలో ఓడిపోయింది.

సెమీఫైనల్లో జ్యోతి సురేఖ

కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్లు వెన్నం జ్యోతి సురేఖ, ప్రియాంశ్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత జ్యోతి సురేఖ రెండో రౌండ్‌లో 147–145తో యువా బేగమ్ (టర్కీ)పై, మూడో రౌండ్‌లో 148–147తో ఆండ్రియా మునోజ్ (స్పెయిన్)పై, క్వార్టర్ ఫైనల్లో 143–142తో అవనీత్ కౌర్ (భారత్)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి క్వార్టర్ ఫైనల్లో 142–144తో ఆండ్రియా బెసెరా (మెక్సికో) చేతిలో ఓడిపోయింది. పురుషుల క్వార్టర్ ఫైనల్లో ప్రియాంశ్ 145–145 (10/9)తో 'షూట్ ఆఫ్'లో బతుహాన్ (టర్కీ)పై నెగ్గాడు. భారత్‌కే చెందిన అభిషేక్ వర్మ, రజత్ చౌహాన్ తొలి రౌండ్‌లో... ప్రథమేశ్ క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు.

గుకేశ్‌కు ఘనస్వాగతం

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌కు భారత్ బిడ్




చెన్నై విమానాశ్రయంలో తల్లి పద్మతో గుకేశ్

సాక్షి, చెన్నై: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ గురువారం టొరంటో నుంచి స్వస్థలం చెన్నై చేరుకున్నాడు. అతనికి చెన్నై విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. టోర్నీ సమయంలో గుకేశ్ వెంట తండ్రి రజినీకాంత్ ఉన్నారు. విమానాశ్రయంలో గుకేశ్ తల్లి పద్మకుమారితోపాటు ఇతర కుటుంబ సభ్యులు, అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్), తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సభ్యులు గుకేశ్‌కు స్వాగతం పలికారు. 'టైటిల్ గెలిచినందుకు ఎంతో ఆనందంగా ఉంది. నా కెరీర్‌ను తీర్చిదిద్దడంలో దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పాత్ర ఎంతో ఉంది. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్నాక ఈ ఏడాది చివర్లో డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్‌తో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ కోసం సన్నద్ధమవుతాను' అని వచ్చే నెలలో 18 ఏళ్లు పూర్తి చేసుకోనున్న గుకేశ్ వ్యాఖ్యానించాడు. మరోవైపు గుకేశ్–డింగ్ లిరెన్ (చైనా) మధ్య జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్ వేస్తుందని ఏఐసీఎఫ్ కార్యదర్శి దేవ్ పటేల్ ప్రకటించారు. ఒకవేళ భారత్‌కు ఆతిథ్య హక్కులు లభిస్తే చెన్నై నగరం ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌కు వేదిక అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. క్యాండిడేట్స్ టోర్నీ టైటిల్ నెగ్గిన గుకేశ్‌కు ఏఐసీఎఫ్ రూ. 51 లక్షలు నగదు పురస్కారం ప్రకటించింది.

రైజింగ్‌కు బ్రేక్

- సొంతగడ్డపై హైదరాబాద్‌కు ఓటమి
- 35 పరుగులతో బెంగళూరు గెలుపు
- పటిదార్, కోహ్లి అర్ధసెంచరీలు
- రాణించిన ఆర్‌సీబీ బౌలర్లు

హెడ్ విధ్వంసం సృష్టించలేదు... క్లాసెన్ కుమ్మేయలేదు... మార్క్‌రమ్ మెరుపుల్లేవు... అభిషేక్ ఆశించిన స్థాయిలో చెలరేగలేదు... వరుస మ్యాచ్‌లలో పరుగుల వరద పారిస్తూ ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా మారిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు దూకుడుకు సొంతగడ్డపై బ్రేక్ పడింది. 300 స్కోరు సంగతేమో కానీ ఛేదనలో ఒకదశలో 100 కూడా దాటడమే కష్టమనిపించింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత హైదరాబాద్ జట్టు తలవంచింది. మరోవైపు వరుసగా ఆరు పరాజయాలు... మైదానంలో దిగేదే ఓడేందుకా అన్నట్లు ఆడుతూ ఒక్క గెలుపు కోసం తపించిపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు భారీ ఊరట లభించింది. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ రాణించడంతో ఎట్టకేలకు ఆ జట్టుకు ఈ ఐపీఎల్ సీజన్‌లో రెండో విజయం దక్కింది.



రజత్ పటిదార్



నితీశ్ బౌల్డ్

సాక్షి, హైదరాబాద్: సీజన్‌లో తిరుగులేకుండా సాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అనూహ్య పరాజయం ఎదురైంది. గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 35 పరుగుల తేడాతో సన్‌రైజర్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 206 పరుగులు సాధించింది. విరాట్ కోహ్లి (43 బంతుల్లో 51; 4 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రజత్ పటిదార్ (20 బంతుల్లో 50; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేయగా... కామెరాన్ గ్రీన్ (20 బంతుల్లో 37 నాటౌట్; 5 ఫోర్లు) రాణించాడు. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులు చేసి ఓడిపోయింది. షహబాజ్ అహ్మద్ (37 బంతుల్లో 40 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), అభిషేక్ శర్మ (13 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్యాట్ కమిన్స్ (15 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు.

పటిదార్ మెరుపులు...

భువనేశ్వర్ ఓవర్లో 3 ఫోర్లతో డుప్లెసిస్ (12 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఇన్నింగ్స్ ఆరంభించగా... కమిన్స్ ఓవర్లో కోహ్లి 2 ఫోర్లు కొట్టాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 61 పరుగులకు చేరింది. డుప్లెసిస్, జాక్స్ (6) వెనుదిరిగిన తర్వాత కోహ్లి ఆశ్చర్యకర రీతిలో ఒక్కసారిగా నెమ్మదించాడు. తన 17వ బంతికి సిక్స్ కొట్టిన కోహ్లి... ఆ తర్వాత 25 బంతులపాటు బౌండరీ కొట్టలేకపోవడం అనూహ్యం. అయితే మరో ఎండ్‌లో పటిదార్ విధ్వంసం ఆర్‌సీబీ స్కోరును పరుగెత్తించింది. లెగ్‌స్పిన్నర్ మార్కండే లక్ష్యంగా అతను చెలరేగిపోయాడు. అతని రెండో ఓవర్లో ఒక సిక్స్ కొట్టిన పటిదార్... అతని తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6, 6, 6 బాదడం విశేషం. కోహ్లి, పటిదార్ తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా... గ్రీన్ చక్కటి షాట్లతో స్కోరును 200 పరుగులు దాటించాడు. ఆఖరి 5 ఓవర్లలో ఆర్‌సీబీ 64 పరుగులు చేసింది.

టపటపా...

తొలి ఓవర్లోనే హెడ్ (1) అవుట్ కావడంతో రైజర్స్‌కు సరైన ఆరంభం లభించలేదు. జాక్స్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టిన అభిషేక్ తర్వాతి ఓవర్లో వెనుదిరిగాడు. అంతే... ఆ తర్వాత పరుగులు రావడం ఆగిపోవడంతో పాటు హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది. మార్క్‌రమ్ (8 బంతుల్లో 7; 1 ఫోర్), క్లాసెన్ (3 బంతుల్లో 7; 1 సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (13 బంతుల్లో 13; 1 సిక్స్) ఇలా వచ్చి అలా పెవిలియన్‌కు వెళ్లిపోయారు. దాంతో సన్‌రైజర్స్‌కు ఏ దశలోనూ గెలుపు అవకాశాలు కనిపించలేదు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) సమద్ (బి) ఉనాద్కట్ 51; డుప్లెసిస్ (సి) మార్క్‌రమ్ (బి) నటరాజన్ 25; జాక్స్ (బి) మార్కండే 6; పటిదార్ (సి) సమద్ (బి) ఉనాద్కట్ 50; గ్రీన్ (నాటౌట్) 37; లోమ్రోర్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 7; కార్తీక్ (సి) సమద్ (బి) కమిన్స్ 11; స్వప్నిల్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 12; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 206. వికెట్ల పతనం: 1–48, 2–65, 3–130, 4–140, 5–161, 6–193, 7–206. బౌలింగ్: అభిషేక్ శర్మ 1–0–10–0, భువనేశ్వర్ 1–0–14–0, కమిన్స్ 4–0–55–1, నటరాజన్ 4–0–39–2, షహబాజ్ 3–0–14–0, మార్కండే 3–0–42–1, జైదేవ్ ఉనాద్కట్ 4–0–30–3.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) కార్తీక్ (బి) యశ్ 31; హెడ్ (సి) కరణ్ (బి) జాక్స్ 1; మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) స్వప్నిల్ 7; నితీశ్ కుమార్ రెడ్డి (బి) కరణ్ 13; క్లాసెన్ (సి) గ్రీన్ (బి) స్వప్నిల్ 7; షహబాజ్ (నాటౌట్) 40; సమద్ (సి అండ్ బి) శర్మ 10; కమిన్స్ (సి) సిరాజ్ (బి) గ్రీన్ 31; భువనేశ్వర్ (సి) సిరాజ్ (బి) గ్రీన్ 13; ఉనాద్కట్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 171. వికెట్ల పతనం: 1–3, 2–37, 3–41, 4–56, 5–69, 6–85, 7–124, 8–141. బౌలింగ్: జాక్స్ 2–0–23–1, సిరాజ్ 4–0–20–0, యశ్ దయాళ్ 3–0–18–1, స్వప్నిల్ 3–0–40–2, కరణ్ శర్మ 4–0–29–2, ఫెర్గూసన్ 2–0–28–0, గ్రీన్ 2–0–12–2.

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × పంజాబ్
వేదిక: కోల్‌కతా

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	8	5	3	10	0.577
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
ఢిల్లీ	9	4	5	8	-0.386
గుజరాత్	9	4	5	8	-0.974
ముంబై	8	3	5	6	-0.227
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	9	2	7	4	-0.721

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

The Mark of Achievement

SR Shines Again!

Sterling Performance in JEE MAIN 2024

50 YEARS OF BRILLIANCE

ALL INDIA RANK	Name	APP.
5	G.NAVEEN	APP. 240310345924 (R)
12	A.NANDINI	APP. 240310111980 (R)
42	Y.SATHWIK REDDY	APP. 240310688822 (R)
55	G.KALU	APP. 240310398144 (R)
126	D.MANISH	APP. 240310469723
131	D.KARTHIK	APP. 240310408808 (R)
144	J.SHRETHAN REDDY	APP. 240310686945 (R)
148	K.PRASHANTH REDDY	APP. 240310439090 (R)
149	T.TEJASWI	APP. 240310484777 (R)
154	K.AKHIL YADAV	APP. 240310604565 (R)
186	P.NIHAL SREEVATHSAV	APP. 240310642019 (R)
192	K.SREERAM REDDY	APP. 240310166922 (R)
201	T.AMRUTHA VARSHINI	APP. 240310017984 (R)
211	K.RAMANA REDDY	APP. 240311169525 (R)
225	T.SRESHTA	APP. 240310251866 (R)
314	P.RITHVIK	APP. 240310550132 (R)
357	R.DEEPANSH REDDY	APP. 240310166542
385	G.NAVEEN KRISHNA SAI	APP. 240310308078 (R)
430	Md.TAYYAB	APP. 240310214498 (R)
431	K.SIDDARTHA	APP. 240310562983 (R)
433	B.ABHISHEK RATHOD	APP. 240310361365 (R)
497	G.UDAY	APP. 240310340124 (R)
530	M.SRINU	APP. 240310411282 (R)
550	B.BHAVITHA	APP. 240310684585 (R)
599	S.BHANU PRASAD	APP. 240310517138 (R)
614	D.PRAGNA TEJA	APP. 240310126395 (R)
625	L.RAMYA LEELA PAVANI	APP. 240310598220 (R)
662	G.BHAGAVANDAS	APP. 240310452162 (R)
730	P.MARUTHI	APP. 240310415884 (R)
782	J.SHRESTITHA	APP. 240310460489 (R)
783	T.TEJESH	APP. 240310441887 (R)
788	DANISH FATIMA	APP. 240310281113 (R)
880	V.PRATHEEK	APP. 240310509541 (R)
861	B.ANAND SAI	APP. 240310360916 (R)
870	M.ABHIGNAN	APP. 240310483312 (R)
872	P.MEGHANA	APP. 240310194592 (R)
944	D.VARSHITH	APP. 240310463538 (R)
948	N.MAHENDRA BABU	APP. 240310449409 (R)
986	Y.HARSHITH	APP. 240310189007 (R)

LONG TERM (JEE-MAIN/ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2024-25

3256 STUDENTS SELECTED FOR JEE-Advanced 2024

SR Educational Academy

TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | **WARANGAL:** 9642117378 | **VIJAYAWADA:** 8142111302 | **VIZAG:** 9052222274, 9154854707 | **GUNTUR:** 9154854694 | **TIRUPATI:** 9154854699 | **NELLORE:** 9154854696 | **ANANTHAPURM:** 9154854691 | **KURNOOL:** 9154854695 | **NIZAMABAD:** 9642117110 | **SRIKAKULAM:** 9154854697 | **BHIMAVARAM:** 9642223762, 7331122579 | **RAJAHMUNDRY:** 9154854693 | **KARIMNAGAR:** 9642117335 | **NALGONDA:** 9573927070 | **ONGOLE:** 8712609156 | **KHAMMAM:** 9121155002 | **ADILABAD:** 9154854690 | **KOTHAGUDEM:** 9154854692 | **NIRMAL:** 9642117835 | **HOSAPETE:** 9154854713.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం ׀ 26 ׀ ఏప్రిల్ ׀ 2024



డీజీపీని కలిసిన ఎన్టీఆర్ జిల్లా సీపీ

విజయవాడస్పోర్ట్స్: డీజీపీ కేఈ రాజేంద్రనాథ్ రెడ్డిని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.



సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నతంగా..

ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్‌ను గురువారం ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ పరిశీలించారు. -IIలో▸



	కనిష్టం	గరిష్టం
నందిగామ	26.4	42.8
జగ్గయ్యపేట	25	42
మచిలీపట్నం	28	36
గుడివాడ	27	40

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో సీపీ రామకృష్ణ దంపతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా నియమితులైన పీహెచ్‌డీ రామకృష్ణ దంపతులు గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సీపీ రామకృష్ణను ఆలయ ఈవో కేఎస్ రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారితో పాటు మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను బహూకరించారు.

నిత్యాన్నదానానికి రూ. 3.60 లక్షలు విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి చెన్నైకి చెందిన భక్తులు గురువారం రూ.3.60 లక్షల విరాళాన్ని అందజేశారు. చెన్నై టి.నగర్‌కు చెందిన పి. బాలకృష్ణ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 3.60 లక్షల విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా, దాతలకు ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

వెటర్నరీ వైద్యులకు రాష్ట్ర అవార్డులు





లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడలోని ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాల జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ఆర్ ఠాగూర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు పశుసంవర్ధకశాఖ నుంచి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. గురువారం ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ డాక్టర్ ఆర్. అమరేంద్రకుమార్ వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఆస్పత్రిలో అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను డాక్టర్ జీఎస్ఆర్ ఠాగూర్‌కు పురస్కారం స్వీకరించగా.. అదే ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో సర్జరీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ కామని శ్రీనివాసరావు బెస్ట్ వెటర్నరీ సర్జన్ అవార్డు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ రెండు వేలకు పైగా వివిధ రకాల పశువులకు మేజర్ ఆపరేషన్లు చేసి మంచి ఫలితాలు సాధించారు. అంతేకాకుండా ఆస్పత్రి ఆధ్వర్యంలో జాతీయ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించి పశు వైద్య సిబ్బందికి జంతువులకు మేజర్ ఆపరేషన్లపై శిక్షణ ఇచ్చారు.

అవగాహనతో మలేరియాను నిర్మూలిద్దాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం ద్వారానే మలేరియాను సమూలంగా నిర్మూలించవచ్చని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలోని పాత ప్రభుత్వాస్పత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్య సిబ్బంది గడప గడపకు వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మలేరియా నిర్మూలనలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీఐఓ డాక్టర్ అమృత పాల్గొన్నారు.



గన్నవరంలో నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వస్తున్న వల్లభనేని వంశీ



పోటెత్తిన అభిమానం



ఆర్వోకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వల్లభనేని వంశీమోహన్

ఎటువైపు చూసినా అభిమాన జనప్రవాహంతో కిటకిటలాడుతున్న రోడ్లు.. కనుచూపు మేరా కనిపించే ర్యాలీలు.. చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా ప్రతిఒక్కరి చేతిలో రెపరెపలాడిన పార్టీ జెండాలు.. జై జగన్ అంటూ మార్మోగిన నినాదాలు.. ఎదురేగి హారతులు ఇచ్చి విజయీభవ అంటూ దీవెనలు అందించిన అక్కచెల్లెళ్లు.. ఇవీ గన్నవరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్ నామినేషన్ దాఖలు సందర్భంగా కనిపించిన దృశ్యాలు. గురువారం గన్నవరం నుంచి భారీ ర్యాలీతో ఆర్వో కార్యాలయానికి వెళ్లి వంశీ నామినేషన్ వేశారు. అలాగే టీడీపీ నుంచి యార్లగడ్డ వెంకట్రావు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి పొట్లూరి రవీంద్రకుమార్, జై భారత్ పార్టీ నుంచి గూడూరు వెంకట రవికుమార్, స్వతంత్రులుగా పలువురు నామినేషన్‌ను ఆర్వో గీతాంజలిశర్మకు అందజేశారు.

పోలీస్ కమిషనర్‌గా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ



విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఏసీబీ ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను జిల్లా పోలీస్ కమిషనర్‌గా కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న రామకృష్ణ కార్యాలయంలో సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన చాంబర్‌లో పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. 2001లో డీఎస్పీగా రామకృష్ణ పోలీస్ శాఖలో చేరారు. 23 ఏళ్ల సర్వీసులో ఏఎస్పీ, ఎస్పీ, డీఐజీ, ఐజీగా ఉద్యోగోన్నతి పొందారు. డీఎస్పీగా నల్గొండ జిల్లా దేవరకొండ, వరంగల్ జిల్లా పరకాల, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో, ఏఎస్పీగా తూర్పుగోదావరి, నల్గొండ జిల్లాల్లో, ఎస్పీగా కౌంటర్ ఇంటిలిజెన్స్, స్పెషల్ ఇంటిలిజెన్స్ విభాగాలతో పాటు, చిత్తూరు, గుంటూరు రూరల్, కడప, నెల్లూరు, గుంటూరు అర్బన్ జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. 2020లో డీఐజీగా ఉద్యోగోన్నతి పొంది ఎస్ఈబీ డైరెక్టర్‌గా, ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా, 2024 జనవరిలో ఐజీగా ఉద్యోగోన్నతి పొంది ఏసీబీలో విధులు నిర్వర్తిస్తూ ఆ శాఖ నుంచి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. సీపీగా బాధ్యతలు తీసుకున్న రామకృష్ణను పలువురు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆహ్వానం పలికారు. వారిలో డీసీపీలు కంచి శ్రీనివాసరావు, అధిరాజ్‌సింగ్ రాణా, ఉదయరాణి, టి.హరికృష్ణ, కె.చక్రవర్తి, బి.రామకృష్ణ, ఏడీసీపీలు టి.కనకరాజు, కృష్ణమూర్తినాయుడు, శ్రీహరిబాబు, డి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తొలి ఘట్టం సమాప్తం

ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు విజయవాడ పార్లమెంట్‌కు 22, ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ అసెంబ్లీ స్థానాలకు 94 నామినేషన్లు
- మొత్తం జిల్లాలో పార్లమెంట్‌కు 50, అసెంబ్లీ స్థానాలకు 260 నామినేషన్ల దాఖలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం ముగిసింది. గురువారం చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన రాజకీయపార్టీలు అభ్యర్థులు అదనపు సెట్లు నామినేషన్లు వేశారు. ఇతర పార్టీలు, స్వతంత్రులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. చివరి రోజు ఒక్క రోజే మొత్తం 116 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో ఉన్న ఒక పార్లమెంట్ స్థానానికి మొత్తం 50, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 260 నామినేషన్లు వచ్చాయి.

- విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి చివరి రోజు 22 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి మద్దిరాల వినోద్ కుమార్, బీజేపీ నుంచి కాటంనేని రాజశేఖర్, సీపీఐ అభ్యర్థులుగా కె.దుర్గాంబ, జి.కోటేశ్వరరావు తదితరులు నామినేషన్లు వేశారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాస్ రావు, సీపీఐ(ఎం) అభ్యర్థులుగా సీహెచ్ బాబూరావు, భూపతి రామారావు తదితరులు నామినేషన్ వేశారు.
- విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 13 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బీఎస్పీ అభ్యర్థిగా కె.మురళి, టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి వై.రత్నకుమారి పలువురు స్వతంత్రులు నామినేషన్ వేశారు.



ఆర్వో ఢిల్లీరావుకు నామినేషన్‌ను సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి రాణీలక్ష్మీనారాయణశర్మ

- మైలవరంలో 13 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ నుంచి సర్నాల తిరుపతిరావు, సర్నాల నాగలక్ష్మి, బీఎస్పీ నుంచి జి.వెంకటేశ్వరరావు, టీడీపీ నుంచి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పలువురు స్వతంత్రులు, ఇతర పార్టీలకు చెందిన వారు నామినేషన్ వేశారు.
- జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 11 మంది నామినేషన్లు వేశారు. టీడీపీ నుంచి శ్రీరామ రాజగోపాల్, వైఎస్సార్ సీపీ నుంచి సామినేని విమల, సామినేని ఉదయభాను, జాతీయ జనసేన పార్టీ నుంచి శ్రీరామ రామకృష్ణ, అన్యపాక రత్నం, పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు.
- తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ నుంచి ఎన్.స్వామిదాసు, ఎన్.సుధారాణి, జాతీయ జనసేన పార్టీ నుంచి కె.శ్రీను, టీడీపీ అభ్యర్థులుగా కోట పుల్లమ్మ, కొలికలపూడి శ్రీనివాసరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా లాం తాంతియా కుమారి పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు.
- నందిగామ అసెంబ్లీ నియోజకవర్గంలో 14 మంది నామినేషన్లు వేశారు. టీడీపీ నుంచి తంగిరాల సౌమ్య, కాంగ్రెస్ పార్టీ నుంచి మందా వజ్రయ్య, వైఎస్సార్‌సీపీ నుంచి పెద్దాడ రమాదేవి, బీఎస్పీ నుంచి బి.ఉదయ్ కిరణ్, టీడీపీ నుంచి తంగిరాల శ్రావణ్‌కుమార్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారన్నారు.
- విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఆర్వో, జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావుకు నామినేషన్లు స్వీకరించారు.

నేరుగా ఫిర్యాదులు చేయండి

- ఎన్నికల పరిశీలకులను నిర్దిష్ట సమయాల్లో కలిసేందుకు అవకాశం
- ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా ఎన్నికల పరిశీలకులకు నిర్దిష్ట సమయాల్లో నేరుగా ఫిర్యాదులు అందించవచ్చని, విషయ తీవ్రతను బట్టి ఫోన్ నంబర్లలోనూ సంప్రదించవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరువూరు, విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాలకు మంజురాజ్‌పాల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు నరేందర్ సింగ్ బాలి జనరల్ అబ్జర్వర్‌గా, పోలీస్ అబ్జర్వర్‌గా ప్రీతీందర్‌సింగ్ నియమితులయ్యారన్నారు. ఈ సాధారణ పరిశీలకులు పోలింగ్ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మునిసిపల్ గెస్ట్ హౌస్, నందమూరి రోడ్డు, బృందావన్ కాలనీ, లబ్బీపేట, విజయవాడలో అందుబాటులో ఉంటారని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదులు, విజ్ఞాపనలు సమర్పించవచ్చన్నారు. అదే విధంగా మంజురాజ్‌పాల్ 81215 26777లో, నరేందర్ సింగ్ బాలి 91548 83009లోనూ అందుబాటులో ఉంటారని, విషయ తీవ్రతను బట్టి ఫోన్లో సంప్రదించవచ్చని తెలిపారు.



ఎన్నికల పరిశీలకుడు నరేందర్‌సింగ్‌బాలికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

- విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఎన్నికల వ్యయ పరిశీలకులు వి.జస్టిన్, తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరభ్ శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు మదన్ కుమార్ మధ్యాహ్నం 4 గంటల నుంచి 5 గంటల వరకు పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్, విజయవాడలో అందుబాటులో ఉంటారన్నారు. వి.జస్టిన్ 81214 90777 నంబర్లోనూ, సౌరభ్ శర్మ 81214 05777, మదన్ కుమార్ 91548 83050లో అందుబాటులో ఉంటారని తెలిపారు.
- విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ ప్రీతీందర్ సింగ్ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పోలీస్ గెస్ట్ హౌస్ అందుబాటులో ఉంటారన్నారు. ఆయనను 91548 83014లో సంప్రదించవచ్చని వివరించారు.

ఎన్నికల పరిశీలకురాలి పర్యటన



తిరువూరు చెక్‌పోస్టు పరిశీలిస్తున్న మంజు

తిరువూరు: ఎన్నికల సంఘ పరిశీలకులు మంజు రాజ్‌పాల్ గురువారం తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను, సరిహద్దు చెక్ పోస్టును పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. పోలింగ్ ముందురోజు రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి సిబ్బందికి అప్పగించడం, రవాణా సదుపాయం తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి మాధవితో చర్చించారు. స్ట్రాంగ్‌రూం వద్ద భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయాలు సమగ్రంగా ఉండాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి మాధవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ టోర్నీ ప్రారంభం



చెస్ అంతర్జాతీయ టోర్నీని ప్రారంభిస్తున్న స్కూల్ ప్రిన్సిపాల్ భారతి

విజయవాడస్పోర్ట్స్: స్పార్క్ చెస్ అకాడమీ(విజయవాడ) మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ కానూరులోని షామ్‌రాక్ స్కూల్‌లో గురువారం ప్రారంభమైంది. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, అమెరికా, శ్రీలంక, జింబాబ్వే దేశాల నుంచి 405 మంది క్రీడాకారులు ఈ టోర్నీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు పది రౌండ్లు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తాళ్ల నరేష్ తెలిపారు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడర్లు అలనా మీనాక్షి(విశాఖపట్నం), ఎండీ ఇమ్రాన్(విజయవాడ)తో పాటు మరో 172 మంది టాప్ సీడర్‌లు విజయం సాధించినట్లు వివరించారు. చీఫ్ ఆర్బిటర్ జి.వి.కుమార్ సారథ్యంలో 15 మంది ఆర్బిటర్‌లు ఈ టోర్నీకి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ప్రతిష్టాత్మకమైన పోటీలు తమ పాఠశాలలో జరుగుతుండటం పట్ల స్కూల్ ప్రిన్సిపాల్ భారతి సంతోషం వ్యక్తం చేశారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.భీమారావు, కృష్ణా, కోనసీమ, నంద్యాల, ప్రకాశం జిల్లాల చెస్ అసోసియేషన్ కార్యదర్శులు ఎన్.ఎం.ఫణికుమార్, టి.సురేష్, రామసుబ్బారెడ్డి, ఎస్కే అబ్దుల్‌నబి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



ఎలక్షన్ సెల్‌ను పరిశీలిస్తున్న పోలీస్ అబ్జర్వర్ ప్రీతీందర్‌సింగ్

విజయవాడస్పోర్ట్స్: అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను సమన్వయం చేసుకుని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ తీసుకుంటున్న ఎన్నికల నిర్వహణ చర్యలు భేషుగ్గా ఉన్నాయని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ప్రీతీందర్‌సింగ్ అన్నారు. జిల్లా అబ్జర్వర్‌గా కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన ప్రీతీందర్‌సింగ్ విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సెల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, చెక్ పోస్టులలో నిర్వహిస్తున్న తనిఖీలు, నామినేషన్ కేంద్రాల వద్ద తీసుకున్న చర్యలు, ఈవీఎంల భద్రత, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరు, ఉల్లంఘనలపై తీసుకుంటున్న చర్యల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన నిఘా వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా, ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు సమక్షంలో అబ్జర్వర్ ఈ తనిఖీలు నిర్వహించారు.

28న క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: సీనియర్ పురుషుల, అండర్–23 పురుషుల ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహాక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు తెలిపారు. టీ–20, వన్డే, మల్టీడే పోటీల్లో ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. అండర్–23 ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2001 సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్‌తో పాటు వైట్ డ్రస్, షూస్, కిట్‌తో హాజరుకావాలని సూచించారు.



ఓటర్ల మనసు దోసెస్తా!

వైఎస్సార్‌సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 59వ డివిజన్ సింగ్‌నగర్‌లో ఓట్లను అభ్యర్థించిన ఆయన టిఫిన్ బండ్ల దగ్గరకు వెళ్లి ఇలా దోసెలు వేసి చిరువ్యాపారులను, స్థానిక ఓటర్లను ఆకట్టుకున్నారు.

– అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)

ప్రచార పర్వం



బొండం కొట్టి.. మనసు తట్టి..

వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నాలుగో డివిజన్ గురునానక్ కాలనీలో ఓట్లను అభ్యర్థించిన ఆయన కొబ్బరి బొండం విక్రయదారుడి వద్దకు వెళ్లి తానే బొండం కొట్టి కొనుగోలుదారులకు అందించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

పాలిసెట్‌కు ఎన్టీఆర్ జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ ఈ నెల 27 తేదీ నిర్వహిస్తున్న పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఎన్టీఆర్ జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని సెట్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 20 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడలో 11 సెంటర్లలో 4888 మంది, నందిగామలో 5 సెంటర్లలో 1560 మంది, తిరువూరులో 4 సెంటర్లలో 1416 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని వెల్లడించారు. విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు శనివారం ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఒక నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. సాంకేతిక విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ అధికారులను పరిశీలకులుగా నియమించామని చెప్పారు.

ట్రక్ టెర్మినల్ రోడ్డులో మృతదేహం గుర్తింపు

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ రోడ్డులో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బట్టి పది రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా తిరువూరుకు చెందిన బాణావత్ గోపీకృష్ణ (34)గా గుర్తించారు. అక్కడ లభించిన మద్యం సీసా, వ్యవసాయ పొలాలకు వాడే పురుగుల మందు డబ్బాను బట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు భావించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి బంధువులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దుర్గాప్రసాద్



పెనమలూరు: బీజేపీ కిసాన్‌మోర్చా కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా గోపిశెట్టి దుర్గాప్రసాద్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దుర్గాప్రసాద్ గతంలో రెండు సార్లు జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా పని చేశారు. 2019లో పెనమలూరు అసెంబ్లీకి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. రైతుల సమస్యలు తెలుసుకోవటానికి తాను త్వరలో జిల్లాలో పర్యటిస్తానని దుర్గాప్రసాద్ తెలిపారు.

మాయల మరాఠి 'సుజనా'

- విజయవాడ పశ్చిమ ప్రజలను మభ్యపెట్టేందుకు రకరకాల ఎత్తుగడలు
- పేరుకు మాత్రం బీజేపీ... వ్యవహారం నడిపేదంతా టీడీపీ వాళ్లే
- విచిత్రమైన హామీలను చూసి నివ్వెరపోతున్న జనాలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: బ్యాంకులను మోసం చేయడంలో మాస్టర్ డిగ్రీ తీసుకున్న విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరి ఓటర్లను మోసం చేసేందుకు రకరకాల ఎత్తుగడలు అనుసరిస్తున్నారు. విచిత్ర హామీలిచ్చి జనాలను మభ్య పెట్టేందుకు చేస్తున్న యత్నాలు బెడిసికొడుతున్నాయి. మాయల మరాఠీ మాదిరి ఆయన వేస్తున్న వేషాలను ప్రజలు పసిగడుతున్నారు. కమ్యూనిటీ మీటింగ్‌ల పేరుతో బయటి నుంచి అరువు తెచ్చుకున్న జనాలతో సమావేశాలు నిర్వహించి హడావిడి చేస్తున్నారు. ప్రతి ఒక్క కమ్యూనిటీకి గెలిస్తే డబ్బులు, స్థలాలు, ప్రధాన సామాజిక వర్గాల వారికి అమరావతిలో స్థలాలంటూ షో పుటప్ చేస్తూ అదరగొడుతున్నారు. మీ సంఘానికి ఏ సమస్య ఉన్నా గెలిపించగానే మొదటే పరిష్కారం చేస్తానంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. కొండలపైకి దారులు వేసి అంబులెన్స్‌లు, ఫైరింజన్‌లు వెళ్లేలా చేస్తానని విచిత్రమైన హామీలు ఇస్తున్నారు. ప్రచారంలో కొండలపైకి వెళ్లడం లేదు. అరగంటకు మించి ఏ డివిజన్‌లోనూ ప్రచారం చేయటం లేదు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసిన దాఖలాలే లేవు. పేరుకు బీజేపీ అయినా వ్యవహారం నడిపేది మాత్రం టీడీపీ నాయకులే. బీజేపీ, టీడీపీ, జనసేన మూడు పార్టీల మధ్య పూర్తిగా సమన్వయం కొరవడింది. స్థానిక బీజేపీ నాయకులను దగ్గరికి రానివ్వటం లేదు. దీంతో ఆయన తీరుపై సొంత పార్టీ నేతలే గరంగరంగా ఉన్నారు. జనసేన నేతలు ప్రచారంలో కనిపించటం లేదు. బయటినుంచి తెచ్చుకొన్న జనసేన నేతలతో ఇక్కడ కలరింగ్ ఇస్తున్నారు. ఏదో హడావిడిచేసి, జనాలను మభ్యపెట్టి ఎన్నికల్లో గట్టెక్కాలని చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తుండటంతో డబ్బు ఖర్చు చేయడం కూడా తగ్గించినట్లు ఆయన అనుచరులే పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో తిరిగాక ఆయనకు ఓటమి తప్పదనే క్లియర్ పిక్చర్ రావటంతో ప్రస్తుతం ఆయన తటాపటాయిస్తున్నారు.

బేరం పెట్టి... అడ్వాన్స్‌లతోనే సరి...

వివిధ పార్టీలకు చెందిన నేతలు తమ పార్టీలోకి వస్తున్నారని, భారీగా వలసలు సాగుతున్నాయనే బిల్డప్ ఇచ్చేందుకు కొత్త ఎత్తుగడలు అవలంభిస్తున్నారు. ఇతర పార్టీల్లో ఉన్న నాయకులకు గాలం వేసి, పెద్ద ఎత్తున డబ్బు ఇస్తామని ఆశ చూపుతున్నారు. నామమాత్రంగా అడ్వాన్స్ ఇస్తున్నారు. తీరా పార్టీలో చేరి కండువా కప్పుకొన్నాక, వారి గురించి పట్టించుకోవటం లేదు. మిగతా డబ్బులు అడిగితే ఇస్తాంలే అని మభ్యపెడుతున్నారు. దీంతో వారు విషయాన్ని బయటకు చెప్పుకోలేక, మళ్లీ పార్టీ వీడి సొంత గూటికి రాలేక దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉదాహరణకు ఇటీవల పార్టీ మారిన ఓ నేతకు రూ.15 లక్షలు ఇస్తామని బేరం పెట్టి పార్టీ కండువా కప్పారు. ఆ తర్వాత డబ్బులు ఇవ్వమని అడుగుతుంటే పట్టించుకోవటం లేదు. దీంతో కక్కలేక మింగలేక ఆ నాయకుడు లోలోపల మదన పడుతున్నారు. ఇలా పలువురు నేతలను ఊరించేలా డబ్బులు ఇస్తామని ఆశ చూపి, ఆయన చేస్తున్న నక్కజిత్తులను పసిగట్టి దూరంగా జరుగుతున్నారు. ఆయన ప్రచారంలో మరింత దిగజారి ముస్లిం మహిళలతో ఓటు కోసం ఒట్టు వేయమని ఒత్తిడి చేయడం ఆ వర్గాల్లో సైతం కలకలం రేపుతోంది.

సామ్యానుడిగా.. జనాల అభిమానం చూరగొని..

ఈ నియోజకవర్గంలో 1983లో తప్ప ఎప్పుడూ టీడీపీ గెలవలేదు. వైఎస్సార్ సీపీకి ఈ నియోజకవర్గం కంచుకోట. సామాజిక సమీకరణలో భాగంగా ముస్లిం అభ్యర్థిని వైఎస్సార్ సీపీ బరిలో నిలిపింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి అసిఫ్ స్థానికుడు. సామ్యుడిగా నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల మనస్సును దోచుకున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గడప గడపకు ప్రచారాన్ని పూర్తి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వందలకోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించారు. దీంతో ప్రచారంలో అసిఫ్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ మద్దతుగా నిలుస్తుండటంతో ఈయన గెలుపు నల్లేరు మీద నడకేననే భావనను రాజకీయ విశ్లేషకులు సైతం వ్యక్తం చేస్తున్నారు. సుజానా చౌదరికి ఈ ఎన్నికల్లో శృంగభంగం తప్పదనే భావన ప్రతి ఒక్కరిలో వ్యక్తం అవుతోంది.

టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



మంత్రి జోగి రమేష్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కుటుంబాలు



పార్టీలో చేరిన టీడీపీ నేతలతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ

ఉయ్యూరు: పట్టణంలోని కాకాని గిరిజన కాలనీకి చెందిన 42 టీడీపీ కుటుంబాలు గురువారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరాయి. 15వ వార్డు కౌన్సిలర్ ముడావత్ లక్ష్మి, పార్టీ నాయకుడు ముడావత్ బ్రహ్మం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ సమక్షంలో చేరారు. మంత్రి జోగి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దేవినేని స్మిత, దేవినేని గౌతమ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, సిడిసి చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

గన్నవరం: టీడీపీలో పెత్తందారుల పోకడలకు ఇమడలేక ఒక్కొక్కరు ఆ పార్టీని వీడుతున్నారు. గన్నవరం, బుద్ధవరం గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీ నేతలు ముతకన రాంబాబు, తాడిపర్తి ఆంజనేయులు, నక్కా వెంకటప్పయ్య, ముద్రబోయిన అజయ్‌కుమార్, కుప్పాల ఏడుకొండలు, నక్కా గీతామహేష్, నక్కా వెంకటేశ్వరరావు, కొండా శివప్రసాద్, వడితే లక్ష్మణుడుకు పార్టీ కండువాలను కప్పి వైఎస్సార్ సీపీలోకి వంశీమోహన్ ఆహ్వానించారు. పార్టీ నాయకులు దుర్గాప్రసాద్ (నాని) తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 66,153 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 62,762 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 66,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 45,199 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఫిర్యాదు రాగానే సమస్యకు పరిష్కారం



ఎస్ఎస్ఎం స్కూలు సమీపంలో విద్యుత్ ఫీజులు వేస్తున్న సిబ్బంది



తీవ్రమైన ఎండలో మెయిన్‌లైన్ పనులు చేస్తున్న విద్యుత్ కార్మికులు

- అధిక ఉష్ణోగ్రతలతో తరచూ విద్యుత్ సమస్యలు
- మండుటెండలో శ్రమించి సరఫరా పునరుద్ధరిస్తున్న సిబ్బంది
- కరెంటు సమస్యలకు తక్షణ పరిష్కారం

ఆటోనగర్(విజయవాడతూర్పు): మండుటెండల్లో విద్యుత్ సిబ్బంది అందిస్తున్న సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వేసవిలో తరచూ కరెంటు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమై తక్షణం సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 40 డిగ్రీలకు పైగా కాస్తున్న ఎండల్లోనూ కరెంటు సిబ్బంది కష్టపడి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నారు. బెజవాడలో గత కొద్ది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడం వల్ల అక్కడక్కడ ఫీజులు ఎగిరిపోతున్నాయి. కరెంట్ లోడు అధికంగా ఉండటం, గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో నిత్యం కరెంట్ సరఫరాకు ఎక్కడోచోటు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్య గత కొద్ది రోజుల నుంచి తలెత్తుతుంది. దీంతో విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆపి సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వైరింగ్‌లో సమస్యలు తలెత్తుతున్నాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. లోడు మార్పిడి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారు. ఆటోనగర్, పటమట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 37 వేల సర్వీస్‌లు ఉన్నాయి. విద్యుత్ అంతరాయంకు సంబంధించి పలు ప్రాంతాల్లో వస్తున్న ఫిర్యాదులను వెంటనే స్పందిస్తున్నట్టు ఏఈ సురేష్ తెలిపారు.

ఏసీల వాడకం పెరిగింది..

గతం కన్నా ఏసీల వాడకం గణనీయంగా పెరిగింది. సుమారు 15 నుంచి 20 శాతం ఈ పెరుగుదల ఉందని అంటున్నారు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. లోడుకు తగ్గట్టు విద్యుత్ వాడకానికి సంబంధించి అవసరమైన చోట 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు 4 ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు కూడా గత రెండేళ్లలో పలు ప్రాంతాల్లో నెలకొల్పారు. వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సిబ్బంది మెరుగైన కరెంట్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

పది నిమిషాల్లోనే స్పందిస్తున్నాం

వేసవికాలంలో చిన్న చిన్న సమస్యలు రావడం సర్వసాధారణం. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అక్కడక్కడ సమస్య ఉత్పన్నమవుతుంది. ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో స్పందించి విద్యుత్ సరఫరాను అందిస్తున్నాం.

ఎం.శివకుమార్,
డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

వీటీపీఎస్ నుంచి నున్న గ్రామానికి తాగునీరు సరఫరా



నున్నలో అధికారులతో మాట్లాడుతున్న ఈఈ రంగప్రసాద్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ఉండేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా నున్న గ్రామంలో తాగునీటి చెరువులను ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.రంగప్రసాద్, డీఈ డి.శ్రీనివాసరావు, ఏఈ కె.శ్వేత గురువారం గ్రామంలో చెరువులను పరిశీలించారు. కృష్ణానదిలో నీరు తగ్గుముఖం పట్టడంతో వీటీపీఎస్ నుంచి గొల్లపూడి పంపింగ్ స్కీమ్ కాల్వలోకి ఎత్తిపోతల ద్వారా నీరు సరఫరా చేసి, ఆ కాల్వ నుంచి నున్న గ్రామంలోని మంచినీటి చెరువులను నింపనున్నట్లు ఈఈ రంగప్రసాద్ తెలిపారు. కృష్ణానదిలో ప్రస్తుతం ఒకటిన్నర టీఎంసీలు మాత్రమే నీటి మట్టం ఉండటంతో గొల్లపూడి పంపింగ్ స్కీమ్ మోటార్ల ద్వారా నీరు లభించే పరిస్థితి లేదు. ప్రత్యామ్నాయంగా వీటీపీఎస్ కాల్వ వద్ద 20 హెచ్‌పీ సామర్థ్యం గల నాలుగు మోటార్లు ఏర్పాటు చేసి అక్కడ నుంచి గొల్లపూడి పంపింగ్ స్కీమ్ కాల్వకు నీటిని 15 రోజులపాటు పెడుతున్నామన్నారు. అక్కడ నుంచి నున్న గ్రామంలోని రెండు మంచినీటి చెరువులను నింపనున్నట్లు తెలిపారు. వీటీపీఎస్ అధికారులతో మాట్లాడి త్వరలోనే మోటార్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నున్న గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నతంగా ఎదగాలి

ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్




కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పోలా భాస్కర్

మధురానగర్ (విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్‌ను గురువారం ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ పరిశీలించారు. ఎస్ఐఆర్ఎఫ్ నిధుల ద్వారా కళాశాలకు నూతనంగా అందించిన 100 కంప్యూటర్స్‌ను సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్‌ను గొప్పగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి, కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి గుమ్మడి విజయదీప్ పాల్గొన్నారు.

వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ అందించాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్ అందించేందుకు కృషి చేయాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ సూచించారు. విద్యార్థులకు వేతనంతో కూడి ఇంటర్న్‌షిప్ అందించేందుకుగానూ పలు పరిశ్రమలకు చెందిన సీఈవోలతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏజీఓ డాక్టర్ తులసి, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, నాలుగు జోన్‌లకు చెందిన రీజనల్ జాయింట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. జూన్ 28 నుంచి 29వ తేదీవరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సెమినార్ కరపత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మితో కలిసి ఆయన ఆవిష్కరించారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన



నామినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న నరీందర్ సింగ్ బాలి, మదనకుమార్, చిత్రంలో ఆర్‌వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట అర్బన్: తహసీల్దార్ కార్యాలయంలోని నామినేషన్ల కేంద్రాన్ని జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి నరీందర్ సింగ్ బాలి, జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ తూర్పు నియోజకవర్గాల ఎక్స్‌పెండిచర్ (వ్యయ) అబ్జర్వర్‌గా నియమితులైన ఐఆర్ఎస్ అధికారి ఎం.మదనకుమార్ గురువారం పరిశీలించారు. నరీందర్ సింగ్ బాలి ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల నామినేషన్ల పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపసంహరణలు ఈ నెల 29 న మధ్యాహ్నం 3 గంటలకల్లా చేసుకోవాలని స్పష్టం చేశారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జి.శేషగిరి, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల తహసీల్దార్లు అమ్మాజీ, కె.సూర్యారావు, పేట మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళ దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బైక్ ఢీకొని మహిళ దుర్మరణం చెందిన ఘటన బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామ శివారులో ఆటో పక్కన నిలబడిన ఇద్దరు మహిళలను అదే గ్రామానికి చెందిన యువకుడు బైక్‌పై వెళుతూ అదుపు తప్పి ఢీకొట్టాడు. దీంతో గాయపడిన మహిళలను పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మన్నెం సుశీల (62) అనే మహిళ మృతి చెందింది. మరో మహిళ సోదిమెళ్ల కొండమ్మ పరిస్థితి విషమంగా ఉంది. వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెజవాడలో కృష్ణమ్మ చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న కృష్ణమ్మ చిత్ర యూనిట్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో కృష్ణమ్మ చిత్ర బృందం గురువారం సందడి చేసింది. బెజవాడ నగరం ఇతివృత్తంగా నగరంలో 60 రోజులపాటు ఈ చిత్రాన్ని నిర్మించామని, ప్రేక్షకులు తప్పక విజయవంతం చేయాలని హీరో సత్యదేవ్ కోరారు. నగరంలోని స్టెల్లా కాలేజ్ సమీపంలోని హివాగా స్కూల్ ఆఫ్ బ్యూటీ సెంటర్లో కృష్ణమ్మ చిత్ర బృందం విలేకరుల సమావేశం నిర్వహించింది. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ కృష్ణమ్మ చిత్రాన్ని విజయవాడ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించామని తెలిపారు. ప్రధానంగా వన్‌టౌన్, వించిపేట కొండ ప్రాంతంలో, మూలపాడు అటవీ ప్రాంతంలో సినిమా చిత్రీకరణ జరిగిందన్నారు. ఈ చిత్రంలో తాను వించిపేట భద్ర క్యారెక్టర్‌లో ప్రేక్షకులకు కనబడతానని చెప్పారు. ముగ్గురు స్నేహితుల మధ్య జరిగే కథే ఈ చిత్రమని పేర్కొన్నారు. మే మూడో తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని వెల్లడించారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని కోరారు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరిస్తున్నారని వివరించారు. చిత్రంలో ఉన్న కంటెంట్ నచ్చి ఆయన ప్రజెంట్ చేయడానికి ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం దర్శకుడు వీవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను విజయవాడ నగరంలోనే పుట్టి పెరిగానని తెలిపారు. విజయవాడ అందాలను ప్రపంచానికి తెలియజేసే ఉద్దేశంతో కృష్ణమ్మ చిత్రాన్ని నిర్మించినట్లు చెప్పారు. ఈ చిత్రంలో సత్యదేవ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందన్నారు. ఆయన నటన సహజంగా ప్రేక్షకులకు కచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉంటుందన్నారు. స్నేహానికి ఉన్న విలువను కృష్ణమ్మ చిత్రంలో చూపించినట్లు తెలిపారు. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ ఉన్నారని కథ పరంగా వారి పాత్ర కూడా ఎంతో అద్భుతంగా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. రఘు కుంచే, అర్చన, నందగోపాల్, లక్ష్మణ్, కృష్ణ తదితరులు చిత్రంలో వారి పాత్రలకు న్యాయం చేశారన్నారు. అనంతరం హీరోయిన్ అర్చన అయ్యర్ మాట్లాడుతూ కృష్ణమ్మ చిత్రంలో తాను పద్మ అనే క్యారెక్టర్ లో కనబడతానని తెలిపారు. క్యారెక్టర్ ప్రేక్షకులకు హత్తుకునే విధంగా ఉంటుందన్నారు.

ఇంద్రకీలాద్రిపై ద్వాదశ ప్రదక్షిణలు



ద్వాదశ ప్రదక్షిణలో దుర్గా మల్లేశ్వరస్వామి



ఆలయ అర్చకులు, సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల పవళింపు సేవ గురువారం నిర్వహించారు. ప్రదోషకాలంలో స్వామి వారికి పంచహారతుల అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగిస్తూ స్వామి వారి ఆలయం చుట్టూ 12 పర్యాయాలు ప్రదక్షిణలు చేశారు. తొలుత దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ ఈవో కేఎస్ రామరావు పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వర శాస్త్రి, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ మూర్తి వేద పండితులు ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. పంచమహావాద్యం, వేదపఠనం, స్తోత్రపఠనం, భేరీ, కొమ్ముబూర, కాంస్యనాదం, వీణానాదం, మురళీనాదం, గానం, నృత్యం, మౌనంతో ఆలయ అర్చకులు, వేద పండితులు ప్రదక్షిణలు నిర్వహించారు. ఆయా ప్రదక్షిణ ప్రాధాన్యత గురించి వేద పండితులు చక్కటి వ్యాఖ్యానంతో భక్తులకు వివరించారు. అధికారులు, సిబ్బందితో పాటు ఉభయ దాతలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని అద్దాల మండపంలో పవళింపు సేవ జరిగింది.

క్లుప్తంగా

11వ డివిజన్‌లో ప్రచారం



పటమట(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ గురువారం పటమటలోని 11వ డివిజన్‌లో దానయ్య బజార్, అచ్చం బజార్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన రాష్ట్ర ప్రభుత్వంలో ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలను, అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత ఆయకు దక్కుతుందని తెలిపారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందాలన్నా, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలన్నా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని)ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

సందడిగా విద్యార్థుల ప్రమోషన్ డే



కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థి జీవితంలో ప్రమోషన్ డే మరిచిపోలేనిదని శ్రీచైతన్య స్కూల్ కృష్ణలంక బ్రాంచ్ ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి అన్నారు. స్కూల్ ఆవరణలో గురువారం విద్యార్థుల ప్రమోషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలు తెలుసుకుని జీవిత లక్ష్యాలను సాధించాలన్నారు. ఫన్‌తో సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.మురళీకృష్ణ, ఆర్ఐ జె.రాజేష్, అకడమిక్ డీన్ ఆర్.రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 500పైగా మార్కులు సాధించిన ముండ్లపాడు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామసర్పంచి గూడపాటి లావణ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. కోలా మహేష్(553), గొర్రెపాటి సృజల(549), దమ్ముల బేబి(505), మందా స్వరూపారాణి(503), కనపర్తి పూజిత(502)కు పగడాల రామారావు ఒక్కొక్కరికి రూ.5 వేలు, పగడాల రవికుమార్ మొదటి ముగ్గురు విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు అందించారు. మందా స్వరూపారాణికి వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు రూ.3వేలు, పూజితకు పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల మధుసూదనరెడ్డి రూ.2వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి అభినందించారు. ఈసందర్భంగా సర్పంచి లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యకు ఏరాష్ట్రంలో లేనివిధంగా ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. పిల్లలకు మనమిచ్చే ఆస్తి విద్య మాత్రమేనని నమ్మి విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషిచేయడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచి గుత్తా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూచి విష్ణు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పెనమలూరు: కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి గురువారం కృష్ణానదిలో శవమై తేలాడు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్‌కు చెందిన జక్కంపూడి నాగరాజు(29) అవివాహితుడు. హౌస్‌కీపింగ్ పని చేస్తాడు. అతని ఇంటి ఎదురుగా ఉండే లాల్‌బీ కోరిక మేరకు బంగారు చెవి బుట్టలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకువచ్చి ఆమెకు ఇచ్చాడు. తాకట్టు పెట్టిన బంగారు చెవి బుట్టల విషయంలో ఆమెకు నాగరాజుకు మధ్య వివాదం తలెత్తడటంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు. గత నెల 15 నుంచి నాగరాజు కనిపించలేదు. కాగా ఈ నెల 22న నాగరాజు సోదరికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. బైక్, ఫోన్, లెటర్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉంచానని మెసేజ్‌లో పేర్కొన్నాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రకాశం బ్యారేజీ వద్దకు వెళ్లి చూడగా బైక్, వస్తువులు ఉన్నాయి. అయితే నాగరాజు కనబడలేదు. దీంతో నాగరాజు తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. అతని కోసం గాలించగా గురువారం కృష్ణనదిలో శవమై కనిపించాడు.

మే 1న జయహో జానపదం

విజయవాడకల్చరల్: దామోదర జానపదం, మామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గాం. దీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జయహో జానపదం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు గురువారం ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గాయకులు జానపద గీతాలను ఆలపిస్తారన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రగతి

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం ప్రగతి సాధించిందని ఆ పార్టీ తూర్పు అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. తూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ పరిధిలోని సీటీఓ కాలనీ, గురునానక్ నగర్ ప్రాంతాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఐదేళ్ల కాలంలో రాష్ట్రం ప్రగతి పథంలో నడిచిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేశారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాయని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు మౌలికాభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉందని అభిప్రాయపడ్డారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తూర్పు నియోజకవర్గం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందిందని తెలిపారు. అన్ని డివిజన్లలో రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతులతో పాటు పార్కులు, కమ్యూనిటీ భవనాలను నిర్మించారన్నారు. ఒక్క 4వ డివిజన్‌లోనే రూ.18 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. కృష్ణలంక ప్రాంతంలో 260 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్ నగరానికి నగిషీగా నిలిచిందని తెలిపారు. జరిగిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని తిరిగి అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు.



నాలుగో డివిజన్‌కరపత్రాలు పంచుతున్న దేవినేని అవినాష్

తూర్పులో వైఎస్సార్ సీపీ జెండా

వచ్చే ఎన్నికల్లో 'తూర్పు'లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని దేవినేని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించామన్నారు. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలతో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రజలంతా వైఎస్సార్ సీపీని గెలిపిస్తారని స్పష్టం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 4వ డివిజన్ అధ్యక్షుడు గల్లా రవికుమార్, కో ఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు, గుంటుపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమం'తో మహిళల జీవితాల్లో వెలుగులు

- ఏ ప్రాంతానికి వెళ్లినా హారతులిచ్చి స్వాగతిస్తున్న ప్రజలు
- చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న వైనం
- 'తూర్పు'లో విశ్వాసం కోల్పోయిన గద్దె రామ్మోహన్
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం అంటున్న ప్రజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు మహిళల్లో జీవితాల్లో వెలుగులు నింపాయనడానికి నిదర్శనం 'తూర్పు' అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్‌కు ప్రచారంలో లభిస్తున్న ఆదరణే. ఏ ఇంటికెళ్లినా ఎదురొచ్చి స్వాగతం పలుకుతూ మహిళలు హారతులిచ్చి ఆశీర్వదిస్తున్నారు. అందుకు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధే సాక్ష్యంగా నిలుస్తోంది. ఏకంగా రూ.650 కోట్లతో చేసిన అభివృద్ధి కళ్లకు కనిపిస్తుండగా, రూ. 924 కోట్లు సంక్షేమ పథకాలు మహిళల జీవితాల్లో వెలుగులు నింపాయి. ఇప్పుడు వాటిని వివరిస్తూ దేవినేని అవినాష్ ప్రచారం చేస్తుండటంతో ఏ ప్రాంతానికి వెళ్లినా అనూహ్య స్పందన లభిస్తుంది.



అవినాష్‌కు ఎన్నికల ప్రచారంలో స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజలతో మమేకం

'తూర్పు' ఇన్‌చార్జిగా నియమితులైనప్పటి నుంచి నాలుగున్నరేళ్లుగా నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారని ఆపద వస్తే భరోసా ఇస్తున్నారని, అవసరమైన సాయం చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. అవినాష్ ప్రచారంలో ఏ ప్రాంతానికి వెళ్లినా నాలుగున్నరేళ్లలో ఆ ప్రాంతంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. అంతేకాదు రానున్న రోజుల్లో ఏమి చేస్తారో కూడా మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన నియోజకవర్గ మేనిఫెస్టోలను అందజేస్తున్నారు.

'గద్దె' చేసిందేమీ లేదు

పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ నియోజకవర్గంలో చేసింది ఏమీ లేదని ప్రజలు అంటున్నారు. మాటలు చెపుతూ మోసం చేయడం ఆయన నైజమంటున్నారు. పదేళ్లు ఏమీ చేయలేదని, రానున్న రోజుల్లో ఏమి చేస్తారో కూడా చెప్పకుండా, ఎదుటి వారిపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గద్దె రామ్మోహన్, ఆయన భార్య అనురాధ ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో సమస్యలు పట్టించుకోని వారికి ఓట్లు అడిగే అర్హత లేదని ప్రజలు అంటున్నారు.

మలేరియా జ్వరాలపై అవగాహన పెంచుకోవాలి



రైల్వే ఆస్పత్రిలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం




కానూరులో ర్యాలీ చేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): మలేరియా జ్వరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రైల్వే ఆస్పత్రి అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయదీప్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం రైల్వే హాస్పటల్ కొత్త ఓపీలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కాలనీల్లో, చుట్టు పక్కల నీరు నిలవకుండా చూసుకోవాలని దీంతో దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. డాక్టర్ పూర్ణచంద్రరావు ప్రజలకు మలేరియా జ్వరం వచ్చినప్పుడు లక్షణాలు ఎలా ఉంటాయి, తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ వి.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.


మధురానగర్(విజయవాడసెంట్రల్): మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జమీల్ అన్నారు. ప్రపంచ మలేరియా డేను పురస్కరించుకుని యూపీహెచ్‌సీ గులాం మొహిద్దీన్‌నగర్‌లోని మలేరియా సబ్ యూనిట్-1 ఆఫీసర్ నగేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమీల్ మాట్లాడుతూ 2027 నాటికి మలేరియా కేసులు లేకుండా చేయడంతోపాటు 2030కి మన దేశంలో మలేరియాను నిర్మూలించడమే లక్ష్యమన్నారు. మలేరియా నివారణ కోసం పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమల లార్వా నిర్మూలన కోసం సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే శివారు ప్రాంతాల్లో నివసించే వారు దోమ తెరలు వినియోగించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో మలేరియా సూపర్‌వైజర్లు నిరీక్షణరావు, గజేంద్ర, హెచ్‌వీ జయలక్ష్మి, మలేరియా సిబ్బంది, యూపీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెనమలూరు: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని కానూరులో గురువారం విద్యార్థులు నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివరాలు తెలుపుతూ మలేరియా వచ్చిన వారికి ఆకస్మాత్తుగా విపరీతమైన జ్వరం, చలితో వణుకు, శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉండటం, చెమటలు పట్టడం, నీరసం, జ్వరం వస్తూ పోతుండటం జరుగుతుందన్నారు. రక్త పరీక్షలు చేయించుకోని మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శారద' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు



బి.తన్విక 1140వ ర్యాంకు



ఎ.సంపత్ 1441 ర్యాంకు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని శారద విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరిలో బి.తన్విక-1140వ ర్యాంకు, ఎ.సంపత్-1441 ర్యాంకు, పి.అస్మిత-3690వ ర్యాంకు, బి.నిత్యశ్రీ-4630వ ర్యాంకు, కె.నాగరాహుల్ ధృవ-5150వ ర్యాంకు, కె.ఉదయ బాలకుమార్-6598వ ర్యాంకులను పొందారని తెలియజేశారు. కేవలం డే స్కాలర్స్ విద్యార్థులతోనే ఇలాంటి ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతున్నామని తెలిపారు. తమ విద్యాసంస్థ నుంచి మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వారిలో 350 మంది ఉత్తమ ర్యాంకులు పొందారని వివరించారు. ఒత్తిడి లేని విలువలతో కూడిన విద్య, విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకులు సలహాలు, సూచనలతో పాటుగా ప్రశాంత వాతావరణం, ఆన్‌లైన్ పరీక్ష ప్రణాళిక విద్యార్థులకు ఇలాంటి ర్యాంకులు పొందడానికి అనుకూలించిన అంశాలని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి పేర్కొన్నారు. ఈ ర్యాంకులు సాధించడానికి కళాశాల మేనేజ్‌మెంట్ విద్యార్థులపై చూపిన వ్యక్తిగత శ్రద్ధ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందని కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యంతో పాటుగా అధ్యాపకులు అభినందించారు.

హోమియో మందుల పంపిణీ

నందిగామ: పట్టణానికి చెందిన సత్య దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం వడదెబ్బ నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు. మండలంలోని మునగచర్ల పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్న 500 మంది వ్యవసాయ కూలీలకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేశారు. సేవా సమితి నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ పటమటలంక ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఎం రంగా పార్క్ ఏరియా, ఆశ్రమం రోడ్డు, కోగంటి వీధి, ట్రెండ్‌సెట్ అపార్ట్‌మెంట్స్‌రోడ్డు, సేవ నికేతన్ రోడ్డు, పరుచూరివారి వీధి, మసాతు రోడ్డు, జాస్తివారి వీధితో పాటు సర్వీస్‌రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

- **లబ్బీపేట(విజయవాడతూర్పు):** మొగల్రాజపురం సెక్షన్ పరిధిలోని లబ్బీపేట విద్యుత్ సబ్‌స్టేషన్ బృందావనకాలనీ ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలోని ఎ కన్వెన్షన్ సెంటర్, పకీరుగూడెం, గ్రీన్‌ల్యాండ్స్ ఏరియా, ఎప్లానిక్స్ రోడ్డు, సింధుభవన్ రోడ్డు, సిరీస్‌రాజు రోడ్డు, మాదినేని వెంకటేశ్వరరావు రోడ్డు. బృందావనకాలనీ, నందమూరి రోడ్డులో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

గిరిపురంలో...

గిరిపురం ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బీవీ సుధాకర్ తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలోని శిఖామణిసెంటర్, గిరిపురం, ఉడ్‌పేట, వాటర్ ట్యాంక్ రోడ్డు, బ్లెస్సింగ్ చర్చి ఏరియా, గాస్పెల్ హాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కొనసాగుతున్న కల్యాణ మహోత్సవాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పర్యవేక్షణలో సప్తకలశ స్నాపనం, హోమం, బలిహరణ, వసంతోత్సవం, చక్రతీర్థం, మహానివేదన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో నూతక్కి సాంబశివరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తిరునాళ్ల

ఉంగుటూరు: తేలప్రోలులో రంగమ్మ పేరంటాల తిరునాళ్ల మూడో రోజైన గురువారం వైభవంగా కొనసాగుతున్నాయి. పరిసర గ్రామాల నుంచి భక్తులు ప్రభ బండ్లతో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి తమ మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. అర్ధరాత్రి అమ్మవారి ఊయల ఊగే కార్యక్రమం ఆ సమయంలో భక్తులు ఆలయం వద్దకు చేరుకుని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని తిలకించారు. తిరునాళ్లను జక్కా వారసులు పర్యవేక్షించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

పెనమలూరు: కానూరు షాంరాక్ ఇంటర్నేషనల్ పాఠశాలలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాలలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సొంగా రత్నమంజుల చిన్నారులకు పట్టాలు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు ఆటపాటలతో పాటు విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.సుమన్‌త్యాగరాజు, అధ్యక్షురాలు మౌనికాసుమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ భారతీధర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచి చేసిన వారిని గెలిపించండి

లబ్బీపేట(విజయవాడతూర్పు): మంచి చేసిన వారిని గెలిపించాలని కేశినేని శ్రీనివాస్ కుమార్తె హైమా, అవినాష్ సతీమణి దేవినేని సుధీర కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్‌ల విజయాన్ని కాంక్షిస్తూ వారి కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కేశినేని శ్రీనివాస్ కుమార్తె హైమా, అవినాష్ సతీమణి దేవినేని సుధీర గురువారం 8వ డివిజన్‌లోని కంచుకోట వారివీధిలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రజలకు మంచి చేసిన మంచి మనసున్న వారిని గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు.

9వ డివిజన్‌లో..

పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్, దేవినేని అవినాష్‌ల విజయాన్ని కాంక్షిస్తూ అవినాష్ సోదరి క్రాంతి గురువారం 9వ డివిజన్‌లో ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా ఆమె చెన్నుపాటి రామకోటయ్య వీధి, వల్లూరు కేశవరావు వీధి, సీతారామనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. నియోజకవర్గంలో అభివృద్ధి ఎవరు చేసారో గుర్తించి ఓట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, 9వ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, అధ్యక్షుడు గద్దె కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.



8వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కేశినేని హైమా, దేవినేని సుధీర



9వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న దేవినేని క్రాంతి

దుర్గగుడిపై నేడు నూతన యాగశాలలో పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నూతనంగా నిర్మించిన యాగశాలలో శుక్రవారం పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునే దారిలో రాధాకృష్ణుల విగ్రహం వద్ద సుమారు 250 గజాల్లో యాగశాల నిర్మించారు. రెండు నెలల్లో పూర్తైన యాగశాలను దాత సంగా నరసింహారావు రూ. 5 కోట్లతో నిర్మించారు. దీనికి అవసరమైన రాతి స్తంభాలు, చప్పురాయి, రాతి భీములు, పాదికలను క్వారీ వద్దే తయారు చేసి క్రేన్ సాయంతో కొండపైకి చేర్చారు. గురువారం యాగశాలను దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో యాగశాల ప్రారంభోత్సవం జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. తొలుత పుణ్యాహవచనం, గణపతి పూజ, మండపారాధన, చండీ మూలమంత్ర హోమం నిర్వహిస్తారు. యాగశాల తుది మెరుగులు దిద్దేందుకు చిన్న పాటి పనులు మిగిలి ఉండగా, మరో నాలుగు నెలల పాటు మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుక్రవారం ముహూర్తాన్ని ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ ఖరారు చేసింది. దీంతో యాగశాల వద్ద పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపున ఘాట్ రోడ్డులోని సమాచార కేంద్రం వద్ద డోనర్ సెల్ భక్తులకు శుక్రవారం నుంచే అందుబాటులోకి రానుంది. అమ్మవారికి విరాళాలు ఇచ్చే భక్తులు, దాతలు సౌకర్యార్థం సెల్‌ను ఏర్పాటు చేశారు.



అమ్మవారి సన్నిధిలో అందుబాటులోకి వచ్చిన యాగశాల

స్వరఝురి సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలి

విజయవాడకల్చరల్: స్వరఝురి సంస్థ నిర్వహించే సంగీత కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలని సంగీత విద్వాంసుడు కొంమాండూరి శేషాద్రి అన్నారు. స్వరఝురి సంగీత సంస్థ 36వ వార్షిక వేడుకలు, సంగీత విద్వాంసులకు వార్షిక పురస్కారాలు, వాయిలీన త్రయం సంగీత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. శేషాద్రి మాట్లాడుతూ స్వరఝురి సంగీత సేవలను కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రికి స్వరఝురి, చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోనరావుకు లయ ప్రవీణ బిరుదును ప్రదానం చేశారు. సంగీత కార్యక్రమంలో భాగంగా కొంమాండూరి శేషాద్రి, కొంమాండూరి అనంత శౌరిరాజన్, డాక్టర్ కొంమాండూరి వెంకటకృష్ణ వయోలిన్‌పై శ్రీ రాఘవంతో ప్రారంభించి మహాగణపతిం, గాన మూర్తి, జ్ఞాన మొసగరాదా, దొరుకునా ఇటువంటి సేవ కీర్తనలను పలికించారు. బీవీఎస్ ప్రసాద్, ఎమ్ హరి బాబు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.




సంగీత కచేరీ నిర్వహిస్తున్న సంగీత విద్వాంసులు

కనులపండువగా శివకల్యాణం



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా గురువారం శివకల్యాణం కనులపండువగా జరిగింది. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి దంపతులు కల్యాణం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు శివకల్యాణంలో పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ మరకత శివలింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరకత శివలింగం ప్రతిష్ఠతో బుధుడి ఆశీస్సులు లభిస్తాయని ధనయోగం కలుగుతుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ అమ్మవారి తిరునాళ్ల



విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం మూడో రోజు గురువారం కొనసాగింది. జలబిందెలు, పూలకప్పెర, ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి. బుధవారం రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. జానపద డప్పులు, కనకతప్పెట్లు, శక్తివేషాలు, విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ వై. సీతారామయ్య పర్యవేక్షించారు.

BEFORE THE HON'BLE IV SPECIAL MAGISTRATE AT VIJAYAWADA
C.C.No.103/ 2020

Between:
Vemula Venkata Ramana
S/o. Jalachandra rao
Seeta Ramapuram, Vijayawada
..... Complainant
And
Vangara Pavan Kumar,
S/o. SyamSundhar, D.No. 40-6/1-12,
Veerabhadra Nilayam, Moghalrajapuram, Vijayawada-10.
..... Accused

[illegible] Accused [illegible] Vangara Pavan Kumar, S/o. SyamSunchar, [illegible] NBW [illegible] Warrant Execution Advocate Commissioner [illegible] accused [illegible] Vangara Pavan Kumar, S/o. Syam Sundhar Upscand [illegible] Section 82 crpc [illegible] warrant [illegible] Accused [illegible] (Proclamanation) [illegible] Abscend [illegible]

MATHI SYAM, M.com, LL.B, Advocate,
D.No. 30-9-7, FF2, AB Humes,
Namburi Var Street, Durga Agraharam,
VIJAYAWADA-2. Cell: 9297051565.
VIJAYAWADA, 24.04.2024

అసలే కోతి...ఆపై కల్లు తాగిందన్నట్లు...అసలే రామోజీ...ఆపై ఒంటిపై టీడీపీ పూనింది... ఆ పూనకంలో ఒళ్లు మరిచి తానేం రాస్తున్నారో...ఏమాలోచిస్తున్నారో...తెలియని అజ్ఞానంలో రాసిన తప్పుడు కథనాలను తిరగరాయిస్తూ...ఏదో విధంగా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలన్న దుష్ట సంకల్పంలో ఉన్నారీ పచ్చ చొక్కా రాతలను అచ్చోసినట్లు జనం లోకి వదిలేస్తున్నారు..

ఉన్మత్త రాతల రామోజీకి

పూనకాలు లోడింగ్!

ప్రభుత్వంపై ఈనాడు మత్తు రాతల దుష్ప్రచారం

సింగిల్ కాలమ్ వార్తలో అయినా ఎవరిపైనైనా ఆరోపణలు చేస్తే... వివరణ లేనిదే ప్రచురించే రోజులు మరిచిపోయిన ఈ మేధావి..వయసు తెచ్చిన చిత్తచాంచల్యంతో ...వ్యక్తిత్వ హననంతో చిత్తమొచ్చిన రీతిలో మర్యాద, మన్నన లేని గ్రాఫిక్ కేరికేచర్లతో వైఎస్సార్‌సీపీపై నిష్ఠ దరిద్రపు కథనాలను వెలువరిస్తున్నారు. పాత్రికేయం అంటే ఇంత నీచంగా ఉంటుందా?..ఇంతకు దిగజారిందా?...ఇంత దురహంకారంతో రాస్తుందా?...అని పాఠకులు నివ్వెరపోయే కథనాలు అచ్చోసి, తన కుసంస్కారాన్ని రామోజీ సిగ్గూఎగ్గులను వదిలేసి బట్టబయలు చేసుకుంటున్నారు...బాబు హయాంలో పెంచి పోషించిన గంజాయి వనాలు ఇంతలింతలుగా రాష్ట్రాన్ని కమ్ముకుంటే ఒక్క సారైనా బాబుకు వ్యతిరేకంగా వార్తలు రాయని ఈ పక్షపాత పాత్రికేయానికి ఇప్పుడు జగన్ ప్రభుత్వం గంజాయిని సమూలంగా నిర్మూలిస్తుంటే నచ్చడం లేదు...అందుకే 'ఊరూరా మాదక ద్రవ్యాలతో మత్తెక్కిన ఆంధ్రా' ...శీర్షికన బుధవారం ఒక ఉన్మత్త కథనాన్ని పునర్ముద్రించారు...నెలలో రెండు మూడుసార్లయినా ఒకే అంశంపై ఈ అబద్ధాల బాగోతాన్ని కొనసాగించడం రామోజీకి అలవాటైపోయింది...ఈ సాగు నిరోధానికి గిరిజనుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్‌ను కేంద్రం ప్రశంసించిందన్న నిజమైనా రామోజీకి తెలుసో లేదో...వెర్రివాళ్ల గురించి వినడమే తప్ప చూడలేదని ఓ సినిమాలో డైలాగు రామోజీకి సరిపోతుంది...ఆపరేషన్ పరివర్తన్ ద్వారా రాష్ట్రంలో గంజాయి దందాను ధ్వంసం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఘనతను మరోసారి గుర్తు చేసేందుకే ఈ ఫ్యాక్ట్ చెక్....

సాక్షి, అమరావతి

పిచ్చి ముదిరి రోకలి తలకు చుట్టమన్నాట్ట వెనకటికి ఎవరో... ప్రస్తుతం ఈనాడు రామోజీ రావు పరిస్థితి సరిగ్గా అలానే ఉంది. ఎన్నికల్లో టీడీపీ చిత్తు చిత్తుగా ఓడిపోతోందన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక రామోజీరావుకు మంట నషాళానికి కెక్కుతోంది. లేనిది ఉన్నట్టుగా.... ఉన్నది లేనట్టుగా భ్రమపడుతూ తలతిక్క రాతలతో పాత్రికేయాన్ని అధఃపాతాళానికి దిగజార్చేశారు. హైదరాబాద్ శివార్లలో ఆక్రమించి కొండ మీద కట్టుకున్న అక్రమ భవంతిలో రాత్రిళ్లు నిద్రపట్టక పాత్రికేయ అఘోరా అవతారం ఎత్తి హుశ్శరభ అంటూ పూనకాల లోడింగ్‌లో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎంతటి విషం కక్కుతున్నా... పిచ్చి రాతలు, కారుకూతలతో ఈనాడు పత్రికను తాను నింపేస్తున్నా ప్రజలు ఎందుకు నమ్మడం లేదంటూ రామోజీ బుర్ర బద్దలు కొట్టుకుంటూ కరాళ నృత్యం చేస్తున్నట్టుగా ఉంది. పిచ్చో... భ్రాంతో...భయమో తెలియని అపస్మారక స్థితిలో ఈనాడు పత్రిక నిండా మరోసారి గంజాయి మత్తు రాతలు రాసేశారు...నిజాలనేవి ఎప్పుడూ చేదుగానే ఉంటాయి కనుక ఆ ఉన్మత్త రాతల మత్తును వదిలించే వాస్తవాలివి...

చంద్రబాబు హయాంలోనే గంజాయి దందా వ్యవస్థీకృతం...

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే గంజాయి దందా వ్యవస్థీకృతమైందన్న వాస్తవాన్ని దాచలేరు... బాబు ముఠా సభ్యుడైన అయ్యన్న పాత్రుడి కనుసన్నల్లోనే నర్సీపట్నం కేంద్రంగా అంతర్రాష్ట్ర గంజాయి సిండికేట్ నడిచిందన్న నిజాన్ని కప్పిపుచ్చలేరు. రాష్ట్రంలో వేళ్లూనుకున్న గంజాయి దందాను సీఎం జగన్ కూకటి వేళ్లతో సహా పెకలించివేశారన్న నిజాన్ని ఈనాడు చెప్పకున్నా రాష్ట్రం మొత్తానికీ తెలుసు. అందుకోసం ప్రత్యేకంగా నెలకొల్పిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సాధించిన విజయాలు యావత్ దేశానికీ తెలుసు... ఆపరేషన్ పరివర్తన్‌తో ముఖచిత్రం మారిన మన్యానికీ తెలుసు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో తమ జీవితాల్లో వచ్చిన నవోదయం గిరిజనులకు తెలుసు...ఏపీ గుండా గంజాయి స్మగ్లింగ్ చేయాలంటే వణికిపోతున్న ఇతర రాష్ట్రాల స్మగ్లర్లకూ తెలుసు...ఇందరికీ తెలిసిన సంగతి రామోజీకి ఒక్కరికే తెలియనంత అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారు...

చంద్రబాబు ముఠా... గంజాయి దందా...

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే ఆయనకు అత్యంత సన్నిహితులైన టీడీపీ కీలక నేతలు నర్సీపట్నం కేంద్రంగా గంజాయి సిండికేట్‌ను నిర్వహించారు. అప్పట్లో ఉత్తరాంధ్రలో అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో యథేచ్ఛగా గంజాయి సాగు చేయించారు. నాటి ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఒకరు ఈ గంజాయి దందాకు పూర్తి అండదండలు అందించారు. అప్పట్లో టీడీపీ రాజ్యసభ సభ్యుడికి సమీప బంధువైన ఆయన గంజాయి సాగుకు అడ్డంకులు లేకుండా ఉండేందుకు ఓ వితండవాదాన్ని సమర్థంగా తెరపైకి తెచ్చారు. గంజాయి సాగును అడ్డుకుంటే గిరిజనులు నక్సలైట్లకు అనుకూలంగా మారతారన్న మూర్ఖపు వాదనతో ఆ సాగును వటవృక్షం చేసిందే బాబు. పర్యవసానంగా...విశాఖపట్నం ఏజెన్సీలో వేలాది ఎకరాల్లో గంజాయి సాగు యథేచ్ఛగా సాగిపోయింది. దీన్ని నర్సీపట్నంలోని టీడీపీ సిండికేట్ నేతలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు సరఫరా చేసేవారు. అందుకోసం ప్రత్యేకంగా వ్యవస్థీకృత కొరియర్ వ్యవస్థను సైతం ఏర్పాటు చేశారు. ఏపీని గంజాయి దందాకు గేట్‌వే మార్చి...చంద్రబాబు ముఠా వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టి తమ ఖజానాను నింపేసుకుంది. తమ ప్రభుత్వ హయాంలో గంజాయి దందా సాగుతోందని అప్పటి మంత్రి అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావులే గతంలో పత్రికాముఖంగా అంగీకరించడం గమనార్హం.

- గంజాయి దందాను వ్యవస్థీకృతం చేసిందే బాబు
- నాడు టీడీపీ నేతల గంజాయి సిండికేట్
- నేడు ఈ దందాపై జగన్ ప్రభుత్వ ఉక్కుపాదం
- 11,550 ఎకరాల్లో గంజాయి ధ్వంసం
- అంతర్రాష్ట్ర గంజాయి నెట్‌వర్క్ నేలమట్టం
- 'ఆపరేషన్ పరివర్తన్' విజయవంతం
- గిరిపుత్రుల జీవితాల్లో ఉపాధి వెలుగులు
- జాతీయ స్థాయిలో ఏపీ ప్రభుత్వానికి ప్రశంసలు

గంజాయి దందాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉక్కుపాదం..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి దందాపై ఉక్కుపాదం మోపింది. ఈ సాగును నిర్మూలించాలని సీఎం జగన్ పోలీసు యంత్రాంగాన్ని విస్పష్టంగా ఆదేశించారు. గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా దందాను తుదముట్టించేందుకు ప్రత్యేకంగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ఏర్పాటు చేసి, ఈ బ్యూరోకు విస్తృత అధికారాలు కల్పించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో 'సెబ్' గంజాయి సాగును నిర్మూలించేందుకు 'ఆపరేషన్ పరివర్తన్' కార్యక్రమాన్ని చేపట్టింది. ఉత్తరాంధ్రతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ రెండు దశల్లో నిర్వహించిన ఆపరేషన్ పరివర్తన్ విజయవంతమైంది.

ఆపరేషన్ పరివర్తన్ విజయవంతం...

ముందుగా గంజాయి సాగు వల్ల అనర్థాలపై ఆపరేషన్ పరివర్తన్ ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో విస్తృత అవగాహన కల్పించింది. పోలీసు, రెవెన్యూ, సెబ్, గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. ఈ పంట సాగు నిర్మూలన కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. శాటిలైట్ ఫొటోలతో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంత్రాన్ని జియో మ్యాపింగ్ చేశారు. అనంతరం ప్రత్యేక యంత్రాలతో సాగును ధ్వంసం చేశారు. రెండు దశల్లో ఏకంగా 11,550 ఎకరాల్లో పంటను ధ్వంసం చేశారు. ఏకంగా 4.50 కోట్ల గంజాయి మొక్కలను తొలగించి దహనం చేశారు. ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సాగు చేస్తున్న గంజాయిని ఆంధ్రప్రదేశ్ గుండా అక్రమ రవాణాను చేయనివ్వకుండా పోలీసు యంత్రాంగం సమర్థంగా అడ్డుకుంటోంది. ప్రత్యేకంగా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఇతర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 4.50 లక్షల కేజీల గంజాయి, 131 లీటర్ల ద్రవ రూప గంజాయిని స్వాధీనం చేసుకుంది. 13,210 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 2,950 వాహనాలను జప్తు చేసింది.

ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం...

గంజాయి సాగు జాడ్యం మన రాష్ట్రానికే పరిమితమైన అంశం కాదు. ఏపీ, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో విస్తరించిన దండకారణ్యం అంతటా దశాబ్దాలుగా వేళ్లూనుకుంది. సరిహద్దులకు అవతల ఉన్న ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల పరిధిలోని దండకారణ్యంలో ఈ సాగు కొనసాగుతోంది. ఏపీ పోలీసు శాఖ ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాలతో విశాఖపట్నంలో ప్రత్యేక సదస్సు నిర్వహించి గంజాయి స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు ఉమ్మడి కార్యాచరణ చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించింది. మరోవైపు ఒడిశా, చత్తీస్‌ఘడ్‌లలో పండించిన గంజాయిని ఆంధ్రప్రదేశ్ గుండా స్మగ్లింగ్ చేయకుండా కట్టడి చేసింది. అందుకోసం అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతోపాటు ఉత్తరాంధ్ర నుంచి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వరకు సెబ్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ గంజాయి స్మగ్లింగ్‌ను అడ్డుకున్నారు.

నెట్‌వర్క్ నేలమట్టం...

అంతర్రాష్ట్ర గంజాయి నెట్‌వర్క్‌ను ఏపీ ప్రభుత్వం నేలమట్టం చేసింది. తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 14వేల మంది గంజాయి పెడ్లర్లను సెబ్ గుర్తించింది. వారిపై నిఘా పెట్టి ... విస్తృతంగా దాడులు నిర్వహించి ఇప్పటికే 9 వేల మందికిపైగా అరెస్ట్ చేసింది. ఏవోబీలో వారి ఏజంట్ల వ్యవస్థను నిర్మూలించింది. 1,883 మందిపై హిస్టరీ షీట్లు తెరిచింది. వారి కదలికలపై సదా నిఘా కొనసాగిస్తోంది. ఇది కాకుండా 239 మందిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టింది.

నాడు ఉదాసీనం.. నేడు కఠినంగా అణచివేత..

ఎక్కడైనా దొంగలు దోచుకున్న సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకుని దొంగలను అరెస్ట్ చేస్తే ఆ పోలీసు శాఖ సమర్థంగా పనిచేస్తున్నట్టుగా పరిగణిస్తారు. అలానే ఇతర రాష్ట్రాల్లో పండించి స్మగ్లింగ్ చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుంటే...నిందితులను అరెస్ట్ చేస్తే ఆ ప్రభుత్వం సమర్థంగా పని చేస్తున్నట్టు లెక్క. ఈనాడు దీన్ని వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు రాసిన తప్పుడు కథనాన్నే పునర్ముద్రిస్తూ ఇన్నిసార్లు ప్రచురిస్తున్నాం కనుక ఒక్కసారైనా జనం నమ్మకపోతారా? అనే వెర్రితనంలో రామోజీ ఉన్నట్లున్నారు. ఓ వైపు రాష్ట్రంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుంటుంటే...దాన్ని పట్టించుకోకుండా ....రాష్ట్రం గంజాయి వనంగా మారిపోతోంది... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి దందాను ప్రోత్సహిస్తోందని దుష్ప్రచారం చేయడం రామోజీ దిగజారుడు పాత్రికేయానికి నిదర్శనం. మరి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇంత పెద్దమొత్తంలో గంజాయిని ఎందుకు జప్తు చేయలేదో , ఎందుకు తగలబెట్టలేదో రామోజీనే చెప్పాలి. ఎందుకంటే అప్పట్లో గంజాయి దందా టీడీపీ నేతల కనుసన్నల్లోనే సాగేది. తద్భిన్నంగా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి సాగు, స్మగ్లింగ్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కంకణం కట్టుకుంది. అందుకే విస్తృతంగా దాడులు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో గంజాయి సాగును నిర్మూలించింది. ఇతర రాష్ట్రాల్లో సాగు చేస్తూ మన రాష్ట్రం గుండా అక్రమ రవాణా చేస్తున్న గంజాయిని భారీగా స్వాధీనం చేసుకుంటున్నారు. వాహనాలనూ జప్తు చేశారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేశారు. ఈ దందాకు తరచూ పాల్పడుతున్నవారిపై పీడీ యాక్ట్‌కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడుతున్నారు.


ఊరూరా మాదక ద్రవ్యాలతో... మత్తెక్కిన ఆంధ్రా!

గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం

రూ. 144 కోట్లతో ఆపరేషన్ నవోదయం

దశాబ్దాలుగా జీవనోపాధి లేక గంజాయి సాగుపై ఆధారపడుతున్న గిరిజనుల జీవితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త వెలుగులు తెచ్చింది. ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా వారిని ప్రోత్సహించింది. అందుకోసం రూ.144 కోట్లతో ఆపరేషన్ నవోదయం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. కాఫీ, రాగులు, జొన్నలు, రాజ్మా, మామిడి, కొబ్బరి, నిమ్మ, జీడి మామిడి, వేరుసెనగ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించింది. ఇందులో భాగంగా ఉచితంగా విత్తనాలను సరఫరా చేయడంతో పాటు ఇ–క్రాపింగ్ ద్వారా అన్నిరకాల పథకాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ సహకారంతో గిరిజనులు మొదటి దశలో 7,328 ఎకరాల్లో, రెండో దశలో 10,290 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టారు. ఇక 50 వేల ఎకరాలపై ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేసి 1,13,000 మంది గిరిజన రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగించింది.

ఆపరేషన్ పరివర్తన్‌కు కేంద్రం ప్రశంస...

గంజాయి దందాను నిర్మూలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు జాతీయస్థాయిలో ప్రశంసలు లభించాయి. ఏపీ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్‌ను కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ అభినందించింది. ప్రత్యేక పరిశీలకులను పంపించి ఆపరేషన్ పరివర్తన్ పై అధ్యయనం చేయించింది. గంజాయి సాగును సమర్థంగా అడ్డుకున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ మొదటిస్థానంలో నిలిచిందని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీద గంజాయి సాగు ధ్వంసంలో ఏపీ మొదటిస్థానంలో ఉందని పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది.

ఏడాది	కేసులు	అరెస్టులుచేసిన నిందితులు	జప్తు చేసిన గంజాయి(కేజీల్లో)	జప్తు చేసిన వాహనాలు
2020	985	2,719	1,13,105	590
2021	2,129	5,237	2,25,521	990
2022	1,699	4.537	1,24,977	760
2023	1,888	7,364	54,913	870
2024 (మార్చి వరకు)	87	303	6,291	77
మొత్తం	6,788	20,160	5,24,807	3,287

గంజాయి సాగు ధ్వంసం (ఎకరాల్లో)

2021	2022	2023
8,815	2,337	398

మొత్తం 11,550



దహనం చేసిన గంజాయి

2022, ఫిబ్రవరిలో: 2 లక్షల కేజీలు
2022, డిసెంబర్‌లో: 3.33 లక్షల కేజీలు
మొత్తం: 5.33 లక్షలకేజీలు
పీడీ యాక్ట్ కింద కేసుల నమోదు: 239
ఛేదించిన అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్ల నెట్‌వర్క్: 14వేలు

ప్రత్యామ్నాయ పంటల సాగులో ప్రోత్సాహం

2021-22	7,328 ఎకరాలు
2022-23	10,290 ఎకరాలు
మొత్తం	17,618 ఎకరాలు

గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ

పంపిణీ చేసిన భూమి	50వేల ఎకరాలు
లబ్ధిపొందిన గిరిజనులు	1,13,000

ఇదిగో సాక్ష్యాలు...

రాష్ట్రంలో గంజాయి దందా లేనే లేదు... ఒడిశా, చత్తీస్‌ఘడ్‌లలో పండించిన గంజాయినే రాష్ట్రం గుండా అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ఆ గంజాయి ముఠాలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అందుకు తార్కాణం... సెబ్ అరెస్ట్ చేసిన ఎంతోమంది అంతర్రాష్ట్ర స్మగ్లరలో మచ్చుకు కొందరి వివరాలు ఇవిగో...

- ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతంలో సాగు చేస్తున్న గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన గోపీ నాయక్, ఖెముడు సీతారామ్‌లను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న 1,700 కేజీల గంజాయిని జప్తు చేశారు.
- ఒడిశాలోని కొరాపుట్ జిల్లా నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన సుభాష్ చంద్ర పంగిని 2022, ఏప్రిల్‌లో అరకులో అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అతన్నుంచి 680 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఒడిశాలోని నందపూర్ బ్లాక్ పరిధిలో సాగు చేసిన గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన జ్ఞానేశ్వర్ బారిక, ఘేనూ కుంభర్‌లు 2022, జూన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో అరెస్ట్ చేశారు. వారి నుంచి 684 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో సాగు చేసిన గంజాయిని ఆ రాష్ట్రానికి చెందిన గోపాల్ గుంథ, షేక్ అజహర్ మహమూద్‌లు స్మగ్లింగ్ చేస్తుండగా అల్లూరి సీతారామరాజుజిల్లా పెదబయలులో 2024, జనవరి 13న అరెస్టు చేశారు. వారి నుంచి 630 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- ఒడిశాలోని నవరంగపూర్ నుంచి గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఆ రాష్ట్రానికి చెందిన ప్రమోద కుమార్, కైలాస్ బాత్రాలను 2022, జూన్‌లో అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 560 కేజీల గంజాయిని జప్తు చేశారు.

పచ్చ 'సుస్తీ'.. పరువు నాస్తి

(నాడు)

'ఎన్టీఆర్ హెల్త్ కార్డ్‌ను ప్రారంభిస్తాం. ఈ కార్డుతో ఆరోగ్యశ్రీ జాబితాలోని వ్యాధులకు అదనంగా మరికొన్ని ముఖ్యమైన వ్యాధులను చేర్చి ఏడాదికి రూ.2.5 లక్షల వరకూ డబ్బు చెల్లించకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య సేవల సౌకర్యం కల్పిస్తాం'.

2014 ఎన్నికల సమయంలో టీడీపీ మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీ. 2014లో అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీలోకి అదనంగా చేర్చిన జబ్బులు నామమాత్రం. 2014–19 మధ్య పథకం కోసం ఖర్చు చేసింది రూ. 5,171.29 కోట్లు. అప్పట్లో పథకం పరిధిలో 1,059 ప్రొసీజర్లు, 748 నెట్‌వర్క్ ఆస్పత్రులు మాత్రమే.

(నేడు)

'ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేస్తాం. రూ. వెయ్యి వైద్యం ఖర్చు దాటే ప్రతి జబ్బును పథకంలోకి తీసుకుని వస్తాం. రూ.5 లక్షల్లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలను పథకం పరిధిలోకి తెస్తాం. ఎంత ఖర్చయినా చికిత్స అందిస్తాం.'

2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీ. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచింది. హామీ ప్రకారం రూ.5 లక్షల ఆదాయంలోపు కుటుంబాలన్నింటినీ పథకం పరిధిలోకి సీఎం జగన్ తీసుకు వచ్చారు. 1,059గా ఉన్న ప్రొసీజర్‌లను 3,257కు పెంచారు. నెట్‌వర్క్ ఆస్పత్రులను విస్తరించారు. చికిత్సానంతరం విశ్రాంత సమయాన భృతి అందించారు. ఇలా ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం రూ.14,887 కోట్లు ఖర్చు చేశారు.

ఆరోగ్యశ్రీ పడకేసింది మీ బాబు పాలనలోనే రామోజీ

- ఈ ప్రభుత్వంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి జవసత్వాలు
- ప్రొసీజర్లు 3,257కు, నెట్‌వర్క్ ఆస్పత్రుల పెంపు
- పక్క రాష్ట్రాల ఆస్పత్రుల్లోనూ మెరుగ్గా చికిత్సలు
- ఉచిత వైద్యమంటూ గద్దెనెక్కింది ఎవరో మీకు తెలియదా ?
- పేదల పాలిట నయవంచకుడు బాబు కాదా ?
- నామమాత్రంగా 1,059 ప్రొసీజర్లు, 748 నెట్‌వర్క్ ఆసుపత్రుల నిర్వహణ

సాక్షి, అమరావతి: ఈ రెండు అంశాలను క్షుణ్ణంగా గమనిస్తే చాలు.. ఇంగితం ఉన్న ఎవరికైనా పేదలను వచించింది ఎవరో స్పష్టంగా తెలుస్తుంది. పసుపు కామెర్ల రోగంతో పేట్రేగిపోతున్న రామోజీరావు ఆరోగ్యశ్రీ అమలు విషయంలో సీఎం జగన్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. పథకాన్ని అంపశయ్య ఎక్కించి పేదల ఉసురు తీసిన బాబు వైఫల్యాలను కప్పి పుచ్చి సమర్థంగా వైద్య సేవలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారు. ఇందులో భాగంగా 'పేరుకే పెంపు.. ఊకదంపు' అంటూ ఈనాడులో గురువారం ఓ కథనం రాసుకొచ్చారు. ఉచిత వైద్యమంటూ పేదోళ్లను జగన్ వచించారని తప్పుడు ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో వాస్తవాలను పరిశీలిస్తే..

బాబు పాలనలోనే అస్వస్థత

ఆరోగ్యశ్రీ పథకం కష్టాల్లో కొట్టుమిట్టాడింది చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే. అప్పట్లో ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కేవలం 1,059 ప్రొసీజర్లతో అరకొర ఆస్పత్రుల్లో నామమాత్రంగానే కొనసాగించారు. ఆ నాడు పేదల అరణ్య రోదన రామోజీ కంటికి ఏ మాత్రం కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ఆరోగ్యశ్రీకి నిధులు, ప్రొసీజర్లు, నెట్‌వర్క్ ఆస్పత్రులు పెంచారు. పక్క రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారికి కూడా ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. బాబు పాలనలో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో కేవలం 72 ఆస్పత్రుల్లో క్యాన్సర్, కార్డియాలజీ, పీడియాట్రిక్ సేవలు బొటాబొటిగా అందేవి. అలాంటిది ప్రస్తుతం 204 ఆస్పత్రుల్లో 17 సూపర్ స్పెషాలిటీల్లో ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. కానీ పరిమితంగా సేవలు అందించారని ఈనాడులో రోత రాతలు రాయడం దిగజారుడు తనానికి నిదర్శనం.


పేరుకే పెంపు.. ఊకదంపు

ఈహెచ్‌ఎస్‌కు రూ.1427.39 కోట్లు

ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) కింద వైద్య సేవల్లో ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు చుక్కలు చూపించారని ఆరోపించారు. కాగా గత టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం ఈహెచ్‌ఎస్ కింద వైద్య సేవలకు అదనంగా నిధులు ఖర్చు చేసింది. 2014–19 మధ్య రూ.976 కోట్లు ఖర్చు చేసి 3.17 లక్షల మందికి వైద్య సేవలు అందించగా, 2019 నుంచి ఇప్పటి వరకూ రూ.1,427.39 కోట్లు ఖర్చు చేసి 4.29 లక్షల మందికి చికిత్సలు చేశారు. అదే విధంగా 46 క్యాన్సర్ ప్రొసీజర్‌లను ఈహెచ్‌ఎస్‌లోకి చేర్చారు. గత ప్రభుత్వంలో ఈ 204 ప్రొసిజర్స్‌ను రీయింబర్స్‌మెంట్ జాబితా నుంచి తొలగించారు. ఈ ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చి.. రూ.2 లక్షల పైబడిన 25 ప్రొసీజర్స్‌లో కూడా మెడికల్ రీయింబర్స్‌మెంట్ చేసుకునేలా అవకాశం కల్పించింది. మరోవైపు నాలుగు డెంటల్ ప్రొసీజర్ ధరలను పెంచారు. ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులకు కన్సల్టేషన్, మెడికేషన్, డయగ్నోస్టిక్స్, రెఫరల్ సేవల కోసం ఆయా ఏరియా ఆస్పత్రుల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేయనున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. చంద్రబాబు పాలనలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్‌లు నిర్వీర్యమైన తీరును దాచిపెట్టి రామోజీ జర్నలిజం విలువలను తగ్గిస్తున్నారు.

రోగుల సంతృప్తే ప్రామాణికం

ఈ పథకం కింద వైద్య సేవల్లో అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారని రామోజీ ఆరోపించారు. ఈ తరహా అదనపు వసూళ్ల టీడీపీ హయాంలోనే ఉండేవి. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పథకం కింద ఉచిత సేవలకు నిరాకరించినా, అదనపు వసూళ్లకు పాల్పడినా పట్టించుకునే వారు కాదు. ప్రస్తుతం రోగుల సంతృప్తి ప్రామాణికంగా పథకం అమలుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో భాగంగా 104 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే డిశ్చార్జి సమయంలో ఆస్పత్రిలో అదనపు వసూళ్లు, వైద్య సేవలు, వసతులు ఇలా వివిధ అంశాలపై అభిప్రాయ సేకరణ చేపట్టి, రోగులు సంతృప్తి చెందితేనే ఆస్పత్రులకు బిల్లు చెల్లింపులు చేపట్టారు. రోగులు ఇళ్లకు వెళ్లాక మరోసారి ఏఎన్‌ఎంలు వెళ్లి రెండో విడత అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడైనా అదనపు వసూళ్లకు పాల్పడినట్టు వెల్లడైతే ఆయా ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ డబ్బును తిరిగి రోగులకు ఇప్పిస్తున్నారు.

ఇంటి వద్దే పింఛన్లు ఇచ్చేలా చూడండి

- ఎన్నికల సంఘానికి సీపీఎం విజ్ఞప్తి
- మే డే ఉత్సవాలకు షరతులతో అనుమతి

సాక్షి, అమరావతి: మే 1న సచివాలయాల వద్ద కాకుండా ఇంటికే వెళ్లి పింఛన్లు ఇచ్చేలా చూడాలని ఎన్నికల సంఘానికి సీపీఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఎండల తీవ్రత కారణంగా సచివాలయాలకు వెళ్లి లైన్లో నిలబడి పింఛన్ తీసుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. మే డే నిర్వహించుకునేందుకు అనుమతివ్వాలని ఈసీని కోరగా.. అందుకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అనుమతిచ్చారని శ్రీనివాసరావు చెప్పారు. మే డే ఉత్సవాలను ఎన్నికల ప్రచారం, ఎన్నికల ఉపన్యాసాలు లేకుండా నిర్వహించుకోవచ్చని, ప్రదర్శనలు, బహిరంగ సభలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అనుమతిచ్చారని చెప్పారు.

పుష్కలంగా టీబీ మందులు

టీబీ కంట్రోల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో క్షయ (టీబీ) రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచామని టీబీ కంట్రోల్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని చోట్ల తగినంత మందుల నిల్వలు ఉన్నాయన్నారు. రోగులు మందులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిల్లోనే మందుల కొనుగోళ్లకు అనుమతులు ఇచ్చామన్నారు. ఇందుకోసం రూ.49 లక్షల మొత్తాన్ని మంజూరు చేసి, జిల్లా సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాకు విడుదల చేశామని పేర్కొన్నారు.

ఫ్యాషన్





పార్టీ వేర్ అనగానే ముందుగా మనకు ఫాస్ట్ ఫ్యాషన్ గుర్తుకు వస్తుంది. కానీ, వేసవి వేడికి భరించలేం అనే ఆలోచన వచ్చిన వెంటనే ఎక్కడలేని నీరసం వచ్చేస్తుంది. సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్‌తో పార్టీవేర్‌ను రెడీ చేసుకుంటే.. మరీ సంప్రదాయ బద్ధంగా ఉంటాం అనుకునే నవతరపు ఆలోచనను దృష్టిలో పెట్టుకొని రెట్రో లుక్‌తో ఏ సీజన్‌కైనా స్టైలిష్ లుక్‌తో మెరిసిపోయేలా మల్ చందేరీ, పట్టు, ఫ్లోరల్ కాంబినేషన్స్‌తో చేసిన డిజైన్స్ ఇవి.

సీజనల్ స్టైల్







రెట్రో గులాబీ

చేనేతల నుంచి ఎంచుకున్న ప్లెయిన్ మల్ చందేరీ, పట్టుతో డిజైన్ చేసిన డ్రెస్సులు ఇవి. నవతరానికి పాత కాన్సెప్ట్స్‌లో ఉన్న అందాన్ని పరిచయం చేయాలనుకున్నాను. రెట్రో లుక్ వచ్చేలా లాంగ్ అండ్ పఫ్ స్లీవ్స్ డిజైన్ చేశాను. పువ్వులు, పక్షులలో జామెట్రికల్ లైన్స్ వచ్చేలా, తక్కువ ఎంబ్రాయిడరీతో వీటిని తీర్చిదిద్దాను. టీన్స్‌ని ఆకట్టుకునేలా బ్రైట్ కలర్స్‌ని ఎంచుకున్నాను. సమ్మర్‌కి ప్రత్యేక కలెక్షన్ తీసుకురావాలని చేసిన ప్రయత్నం ఇది.

– హేమంత్ సిరి,
ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్





ఈ డిజైన్స్ అన్నీ రెట్రో కాన్సెప్ట్ నుండి ప్రేరణ పొంది తయారు చేసినవే. రెట్రో ఫ్యాషన్ అనేది ఒక మాయా టైమ్ మెషిన్ లాంటిది. గడిచిన కాలాన్ని జ్ఞాపకంగా మళ్లీ మళ్లీ కళ్లముందు నిలుపుతుంది. ఏ కాలంలోనైనా కాలాతీతమైన డిజైన్స్ కొన్ని ఉంటాయి. ఫ్లోరల్ డిజైన్స్ వందల కాలాల నుంచి తమ హంగును కొత్తగా చూపుతూనే ఉన్నాయి. ప్రకృతిలో గల గొప్పతనం అదే అని ప్రతిసారీ నిరూపిస్తూనే ఉంటాయి.

కారణాలు, సాకులు విజయానికి విరోధులు.
లక్ష్యం ఉన్నవారు ఆకాశాన్ని, పాతాళాన్ని ఏకం చేసి అనుకున్నది సాధిస్తారు.
12వ ఏట కుడి చేతిని కోల్పోయిన పార్వతి గోపకుమార్ సివిల్స్ 2023లో 282వ ర్యాంక్ సాధించడానికి ఒంటి చేత్తో పోరాడింది.
'మీరు సంతోషంగా ఉంటేనే సరిగ్గా చదవగలరు' అంటున్న పార్వతి సమస్యలను జయించగల చిరునవ్వును సొంతం చేసుకుంది.

ఒంటి చేత్తో విజయం

విజేత



కృత్రిమ కుడిచేయి అమర్చుకున్న పార్వతి గోపకుమార్

పార్వతి గోపకుమార్ సంతోషంగా ఉంది. ఆమెకు కలెక్టర్ కావాలని ఉంది. సివిల్స్ 2023 ఫలితాలలో 282 ర్యాంక్ సాధించింది. కాని ఆ ర్యాంక్‌కు ఐ.ఏ.ఎస్. రాకపోవచ్చు. కాని దివ్యాంగ కోటాలో చూసినప్పుడు ఆమెది టాప్ ర్యాంక్. కనుక రావచ్చు.

'మాది అలెప్పి. బెంగళూరు నేషనల్ లా స్కూల్‌లో చదువుకున్నాను. ఆ సమయంలో అలెప్పి కలెక్టరేట్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి వచ్చింది. ఆ సమయంలో నాటి కలెక్టర్ ఎస్.సుహాస్ పనిచేసే విధానం, కలెక్టర్ స్థానంలో ఉంటే ప్రజలకు చేయదగ్గ సేవ చూసి నాక్కూడా ఐ.ఏ.ఎస్. కావాలనిపించింది. ఆ విషయం తెలిశాక కలెక్టరేట్‌లో అందరూ నన్ను అందుకు కష్టపడమని ప్రోత్సహించారు. 2022లో మొదటిసారి సివిల్స్ రాసినప్పుడు ప్రిలిమ్స్ దాటలేకపోయాను. ఒక సంవత్సరం విరామం ఇచ్చి 2023లో రెండోసారి రాశాక ఈ ర్యాంక్ తెచ్చుకున్నాను' అని తెలిపింది పార్వతి. ఇప్పుడు ఆమె వయసు 26 సంవత్సరాలు.

7వ తరగతిలో ప్రమాదం

2010లో పార్వతి ఏడవ తరగతిలో ఉండగా కారు ప్రమాదంలో ఆమె కుడిచేయి మోచేతి వరకు కోల్పోవాల్సి వచ్చింది. ఆ వయసులో అలాంటి నష్టం ఎవరికైనా పెద్ద దెబ్బగా ఉంటుంది. అయితే తండ్రి గోపకుమార్, తల్లి శ్రీకళ ఇచ్చిన ధైర్యంతో వెంటనే ఎడమ చేత్తో రాయడం ప్రాక్టీసు చేసింది పార్వతి. ఆ తర్వాత మూడు నెలల్లో వచ్చిన పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకుంది. ఆ తర్వాత కొన్నేళ్లకు సిలికాన్, ప్లాస్టిక్‌లతో చేసిన కృత్రిమ హస్తాన్ని అమర్చుకుంది. 'నాకు దివ్యాంగులు అనే పదం నచ్చదు. అందులో ఏదో బుజ్జగింపు ఉంటుంది. వికలాంగులను వికలాంగులుగానే పిలుస్తూ సమాన గౌరవం ఇవ్వాలి. చేయి కోల్పోయాక నా జీవితమే మారిపోయింది. జనం వికలాంగులతో ఎంతో మొరటుగా వ్యవహరిస్తారు. నువ్వు బ్రా ఎలా వేసుకుంటావు, ప్యాడ్ ఎలా పెట్టుకుంటావు అని అడిగినవారు కూడా ఉన్నారు' అని చెబుతుంది పార్వతి.

మహిళా దివ్యాంగుల కోసం

ఐ.ఏ.ఎస్ అయ్యాక దివ్యాంగుల కోసం, ముఖ్యంగా మహిళా దివ్యాంగుల కోసం పని చేయాలనుకుంటోంది పార్వతి. 'ప్రేమలో పడి శారీరక వాంఛను వ్యక్తం చేసే దివ్యాంగుల సినిమాలు మీరెప్పుడైనా చూశారా? దివ్యాంగులకు ప్రేమ ఏమిటి అనే ధోరణి మనది. ఇక మహిళా దివ్యాంగులైతే పెళ్లి చేసుకుని భర్త ఎదుట ఆత్మన్యూనతతో ఉండేలా తయారు చేశారు. శారీరక లోపం శరీరానికి సంబంధించింది. మేము పొందాల్సిన ప్రేమ, గౌరవం, లైంగిక జీవితం పట్ల మాకు సమాన హక్కు ఉంది. కొందరు అబ్బాయిలు మమ్మల్ని ప్రేమించి ఉద్ధరిస్తున్నామనుకుంటారు. ఇందులో ఉద్ధరణ ఏమీ లేదు. మేము కూడా సమాన మనుషులమే. అందరిలాగే మేము కూడా' అంటోందామె.

వంటిల్లు

ఎప్పుడూ అవే వడియాలా?
బోర్ అనే మాట రాకముందే మార్చేద్దాం.
పుల్లపుల్లగా తమిళ కిల్లు వతాల్.
మళయాల ఇడియాప్పం ఫ్రైయామ్.
కన్నడ అవలక్కి...అరలు సుందిగె.
ఎండ పని పట్టి కొత్త మెనూ రాద్దాం.

వడియాలే... కొంచెం కొత్తగా!

కిల్లు వత్తల్



కావలసినవి: ఉప్పుడు బియ్యం – కేజీ; సగ్గుబియ్యం– 100 గ్రాములు; జీలకర్ర – టేబుల్ స్పూన్; ఇంగువ– అర టీ స్పూన్; నిమ్మకాయలు– 2 (పెద్దవి); పచ్చిమిర్చి – 6 (మెత్తగా గ్రైండ్ చేయాలి); ఉప్పు – 2 టీ స్పూన్‌లు లేదా రుచిని బట్టి;

తయారీ: ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు నానబెట్టాలి. మిక్సీలో వేసి తగినంత నీటిని చేరుస్తూ మెత్తగా పిండి చేసుకోవాలి. ఆ పిండిని ఒక మందపాటి పాత్రలో పోయాలి. అందులో సగ్గుబియ్యం, ఇంగువ, పచ్చిమిర్చి పేస్టు, ఉప్పు వేసి, మూడు లీటర్ల నీటిని పోసి కలపాలి. ఆ పాత్రను స్టవ్ మీద పెట్టి బియ్యప్పిండి మిశ్రమం అడుగుకు అంటుకోకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత స్టవ్ ఆపేసి పిండిలో జీలకర్ర వేసి కలిపి మూతపెట్టాలి. ఓ గంట సేపటికి పిండి వేడి తగ్గిపోతుంది. అప్పుడు మూత తీసి పిండిలో నిమ్మరసం వేసి గరిటెతో కలపాలి. ఇప్పుడు ఎండలో నూలు వస్త్రం లేదా పాలిథిన్ షీట్ పరిచి బియ్యప్పిండి మిశ్రమాన్ని చేత్తో వడియాల్లా పెట్టుకోవాలి. ఈ మిశ్రమం గరిటెతో వడియాలు పెట్టడానికి వీలుగా ఉండదు. చేత్తో తీసుకుని వేళ్లతో చిన్న నిమ్మకాయంత పిండిని వడియాల్లా వేయాలి. ఇవి ఒక రోజులోనే ఎండిపోతాయి. సాయంత్రం వలుచుకోవచ్చు. క్లాత్ మీద పెట్టినట్లయితే వెనుకవైపు నీటిని చల్లి వలవాలి. ఇది తమిళ వడియం.

అవలక్కి సుందిగె (పోహా వడియం)



కావలసినవి: అటుకులు – కేజీ; పచ్చిమిర్చి తరుగు – 50 గ్రాములు; ఉల్లిపాయ తరుగు – పావు కేజీ; ఉప్పు – 50 గ్రాములు; కొత్తిమీర తరుగు – 100 గ్రాములు; నీరు – 2 లీటర్లు; నూనె – వేయించడానికి తగినంత;

తయారీ: ● వెడల్పు పాత్రలో నీటిని తీసుకుని అందులో ఉప్పు వేసి కలపాలి. ఆ తర్వాత అటుకులు వేయాలి. అటుకులు మునిగేటట్లు ఒకసారి మెల్లగా చేత్తో అద్ది రెండు–మూడు నిమిషాల తర్వాత నీటిని వంపేసి అటుకులను జల్లెడ వంటి పాత్రలో వేసి అరగంట సేపు పక్కన ఉంచాలి. ● ఇప్పుడు అటుకులను ఒక పాత్రలో వేసి అందులో కొత్తిమీర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి పొడవాటి గరిటెతో సున్నితంగా కలపాలి. ● నూలు వస్త్రాన్ని తడిపి ఎండలో పరిచి, అటుకుల మిశ్రమాన్ని చిన్న నిమ్మకాయంత తీసుకుని వలయాకారంగా వత్తి నూలు వస్త్రం మీద పెట్టాలి. ఇలాగే అటుకుల మిశ్రమం మొత్తాన్ని చేసుకోవాలి. వస్త్రం మీద పెట్టడం కుదరకపోతే వడియాలను నీడలో కూర్చుని వెడల్పాటి ప్లేట్‌లో అమర్చి ఆ ప్లేట్‌ని పెట్టుకోవచ్చు. పై కొలతలతో దాదాపు వంద వడియాలు చేయవచ్చు. ● ఈ వడియాలను రెండు లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టాలి. ఒక వైపు ఎండిన తర్వాత వలిచి రెండవ వైపు కూడా ఎండబెట్టాలి. గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే ఏడాది పాటు తాజాగా ఉంటాయి. ● బాణలిలో నూనె వేడి చేసి ఈ వడియాలను వేసి మీడియం మంట మీద రెండు వైపులా కాలనివ్వాలి. ఇవి బియ్యప్పిండి వడియాలు వేగినంత వేగంగా వేగవు. కొంత ఎక్కువ సమయం తీసుకుంటాయి.

ఇడియాప్పం ఫ్రైయామ్స్

కావలసినవి: బియ్యప్పిండి– కేజీ; సగ్గుబియ్యం పిండి– పావు కేజీ; నీరు – 2 లీటర్లు; ఇంగువ – టీ స్పూన్; ఉప్పు – టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● బియ్యప్పిండి, సగ్గుబియ్యం పిండి రెడీమేడ్ కొనుక్కోవచ్చు లేదా సొంతంగా ఇంట్లోనే చేసుకోవచ్చు. బియ్యాన్ని కడిగి నూలు వస్త్రం మీద నీడలో ఆరబోయాలి. సగ్గుబియ్యాన్ని ఓ అరగంట సేపు ఎండలో పెట్టాలి. బియ్యం ఆరిన తర్వాత బియ్యం, సగ్గుబియ్యం రెండింటినీ కలిపి మిక్సీలో లేదా వేసి మెత్తగా పొడి చేయాలి లేదా మర పట్టించవచ్చు. ● ఇప్పుడు స్టవ్ మీద వెడల్పు బాణలి పెట్టి నీటిని పోసి వేడి చేయాలి. అందులో ఉప్పు, ఇంగువ వేయాలి. నీరు మరిగేటప్పుడు మంట తగ్గించి బియ్యం, సగ్గుబియ్యం పిండిని వేసి ఉండ కట్టకుండా గరిటెతో కలపాలి. నీరు ఆవిరై పోయి పిండి మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత మంట ఆపేయాలి. మిశ్రమం పైన ఒక స్పూన్ నూనె వేసి పరిచినట్లు సర్ది మూత పెట్టాలి. మిశ్రమం వేడి తగ్గిన తర్వాత ఇడియాప్పం ఆకారంలో వత్తి ఎండబెట్టాలి.
● మురుకులు వత్తే గొట్టంలో పిండిని పెట్టి పాలిథిన్ షీట్ లేదా తడిపిన నూలు వస్త్రం మీద మురుకుల్లాగా వత్తాలి. పిండినంతటినీ ఇలాగే వత్తి రెండు రోజుల పాటు ఎండనివ్వాలి. ఒకరోజు ఎండిన తర్వాత సున్నితంగా ఒలిచి తిరగేసి రోజంతా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేయాలి.
● వేయించేటప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఒక్కో ఇడియాప్పాన్ని వేస్తూ రెండు వైపులా దోరగా వేయించి తీయాలి.



అరలు సుందిగె



కావలసినవి: బొరుగులు – 10 కప్పులు; సగ్గుబియ్యం– అర కప్పు; బూడిద గుమ్మడికాయ ముక్కలు – కప్పు (చెక్కు, గింజలు తీసి ముక్కలు చేయాలి); పచ్చిమిర్చి – 4 (పేస్ట్ చేయాలి); కొత్తిమీర తరుగు – కప్పు; జీలకర్ర – అర టీ స్పూన్; ఇంగువ – అర టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ:
● సగ్గుబియ్యాన్ని ఉడికించి అదనంగా ఉన్న నీటిని వడపోయాలి.
● వెడల్పుగా ఉన్న పళ్లేనికి నూనె రాసి సిద్ధంగా ఉంచాలి.
● వెడల్పాటి పాత్రలో సగ్గుబియ్యం, గుమ్మడికాయ ముక్కలు, పచ్చిమిర్చి పేస్టు, కొత్తిమీర, ఇంగువ, ఉప్పు వేసి కలపాలి.
● మరొక పాత్రలో బొరుగులు వేసి అవి మునిగేటట్లు నీటిని పోయాలి. వెంటనే బొరుగులను చేత్తో తీసి నీటిని పిండేసి సగ్గుబియ్యం, బూడిద గుమ్మడికాయ మిశ్రమం ఉన్న పాత్రలో వేసి (బొరుగులు ఎక్కువసేపు నానకూడదు) కలపాలి. వడియాల మిశ్రమం రెడీ.
● ఇప్పుడు కొద్దిగా మిశ్రమాన్ని చేతికి తీసుకుని వేళ్లతో వత్తి పాలిథిన్ షీట్ మీద అమర్చాలి. వడల్లా చేసుకోవచ్చు లేదా పిరమిడ్ ఆకారంలో వత్తుకుని ఎండలో పెట్టాలి. వీటిని మూడు రోజులపాటు ఎండబెట్టాలి. బాగా ఎండిన తర్వాత నిల్వ చేసుకుంటే ఆరు నెలల పాటు తాజాగా ఉంటాయి.
● బాణలిలో నూనె వేడి చేసి ఐదారు వడియాలను ఒకేసారి వేయించవచ్చు. వేయించేటప్పుడు లోపల కాలేటట్లు జాగ్రత్త తీసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత వడియాలను వేసి మంట మీడియంలో పెట్టి వడియాలను చిల్లుల గరిటెతో నూనెలోకి ముంచి కాలనివ్వాలి. దోరగా కాలిన తర్వాత తీసేయాలి. అరలు సుందిగె అంటే బొరుగుల వడియాలు. కన్నడంలో అరలు అంటే బొరుగులు.

బ్యూటిప్స్

మీకు తెలుసా!

కాఫీ మేలు చేస్తుంది!

తీవ్రమైన ఎండలకు చర్మం కమిలి నల్లబడిపోతుంది. నల్లబడిన చర్మం తిరిగి కాంతిమంతం కావాలంటే ఇంట్లోనే చేసుకోగలిగిన చిట్కాలు.

కాఫీ- హనీ ఫేస్ మాస్క్

మీది నార్మల్ స్కిన్ అయితే... ఒక టేబుల్ స్పూన్ కాఫీ పొడి(ఇన్‌స్టంట్ పౌడర్ కాదు, ఫిల్టర్‌లో వేసే కాఫీ పౌడర్)లో అంతే మోతాదు తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి వేళ్లతో వలయాకారంగా మర్దన చేసి ఇరవై నిమిషాల సేపు అలాగే ఉంచాలి. ఆరిన తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.

కాఫీ - మిల్క్ ఫేస్ మాస్క్

మీది డ్రై స్కిన్ అయితే... టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్ల పాలు కలపాలి. ఈ పేస్ట్‌ను ముఖానికి పట్టించి 15 నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి.

కాఫీ- టర్మరిక్- యోగర్ట్ మాస్క్

మీ ముఖం మీద మొటిమలు ఉంటే ... టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో టీ స్పూన్ పసుపు, టేబుల్ స్పూన్ పెరుగు కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తర్వాత ఐదు నిమిషాల సేపు మెల్లగా వలయాకారంగా మర్దన చేసి ఆ తర్వాత వేడి నీటితో శుభ్రం చేయాలి.



కాఫీ - లెమన్ మాస్క్

మీది జిడ్డు చర్మం అయితే... టేబుల్ స్పూన్ కాఫీ పొడిలో టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల సేపు అలాగే ఉంచాలి. ఆ తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి.

ఈ ప్యాక్‌లు ట్యాన్‌ను తగ్గించడంతోపాటు చర్మరంధ్రాలను శుభ్రం చేస్తాయి కాబట్టి ఈ ప్యాక్‌లు వేసిన తర్వాత ముఖానికి క్లెన్సింగ్ అవసరం ఉండదు.

● ఆర్ట్ అండ్ కల్చర్

వేరబుల్ ఆర్ట్


● కనికా అదానీ

ముంబైకి చెందిన కనికా అదానీ 'ది స్టూడియో ప్రాజెక్ట్' ద్వారా బ్యాగ్‌లు, పాస్‌పోర్ట్ కవర్‌లు, సూట్‌కేస్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్‌లకు క్రియేటివ్ ట్విస్ట్ ఇస్తోంది. ఫ్రెండ్ పుట్టినరోజును దృష్టిలో పెట్టుకొని ఆమె షూస్‌ను పెయింట్ చేసి స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తే మంచి స్పందన వచ్చింది.

'వేరబుల్ ఆర్ట్'పై కనిక ఆసక్తి అంతకంతకూ పెరుగుతూపోయి వృత్తిగా మారడానికి ఎంతో కాలం పట్టలేదు.

చిన్నప్పటి నుంచి బొమ్మలు వేసేది కనిక. ఆ ఇష్టమే చికాగోలోని 'ది స్కూల్ ఆఫ్ ది ఆర్ట్ ఇనిస్టిట్యూట్'లో నాలుగు–సంవత్సరాల విజువల్ ఆర్ట్స్ కోర్సు చేసేలా చేసింది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో పెయింటింగ్, గ్లాస్ బ్లోవింగ్, స్క్రీన్ ప్రింటింగ్, ఫిగర్ డ్రాయింగ్‌లాంటి ఎన్నో ఆర్ట్స్ నేర్చుకుంది. దీంతో పాటు 'పెయింటింగ్ అనేది కాన్వాస్ మీదే చేయనక్కర్లేదు' అనే విలువైన సత్యాన్ని తెలుసుకుంది

మన దేశానికి తిరిగి వచ్చిన తరువాత ఫుల్–టైమ్ జాబ్ చేసింది. ఆ తరువాత సొంతంగా ఏదైనా చేయాలని ఆలోచన చేసింది. ఆ సమయంలోనే 'పర్సనలైజేషన్' అనే ఐడియా కనిక మదిలో మెదిలింది.

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో 'పర్సనలైజేషన్' కాన్సెప్ట్ ఉంది. మన దేశంలో పెద్దగా లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'ది స్టూడియో ప్రాజెక్ట్'కు శ్రీకారం చుట్టింది. మొదట్లో కాన్వాస్ షూస్‌లాంటి ఫన్ ప్రాజెక్ట్స్ చేసింది. ఇప్పుడు క్లయింట్స్ పర్సనల్ హై–ఎండ్ లగ్జరీ ప్రాడక్ట్‌లకు డిజైన్ చేస్తోంది. బ్రాండ్ కొలాబ్రేషన్స్‌తో బిజీబిజీగా ఉంది. తన క్లయింట్స్‌లో సెలబ్రిటీలు కూడా ఉన్నారు. ప్రాడక్ట్ విభాగంలో కనిక పెయింట్ చేసిన ట్రావెల్ బ్యాగ్స్, పాస్‌పోర్ట్ కవర్స్ బాగా పాపులర్ అయ్యాయి.

● సక్సెస్ స్టోరీ

అక్షరశిల్పి

వివిధ భారతీయ భాషలకు సంబంధించి హై-క్వాలిటీ ఫాంట్స్‌ను డిజైన్ చేయాలనే లక్ష్యంతో అహ్మదాబాద్ కేంద్రంగా సత్య రాజ్‌పురోహిత్ ఇండియన్ టైప్ ఫాండ్రీ (ఐటీఎఫ్) అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాడు. ఈ స్టార్టప్ యాపిల్, గూగుల్, అమెజాన్....మొదలైన పెద్ద కంపెనీలకు భారతీయ భాషలకు సంబంధించిన ఫాంట్స్ డిజైన్ చేస్తోంది....



స్కూల్‌రోజుల్లో 'అందమైన చేతిరాత'కు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవాడు సత్య. ఫ్రెండ్స్ నోట్స్‌కు హైడ్‌లైన్‌ల నుంచి తరగతి గదిలోని గోడలపై నీతివాక్యాలు రాయడం వరకు అందమైన చేతిరాతకు అందరికీ గుర్తుకు వచ్చే పేరు...సత్య రాజ్‌పురోహిత్. కార్లు, బైకుల రేడియం నంబర్ ప్లేట్స్ కోసం సత్య దగ్గరికి ఎంతోమంది వచ్చేవాళ్లు.

అక్షరాలను అందంగా రాసే నైపుణ్యం అతడిని ఎక్కడికో తీసుకెళ్లింది.

ఐటీఎఫ్(ఇండియన్ టైప్ ఫాండ్రీ) ఒకే ఒక ఫాంట్ (హిందీ)తో స్టార్ట్ అయింది. ఆ తరువాత 450 ఫాంట్‌ల వరకు విస్తరించింది. కోహినూర్, అఖండ్, పాపిన్స్, టెకో....మొదలైన ఫాంట్స్ బాగా పాపులర్ అయ్యాయి. 'ఐటీఎఫ్' క్లయింట్స్‌లో యాపిల్, గూగుల్, అమెజాన్, సోనీలాంటి ఎన్నో పెద్ద కంపెనీలు ఉన్నాయి.

థాయి, గ్రీక్, హిబ్రూ, కొరియన్‌లాంటి నాన్–ఇండియన్ లాంగ్వేజెస్‌కు సంబంధించిన ఫాంట్స్‌ను కూడా డిజైన్ చేస్తోంది కంపెనీ.

'ప్రపంచ భాషలతో పోల్చితే భారతీయ భాషలకు ఫాంట్స్ క్రియేట్ చేయడం సవాలుతో కూడిన పని' అంటున్న సత్య ఫాంట్స్ నాణ్యత విషయంలో విజయం సాధించాడు. అదే అతడి 'యూఎస్పీ'గా మారింది.

తల్లిదండ్రులు సత్యను డాక్టర్ చేయాలనుకున్నారు. కోచింగ్ కోసం రాజస్థాన్‌లోని కోటలో రెండు సంవత్సరాలు గడిపాడు సత్య. తల్లిదండ్రుల కలను నేరవేర్చడంలో విఫలం అయ్యాడు. ఆ సమయంలోనే తనకు ఇష్టమైన ఆర్ట్‌ను కెరీర్‌గా చేసుకొని విజయం సాధించాలనుకున్నాడు. చండీగఢ్ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్, అహ్మదాబాద్‌లో చదువుకున్నాడు.

'కోటలో రెండు సంవత్సరాల కాలాన్ని వృథా చేసుకున్నాను. చదువులో గుడ్‌స్టూడెంట్‌ని కాదు. నాకు ఆర్ట్ అంటే ఇష్టం. నాకు ఇష్టమైన రంగంలో కష్టపడితే కచ్చితంగా విజయం సాధిస్తాను అనుకున్నాను' గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు సత్య. అతడి నమ్మకం వృథా పోలేదు. సత్య పురోహిత్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డ్‌లు వచ్చాయి. ప్రపంచంలోని లీడింగ్ టైప్ ఫాండ్రీలలో 'ఐటీఎఫ్' ఒకటిగా గుర్తింపు పొందింది. జీక్యూ ఇండియా '50 మోస్ట్ ఇనిఫ్లుయెన్షల్ యంగ్ ఇండియన్స్' జాబితాలో చోటు సాధించిన సత్య రాజ్ పురోహిత్ యువతకు ఇచ్చే సందేశం....'ప్రతి ఒక్కరిలో టాలెంట్ ఉంటుంది. ఆ టాలెంట్ ఏమిటి? అనే దాని విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. తనలోని టాలెంట్ ఏమిటో తెలుసుకొని ఇష్టంగా కష్టపడితే విజయం సాధించడం కష్టమేమీ కాదు'

● టెక్... టాక్

షావోమీ స్మార్ట్ బ్యాండ్ 8 ప్రో




డిస్‌ప్లే: 1.74 అంగుళాలు
రిజల్యూషన్: 336X480 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జెడ్
అడ్జస్టబుల్ లెంత్: 130–205 ఎంఎం
ఫీచర్స్: హార్ట్ రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మానిటర్, స్లీప్ ట్రాకింగ్, స్పోర్ట్స్ ట్రాకింగ్.... మొదలైనవి.
బ్యాటరీ: 289 ఎంఏహెచ్
కలర్స్: బ్లాక్, లైట్ గ్రే

సీఎంఎఫ్ నెక్‌బ్యాండ్ ప్రో



- టైప్: వైర్‌లెస్
- కనెక్టివిటీ: బ్లూటూత్
- వాయిస్ అసిస్టెంట్
- యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్
- బ్యాటరీ కెపాసిటీ: 220 ఎంఏహెచ్
- బరువు: 29 గ్రా.
- డైమెన్షన్స్: 937X13.2X22.8 ఎంఎం



'బ్రేవ్'లో ఆన్సర్ విత్ ఏఐ ఫీచర్

సెర్చ్ ఇంజిన్ 'బ్రేవ్' 'ఆన్సర్ విత్ ఏఐ' ఫీచర్‌ను ఎనౌన్స్ చేసింది. మల్టిపుల్ సోర్స్ నుంచి ఇన్‌ఫర్‌మేషన్‌ను తీసుకొని దాన్ని సింథసైజ్ చేసి యూజర్ అడిగే ఏ ప్రశ్నకైనా జవాబును స్పష్టంగా అర్థమయ్యే ఫార్మట్‌లో చెబుతుంది. వివిధ సందేహాలకు జవాబు ఇవ్వడంతో పాటు ఒక అంశానికి సంబంధించి సారాంశాన్ని, ముఖ్య అంశాలను వ్యాసం రూపంలో అందిస్తుంది.



పొయెట్రీ కెమెరా

నార్మల్ పోలరాయిడ్ కెమెరాలా కనిపించే ఈ పొయెట్రీ కెమెరా ఫోటోలు తీయడమే కాదు అందమైన ఫోటోలకు పొయెమ్స్ రాయగలదు. కెలిన్ కరోలిన్, రెయాన్‌లు ఈ ఏఐ-పవర్డ్ కెమెరాను తయారుచేశారు. హైకూ నుంచి సానెట్ వరకు రకరకాల పొయెమ్ ఫామ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. టెక్నాలజీని ఆర్ట్‌తో మిక్స్ చేసి తయారుచేసిన కెమెరా ఇది. ఇప్పటి ఇన్‌స్టాగ్రామ్ కల్చర్‌కి బాగా సరిపోతుంది.

ఫొటోలు మౌనాన్ని వీడేలా...



ఫొటోలు మౌనంగా మనల్ని చూస్తుంటాయి. మౌనాన్ని వీడి వాటితో మాట్లాడించాలని, పాడించాలని ఉందా? అయితే ఈ ఏఐ యాప్ మీ కోసమే. మైక్రోసాఫ్ట్ ఏఐ యాప్ వస–1 పిక్చర్‌లోని ఫేస్‌లతో మాట్లాడిస్తుంది. పాడిస్తుంది. మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ ఏషియా బృందం ఈ ఏఐ అప్లికేషన్‌ను క్రియేట్ చేసింది.

● అవును... ఇది నిజమే!



● యులన్ మాగ్నోలియస్ పువ్వులు అచ్చంగా పక్షుల్లా ఉంటాయి ● కోపాన్ని తగ్గించుకోవడానికి జపాన్‌లోని నగొయ యూనివర్సిటీ పరిశోధకులు ఒక టెక్నిక్‌ను డెవలప్ చేశారు. దీని ప్రకారం మనకు బాగా కోపం వచ్చినప్పుడు మనసులోని ఫీలింగ్స్‌ను కాగితంపై రాసి దూరంగా విసిరేయాలి.

● మ్యూజిక్ వరల్డ్

బిల్‌బోర్డ్ నెంబర్ 1 సాంగ్.... టూ స్వీట్



ఐరిష్ సింగర్–సాంగ్ రైటర్ హోజైర్ ఆల్బమ్ 'అన్ హార్డ్'లోని 'టూ స్వీట్' సాంగ్ 'బిల్‌బోర్డ్ హాట్ 100'లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ శుభసందర్భంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు కృతజ్ఞతలు తెలియచేశాడు హోజైర్.

'ఈ పాట ఎందుకు ఇంత పెద్ద హిట్ అయింది?' అనే ఆసక్తి మీలో ఉంటే– 'ఇట్ కాంట్ బి సెడ్ ఐయామ్ యాన్ ఎర్లీ బర్డ్ /ఇట్స్ టెనో క్లాక్ బిఫోర్ ఐ సే ఏ వర్డ్.
బేబీ, ఐ కెన్ నెవర్ టెల్ /హౌ డూ యూ స్లీప్ సో వెల్?'
చరణాలతో మొదలయ్యే 'టు స్వీట్' పాటను తక్షణం వినాల్సిందే.

● గేమింగ్

సముద్రపు దొంగల ఆట కట్టించేలా....

యాక్షన్–అడ్వెంచర్ గేమ్ 'సీ ఆఫ్ థీవ్స్' ఈ నెల 30న విడుదల అవుతుంది. యూకేకి చెందిన డెవలపర్ 'రేర్' నుంచి వచ్చిన గేమ్ ఇది. రక్తపిశాచులు, రాక్షస బల్లులలాంటి రకరకాల సెట్టింగ్స్‌ను గేమ్‌లో ప్రవేశపెట్టారు. గేమ్ ప్రారంభంలో ప్లేయర్ తన జెనరేటెడ్ అవతార్‌ను సెలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. పైరేట్ థీమ్ ప్రత్యేకత ఏమిటంటే...ప్లేయర్స్‌కు తమకు నచ్చినట్లు ఆడే స్వేచ్ఛ ఉంటుంది.

● జానర్: యాక్షన్–అడ్వెంచర్
● మోడ్: మల్టీప్లేయర్ ● ప్లాట్‌ఫామ్స్: విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్, ప్లేస్టేషన్ 5



సినిమా


● రవితేజ

దొంగ... పోలీస్

హీరో రవితేజ మరోసారి దొంగ పాత్రలో కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. 'దొంగోడు' మూవీలో దొంగగా, 'విక్రమార్కుడు' సినిమాలో దొంగ.. పోలీస్‌గా నటించారు రవితేజ. అలాగే 'కిక్, దొంగల ముఠా, దరువు, కిలాడి, టైగర్ నాగేశ్వరరావు' లాంటి సినిమాల్లో చోరుడి పాత్రలు చేసి, ప్రేక్షకుల్ని అలరించారాయన. తాజాగా మరోసారి దోచుకెళ్లేందుకు సిద్ధం అవుతున్నారట. ప్రస్తుతం హరీష్ శంకర్ దర్శకత్వంలో 'మిస్టర్ బచ్చన్' అనే సినిమా చేస్తున్నారు రవితేజ. ఆ తర్వాత 'జాతి రత్నాలు' ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారట. రవితేజ–అనుదీప్ కాంబినేషన్‌పై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన రాకున్నా కొన్నాళ్లుగా ఈ కాంబినేషన్‌పై వార్తలు వస్తున్నాయి. వీరి కలయికలో రానున్న సినిమాలో రవితేజ దొంగ.. పోలీస్‌గా కనిపిస్తారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. రవితేజ కామెడీ టైమింగ్‌ని దృష్టిలో పెట్టుకుని తనదైన శైలిలో ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్ కథని సిద్ధం చేశారట అనుదీప్.

ప్రభాస్ 'కల్కి' యానిమేషన్ చేస్తున్నాం

– నిర్మాత రాజీవ్ చిలక



''సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం సంపాదించడం సులభమే. కానీ, పెళ్లి కుదరడం అనేది పెద్ద సమస్యగా మారింది. పైగా వివాహమనేది అందరూ రిలేట్ చేసుకునే అంశం. అందుకే 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా కథని పెళ్లి నేపథ్యంలో ఎంచుకున్నాం. ఈ కథలోని వినోదం, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఉంటాయి'' అని నిర్మాత రాజీవ్ చిలక అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. రాజీవ్ చిలక నిర్మించిన ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. రాజీవ్ చిలక మాట్లాడుతూ– ''ఓ యానిమేషన్ సంస్థని స్థాపించి, 'ఛోటా భీమ్' వంటి దాదాపు ఆరు యానిమేషన్ చిత్రాలు చేశాం. మల్లి చెప్పిన 'ఆ ఒక్కటీ అడక్కు' కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మించాం. నరేశ్‌గారికి కూడా ఈ కథ బాగా నచ్చింది. నరేశ్‌గారి హైట్‌ని మ్యాచ్ చేయడానికి ఫరియా అయితే బావుంటుందనిపించింది. కథ వినగానే ఆమె ఒప్పుకున్నారు. అలాగే జానీ లీవర్‌గారి అమ్మాయి జెమి లీవర్ కీలక పాత్రలో కనిపిస్తారు. గోపీసుందర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ప్రస్తుతం ప్రభాస్‌గారి 'కల్కి 2898 ఏడీ' సినిమా యానిమేషన్ పనులు మా సంస్థలో చేస్తున్నాం. ఈ మూవీ లోని పాత్రలను వివరించే ఈ యానిమేషన్ సినిమాకంటే ముందే విడుదలవుతుంది. అలాగే పిల్లలతో 'ఛోటా భీమ్'ని చేయబోతున్నాం. అదే విధంగా డిస్నీలో మే 6న ఒక యానిమేషన్ షో లాంచ్ చేయబోతున్నాం'' అన్నారు.


● అమీ ఆడమ్స్

పునరావాసం తర్వాత...

సమాజంలో పేరు, ప్రఖ్యాతులు కలిగిన ఓ మహిళ సుదీర్ఘమైన పునరావాసాన్ని గడపాల్సి వస్తుంది. ఈ పునరావాసం తర్వాత ఆ మహిళ తిరిగి ఏ విధంగా తన కొత్త జీవితాన్ని ఆరంభించింది? సమాజంలో పాపులర్ అయిన ఆ మహిళ ఎందుకు పునరావాస కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది? తిరిగి వచ్చిన తర్వాత తన కుటుంబంతో ఏ విధంగా తన జీవితాన్ని సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చింది? అనే అంశాల సమాహారంగా రూపొందనున్న హాలీవుడ్ చిత్రం 'ఎట్ ది సి'. ఆరుసార్లు ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న అమీ ఆడమ్స్ ఈ సినిమాలో లీడ్ రోల్‌లో నటించనున్నారు. 'వైట్ గాడ్', 'పీసెస్ ఆఫ్ ఎ ఉమెన్' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన కార్నెల్ ముండ్రుక్జో 'ఎట్ ది సి' సినిమాకు దర్శకత్వం వహిస్తారు. జూన్‌లో ఈ సినిమా చిత్రీకరణ బూస్టన్ లొకేషన్స్‌లో ప్రారంభం కానుంది.

మైథలాజికల్ సహ్యా

''సహ్యా' సినిమా టైటిల్ బాగుంది. మంచి కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. కొత్త కథాంశంతో వస్తున్న ఫీమేల్ లీడ్ సినిమాలు బాగా సక్సెస్ అవుతున్నాయి. అదే కోవలో రూపొందుతున్న 'సహ్యా' చిత్రం మంచి విజయం సాధించాలి'' అని నటుడు అర్జున్ అన్నారు. మౌనికా రెడ్డి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'సహ్యా'. యాస రాకేష్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ సుధాకర్ జూకంటి, భాస్కర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను అర్జున్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో మైథలాజికల్ మూవీగా రూపొందుతోన్న చిత్రం 'సహ్యా'. త్వరలో ట్రైలర్ విడుదల చేస్తాం'' అన్నారు. సుమన్, సంజయ్ కృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ కోలుగురి, సంగీతం: రోహిత్ జిల్లా.


● మౌనికా రెడ్డి

జోడీ రిటర్న్స్

కొన్ని జంటలు 'హిట్' అవుతాయి. వెండితెరపై హిట్ అయిన ఆ జోడీలను మళ్లీ మళ్లీ చూడాలని ప్రేక్షకులు అనుకుంటారు. కానీ, మళ్లీ ఆ జోడీకి తగ్గ కథ కుదరాలి, కథ కుదిరితే ఇద్దరి డేట్స్ సెట్ అవ్వాలి. ఈ రెండూ సెట్ అయి, వెంటనే రిపీట్ అయిన జోడీలు ఉంటాయి.. ఎన్నో ఏళ్లకు గానీ రిపీట్ అయ్యే జోడీలూ ఉంటాయి. అలా కొన్నేళ్ల తర్వాత రిపీట్ అవుతున్న జోడీల గురించి తెలుసుకుందాం.


● చిరంజీవి, త్రిష


● శోభన, మోహన్‌లాల్


● అర్చన, రాజేంద్రప్రసాద్, ఆకాంక్ష, రూపేష్

విశ్వంభర పిలిచాడు

దాదాపు పద్దెనిమిదేళ్ల తర్వాత హీరో హీరోయిన్లుగా స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు చిరంజీవి, త్రిష. ఈ ఇద్దరూ కలిసి నటించిన తొలి సినిమా 'స్టాలిన్' 2006లో విడుదలైంది. ఆ తర్వాత మళ్లీ చిరంజీవి, త్రిష కలిసి నటిస్తున్న సినిమా 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తున్నారని, సిస్టర్ సెంటిమెంట్‌తో పాటు ఫ్యాంటసీ ఎలిమెంట్స్ కూడా ఈ కథలో ఉంటాయని ఫిల్మ్ నగర్ సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ షెడ్యూల్‌లో ఇంట్రవెల్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరించారు. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ 2025 జనవరి 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి కీరవాణి స్వరకర్త.

షష్ఠిపూర్తి సంబరం

రాజేంద్రప్రసాద్–అర్చన కలిసి నటించిన 'లేడీస్ టైలర్' చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. 1986లో విడుదలైన ఈ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చన కలిసి మళ్లీ వెంటనే మరో సినిమా చేయలేదు. 38 ఏళ్ల తర్వాత ఇప్పుడు 'షష్ఠిపూర్తి' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేష్, ఆకాంక్షా సింగ్ లీడ్ రోల్స్‌లో, 'కాంతార' ఫేమ్ అచ్యుత్ కుమార్, శకుంతల కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు పవన్ ప్రభ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కుటుంబ కథా చిత్రానికి ఇళయరాజా స్వరకర్త. అప్పటి 'లేడీస్ టైలర్' సినిమాకు సంగీతం అందించిన ఇళయరాజాయే ఈ 'షష్ఠిపూర్తి' సినిమాకూ స్వరాలు సమకూర్చడం విశేషం. కుటుంబ విలువలు, కుటుంబ సభ్యుల అనుబంధాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపేష్ నిర్మిస్తున్నారు.

తెరపై యాభైఆరోసారి...

మలయాళ సిల్వర్ స్క్రీన్‌పై మోహన్‌లాల్, శోభనల జోడీ సూపర్ హిట్. 'అవిడతే పోలే ఇవిడెయుమ్' (1985) సినిమా కోసం తొలిసారి మోహన్‌లాల్, శోభన జత కట్టారు. ఆ తర్వాత 'మణిచిత్ర తాళు', 'నాడోడిక్కట్టు' వంటి హిట్ సినిమాలతో పాటు యాభైసార్లకు పైగా స్క్రీన్ షేర్ చేసుకున్నారు మోహన్‌లాల్, శోభన. అయితే 1994లో విడుదలైన మలయాళ చిత్రం 'తేన్మావిన్ కొంబాట్' తర్వాత మరోసారి మోహన్‌లాల్, శోభన కలిసి లీడ్ రోల్స్‌లో నటించలేదు. ప్రస్తుతం మోహన్‌లాల్ హీరోగా నటించనున్న 360వ చిత్రంలో శోభన ఓ లీడ్ రోల్‌లో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇది మోహన్‌లాల్, శోభన కలిసి నటిస్తున్న 56వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో మోహన్‌లాల్‌కు జోడీగా కనిపిస్తారట శోభన. తరుణ్ మూర్తి దర్శకత్వంలో ఎమ్. రంజిత్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల మొదలైంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్ టాక్సీ డ్రైవర్‌గా కనిపిస్తారని టాక్. ఈ ఏడాది ఓనమ్‌కు సినిమాను రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్.


● జ్యోతిక, సూర్య

పెళ్లి తర్వాత తొలి సినిమా?

దాదాపు పాతికేళ్ల క్రితం తమిళ చిత్రం 'పూవెల్లామ్ కేట్టుప్పార్' (1999)లో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై జోడీగా కనిపించారు సూర్య, జ్యోతిక. ఆ తర్వాత 'ఉయిరిలే కలందదు, పేరళగన్, కాక్క కక్క, మాయావి' వంటి సినిమాల్లో సూర్య, జ్యోతిక హిట్ జోడీ అనిపించుకున్నారు. చివరిసారిగా 2006లో 'సిల్లున్ను ఒరు కాదల్' సినిమాలో సూర్య–జ్యోతిక జోడీగా కనిపించారు. ఈ సినిమా విడుదలైన తర్వాత సూర్య, జ్యోతిక రియల్ లైఫ్ జోడీ కూడా అయ్యారు. అయితే 'సిల్లున్ను ఒరు కాదల్' తర్వాత సూర్య, జ్యోతిక కలిసి సినిమా చేయలేదు. పద్దెనిమిదేళ్ల తర్వాత ఆ సమయం ఆసన్నమైందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. 'కేరళ కేఫ్', 'బెంగళూరు డేస్' వంటి సినిమాలకు దర్శకత్వం వహించిన అంజలీ మీనన్ ఓ కథ సిద్ధం చేశారని, ఈ కథతో తెరకెక్కనున్న సినిమాలో సూర్య, జ్యోతిక జోడీగా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఈ సినిమా ఓకే అయితే పెళ్లి తర్వాత సూర్య, జ్యోతిక కలిసి నటించే చిత్రం ఇదే అవుతుంది.

ఇంకా మరికొందరి హీరో హీరోయిన్ జోడీలు రిపీట్ అయ్యే చాన్సెస్ ఉన్నాయని తెలుస్తోంది.

సాక్షి 2024
శుక్రవారం
ఏప్రిల్, 26



జైత్రయాత్ర



గుసగుస

అమ్మో ఒకటో తారీఖు



ఒకటో తేదీ వస్తోందంటే విపక్ష పార్టీలకు గుండెల్లో గుబులవుతోంది. కడుపులో చల్ల కదలకుండా ఇంటి వద్దే పింఛన్లు అందుకుంటున్న వారిని అష్టకష్టాలు పెట్టారు. పింఛన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లను అడ్డుకుని భుజాలు చరుచుకున్నారు. లబ్ధిదారుల తిట్లు, శాపనార్థాలతో భయపడ్డారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తాము అనుభవించిన కష్టాలు ఎలాంటివో.. లబ్ధిదారులకు మరోసారి గుర్తుకొచ్చింది. సీఎం జగన్ పాలనలో తామెంత సుఖంగా బతుకుతున్నారో తెలుసుకున్నారు. మళ్లీ ఆ చీకటి రోజులు 'మాకొద్దు బాబు'అన్న నిర్ణయానికి వచ్చారు. మే నెల పింఛన్లు అందుకునేందుకు వీరు పరుగులు తీయక తప్పని స్థితి. దీంతో సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటా పింఛన్ల పంపిణీ జరిగేలా ఆదేశించాలంటూ ఎన్నికల సంఘానికి మొరపెట్టుకునేందుకు విపక్ష నేతలు సిద్ధమవుతున్నారట.

తాయిలాల పార్టీ



ఇంతకు మించి దిగజారవనుకున్న ప్రతిసారీ యూ ప్రూవ్ మి రాంగ్.. జెర్సీ సినిమాలో హీరో డబ్బులు దొంగతనం చేస్తూ పట్టుబడ్డాక హీరోయిన్ డైలాగ్ ఇది. ఉత్తరాంధ్ర ప్రజలు టీడీపీ పట్ల ఇదే భావనలో ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇలా చేస్తాం.. అని చెప్పలేక, తాయిలాలిచ్చి ఓట్లు కొనాలన్న తాపత్రయమే చూపుతున్నారు. గతంలో పసుపు కుంకుమ పేరిట ప్రలోభాలకు తెరతీశారు. ఇప్పుడు నల్లపూసల ఎర వేస్తున్నారట. 'డ్వాక్రా' లీడర్లకు నాలుగేసి కాసుల నల్లపూసలు తాయిలాలిచ్చి, గ్రూపు సభ్యుల ఓట్లు గంపగుత్తగా వేయించాలని అడుక్కుంటున్నారట.

స్వామి దెబ్బ అదుర్స్




హిందూపురంలో ఈసారి బాలయ్య ఓటమి 'పరిపూర్ణ'o అంటూ స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఆధ్యాత్మిక గురువు స్వామి పరిపూర్ణానంద బీజేపీ నుంచి హిందూపురం ఎంపీ స్థానాన్ని ఆశించి భంగపడ్డారు. బీజేపీ రాష్ట్ర నేతలు టీడీపీకి తొత్తులుగా మారారంటూ ఆరోపించారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకోకపోవడంతో ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు నామినేషన్ వేశారు. బీజేపీతో పొత్తుతో మైనార్టీలకు దూరమైన టీడీపీకి, పరిపూర్ణానంద బరిలో ఉండటంతో హిందూ వర్గం కూడా దూరమవుతుందన్న భయం పట్టుకుందట. కనీసం బాలయ్య కోసమైనా నామినేషన్ ఉపసంహరణకు స్వామిని ఒప్పించాలని బీజేపీ అధిష్టానానికి మొరపెట్టుకుంటున్నారట.

డర్..గేష్

పొత్తుల్లో భాగంగా చచ్చీచెడీ నిడదవోలు సీటు దక్కించుకున్న జనసేన నేత కందుల దుర్గేష్‌కు ఓటమి భయం పట్టుకుంది. ప్రధానంగా వలంటీర్లపై తమ అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యల వేడి ఇక్కడ అస్సలు తగ్గలేదు. దీంతో వారిని తనవైపు తిప్పుకోలేక తానే కొత్తగా వారియర్స్ పేరిట వలంటీర్లను ఏర్పాటు చేసుకున్నారు. వీరికి వారానికి రూ.10 వేలు చొప్పున చెల్లించి పార్టీ ప్రచారానికి పంపిస్తున్నారు. వీరి పని ఇంటింటికీ వెళ్లి తమ పార్టీ గుర్తును జనాలకు పరిచయం చేయడమే. తాము అధికారంలోకి వస్తే వీరినే వలంటీర్లుగా కొనసాగిస్తామని చెప్తున్నారట. పొత్తుల పార్టీలు అధికారంలోకి వచ్చేనా.. చచ్చేనా.. అంటూ ఈ వారియర్స్ లైట్ తీసుకుంటున్నారు.

నాడంతా బొక్కుడే!



సాధారణ సేవలు విద్య, వైద్యం, నీటి సరఫరా, ఎస్సీ, ఎస్టీ తదితర సంక్షేమానికి ఈ ఐదేళ్లలో పెద్దపీట	బాబు ఐదేళ్ల కంటే వైఎస్ జగన్ హయాంలో రూ.1.58 లక్షల కోట్లు ఎక్కువ	సాధారణ సేవల వ్యయమూ బాబు కన్నా ఇప్పుడే రూ. 1.38 లక్షల కోట్లు ఎక్కువ

అప్పుడు, ఇప్పుడు దాదాపు ఒకే బడ్జెట్.. మరి అప్పుడు ఈ సంక్షేమం, అభివృద్ధి ఏమైంది?

ఈ ఐదేళ్లలో భారీగా పెరిగిన సంక్షేమం, అభివృద్ధి పద్దు

న్యాయ, పోలీసు, జైళ్లు, వికలాంగులు, వడ్డీలు, పెన్షన్ తదితర సాధారణ సేవల వ్యయం ఇప్పుడే ఎక్కువ

ఆర్థిక సేవల వ్యయం కూడా వైఎస్ జగన్ హయాంలోనే రూ.40,508 వేల కోట్లు అధికం

ఆర్థిక సేవలంటే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, ఇంధన, పరిశ్రమలు, రవాణా వ్యయం

సీఎం జగన్ హయాంలో ఓ వైపు సంక్షేమం.. మరో వైపు అభివృద్ధికి పెద్ద పీట

ఇంకో వైపు మూలధన వ్యయం బాబు ఐదేళ్లలో రూ.76,139 కోట్లు.. ఈ ఐదేళ్లలో రూ.87,634 కోట్లు

అర్హులైన పేదలందరికీ ఐదేళ్లలో రూ.2.70 లక్షల కోట్లు నేరుగా బదిలీ

మరో రూ.1.84 లక్షల కోట్లు నగదేతర బదిలీ ద్వారా పేదల సంక్షేమానికి వ్యయం

మొత్తంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.4.54 లక్షల కోట్ల వ్యయం

అప్పుల వృద్ధిలో మాత్రమే బాబు ముందంజ

-మరిన్ని వివరాలు IXలో

అవ్వ

అయ్యా.. నా వయసు 63 ఏళ్లు.. పిల్లలు పట్టించుకోవట్లేదు.. సుగర్, బీపీ మందు బిళ్లలకు కూడా డబ్బుల్లేవు.. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయించండి.. మీకు రుణపడి ఉంటాను.

జన్మభూమి కమిటీ సభ్యుడు

ఏమే ముసల్దానా.. నీకు పింఛన్ కావాల్సి వచ్చిందా.. నువ్వు మాకు ఓటు వేశావో లేదో తెలీదు.. అయినా ఇప్పుడు నేను ఖాళీగా లేను. రేపు పొద్దున ఒకసారి కనిపించు. అప్పుడు చూద్దాం.

అవ్వ: పొద్దుగాలే రమ్మన్నావుగా.. వచ్చానయ్యా.. పింఛన్ ఇప్పించండయ్యా..

జన్మభూమి కమిటీ సభ్యుడు: మనూళ్లో ఇప్పటికే 14 మందికి పింఛన్ వస్తోంది. ఇంతకు మించి ఇవ్వడానికి వీలు లేదు. ఈ 14 మందిలో ఎవరైనా చనిపోతే వారి స్థానంలో నీ పేరు రాయిస్తా. ఈ చెట్టు ఆకులన్నీ మా ఇంటి ముందే రాలుతున్నాయి. రోజూ పొద్దున, సాయంత్రం వచ్చి ఊడ్చు.

మహిళ

అన్నా.. ఇప్పటికే మీకు నాలుగు సార్లు అర్జీ ఇచ్చాను. ఈసారైనా ఇంటి స్థలం ఇచ్చేలా చూడండన్నా.

జన్మభూమి కమిటీ సభ్యుడు

ఏం గట్టిగా మాట్లాడుతున్నావు.. రూపాయి ఖర్చు కాకూడదు కానీ పనులు కావాలంట.. నీకు స్థలం వస్తే నాకేంటి లాభం? మీటింగ్‌లు, మా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.. ఓ పది వేల రూపాయలు సర్దు. నీ పని అయ్యేలా నేను మాట్లాడుతా.

రాష్ట్రంలో గత చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరికీ అర్హత ప్రాతిపదికన సంక్షేమ పథకాలు అందలేదు. ప్రతి పనికీ లంచం. గట్టిగా అడిగితే వేధింపులు. అలాగని రాష్ట్రంలో చెప్పుకోదగిన అభివృద్ధి ఏమైనా జరిగిందా.. అంటే మచ్చుకు అయినా కనిపించదు. బాబు ఐదేళ్ల పాలనలో, ప్రస్తుతం వైఎస్ జగన్ పాలనలో బడ్జెట్ దాదాపు ఒకటే. అప్పుడు సంక్షేమమూ లేదు.. అభివృద్ధీ లేదు. ఇప్పుడు ఏక కాలంలో సంక్షేమాభివృద్ధి సాధ్యమైంది. ఇది ఎలా జరిగిందంటే ఒకటే సమాధానం.

అప్పుడంతా దోచుకో.. పంచుకో.. సిద్ధాంతం.

ఇప్పుడు నేరుగా ప్రజల ఖాతాల్లోకే డబ్బు జమ

ఉద్యాన ఎగుమతులు రయ్ రయ్



గత ప్రభుత్వ హయాంలో 15 లక్షల టన్నులే


వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ ఐదేళ్లలో దాదాపు 30 లక్షల టన్నులు ఎగుమతి

16 లక్షల టన్నుల మిరప, 9.25 లక్షల టన్నుల మామిడి గుజ్జు

1.75 లక్షల టన్నుల అరటి, 1.49 లక్షల టన్నుల పసుపు ఎగుమతి

దేశంలోనే తొలిసారి అరటి కోసం ప్రత్యేకంగా కిసాన్ రైళ్లు నడిపిన రాష్ట్రం

ఉద్యాన పంటల వారీగా ఐదేళ్లలో ఎగుమతులిలా..



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉద్యాన పంటలకు మంచి డిమాండ్ రావడం, తద్వారా రైతులకు మంచి ఆదాయాన్ని అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. ఎగుమతులను ప్రోత్సహించేలా తెచ్చిన సంస్కరణలకు తోడు గ్రామ స్థాయిలో నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాల కల్పనతో ఉద్యాన రైతులకు మేలు కలిగింది. ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రం దూసుకెళ్తోంది. తొలి రెండేళ్లు కరోనా మహమ్మారిని ఎదురొడ్డి మరీ రైతులు ఎగుమతులు చేశారు. లాక్‌డౌన్ ఆంక్షలు ఎత్తివేసిన తర్వాత ఇవి మరింతగా పెరిగాయి. టీడీపీ హయాంలో ఏటా సగటున 3 లక్షల టన్నులు ఎగుమతి అయితే ఈ ఐదేళ్లలో ఏకంగా 6 లక్షల టన్నులు ఎగుమతయ్యాయి. 2018–19లో 42.5 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఉద్యాన పంటలు 2022–23 నాటికి ఏకంగా 45.61 లక్షల ఎకరాలకు పెరిగాయి. మరో వైపు 2018–19 నాటికి 305 లక్షల టన్నులున్న దిగుబడులు 2022–23 నాటికి ఏకంగా 368.89 లక్షల టన్నులకు చేరాయి. సాగులో 15 శాతం, దిగుబడుల్లో 20.9 శాతం వృద్ధి రేటు సాధించింది.

60 శాతం ఉత్పత్తులు విదేశాలకు

ఉద్యాన పంట ఉత్పత్తుల్లో 15 నుంచి 20 శాతం మాత్రమే స్థానికంగా వినియోగిస్తున్నారు. 20 నుంచి 30 శాతం పొరుగు రాష్ట్రాలకు వెళ్తుంటే, దాదాపు 60 శాతం విదేశాలకు ఎగుమతవుతున్నాయి. విదేశాలకు ఎగుమతయ్యే ఉద్యాన ఉత్పత్తుల్లో ప్రధానంగా మిరప, అరటి, బత్తాయి, మామిడి, మామిడి పల్ప్, పసుపు, జీడిపప్పు, సుగంధ ద్రవ్యాలతో పాటు కూరగాయలు

-మిగతా IXలో

ఉద్యాన పంటల అభివృద్ధికి సీఎం జగన్ చేపట్టిన చర్యలు

- మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా అభివృద్ధి చేసిన ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా ఉద్యాన పాలసీలో మార్పులు.
- నాణ్యమైన దిగుబడులు సాధించే లక్ష్యంతో ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో సాగు మెళకువలు నేర్పేందుకు పెద్ద ఎత్తున తోటబడులు నిర్వహణ.
- పంటలకు అదనపు విలువ జోడించేందుకు గ్రామ స్థాయిలో పెద్ద ఎత్తున మౌలిక వసతుల కల్పన.
- మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపర్చడం
- 478 కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు (టీడీపీ హయాంలో ఒక్కటి కూడా లేదు).
- కొత్తగా 89 కోల్డ్ రూమ్స్, 2,905 ప్యాక్ హౌస్‌ల నిర్మాణం. వీటి ద్వారా రైతులకు అదనంగా 2.44 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం పెరిగింది.
- రైతులకు వ్యక్తిగతంగా 1156, రైతు సంఘాలకు 164 ఫామ్ పాండ్స్ నిర్మాణం.
- ఐదేళ్లలో పంటల వారీగా 8,757 తోటబడులు నిర్వహణ.. 2.63 లక్షల మంది రైతులకు నాణ్యమైన దిగుబడుల సాధనపై శిక్షణ.
- దేశంలోనే తొలిసారి మామిడితో పాటు అరటి, మిరప, పసుపు పంట ఉత్పత్తులకు జీఏపీ సర్టిఫికేషన్ జారీ.
- 2,534 ఎకరాల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తున్న 1,051 మంది రైతులతో 13 ఎఫ్‌పీవోలు ఏర్పాటు.

ఓట్లా అభ్యర్థులు?



అక్రమాల్లో టేకిటీజీ పాలసీ

ఆ ఉమ్మడి కుటుంబంలో తండ్రి జాతీయ పార్టీలో ఉంటే.. కొడుకు ప్రాంతీయ పార్టీలో ఉన్నారు. తండ్రి ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా పనిచేసి అక్రమాలతో రూ.వందల కోట్లకు పడగలెత్తారు. కొడుకూ తక్కువేమీ తినలేదు. ఈ కుటుంబం దౌర్జన్యానికి కర్నూలు ప్రజలు దశాబ్దాలుగా పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో వారు ఏనాడూ అభివృద్ధి, ప్రజాసమస్యలను పట్టించుకోలేదు. ఫలితంగా ఆ కుటుంబంపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

-వివరాలు IXలో

అరేయ్.. ఒరేయ్.. అవమానాలకు చెల్లు చీటీ

బడుగులకు గొడుగై నిలిచి వారి **ఆత్మ గౌరవా**న్ని కాపాడటంలో **సీఎం వైఎస్** జగన్‌మోహన్‌రెడ్డి **రాజకీయాల్లో** సరికొత్త చరిత్ర **సృష్టించారు**. అనాదిగా **అట్టడుగు** వర్గాలను అత్యంత **హీనంగా** చూసే పెత్తందార్ల **పోకడలకు** చెక్ పెట్టారు. **'అరేయ్..** ఒరేయ్.. ఏరా.. **పోరా' అం**టూ కులం పేరుతో **హీనంగా** మాట్లాడే అవమానా**లకు చెల్లు** చీటీ రాశారు. తమ **వృత్తుల** ద్వారా సమాజంలో **ప్రజలకు** సేవలందిస్తున్న అనేక **కులాలకు** ఆత్మ గౌరవాన్ని **అందించారు**. తద్వారా ఎన్నో **ఏళ్లుగా కనీ**స గౌరవం పొందలేకపోతున్న బడుగులకు భరోసా కల్పించారు. దీనిపై వెనుకబడిన వర్గాలు సీఎం జగన్ ఔదార్యానికి హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

బీసీలకు ఆత్మగౌరవం అందించిన సీఎం జగన్

- కులం పేరుతో దూషించకుండా ఉత్తర్వులు జారీ
- రజక, నాయీ బ్రాహ్మణ, యాదవ, బట్రాజు, దూదేకులకు సమున్నత గౌరవం
- వైశ్యుల మనోభావాల కోసం చింతామణి నాటకంపై నిషేధం
- నాడు బీసీలపై హీనమైన భాషలో బాబు బెదిరింపులు
- వారిపై ఆది నుంచీ పెత్తందారీ పోకడలే
- బీసీల పార్టీ అంటూనే.. తోకలు కత్తిరింపు

(సాక్షి, అమరావతి)



నాయీ బ్రాహ్మణులను బెదిరిస్తున్న బాబు (ఫైల్)

రాష్ట్రంలో రజకులు, నాయీ బ్రాహ్మణులు, బట్రాజు, దూదేకుల, యాదవ వంటి కులాలకు చెందిన వారిని కులం పేరు, వ్యక్తుల పేరుతోనూ కించపరిచేలా పిలవడం, దూషించడం చేయకూడదని సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధతో వేర్వేరు ఉత్తర్వులు ఇచ్చారు. వారు కూడా సమాజంలో సేవా భావంతో పనిచేసే మనుషులేనని, వారిని కించపరిచేలా వ్యవహరిస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదని జీవోలు జారీ చేయడం విశేషం. వారిని హేళన చేయడం, వారి కులాన్ని తక్కువ చేసి పోల్చడం, ఆయా కులాల పేరుతో జోకులు, వెటకారం ఆడటం, అగౌరవ పర్చడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఆయా కులాలకు అవమానాలను తప్పించి, ఆత్మగౌరవం నింపేలా చేయడంలో సీఎం వైఎస్ జగన్ తరహాలో ఏ ఒక్క నాయకుడు చేయలేదని ఆయా సామాజిక వర్గాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నారు.

వైశ్యుల వేదనతో 'చింతామణి' నిషేధం

రాష్ట్రంలో వైశ్యుల వేదనను పెద్ద మనస్సుతో అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్ 'చింతామణి' నాటకంపై నిషేధం విధించడం అప్పట్లో సంచలనం రేపింది. దాదాపు వందేళ్లకుపైగా ప్రదర్శిస్తున్న ఈ నాటకంలో వైశ్యులను కించపరిచి, అవమానించేలా ఉండటంతో దానిపై నిషేధం విధించడంతో సీఎంకు వైశ్య సామాజికవర్గం మొత్తం పెద్ద ఎత్తున కృతజ్ఞతలు తెలిపింది. సాంఘిక దురాచారాల బారిన పడితే వారి కుటుంబాలు ఎలా దెబ్బతింటాయో వివరించే ప్రయత్నంలో చింతామణి నాటకాన్ని కాళ్లకూరి నారాయణరావు రచించారు. ఉద్దేశం మంచిదే అయినా ఇందులో ప్రత్యేకంగా 'సుబ్బిశెట్టి' పాత్ర వైశ్యుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు చేశారు. సుబ్బిశెట్టి పాత్రను చెడుగా చూపించడంతోపాటు అసభ్యకరంగానూ, ద్వంద్వార్థాలతోను ప్రదర్శించడంతో చింతామణిని నిషేధించాలంటూ ఉద్యమాలు జరిగాయి. వైశ్యుల వేదనను అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్ ఆ నాటకాన్ని నిషేధించారు. ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా, తప్పుగా చూపించేలా ప్రదర్శించే నాటకానికి అనుమతిలేదని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు.


బడుగులపై బాబు ప్రతాపం..

'తోకలు కత్తిరిస్తా.. పిచ్చాటలు ఆడితే సహించేది లేదు.. తమాషాలు చేస్తున్నారా.. ఖబడ్దార్' అంటూ బడుగులపై చంద్రబాబు చూపించిన ప్రతాపం రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదు. టీడీపీ బీసీల పార్టీ అని చెప్పుకొనే చంద్రబాబు వారి పట్ల కనీసం బాధ్యత లేకుండా వ్యవహరించారు. టీడీపీ హయాంలో సమస్యలు చెప్పుకొనేందుకు రాష్ట్ర సచివాలయానికి వచ్చిన నాయీ బ్రాహ్మణులపై చంద్రబాబు చిందులు తొక్కారు. వేతనాలు

-మిగతా IXలో

తొమ్మిదేళ్లయినా చెరగని సిరా గుర్తు!





ఓటేసినప్పుడు వేలిపై పెట్టే ఇంకు గుర్తు ఎన్ని రోజులుంటుంది? వారం. నెల. మహా అయితే రెండు మూడు నెలలు. కానీ కేరళకు చెందిన ఉష అనే ఓటరును మాత్రం తొమ్మిదేళ్లయినా సిరా గుర్తు వదలడం లేదు. ఆమెకు ఇదో పెద్ద తలనొప్పిగా కూడా మారింది!

షోరన్పూర్‌లోని గురువాయూరప్పన్ నగర్‌లో ఉండే 62 ఏళ్ల ఉష 2016లో ఓటేసింది. ఆ సందర్భంగా వేలిపై వేసిన ఇంకు గుర్తు 9 ఏళ్లయినా మాసిపోలేదు. అనేక రకాల సబ్బులు, ద్రావణాలతో కడిగినా లాభం లేకపోయింది. ఆ తర్వాతి స్థానిక ఎన్నికల్లో ఓటేయడానికి వెళ్తే వేలిపై గుర్తు చూసి 'నువ్విప్పటికే ఓటేశావు పొ'మ్మన్నారట ఎన్నికల అధికారులు! పోలింగ్ బూత్‌లోని ఏజెంట్లు అసలు విషయం చెప్పడంతో చివరికి ఓటేయడానికి అనుమతించారు. పోలింగ్ బూత్‌ల్లో ఎందుకీ గోల అని 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఉష ఓటే వేయలేదు! ఈసారీ అదే సమస్య ఎదురవుతుందేమోనని భయపడుతున్నారు. ప్రచారానికి వచ్చిన ఓ నాయకునికి విషయం చెప్పడంతో ఆయన ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని వాళ్లు హామీ ఇచ్చారట. ఎన్నికల సిరా గుర్తు ఇంతకాలం పాటు చెరగకుండా ఉన్న ఘటనలు ఎక్కడా లేవని వారు విస్తుపోతున్నారు! అయితే ఇలా జరిగేందుకు అవకాశం ఉందని చర్మ వ్యాధి నిపుణులు అంటున్నారు. ''సిరా చుక్క గోళ్ల కింద చేరితే మచ్చ అలాగే ఉండే చాన్సుంది. సమగ్ర వైద్య పరీక్షలు చేస్తే కారణం తెలుస్తుంది'' అని చెబుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీ కూటమి హోరాహోరీ

14 లోక్‌సభ స్థానాలకు నేడే పోలింగ్ ● వీటిలో 11 బీజేపీ సిట్టింగ్ స్థానాలే

● కన్నడిగుల తొలి ఓటెవరికో!

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నాటకలో 14 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం రెండో విడతలో పోలింగ్ జరగనుంది. 2019లో రాష్ట్రంలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేయగా ఈసారి బీజేపీ-జేడీ(ఎస్) కూటమితో కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతోంది. జేడీ(ఎస్) పోటీ చేస్తున్న హసన్, మండ్య, కోలార్ స్థానాలకు రెండో విడతలోనే పోలింగ్ ముగియనుంది. ఆ పార్టీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జట్టు కట్టడం విశేషం! ఈసారి పలు స్థానాల్లో పోటీ నువ్వా నేనా అన్నట్టుగా సాగుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

బెంగళూరు రూరల్

2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక స్థానమిది. ఈసారి కూడా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తమ్ముడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 2009లో జేడీ(ఎస్) నేత కుమారస్వామి గెలిచారు. కాంగ్రెస్ ఇక్కడ బలంగా ఉండటంతో దేవెగౌడ అల్లుడు, ప్రముఖ వైద్యుడు సి.ఎన్.మంజునాథను బీజేపీ బరిలో దింపింది. ఇద్దరూ బలమైన అభ్యర్థులు కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. చారిత్రకంగా ఇక్కడ హస్తానిదే ఆధిపత్యం. ఆ పార్టీ ఏకంగా 13 సార్లు నెగ్గగా మూడు సార్లు జేడీ(ఎస్) గెలిచింది.

బెంగళూరు నార్త్

బీజేపీ నేత సదానంద గౌడ 2014 నుంచీ ఇక్కడ గెలుస్తున్నారు. ఈసారి మాత్రం కేంద్ర సహాయ మంత్రి శోభ కరంద్లాజె పోటీ చేస్తున్నారు. ప్రముఖ విద్యావేత్త, కాంగ్రెస్ నేత ఎంవీ రాజీవ్‌గౌడను ఆమె ఢీకొడుతున్నారు. గౌడ బెంగళూరు ఐఐఎం ప్రొఫెసర్. ఆర్బీఐ సెంట్రల్ బోర్డ్ సభ్యుడు. ఈ స్థానం 1999 దాకా కాంగ్రెస్ కంచుకోట. 2004 నుంచీ బీజేపీ జైత్రయాత్ర సాగుతోంది. దీనికి ఈసారి ఎలాగైనా చెక్ పెట్టాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది.



కోలార్

ఒకప్పుడు కాంగ్రెస్‌కు బలమైన పట్టున్న కోలార్‌లో ఈసారి గట్టి పోటీ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇక్కడ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేత ఎస్.మునిస్వామి 2.1 లక్షల మెజారిటీతో కాంగ్రెస్ నేత కె.హెచ్.మునియప్పపై నెగ్గారు. ఈసారి పొత్తులో భాగంగా జేడీ(ఎస్) అభ్యర్థి ఎం.మల్లేశ్‌బాబు పోటీ చేస్తున్నారు. అంతర్గత విభేదాలు కూడా ఇక్కడ కాంగ్రెస్‌కు చేటు చేసేలా ఉన్నాయి. ఇక్కడ ఆరుసార్లు గెలిచిన మునియప్ప ఇటీవలి అసెంబ్లీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. లోక్‌సభ టికెట్‌ను తన అల్లుడికి ఇప్పించుకునేందుకు ప్రయత్నించగా సొంత పార్టీ నేతలే మోకాలడ్డారు.

బెంగళూరు సౌత్

1996 నుంచి ఈ స్థానం బీజేపీకి కంచుకోట. బీజేపీ దివంగత నేత అనంతకుమార్ ఇక్కడినుంచి ఏకంగా 28 ఏళ్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు! 2019 ఎన్నికల్లో యువ నేత తేజస్వి సూర్య బీజేపీ తరఫున 3.31 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఈసారీ ఆయనకే బీజేపీ టికెటిచ్చింది. కాంగ్రెస్ నుంచి రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యా రెడ్డి బరిలో ఉన్నారు. ఈసారీ విజయం తనదేనని తేజస్వి ధీమాగా ఉన్నా పోరు హోరాహోరీగా సాగవచ్చంటున్నారు.

మండ్య

వొక్కళిగ ఆధిపత్యమున్న స్థానమిది. గత ఎన్నికల్లో నటి సుమలత బీజేపీ మద్దతుతో 1.26 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మాజీ సీఎం కుమారస్వామి కుమారుడు నిఖిల్ కుమారస్వామిని ఓడించారు. ఈ స్థానం పొత్తులో భాగంగా ఈసారి జేడీ(ఎస్)కు వెళ్లింది. కుమారస్వామే బరిలో ఉన్నారు. సుమలత బీజేపీలో చేరడం ఆయనకు మరింత కలిసి రానుంది. కాంగ్రెస్ నుంచి వెంకటరమణ గౌడ (స్టార్ చంద్రు) బరిలో ఉన్నారు. 2009, 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి జేడీ(ఎస్) విజయం సాధించడం కూడా కుమారస్వామికి కలిసొచ్చే అంశాల్లో ఒకటి.

సామాజిక వర్గాల ప్రభావం..

రెండో దశలో భాగంగా ఎన్నికలు నిర్వహించే 14 స్థానాలకు గాను మెజారిటీ చోట్ల వొక్కళిగ సామాజిక వర్గం ఓటర్లు కీలకంగా వ్యవహరించనున్నారు. వీరు బీజేపీ వైపు మొగ్గు చూపిస్తుంటారు. వీరితోపాటు ఎస్సీ, ఎస్టీ ఓట్లపైనా బీజేపీ దృష్టి సారించింది. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం ఓటర్లను ఆకర్షించడంపై కాంగ్రెస్ ప్రధానంగా దృష్టి పెట్టింది.

హసన్

మాజీ ప్రధాని దేవెగౌడ ఐదుసార్లు నెగ్గిన స్థానమిది. 2019లో మనవడు ప్రజ్వల్ రేవణ్ణను బరిలో దింపారు. బీజేపీ నేత ఎ.మంజుపై ఆయన 1.41 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఈసారి కూడా జేడీ(ఎస్) నుంచి ప్రజ్వలే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన నేతగా పేరున్న జి.పుట్టస్వామి గౌడ మనవడు శ్రేయస్ పటేల్ పోటీలో ఉన్నారు. ఒకప్పుడు దేవెగౌడ, పుట్టస్వామి పోటీకి వేదికైన హసన్ వారి మనవళ్ల పోరుకు కేంద్రంగా మారింది!

కరవు కోరలు

కర్ణాటకలోని అధిక ప్రాంతాలు ప్రస్తుతం చరిత్రలోనే అతి తీవ్రమైన కరువును చూస్తున్నాయి. దాదాపు అధిక శాతం పట్టణాలను కరువు ప్రాంతాలుగా ఇటీవలే ప్రభుత్వం ప్రకటించింది. ఫలితంగా నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. కరువు కోరల్లోనే జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఐదు గ్యారంటీలతో నెగ్గుకొచ్చిన కాంగ్రెస్‌కు.. లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఆ గ్యారంటీల ప్రభావం ఇప్పుడు అంతగా పనిచేయకపోవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది.

నాలెడ్జ్ కేపిటల్. ఐటీ హబ్. దిగ్గజ శాస్త్ర సాంకేతిక సంస్థల నిలయం. కాస్మోపాలిటన్ సంస్కృతి. చెప్పుకుంటూ పోతే బెంగళూరు నగర ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. కానీ ఎన్నికల విషయానికి వచ్చేసరికి మాత్రం ఈ లెక్కలన్నింటినీ పక్కన పెట్టేస్తున్నారు నగర ఓటర్లు. అన్నిచోట్లా ఉన్నట్టే కులం, మతం, పార్టీ విధేయతలకే ఓటేస్తున్నారు! బెంగళూరు నగర పరిధిలో 4 లోక్‌సభ సీట్లకూ శుక్రవారం రెండో విడతలో పోలింగ్ జరగనుంది. 2008లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పటి నుంచీ ఆ స్థానాల్లో ఓటర్లు ఎప్పుడూ ఒకే పార్టీకో, అభ్యర్థికో పట్టం కడుతుండటం విశేషం...

- సాక్షి, నేషనల్ డెస్క్

బెంగళూరు పరిధిలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో గెలిచిన అభ్యర్థే గెలవడం, ఒకే పార్టీకి ఓటర్లు జై కొట్టడానికి నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తీరే కారణమనేది రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. నేతలు తమకు అనుకూలమైన కులాలు, మతాల ఓటర్లు ఒకే నియోజకవర్గంలోకి వచ్చేలా జాగ్రత్త పడటం వల్లే ఈ ట్రెండ్ కొనసాగుతోందనే వాదనలు బలంగా ఉన్నాయి. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే ధోరణి ప్రతిఫలిస్తోంది. 2008 నుంచి బెంగళూరులోని మొత్తం 28 అసెంబ్లీ స్థానాల్లో 57 శాతం సీట్లను సిట్టింగ్ ఎమ్మెల్యేలే గెలుస్తూ వస్తున్నారు. మరో 18 శాతం సీట్లను ఒకే ఎమ్మెల్యే లేదా పార్టీ కనీసం రెండుసార్లు గెలవడం విశేషం. ఆ లెక్కన చూస్తే నగరంలోని 75 శాతం స్థానాలు ఒకే అభ్యర్థికో, ఒకే పార్టీకో 'రిజర్వ్' అయిపోయాయన్నమాట! రాజకీయాల్లో తరచూ వినిపించే ఓటర్ల వ్యతిరేకత, సిట్టింగ్ ప్రజాప్రతినిధిపై అసంతృప్తి వంటివి బెంగళూరుకు వర్తించవు! నగర పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ సీట్లలో బీజేపీ నుంచి, ఏడు స్థానాల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన అభ్యర్థులే మళ్లీ గెలిచారు. శివాజీనగర్‌లో 2008 నుంచి వరుసగా మూడుసార్లు కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్యే అయిన రోషన్ బేగ్ 2019లో బీజేపీలోకి దూకారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి రిజ్వాన్ అర్షద్ చేతిలో ఆయన చిత్తుగా ఓడటం విశేషం! అర్షద్‌కు ఎమ్మెల్యేగా అది రెండో విజయం. చామరాజ్‌పేట్ నుంచి మూడుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ మాత్రం రెండుసార్లు జేడీ(ఎస్) టికెట్‌పైనా గెలిచారు.

బెంగళూరు సిటీ... రిజర్వ్డ్!


బెంగళూరు ఎయిర్‌పోర్టు

అదే పార్టీ, వారే అభ్యర్థులు

- **పునర్విభజన నుంచీ ఇదే ట్రెండ్**
- **కాస్మోపాలిటన్ సిటీలో కులాధిపత్యం**

వొక్కళిగలే కీలకం...

బెంగళూరులో ఇలా ఒకే పార్టీ, ఒకే అభ్యర్థి వరుసగా గెలుస్తున్న ట్రెండ్ వెనక పలు ఇతర కారణాలూ ఉన్నా కులమే కీలక ఫ్యాక్టర్‌గా నిలుస్తోంది. పార్టీ ఓటు బ్యాంకుతో పాటు పార్టీలు, నేతల మధ్య లోపాయకారీ అవగాహన, తటస్థ ఓటర్ల మొగ్గు కూడా ప్రభావం చూపుతున్నాయి.

- బెంగళూరులోని 28 అసెంబ్లీ స్థానాల్లో 4 ఎస్సీ రిజర్వుడు సీట్లు. వాటిని బీజేపీ, కాంగ్రెస్ చెరో రెండు చొప్పున తమ ఖాతాలో వేసుకుంటూ వస్తున్నాయి.
- బెంగళూరు పరిధిలోని 28 మంది ఎమ్మెల్యేల్లో 13 మంది వొక్కళిగ కులానికి చెందినవారే. మిగతా సీట్లలో కూడా వారి ప్రభావం గట్టిగా కనబడుతుండటం నగరంలో కులాలవారీ ఓటింగ్ కీలకంగా నిలుస్తోందనేందుకు తిరుగులేని నిదర్శనం.
- పునర్విభజన తర్వాత పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి బెంగళూరు నగర పరిధిలోని నియోజకవర్గాలకు ఓటర్ల వలస కూడా ఈ ధోరణికి మరింత దోహదపడుతోంది.
- వొక్కళిగ, ఎస్సీ రిజర్వుడ్‌తో పాటు ముగ్గురు ముస్లిం, ఒక క్రిస్టియన్ అభ్యర్థులు శివాజీనగర్ శాంతిగనర్, చామరాజ్‌పేట్, సర్వజ్ఞనగర్‌లో అసెంబ్లీ స్థానాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు.
- రాజాజీనగర్, గాంధీగనర్, బసవనగుడి, చిక్పేట్ నియోజవర్గాల్లో ఎప్పుడూ బ్రాహ్మణ సామాజిక వర్గమే గెలుస్తోంది.
- ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో నగరంలో టికెట్ల కేటాయింపులోనూ వొక్కళిగల ఆధిపత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నాలుగు సీట్లలో మూడింటిని కాంగ్రెస్ ఆ సామాజికవర్గానికే కట్టబెట్టింది. బెంగళూరు నార్త్ నుంచి రాజీవ్ గౌడ, సౌత్ నుంచి సౌమ్యా రెడ్డి, రూరల్‌లో డీకే సురేశ్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి బెంగళూరు నార్త్ అభ్యర్థి శోభ కరంద్లాజె, రూరల్ నుంచి సీఎన్ మంజునాథ కూడా వొక్కళిగలే.
- బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో చాలావరకు మైనారిటీల ఆధిపత్యమే కావడంతో మన్సూర్ అలీకి కాంగ్రెస్ టికెటిచ్చింది.

బెంగళూరు నగర పరిధిలోని లోక్‌సభ స్థానాలు

బెంగళూరు నార్త్, బెంగళూరు రూరల్, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు సౌత్

లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే ధోరణి

- ➤ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ బెంగళూరు పరిధిలోని స్థానాల్లో దాదాపు ఒకే పార్టీ, లేదా అభ్యర్థే గెలిచారు.
- ➤ బెంగళూరు రూరల్ 2013 ఉపఎన్నిక నుంచీ కాంగ్రెస్ కంచుకోటగా మారింది. పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్ ఇక్కడ హ్యాట్రిక్ కొట్టారు. నాలుగో విజయం కోసం మళ్లీ బరిలో దిగారు. ఆయనదీ వొక్కళిగ కులమే. ఇక్కడ బీజేపీ కూడా అదే సామాజిక వర్గానికి చెందిన దేవెగౌడ అల్లుడు సి.ఎస్.మంజునాథను బరిలో దింపింది.
- ➤ బెంగళూరు సెంట్రల్ బీజేపీ సిట్టింగ్ ఎంపీ పీసీ మోహన్ కూడా హ్యాట్రిక్ వీరుడే. ఈసారి కూడా ఆయనే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ మాత్రం అభ్యర్థిని మార్చి మన్సూర్ అలీతో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది.
- ➤ బెంగళూరు సౌత్ నుంచి బీజేపీ సిట్టింగ్ ఎంపీ తేజస్వీ సూర్య మళ్లీ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1991 నుంచీ కాషాయ జెండానే ఎగురుతుండటం విశేషం! దాంతో ఈసారి రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యా రెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దింపింది.
- ➤ బెంగళూరు నార్త్‌లో మాత్రం 2014 నుంచీ గెలుస్తున్న సదానంద గౌడను బీజేపీ ఈసారి పక్కనబెట్టింది. ఉడుపి-చిక్‌మగళూరు ఎంపీ, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజెను బరిలో దింపింది. ఆమె కోస్తా వొక్కళిగ కాగా కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్ గౌడ స్థానిక వొక్కళిగ కావడం విశేషం.

నోట్ 'గతం' శీర్షికన అందిస్తున్న లోక్‌సభ ఎన్నికల సిరీస్‌కు రెండో విడత పోలింగ్ కవరేజీ కారణంగా ఈ రోజు విరామం. ఆ సిరీస్ రేపటినుంచి యథావిధిగా కొనసాగుతుంది.

హస్తానికి అందని ద్రాక్షేనా!

మధ్యప్రదేశ్‌లో ఆరు సీట్లకు నేడే పోలింగ్

రెండు దశాబ్దాలుగా కాషాయ జెండానే ● యువ అభ్యర్థులతో కాంగ్రెస్ ప్రయోగం

బలమైన బీజేపీని దీటుగా ఢీకొట్టాల్సిన వేళ హస్తం పార్టీ ఆదిలోనే 'చేయి' కాల్చుకుంది. పోలింగ్‌కు ముందే ఈ స్థానాన్ని చేజేతులా 'కమలం' పువ్వులో పెట్టి మరీ అందిస్తోంది. పొత్తులో భాగంగా ఖజురహోను సమాజ్‌వాదీ పార్టీకి కాంగ్రెస్ త్యాగం చేసింది. ఇక్కడ బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, సిట్టింగ్ ఎంపీ వీడీ శర్మపై అనామకుడైన మనోజ్ యాదవ్‌ను ఎస్పీ తొలుత అభ్యర్థిగా ప్రకటించింది. తర్వాత మాజీ ఎమ్మెల్యే మీరా దీపక్ యాదవ్‌కు సీటిచ్చింది. కానీ నామినేషన్ పత్రాల్లో సంతకం మర్చిపోవడంతో ఆమె అభ్యర్థిత్వాన్ని ఈసీ తిరస్కరించింది. దాంతో కంగుతిన్న కాంగ్రెస్, ఎస్పీ పెద్దగా సోదిలో లేని ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఆర్.బి.ప్రజాపతికి మద్దతివ్వాల్సి వస్తోంది. దీంతో ఇక్కడ విజయం బీజేపీకి నల్లేరుపై నడకే కానుంది. 2019లో 4.3 లక్షల పై చిలుకు మెజారిటీతో గెలిచిన శర్మ ఈసారి దాన్ని మరింత పెంచుకుంటారంటున్నారు. ''వీడీ శర్మ చూడ్డానికి సన్నగా కనిపించినా ఆయన నాయకత్వంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కొత్త రికార్డులు కొట్టింది'' అంటూ తాజాగా దామోహ్ ఎన్నికల సభలో ప్రధాని మోదీ ఆకాశానికెత్తారు.

ఖజురహో... కాంగ్రెస్ సెల్ఫ్ గోల్

హోషంగాబాద్.. కుబేరుడితో సరస్వతీ పుత్రుడు ఢీ!

ఇక్కడ బీజేపీ సిట్టింగ్ ఎంపీ ఉదయ్ ప్రతాప్ సింగ్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. దాంతో ఈసారి ఐదు మాస్టర్ డిగ్రీల వీరుడు, రైతు ఉద్యమకారుడు దర్శన్ సింగ్ చౌదరిని బీజేపీ బరిలో దింపింది. నెరిసిన గడ్డం, తెల్లటి తలపాగాతో సౌమ్యంగా కనిపించే ఈయన సరస్వతీ పుత్రుడు. ఫిలాసఫీ, ఇంగ్లిష్, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, సోషియాలజీల్లో ఎంఏ చేశారు. నర్మదా లోయలో పలు రైతు ఉద్యమాలకు సారథ్యం వహించారు. బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు కొత్తే అయినా బాగా గుర్తింపున్న నాయకుడు. కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శర్మ రాష్ట్రంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరు. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తి రూ.233 కోట్లు. హోషంగాబాద్ నియోజకవర్గ పరిధిలోని తెండుఖేడా అసెంబ్లీ స్థానం నుంచి రెండుసార్లు గెలిచారు. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడారు.



హిందీ బెల్టులో కీలక రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. 2009లో 12 స్థానాల్లో గెలిచిన హస్తం పార్టీ 2014లో 2 స్థానాలకు పడిపోయింది. 2019కి వచ్చేసరికి ఒకే సీటుకు పరిమితమైంది. మిగతా 28 చోట్ల కాషాయ జెండాయే ఎగిరింది! గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ దుమ్ము రేపింది. శుక్రవారం రెండో విడతలో రాష్ట్రంలో ఆరు కీలక స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇవన్నీ బీజేపీ కంచుకోటలే. ఇక్కడ బీజేపీని ఎదుర్కోలేక రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ అష్టకష్టాలు పడుతోంది. ఆ స్థానాల్లో బరిలో ఉన్న అభ్యర్థులు, వారి బలాబలాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

తికంగఢ్... యమా టఫ్

2009లో ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంగా మారినప్పటి నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. ఇక్కడ బీజేపీ హ్యాట్రిక్ వీరుడు, కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ ఖటిక్ మళ్లీ బరిలో ఉన్నారు. గతంలో సాగర్ లోక్‌సభ స్థానంలోనూ నాలుగుసార్లు గెలిచిన రికార్డు ఆయనది. 2009లో తికంగఢ్ స్థానం ఏర్పడ్డప్పటి నుంచీ ఆయనే గెలుస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ ఇక్కడ ప్రతిసారీ అభ్యర్థులను మార్చినా ఫలితం మాత్రం శూన్యం. వీరేంద్ర అంతకంతకూ మెజారిటీ పెంచుకుంటూ పోతున్నారు. ఈసారి పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంకజ్ అహిర్వార్ రూపంలో యువ నేతను కాంగ్రెస్ బరిలోకి దించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జతారా స్థానం నుంచి టికెట్ ఇవ్వకపోవడంతో ఆయన తిరుగుబావుటా ఎగరేశారు. దాంతో ఇలా ఎంపీ టికెటిచ్చింది. బాహుబలి వంటి కేంద్ర మంత్రి వీరేంద్రపై పోటీకి నిలపడం పంకజ్‌ను బలిపశువును చేయడమేనని కాంగ్రెస్ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు!

దామోహ్.. లోధీ వర్సెస్ లోధీ

బడా నేతలెవరూ రేసులో లేకున్నా ఆసక్తి రేపుతున్న నియోజకవర్గమిది. బీజేపీ అభ్యర్థి రాహుల్ సింగ్ లోధీ, కాంగ్రెస్ అభ్యర్థి తర్బార్‌సింగ్ లోధీ ఇద్దరూ ఒకప్పుడు బీజేపీ ఫైర్ బ్రాండ్ ఉమా భారతి వీరవిధేయులే! పైగా బంధువులు కూడా. 2018 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇద్దరూ బీజేపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. దామోహ్ నుంచి రాహుల్, బాందా నుంచి తర్బార్ ఎమ్మెల్యేలుగా గెలిచారు. 15 నెలలకే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడంతో రాహుల్ మళ్లీ బీజేపీ పంచన చేరారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య పోటీ హోరాహోరీగానే ఉండొచ్చనేది పరిశీలకుల అభిప్రాయం. ఇక్కడ రెండుసార్లు నెగ్గిన సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ గత డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి రాష్ట్ర మంత్రి అయ్యారు.

సత్నా.. హోరాహోరీ

నాలుగుసార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ బలశాలి గణేశ్ సింగ్‌పై యువ ఎమ్మెల్యే సిద్దార్థ్ కుశ్వాహను కాంగ్రెస్ బరిలో నిలిపింది. ఐదు నెలల క్రితమే సత్నా అసెంబ్లీ స్థానంలో గణేశ్ సింగ్‌ను కుశ్వాహ మట్టికరిపించడం విశేషం! దాంతో ఈసారి వారిద్దరి పోటీ ఉత్కంఠ రేపుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి షాకిచ్చిన చరిత్ర కుశ్వాహది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బీజేపీ నేత శంకర్‌లాల్ తివారీని ఓడించి జెయింట్ కిల్లర్‌గా పేరొందారు.

రేవా.. కమలానికే మొగ్గు

బ్రాహ్మణ ఓట్లు ఎక్కువగా ఉన్న ఈ స్థానంలో ఇరు పార్టీలూ ఆ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులనే నిలబెడుతూ వస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీ జనార్దన్ మిశ్రాకే బీజేపీ మళ్లీ టికెటిచ్చింది. ఇక్కడ 2014లో 1.68 లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గిన మిశ్రా 2019లో దాన్ని 3.12 లక్షలకు పెంచుకున్నారు. ప్రతిసారీ అభ్యర్థులను మారుస్తున్న కాంగ్రెస్ ఈసారి మహిళకు టిక్కెట్ ఇచ్చింది. రేవా మేయర్ అభయ్ మిశ్రా భార్య నీలంను రంగంలోకి దించింది. అయితే ఈ ఎంపీ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏడు బీజేపీ గుప్పిట్లోనే ఉన్నాయి. ఈసారీ ఆ పార్టీకే విజయావకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రతి ఇంటికీ మేలు



జగన్ సీఎం అయ్యాక పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో మేలు జరిగింది. చంద్రబాబు హయాంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు మాత్రమే బాగుపడ్డారు. బాబు అధికారంలో ఉంటే రాష్ట్రంలో కరువు తప్పదు. తన 14 ఏళ్ల పాలనలో ప్రజలు గుర్తుపెట్టుకునే ఏ పథకమూ అమలు చేయలేదు. ఎవరిపై ఎక్కువ కేసులుంటే వారికే నామినేటెడ్ పదవులని ఆయన కొడుకు లోకేశ్ చెప్తున్నాడు. ఇలాంటి వారికి ఓటేస్తే రాష్ట్రం పరిస్థితి ఏంటన్నది ప్రజలు గుర్తించాలి.

-అన్నెం చిరంజీవి, అబ్బయ్యపాలెం, దర్శి, ప్రకాశం జిల్లా

ప్రతి హామీ నెరవేర్చారు



దేశ చరిత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. మేనిఫెస్టో అంటే ప్రజల్ని మభ్యపెట్టేందుకు ఓ మార్గంగా గత ప్రభుత్వం చూసింది. జగనన్న మాత్రమే మేనిఫెస్టోను ఓ పవిత్ర గ్రంథంగా చూశారు. ప్రతి సంక్షేమ పథకం లబ్ధిని అర్హులైన వారందరికీ అందించారు. విద్య, వైద్యంలో దేశం మొత్తం మన వైపు చూసేలా చేశారు. జగనన్న మాటిచ్చారంటే.. చేసి చూపిస్తారంతే.. అన్న నమ్మకం ప్రజల్లో ఉంది. అందుకే మళ్లీ మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

- కంకణాల శివ, గుర్ల, విజయనగరం జిల్లా

జగన్‌తోనే బడుగుల అభ్యున్నతి



గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. రైతులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, మహిళలు, వృద్ధులు, పేదింటి పిల్లలు ఇలా ప్రతి వర్గానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోంది. గత ప్రభుత్వం మైనార్టీల గురించి ఆలోచించిన దాఖలాల్లేవు. జగనన్న ప్రభుత్వంలోనే మైనార్టీలకు అన్ని విధాలా లబ్ధి చేకూరింది. మా పిల్లల చదువులకు ఢోకా లేకుండా ఉంది. మా ఆడపిల్లల పెళ్లికి ఏటా షాదీ తోఫా పేరిట ఆర్థిక సాయం చేస్తున్నారు.

- మర్రిమాను షేక్ అంజద్‌బాషా, పెద్ద ఉప్పరపల్లి, చిత్తూరు జిల్లా

• దేశంలోనే తొలి ఏకగ్రీవ ఎంపీ విశ్వనాథరెడ్డి



దేశంలో తొలిసారిగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెకు చెందిన వ్యక్తి లోక్‌సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1952లో లోక్‌సభకు తొలి ఎన్నికలు జరగ్గా తంబళ్లపల్లెకు చెందిన టి.ఎస్.విశ్వనాథరెడ్డి చిత్తూరు లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి 1,61,590 ఓట్లతో విజయం సాధించారు. ఆ తర్వాత 1957లో జరిగిన రెండో లోక్‌సభ ఎన్నికల్లో ఆయన అప్పటి కడప–చిత్తూరు ఉమ్మడి జిల్లాల పరిధికి వచ్చే రాజంపేట లోక్‌సభ నుంచి బరిలో దిగేందుకు నిర్ణయించారు. జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, వాయల్పాడు నియోజకవర్గాలు అప్పట్లో రాజంపేట పార్లమెంటు పరిధిలో ఉండేవి. కాంగ్రెస్ అభ్యర్థిగా టి.ఎస్.విశ్వనాథరెడ్డి నామినేషన్ వేయగా మిగతా పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్లు వేయకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. - బి.కొత్తకోట

అరేయ్.. ఒరేయ్.. అవమానాలకు చెల్లు చీటీ

▶ 7వ పేజీ తరువాయి

పెంచాలని అడిగితే 'తోకలు కత్తిరిస్తా' అంటూ చంద్రబాబు వేలు చూపించి మరీ హెచ్చరికలు జారీ చేసిన పెత్తందారీ పోకడలు జనం మరచిపోలేదు.

20 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కింది



నూర్ బాషా (దూదేకు)లను సగం సాయిబు, అర ముస్లిం, పింజరి, పింజారోడా అని అవమానించే దారుణమైన పదాలను తొలగించాలని దాదాపు 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. మా వేదన ఎవరూ పట్టించుకోలేదు. చివరికి సీఎం వైఎస్ జగన్ దయ చూపి అడిగిన వెంటనే జీవో ఇచ్చారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మా గురించి పట్టించుకోలేదు. 2014 ఎన్నికల్లో దూదేకులకు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ నామినేటెడ్ కార్పొరేషన్ పదవులు ఇస్తానని చెప్పిన చంద్రబాబు మోసం చేశాడు. అదే సీఎం వైఎస్ జగన్ ఏలూరు మేయర్ పదవి, టైలర్స్ ఫెడరేషన్, నూర్‌బాషా కార్పొరేషన్, రాష్ట్ర డైరెక్టర్లు వంటివి ఇవ్వడంతోపాటు సంక్షేమానికి అనేక పథకాలు అందించి అండగా నిలిచారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయిన మా దూదేకులం ఇకపై సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి సీఎం చేయడానికి పనిచేస్తాం.

-షేక్ దస్తగిరి, దూదేకుల పొలిటికల్ జేఏసీ చైర్మన్

బాబు అవమానిస్తే.. జగన్ గౌరవించారు



నాయీ బ్రాహ్మణులను చంద్రబాబు దారుణంగా అవమానిస్తే.. సీఎం వైఎస్ జగన్ ఆత్మస్థైర్యం నింపారు. సమాజంలో వృత్తిని బట్టి అగౌరవపరిచేలా పిలవకూడదని జీవో ఇచ్చి మా ఆత్మ గౌరవాన్ని నిలబెట్టారు. తొలిసారిగా టీటీడీ బోర్డు మెంబర్‌గా చిట్టవరపు యానదయ్యకు, ప్రముఖ దేవాలయాల పాలక వర్గాల్లోను నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పుల్లయ్య నియామకం, పలువురికి నామినేటెడ్ పదవులు ఇచ్చి ఆదరించారు. ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం, నెలకు 150 యూనిట్ల ఉచిత కరెంటు ఇచ్చి సీఎం వైఎస్ జగన్ మాకు ఎంతో అండగా నిలిచారు.

-మల్లువలస వీరవెంకట సత్యనారాయణ, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి

అక్రమాల్లో టేకిటీజీ పాలసీ

- వలస వచ్చి కర్నూల్లో పాగా
- మంచినీళ్లు తాగినంత సులువుగా స్వాహా.. అవకతవకల్లో ఆరితేరిన తండ్రీ కొడుకులు
- కేసీ కెనాల్ భూములు హాంఫట్
- 60 ఏళ్లుగా గోశాల భూముల లీజు పేరుతో దగా.. సినిమా థియేటర్లు, హోటల్, షాపింగ్ మాల్స్
- తుంగభద్ర ఒడ్డున ఫ్యాక్టరీ కాలుష్యం.. ప్రజలకు శాపం
- రూ.వందల కోట్లకు పడగలెత్తిన టీడీపీ అభ్యర్థి బాగోతం

సాక్షి, టాస్క్‌ఫోర్స్

ఆ కుటుంబం పేరు చెబితే వెంటనే వారు చేసిన ఆకృత్యాలే ప్రజలకు గుర్తుకొస్తాయి. తరచూ పార్టీలు మారే తండ్రికి ఓ రాజకీయ సిద్ధాంతం, పద్ధతి లేదనే విమర్శలు ఉన్నాయి. ఆయన ఇప్పుడు ఓ జాతీయ పార్టీలో ఉంటే కొడుకు ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం తరఫున అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. ఈ కుటుంబం బినామీ పేర్లతో వక్ఫ్ భూములు, దేవదాయ శాఖ మాన్యాలను తమ అధీనంలో పెట్టుకుని సర్కారు ఖజానాకు గండి కొడుతోంది.



గోశాల పేరుతో పెద్ద దందా!

కర్నూలు సిటీ నడిబొడ్డున దేవదాయశాఖ పరిధిలోని 1.31ఎకరాల గోశాల స్థలాన్ని 60 ఏళ్ల కిందట వి.రామచంద్రమ్మ అనే బినామీ పేరుతో లీజుకు తీసుకున్న ఈ కుటుంబం థియేటర్లు నిర్మించింది. జ్యూవెలరీ, బ్యాంకు, షోరూంతో పాటు 20 వరకు కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించింది. తొలుత 30 ఏళ్లకు తీసుకున్న లీజు గడువు 1994 జూలై 1న ముగిసింది. అప్పట్లో నెలకు రూ.63,730 అద్దె ఉండేది. దానిని రూ.98,794కి పెంచి మరో 30 ఏళ్లు లీజుకు తీసుకున్నారు. రాబోయే జూలైతో ఆ గడువు ముగియనుంది. షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, గ్రూపు థియేటర్లకు కలిపి నెలకు రూ.25 లక్షల వరకూ ఈ కుటుంబం అద్దె వసూలు చేస్తోందని చెబుతున్నారు. నిజానికి ఇంత కంటే ఎక్కువే అద్దె వస్తున్నట్లు సమాచారం. మళ్లీ ఇప్పుడు లీజును పొడిగించుకునేందుకు తండ్రీకొడుకులు యత్నిస్తున్నారు.

రైతులకు వేదన.. ఆల్కలీస్ ఫ్యాక్టరీ!

తుంగభద్ర నదీ తీరంలో రాయలసీమ ఆల్కలీస్ ఫ్యాక్టరీ ఉంది. ఇది ఆ కుటుంబానికి చెందినదే. దీని కాలుష్యంతో ఇ.తాండ్రపాడు, గొందిపర్ల, ఇందిరమ్మకాలనీ, వసంతనగర్, దొడ్డిపాడు, పూలతోట, దేవమడ గ్రామాలలో వందల ఎకరాల వ్యవసాయ భూములు పంటలు పండక బీళ్లుగా మిగిలిపోయాయి. ప్రజలు అనారోగ్యానికి గురికావడంతో పాటు పశువులు చనిపోయిన ఘటనలు కోకొల్లలు. ఈ ప్రాంతంలో ఏదైనా ఘటన జరిగినా బయటకు రానివ్వరు. పరాయి వ్యక్తులను అక్కడికి వెళ్లనివ్వరు. తుంగభద్రకు ఇటువైపు కర్నూలు రాఘవేంద్ర మఠం అటువైపు ఫ్యాక్టరీ ఉంది. వీటి మధ్య వంతెన నిర్మించాలని దాంతో గ్రామాలకు, సిటీకి రాకపోకలు పెరగడంతోపాటు జోగులాంబ ఆలయానికి దగ్గరవుతుందని 25 ఏళ్లకుపైబడి ప్రతిపాదనలు పంపుతున్నా, ఆ కుటుంబం అడ్డుకుంటుందనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి కారణం వంతెన నిర్మిస్తే ఫ్యాక్టరీ విషయాలు అందరికీ తెలియడంతోపాటు ఏ చిన్న ఘటన జరిగినా ఆందోళనలు చేస్తారనే భయమేనని స్థానికులు చెబుతున్నారు.

కేసీ కెనాల్ భూములు స్వాహా!

కర్నూలు మండల పరిధిలోని మునగాలపాడు పరిధిలో 46ఏ, 46బీ, 79బీ సర్వే నంబర్లలో 123.82 ఎకరాల భూమి ఉంది. జలవనరుల శాఖ పరిధిలో కేసీ కెనాల్(కర్నూలు–కడప కాల్వ) బండ్ భూమిగా 1908 ఆర్ఎస్ఆర్ రికార్డులు చెబుతున్నాయి. ఇవి హైదరాబాద్, బెంగళూరు నేషనల్ హైవే పక్కనే ఉన్నాయి. ఈ భూములపై ఆ కుటుంబం కన్ను పడింది. తమకు అనుకూలమైన ముగ్గురు వ్యక్తులను ఎంచుకుని 1998లోనే ఆ భూమి వారి పరిధిలో ఉన్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించినట్లు తెలుస్తోంది. ఆపై మరో ఇద్దరు ఆ భూములను కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్లు సృష్టించారు. ఆ తర్వాత 2003లో వీటిలో 5.43 ఎకరాలను వారసుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. ఇది కాకుండా నలుగురు వ్యక్తులు ఇతరుల వద్ద తాకట్టుపెట్టిన సర్వే నంబర్ 46/1 మరో 1.5 ఎకరాల భూమిపై పంచాయితీని 2015లో ఆ కుటుంబం సెటిల్ చేసి వారసుల పేరుతో రాయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ భూమి విలువ రూ.100 కోట్లపైనే ఉంటుంది.

కర్నూలు అభివృద్ధిపై మాటలే.. చేతలేవీ?

కర్నూలు సిటీలో జొహరాపురంలో డంపింగ్ యార్డు ఉంది. దీన్ని తీసేస్తానని 2009, 2014లో ఆ కుటుంబ పెద్ద మాట ఇచ్చారు. 2009లో గెలిచి మంత్రి అయ్యారు. 2014లో ఆయన ఓడిపోయినా ఆయన పార్టీ ప్రభుత్వమే ఉంది. కానీ దీని గురించి ఆయన పట్టించుకోలేదు. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించి 23 ఎకరాల్లోని డంపింగ్ యార్డును తీసేస్తున్నారు. 95శాతం డంప్ తీసేశారు. దీంతో చుట్టపక్కల 50 వేల మందికి ఉపశమనం లభించింది.

కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి సమస్య నుంచి శాశ్వత పరిష్కారం చూపుతానని గతంలో ఆ కుటుంబ పెద్ద హామీ ఇచ్చారు. చేయలేకపోయారు. జగన్ ప్రభుత్వం వచ్చాక రూ.82 కోట్లతో సుంకేసుల రిజర్వాయర్ నుంచి ఎస్ఎస్ ట్యాంకు వరకూ పైపులైన్ నిర్మించారు. దీంతో సిటీకి నీటి కష్టాలు తప్పాయి.

2007లో కర్నూలుకు వరదలు వచ్చాయి. దీంతో వైఎస్సార్ రూ.244 కోట్లు మంజూరు చేసి కేసీ కెనాల్, హంద్రికి రక్షణ గోడ నిర్మించాలని నిర్ణయించారు. ఆ కుటుంబం దీన్ని నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా 2009లో ప్రకృతి విలయంతో కర్నూలు కకావికలమైంది.

కార్పొరేషన్ నూతన భవనానికి 2010లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ఆ కుటుంబ పెద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. రూ.9 కోట్ల అంచనాలతో చేపట్టాల్సిన ఈ పనులు చేయలేకపోయారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం రూ.26 కోట్లు వెచ్చించి భవనం నిర్మిస్తోంది. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయ్యాయి..

మీకు తెలుసా?




రాజకీయ అపర చాణక్యుడు 'సుబ్బరాజు'

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ రాజకీయ చరిత్రలో మంతెన వెంకట సూర్య సుబ్బరాజు మూడున్నర దశాబ్దాల పాటు తనదైన ప్రత్యేక శైలిలో రాజకీయాలు నడిపి రాజకీయ అపర చాణక్యునిగా గుర్తింపు పొందారు. ఈ నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యే కళా వెంకటరావు (1959)లో కాగా, ఆయన అదే సంవత్సరం మరణించడంతో ఉప ఎన్నికల్లో రెండో ఎమ్మెల్యేగా సుబ్బరాజు గెలిచారు. రాష్ట్ర మంత్రిగా, జాతీయ కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక భూమిక పోషించిన కళా తరహాలోనే ఈయన కూడా ఈ నియోజకవర్గానికి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు తీసుకు వచ్చారు. ఈ నియోజకవర్గంలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక నాయకుడు ఆయనే.



దేశంలోని తొలి ఎన్నికల్లో ఏపీ పాత్ర

1952లో దేశవ్యాప్తంగా మొట్టమొదట జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయానికి ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు, కర్నూలు వరకు ఉన్న ప్రాంతమంతా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండేది. కర్నాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, ప్రస్తుత తెలంగాణా అంతా హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా వుండేది. ఈ రెండు రాష్ట్రాలకు వేర్వేరుగా 1952లో తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణాలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీలు ప్రధాన ప్రత్యర్థి పార్టీలుగా ఢీకొన్నాయి. నువ్వా నేనా అన్నట్టు జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ 41 స్థానాల్లో గెలుపొందగా కాంగ్రెస్‌పార్టీ 40 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీకి 20 స్థానాలు, ఎన్‌జీ రంగా ఆధ్వర్యంలో కృషికార్ లోక్‌పార్టీకి 15 స్థానాలు దక్కాయి. నీలం సంజీవరెడ్డి, కళా వెంకటరావు, బెజవాడ గోపాల్ రెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, కల్లూరి చంద్రమౌళి లాంటి హేమాహేమీలైన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటమి పాలయ్యారు.



అక్కడ గెలిస్తే 'మంత్రి'ముగ్ధులే!

బాపట్ల జిల్లాలోని వేమూరు అసెంబ్లీ నియోజకవర్గానిది రాజకీయంగా ప్రత్యేక స్థానం. ఇక్కడ నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైన వారిలో దాదాపుగా అందరినీ మంత్రి పదవి వరించింది. వేమూరు నియోజకవర్గంలో 15సార్లు ఎన్నికలు జరగ్గా పది మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇందులో ఏడుగురిని మంత్రి పదవి వరించింది. వీరిలో నాదెండ్ల భాస్కరరావు మంత్రిగానూ, నెలరోజుల పాటు ముఖ్యమంత్రిగానూ పనిచేశారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన కల్లూరి చంద్రమౌళి, యడ్లపాటి వెంకట్రావు, ఆలపాటి ధర్మారావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, సతీష్‌పాల్‌రాజ్, నక్కా ఆనందబాబు, మేరుగ నాగార్జున, మంత్రులుగా పనిచేశారు. కొడాలి వీరయ్య, ఎస్.రామస్వామి మాత్రం ఇక్కడి నుంచి గెలిచినా మంత్రులు కాలేకపోయారు.

నాడంతా బొక్కుడే



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల బడ్జెట్‌లో సామాజిక, ఆర్థిక, సాధారణ సేవలకు గత చంద్రబాబు హయాం కన్నా భారీగా వ్యయం చేశారు. తద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధి రంగాలకు రికార్డు స్థాయిలో నిధులు వెచ్చించారు. చంద్రబాబు దిగిపోయే నాటికి బడ్జెట్ వ్యయం రూ.1.50 లక్షల కోట్లు ఉండగా, ఈ నాలుగేళ్ల ఆర్థిక సంవత్సరంలో కూడా బడ్జెట్ ఇంచుమించు అంతే. ప్రస్తుత ఆర్థిక ఏడాది నాటికి స్వల్పంగా రూ.50 వేల నుంచి రూ.60 వేల కోట్లు మాత్రమే బడ్జెట్ పెరిగింది. అయినా సరే అర్హులైన పేదలందరికీ సంక్షేమం అందిస్తూ మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. కోవిడ్ సంక్షోభం నేపథ్యంలో ఇటు రాష్ట్ర సొంత ఆదాయం, అటు కేంద్రం నుంచి పన్నుల వాటా రూపంలో రావాల్సిన ఆదాయం తగ్గినప్పటికీ, మేనిఫెస్టోలో చెప్పినవన్నీ నెరవేర్చారు. మరో పక్క ఆస్తుల కల్పనకు గత చంద్రబాబు ఐదేళ్ల కన్నా ఈ ఐదేళ్లలోనే ఎక్కువగా వ్యయం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు, స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఆలోచన గానీ, పోర్టులు.. ఎయిర్ పోర్టులు నిర్మించాలనే ఆలోచన గానీ, ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీల నిర్మాణం చేయాలనే ఆలోచన గానీ, గ్రామాల్లో రైతులతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఆలోచన గానీ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో చేయలేదు. అయితే ఇవన్నీ కోవిడ్ సంక్షోభంలోనూ సీఎం వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో చేసి చూపించారు. కోవిడ్ కారణంగా బాబు హయాం కన్నా రాష్ట్ర రాబడులు తగ్గినప్పటికీ ఎక్కడా సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా సమతుల్యతతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించిన ఘనత సీఎం జగన్‌కే దక్కింది.

సామాజిక సేవలు ఇప్పుడే ఘనం

ఐదేళ్ల బడ్జెట్ (ఒక నెల తక్కువ) ద్వారా సామాజిక సేవలకు గత చంద్రబాబు హయాం కన్నా సీఎం జగన్ భారీగా వ్యయం చేశారు. బాబు ఐదేళ్ల బడ్జెట్ ద్వారా సామాజిక సేవలకు చేసిన వ్యయం కన్నా ఐదేళ్ల సీఎం జగన్ హయాంలో రూ.1.58 లక్షల కోట్లు ఎక్కువగా వ్యయం చేశారు. సామాజిక సేవలంటే విద్య, వైద్యం, కుటుంబ సంక్షేమం, నీటి సరఫరా, ఎస్సీ, ఎస్టీ తదితర సంక్షేమాల వ్యయం. ఐదేళ్ల బడ్జెట్ ద్వారా సీఎం వైఎస్ జగన్ గత బాబు ఐదేళ్ల కన్నా సాధారణ సేవలకు రూ.1.38 లక్షల కోట్లు ఎక్కువగా వ్యయం చేశారు. సాధారణ సేవలంటే న్యాయ, పోలీసు, జైలు, వికలాంగులు, వడ్డీలు, పెన్షన్ తదితర వ్యయాలు. ఐదేళ్ల బడ్జెట్‌లో సీఎం వైఎస్ జగన్ గత చంద్రబాబు హయాం కన్నా ఆర్థిక సేవలకు రూ.40,508 కోట్లు ఎక్కువ వ్యయం చేశారు. ఆర్థిక సేవలంటే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, సహకారం, ఇంధన, పరిశ్రమలు, రవాణా తదితర వ్యయాలు. అలాగే గత ఐదేళ్ల బాబు బడ్జెట్ కన్నా సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ఆస్తుల కల్పన వ్యయం అంటే మూల ధన వ్యయం ఎక్కువగా చేశారు. బాబు ఐదేళ్లలో మూల ధన వ్యయం రూ.76,139 కోట్లు చేస్తే, సీఎం వైఎస్ జగన్ ఐదేళ్లలో మూల ధన వ్యయం రూ.87,634 కోట్లు చేశారు. ఈ లెక్కలన్నీ కాగ్ గణాంకాల ఆధారంగా స్పష్టమయ్యాయి.

బాబుకు ఒక్క మంచి ఆలోచన రాలేదు

ఒక పక్క పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తూనే మరో పక్క గ్రామాల్లో, వార్డుల్లో ప్రజలకు వారి ముంగిటే ప్రభుత్వ సేవలందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సీఎం జగన్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సేవలు, పథకాలన్నీ ఆయా గ్రామ, వార్డుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతుల కోసం ప్రత్యేకంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామాలు, వార్డుల్లో విలేజ్, పట్టణ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేశారు. అనుభవం గల వాడినని చెప్పుకునే చంద్రబాబుకు ఇవన్నీ చేయాలనే ఆలోచన కూడా రాలేదు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ రంగంలో ఒకేసారి రూ.8,480 కోట్ల వ్యయంతో 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారు. ఇందులో ఐదు మెడికల్ కాలేజీలు ఇప్పటికే ప్రారంభం కాగా, మిగతావి ప్రారంభమయ్యే దశలో ఉన్నాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, కొత్త నిర్మాణాలకు నాడు–నేడు పేరుతో ఏకంగా రూ.16 వేల కోట్లు వ్యయం చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లను చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తే సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు మన బడి నాడు–నేడు పేరుతో మరో రూ.16 వేల కోట్లు వ్యయం చేస్తున్నారు. ఈ విధంగా చేయవచ్చనే ఆలోచన కూడా చంద్రబాబుకు రాలేదు. రాష్ట్రంలో రూ.25 వేల కోట్లతో కొత్తగా నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ కేంద్రాల నిర్మాణాలను సీఎం వైఎస్ జగన్ చేపట్టారు.


నాడు దోపిడీపైనే బాబు ప్రత్యేక శ్రద్ధ

చంద్రబాబు రూ.17,368 కోట్లతో 43 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని శ్వేత పత్రంలో ప్రకటించి, ఐదేళ్లలో రూ. 68,293 కోట్లు వ్యయం చేసినా ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. దీన్ని బట్టి చూస్తే ఏ స్థాయిలో దోపిడీ చేశారో స్పష్టం అవుతోంది. ఇందుకు అదనంగా నీరు–చెట్టు పేరుతో రూ.12 వేల కోట్లు విలువైన పనులను పార్టీ కార్యకర్తలకు నామినేషన్ల విధానంలో ఇచ్చి దోపిడీ చేశారు. సీఎం జగన్ ఐదేళ్లలో రూ.35,268 కోట్లతో వ్యయం చేసి ఆరు ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. అప్పులు తేవడంలో మాత్రం గత చంద్రబాబు ప్రభుత్వం ముందంజలో ఉంది. గత చంద్రబాబు పాలనలో అన్ని రకాల అప్పుల సగటు వార్షిక వృద్ధి 21.87 శాతం ఉండగా, ఈ ఐదేళ్ల సగటు వార్షిక వృద్ధి 12.13 శాతంగా ఉంది. సుమారు రూ.8,000 కోట్ల వ్యయంతో గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల కోసం ఏకంగా 22,435 భవనాల నిర్మాణాలను చేపట్టారు. ఇందులో 90 శాతం భవనాల నిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభోత్సవాలు కూడా జరిగాయి. ఈ భవనాలన్నీ ఆయా గ్రామాలకు ఆస్తులుగా నిలిచిపోనున్నాయి. మరో పక్క కొత్తగా 13 జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా మొత్తం 26 జిల్లాలను ఏర్పాటు చేశారు. పదే పదే మూడు సార్లు సీఎంగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబుకు గ్రామాల్లోనే ప్రజల చెంతకు పాలన అందించాలనే ఆలోచన గానీ, నగదు బదిలీ ద్వారా పేదలకు లంచాల్లేకుండా సంక్షేమం అందించాలనే ఆలోచన గానీ, పోర్టుల నిర్మాణం చేపట్టాలనే ఆలోచన గానీ ఎందుకు రాలేదు?

నేడు అర్హతే ప్రామాణికం

అర్హులైన పేదలందరికీ సంతృప్త స్థాయిలో నవరత్నాల పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నగదు బదిలీ చేశారు. ఐదేళ్ల పాలనలో ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు నేరుగా నగదు బదిలీ చేశారు. నగదేతర బదిలీ ద్వారా మరో రూ. 1.84 లక్షల కోట్లు పేదలకు వివిధ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం కల్పించారు. అంటే అర్హులైన పేదల సంక్షేమానికి ఐదేళ్లలో ఏకంగా రూ.4.54 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ తన ఐదేళ్ల పాలనలో వ్యయం చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఇలాంటి నగదు బదిలీ పథకాలేమీ లేకపోగా, పేదలకు అందించే సాయంలో జన్మభూమి కమిటీలు, పచ్చ నేతలు కొంత కొట్టేశారు. ఆఖరికి వృద్ధులు, ఒంటరి మహిళలకు పెన్షన్ ఇవ్వాలంటే ఆ గ్రామంలో పెన్షన్ పొందుతున్న వారు మృతి చెందితేనే ఆ స్థానంలో కొత్త వారికి పెన్షన్ మంజూరు చేసే దౌర్భాగ్య పరిస్థితిని చంద్రబాబు ప్రభుత్వం చేసింది. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కూడా జన్మభూమి కమిటీల పేరుతో పార్టీ వారినే ఎంపిక చేయించారు తప్ప అర్హులా కాదా అనేది పట్టించుకోలేదు. అయితే సీఎం వైఎస్ జగన్ హయాంలో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేశారు. పైసా లంచం లేకుండా పార్టీలు, వివక్ష లేకుండా అర్హులైతే చాలు వారందరికీ పారదర్శకంగా పథకాల ప్రయోజనాలను అందించారు. పొరపాటున అర్హులెవరైనా పథకాలు అందక మిగిలిపోతే, అలాంటి వారి కోసం ఏడాదిలో రెండుసార్లు సమయం ఇచ్చి మరీ వారి చేత వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించి ప్రయోజనాలు అందించారు. మహిళల పేరిట అర్హులైన పేదలకు ఏకంగా 31 లక్షల ఇళ్ల స్థలాలను మంజూరు చేయించి నిర్మాణాలను చేపట్టారు. ఒకేసారి ఇన్ని లక్షల మందికి ఇళ్ల స్థలాలను గతంలో ఏ ప్రభుత్వాలు ఇవ్వలేదు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు పాలనలో ఇలా పారదర్శకంగా పేదలకు ప్రయోజనాలను అందజేయలేదు.

- అప్పట్లో పెన్షన్ కావాలంటే ఎవరైనా మృతి చెందితేనే కొత్త వారికి మంజూరు
- జన్మభూమి కమిటీల సిఫార్సులు, లంచాలు ఉంటేనే పథకాలు
- ఈ ఐదేళ్లలో పైసా లంచం లేకుండా పథకాలు.. అర్హతే ప్రాతిపదిక
- మరోవైపు 17 మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో, స్కూళ్లలో నాడు-నేడు
- ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు, కొత్త నిర్మాణాలకు రూ.16 వేల కోట్లు వ్యయం
- రూ.25 వేల కోట్లతో కొత్తగా నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ కేంద్రాలు
- గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీలు
- రెండేళ్లు కోవిడ్ కష్టాలున్నా ఇప్పుడే నిజమైన సంక్షేమాభివృద్ధి



గ్రామాల్లో భవనాల నిర్మాణాలు	
గ్రామ సచివాలయ భవనాలు	9,585
రైతు భరోసా కేంద్రాలు	7,436
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్	5,414

ఉద్యాన ఎగుమతులు రయ్ రయ్

▶ 7వ పేజీ తరువాయి

కూడా ఉన్నాయి. ఎక్కువగా అమెరికా, యూకే, చైనా, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, తదితర దేశాలతోపాటు యూరప్, గల్ఫ్ దేశాలకు విశాఖ, కాకినాడ, కృష్ణపట్నం, చెన్నై, కొచ్చి, ముంబై పోర్టుల నుంచి ఎగుమతి అవుతున్నాయి.

దేశంలోనే అత్యధికంగా మిరప ఎగుమతులు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతులు ఏటా సగటున 3 లక్షల టన్నులకు మించి జరగలేదు. అలాంటిది ఈ 58 నెలల్లో ఏకంగా 29.77 లక్షల టన్నులు ఎగుమతి అయ్యాయి. ఒక్క మిరప టీడీపీ ఐదేళ్లలో 12 లక్షల టన్నులు ఎగుమతి అయితే ఈ ఐదేళ్లలో ఇప్పటివరకు 16.89 లక్షల టన్నులు దాటింది. మామిడి గుజ్జు (పల్ప్) టీడీపీ హయాంలో 75 టన్నులు కూడా ఎగుమతి అయ్యేది కాదు. కానీ ఈ ఐదేళ్లలో 9.25 లక్షల టన్నులకు పైగా ఎగుమతి జరిగింది. మామిడి పండ్లు టీడీపీ హయాంలో 500 టన్నులు ఎగుమతి అయితే ఈ ఐదేళ్లలో 1,323 టన్నులకు పైగా ఎగుమతి అయ్యాయి. పంటల మార్పిడి ప్రయోగం ఫలించడంతో ఈ ఐదేళ్లలో 4 లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి. మరో వైపు స్ట్రాబెర్రీ, నట్‌మెగ్, సిన్నామన్, డ్రాగన్ ఫ్రూట్, అవకడో, జామూన్, కరండ, చెర్రీ వంటి విదేశీ పండ్ల సాగు కూడా విస్తరిస్తోంది.

తాడిపత్రి నుంచి ముంబైకి కిసాన్ రైళ్లు

టీడీపీ ఐదేళ్లలో 24 వేల టన్నుల అరటి ఎగుమతి జరిగితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఐదేళ్లలో 1.75 లక్షల టన్నులు జరిగింది. అరటి కోసం తాడిపత్రి నుండి ముంబైకి ప్రత్యేకంగా కిసాన్ రైళ్లు నడిపింది వైఎస్ జగన్ ప్రభుత్వం. ఫలితంగా దేశంలోనే అతిపెద్ద అరటి ఎగుమతిదారుగా ఏపీ నిలిచింది. ఐసీఏఆర్–ఎన్ఆర్‌సీ నుంచి బెస్ట్ స్టేట్ అవార్డు కూడా అందుకుంది. పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలు కూడా గతంతో పోలిస్తే ఎగుమతులు భారీగా పెరిగాయి. పసుపు చంద్రబాబు హయాంలో 20 వేల టన్నులే ఎగుమతి అవగా, సీఎం జగన్ ప్రభుత్వంలో ఇప్పటికే 1.49 లక్షల టన్నులు ఎగుమతి జరిగింది. జీడిపప్పు ఎగుమతులు కూడా 12,356 టన్నుల నుంచి 33,399 టన్నులకు పెరిగాయి. టమాటా, వంగ, బీర, సొర, దొండ, బెండ వంటి కూరగాయలు సైతం పొరుగు రాష్ట్రాలకు, ఉత్తరాదిలోని ప్రముఖ నగరాలకు నిత్యం సరఫరా అవుతూనే ఉన్నాయి. స్థూల వ్యవసాయ ఉత్పత్తి (జీవీఏ) ఐదేళ్లలో రూ.11వేల కోట్లకు పైగా పెరిగింది.


గుంటూరు జిల్లా పేరేచర్లలో జగనన్న కాలనీ ముఖద్వారం


సామర్లకోటలో గృహప్రవేశం చేయిస్తున్న సీఎం జగన్ (ఫైల్)


విజయవాడ రూరల్ మండలం జక్కంపూడిలో కాలనీ


ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో నిర్మితమైన ఇల్లు



ఈ ఫొటోలో సెల్ఫీ తీసుకుంటున్న టి.తిరుపతి స్వామి, వేళంగిణిలది బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామం. వీరు రెండేళ్ల క్రితం గ్రామంలోని కృష్ణా కెనాల్‌కు సంబంధించిన పిల్లకాలువ గట్టుపై పూరి గుడిసెలో నివసించేవారు. ఆ గుడిసెలోనే వేళంగిణి అమ్మ, అన్నయ్య కుటుంబాలూ ఉండేవి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ...ఈ కుటుంబం ప్రత్యక్ష నరకాన్ని అనుభవించింది. గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా...ఇంటి స్థలం మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద వేళంగిణికి ఇంటి స్థలం, ఇంటిని మంజూరు చేసి నిర్మించి ఇచ్చింది. 2022 సెప్టెంబర్‌లో ఈ కుటుంబం ఆ ఇంటిలోకి మారింది. 'నా చిన్నప్పటి నుంచి కాలువ గట్టుపై మురికి కూపంలో గుడిసెల్లోనే బతికాను. దీపం వెలుతురు తప్ప కరెంటు కనెక్షన్ ఉండేది కాదు. వర్షాలు కురిస్తే మా గుడిసె వరదనీటిలో మునిగిపోయేది. మురుగు నీరు బయటకు వెళ్లిపోయి, సాధారణ పరిస్థితి నెలకొనే వరకూ రోడ్డు పక్కనే ఉండేవాళ్లం. సాధారణ రోజుల్లోనూ మురికి నీటి కారణంగా దోమల బెడద తీవ్రంగా ఉండేది. పాములు, తేళ్లు, కీటకాలు గుడిసెల్లోకి వచ్చేసేవి. సీఎం జగన్ ప్రభుత్వం మా గోడును ఆలకించింది. ఉచితంగా ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, ఇంటినీ నిర్మించి ఇచ్చింది. గుడిసెల్లో నివాసం దినదినగండమే. కంటి నిండా నిద్రపోయిన రోజులే లేవు. ఇప్పుడు మాకంటూ ఓ సొంత ఇల్లుంది. గుడిసె కష్టాలన్నీ తొలగిపోయాయి..' అని వేళంగిణి సంతోషం వ్యక్తం చేస్తోంది.



పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని మెంటేవారితోటకు చెందిన మేడిశెట్టి దుర్గ భర్త సంచులు కుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. దుర్గ కూలి పనులకు వెళుతుంటారు. వారికి ఇద్దరు పిల్లలు. సొంత ఇల్లు లేదు. 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. దంపతుల అరకొర సంపాదన ఇంటి అద్దె, కుటుంబ పోషణకే సరిపోతుంది. సీఎం జగన్ ప్రభుత్వంలో దుర్గకు విస్సాకోడేరు జగనన్న లే అవుట్‌లో స్థలంతో పాటు ఇల్లు మంజూరయింది. ప్రభుత్వ సాయం రూ.1.80 లక్షలకు, కొంత సొంత నగదు జోడించి ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్నారు. ఇప్పుడు అద్దె బాధలు తప్పాయని ఆ కుటుంబం సంబరంగా చెబుతోంది. ఇక్కడ సెంటు స్థలం రూ.4 లక్షలు ఉంటుందని, జగనన్న దయతోనే తమ కల నెరవేరిందని ఈ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మా పిల్లలైనా సొంతింటిలో జీవించాలని మాకు కోరిక. సీఎం జగన్ మా కోరికను నెరవేర్చారని భావోద్వేగానికి గురయ్యారు.

నిన్నటి కన్నా ఈ రోజు బాగుండాలి...ఈ రోజు కన్నా రేపు బాగుండాలి...ఎవరైనా కోరుకునేది ఇదే...సగటు మనిషి కాస్తంత నీడ కోసం పరితపిస్తాడు...తన సంపాదన ఓ చిన్న గూడును కట్టుకోవడానికీ చాలకపోతే ప్రభుత్వం సాయపడుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తాడు...ప్రభుత్వం ఓట్ల కోసం తప్పుడు వాగ్దానం చేసి అధికారంలోకి వస్తే మోసపోయానే...అని తనలో తానే మథనపడతాడు...మోసమనే ఇటుకతో గాలిలో మేడలు కట్టిన చంద్రబాబు ప్రభుత్వం నిరుపేదలను ఇలాగే వంచించింది... ఆ వంచనకు శాస్తిగా బాబును చిత్తుగా ఓడించింది జనసామాన్యం...ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలకు ఆచరణ రూపమిస్తే జననీరాజనం ఎలా ఉంటుందో నేడు జగన్ మేం సిద్ధం యాత్ర సాక్ష్యంగా నిరూపిస్తోంది...ఆ హామీ పేరు పేదలకు ఇళ్లు...అర్హతే ప్రాతిపదికగా దేశంలోనే రికార్డుగా...ఒక ఘనతగా చెప్పేలా 31 లక్షల మంది అక్క చెల్లెమ్మల సొంతింటి కలకు గాలిలో కాదు...నేలపైనే మేడలు...ఇంకా చెప్పాలంటే ఊళ్లకు ఊళ్లను నిర్మిస్తూ...నవ్యాంధ్ర చరితను సీఎం జగన్ తిరగరాస్తున్నారు... స్థలం విలువ ఆధారంగా చూస్తే ఒక్కొక్కరికి రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల ఆస్తిని ఉచితంగా కట్టబెట్టిన ప్రభుత్వాన్ని ఇప్పుడే చూస్తున్నామని జనసామాన్యమే ఉప్పొంగిపోతోంది...ఇది కదా మాటకు కట్టుబడి... మడమ తిప్పని ప్రభుత్వానికి సార్థకత.

-వద్దే బాలశేఖర్, సాక్షి ప్రతినిధి

• పేదలకు ఇళ్లు
కాలనీలు కాదు ఊళ్లు

నిరుపేదల సొంతింటి కల సాకారం

- నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు అమలు
- దేశంలోనే రికార్డుగా 31.19 లక్షల మంది మహిళలకు ఇంటి పట్టాలు
- స్థలాలపై సర్వహక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు
- 21.75 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు
- అనతికాలంలోనే 9 లక్షలకు పైగా ఇళ్ల పూర్తి
- టీడీపీ మోకాలడ్డినా లక్ష్యసాధనలో జగన్ ముందంజ


కాకినాడ జిల్లా సామర్లకోట వైఎస్సార్ జగనన్న కాలనీ

ప్రతి పేదవాడు ఏం కోరుకుంటాడు? 'కడుపు నింపుకోవడానికి గుప్పెడు మెతుకులు, తలదాచుకోవడానికి ఓ సొంత గూడు'.. అయితే దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా తమకంటూ ఓ సొంత గూడు లేని పేదలు ఎందరో ఉన్నారు. ఆ కోవకు చెందిన వేళంగిణి, దుర్గ తరహాలనే రాష్ట్రంలో తమకంటూ ఓ పక్కా ఇల్లు ఉండాలనే ప్రతి పేదింటి అక్క చెల్లెమ్మల చిరకాల స్వప్నాన్ని తొబుట్టువుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. రాష్ట్ర, దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పేదలకు పెద్ద ఎత్తున ఉచితంగా ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇంటి నిర్మాణానికి సాయం, కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన ఇలా ప్రతి అడుగులోనూ చేయి పట్టి అక్కచెల్లెమ్మలను ముందుకు నడిపారు. ఇదిలా ఉండగా 40 ఇయర్స్ ఇండస్ట్రీ, విజనరీ లీడర్ అని చెప్పుకునే చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశానాలతో పోల్చిన దుస్థితి. ఉమ్మడి రాష్ట్రంలో రెండు సార్లు, విభజిత ఏపీలో ఒక పర్యాయం సీఎంగా పనిచేసిన ఈ పెద్ద మనిషి ఏనాడు పేదల గూడు గోడును పట్టించుకోలేదు.

అడ్డంకులను అధిగమిస్తూ...

రాష్ట్రంలో పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం రూపంలో ఏకంగా కొత్తగా ఊళ్లకు ఊళ్లనే సీఎం జగన్ గడిచిన ఐదేళ్లలో నిర్మించ తలపెట్టారు. 71,811 ఎకరాల్లో 31.19 లక్షల మంది నిరుపేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. తద్వారా 17,005 వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊళ్లనే నెలకొల్పారు. పేదలకు పంపిణీ చేసిన ఒక్కో ప్లాట్ విలువ రూ.2.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంటుంది. ఈ లెక్కన ఏకంగా పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ప్లాట్‌ల మార్కెట్ విలువ రూ.76 వేల కోట్లకు పైమాటే. నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల సాకారానికి చిత్తశుద్ధితో సీఎం జగన్ అడుగులు వేస్తుండటంతో తన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అడుగడుగునా పథకాన్ని చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ, తమ మద్దతుదారుల ద్వారా కోర్టుల్లో 1,000 కేసులను వేయించి, ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణాలను పలు సందర్భాల్లో అడ్డుకున్నారు. ఈ అడ్డంకులేవీ జగన్ మనోధైర్యాన్ని సడలనివ్వలేదు. దేశంలోనే తొలిసారిగా ఉచితంగా పంపిణీ చేసిన స్థలాలపై లబ్ధిదారులకు సర్వహక్కులను సీఎం జగన్ ప్రభుత్వం కల్పించింది. వారి పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ అందించింది. 2024లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టి 15 లక్షల మందికి రిజిస్ట్రేషన్లు చేసి ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మిగిలిన రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు.

పథకం అమలులో కీలక ఘట్టాలు

- **2020 డిసెంబర్:** 25 లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ. తొలిదశలో 15.60 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు.
- **28 ఏప్రిల్ 2022:** పథకంలో రెండో దశకు శ్రీకారం. 1.24 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ. 3.53 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు.
- **27 మే 2023:** సీఆర్‌డీఏలో రూ.3,506 కోట్ల మార్కెట్ విలువ కలిగిన 1,402.58 ఎకరాల భూమి 50,793 మంది అక్కచెల్లెమ్మలకు పంపిణీ.
- **24 జూలై 2023:** సీఆర్‌డీఏలో 47,071 పేదల ఇళ్ల నిర్మాణాలకు సీఎం జగన్ శంకుస్థాపన.

పేదల తరపున పెత్తందారులతో యుద్ధం

అమరావతిలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలకు చెందిన నిరుపేదలకు సీఎం జగన్ ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే సామాజిక అసమతుల్యత (డెమోగ్రాఫిక్ ఇంబ్యాలెన్స్) ఏర్పడుతుందని టీడీపీ కోర్టులకు వెళ్లి స్టే తెచ్చింది. అయినా జగన్ మనోబలం సడలిపోలేదు. పేదల తరపున పెత్తందారులతో సీఎం జగన్ ప్రభుత్వం యుద్ధం చేసింది. హైకోర్టు, సుప్రీం కోర్టులకు వెళ్లి విజయం సాధించి గత ఏడాది 50,793 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పేదలకు అమరావతిలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దంటూ కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ మద్దతుదారులు అనేక ఫిర్యాదులు చేశారు. ఈ అడ్డంకులను సైతం అధిగమించి అనుమతులు రాబట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి గత ఏడాది జూలై 24న సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ టీడీపీ పేదల ఇళ్లకు అడ్డుపడుతూ తన కపట బుద్ధిని ప్రదర్శించింది. మరోమారు కోర్టుకు వెళ్లి పేదల ఇళ్ల నిర్మాణంపై స్టే తెచ్చి నిర్మాణాలను అడ్డుకుంది.

రికార్డు స్థాయిలో

31.19 లక్షల ఇళ్ల పట్టాలు రికార్డు సృష్టించడమే కాకుండా, కరోనా, కోర్టు కేసులు, ఇతర అడ్డంకులను ఎదురొడ్డి అనతికాలంలో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలను చేపట్టి మరో సరికొత్త రికార్డును సీఎం జగన్ కైవసం చేసుకున్నారు. 2020 డిసెంబర్‌లో ఇళ్ల స్థలాల పంపిణీ అనంతరం వివిధ దశలుగా 21.75 లక్షల ఇళ్ల (19.13 లక్షలు సాధారణ ఇళ్లు, 2.62 లక్షలు టిడ్కో ఇళ్లు) నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వీటిలో ఇప్పటికే 9 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మిగిలినవి శరవేగంగా నిర్మితమవుతున్నాయి. సాధారణ ఇళ్లలో 11.61 లక్షల గృహాలు వివిధ దశల్లో నిర్మాణం పూర్తి చేసుకుంటున్నాయి. 2020 డిసెంబర్ 25న కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో పట్టాలను పంపిణీ చేయడంతో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కేవలం మూడేళ్ల నాలుగు నెలల్లోనే రికార్డు స్థాయిలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు అందించారు.

ఉచితంగా స్థలం... ఆపై అమిత సాయం

ఇళ్ల లబ్ధిదారులకు ఖరీదైన స్థలాలను ఉచితంగా పంపిణీ చేసిన సీఎం జగన్ ప్రభుత్వం అక్కడితో ఆగలేదు. ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షల బిల్లు మంజూరు చేయడంతో పాటు, ఎస్‌హెచ్‌జీల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేల రుణ సాయం అందించింది. ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం ద్వారా రూ.15 వేలు, స్టీల్, సిమెంట్, ఇలా 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా చేయడం ద్వారా మరో రూ.40 వేల చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున ప్రయోజనం చేకూర్చింది.

గేటెడ్ కమ్యూనిటీల తరహాలో...

పేదలకు సొంత గూడు కల్పించడమే కాకుండా కాలనీలను ప్రైవేట్ గేటెడ్ కమ్యూనిటీల తరహాలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. విశాలమైన రోడ్లు, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ, పార్కులు, ఇంటర్నెట్ సహా అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఈ క్రమంలో మౌలిక సదుపాయాల కల్పన కోసమే ఏకంగా రూ.32,909 కోట్లను వెచ్చిస్తోంది.

చంద్రబాబు రూ.8,929.81కోట్ల అవినీతి

చంద్రబాబు తన అక్రమాలకు పట్టణాల్లో ఇల్లు లేని నిరుపేదల జీవితాలను 'తాకట్టు' పెట్టారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టించేందుకు 2016–17లో రాష్ట్రంలో అధికంగా నిర్మాణ వ్యయాన్ని చూపి లబ్ధిదారులను దోచుకున్నారు. ఏపీ టిడ్కో ద్వారా రాష్ట్రంలోని పట్టణాల్లో నివశిస్తున్న ఇళ్లు లేని 5 లక్షల మందికి ప్రభుత్వ స్థలాల్లో 300, 365, 415 చ.అ విస్తీర్ణంలో జీ+3 విధానంలో ఫ్లాట్లు కట్టిస్తామని చెప్పారు. 300 చ.గ విస్తీర్ణం గల ఫ్లాట్‌కు రూ.2.60 లక్షల ధర నిర్ణయించి బ్యాంకు రుణాలు ఇప్పించి, నెలకు రూ.3 వేల చొప్పున 20 ఏళ్లు చెల్లించాలని (రూ.7.20 లక్షలు) షరతు పెట్టారు. ఇలా నిర్మాణ కంపెనీల నుంచి ముడుపులు తీసుకుని, అధికంగా ముడుపులు ఇచ్చుకున్న కంపెనీకి అధిక ధరకు, తక్కువగా ఇచ్చిన కంపెనీకి తక్కువ ధరకు నిర్మాణ అనుమతులు కట్టబెట్టింది. 2016–17లో మార్కెట్‌లో చ.అడుగు నిర్మాణ ధర రూ.900 నుంచి రూ.1,000 మధ్య ఉండగా... కంపెనీలకు రూ.2,534.75 నుంచి రూ.2034.59గా నిర్ణయించి సగటు చ.అ నిర్మాణ ధర రూ.2,203.45గా చెల్లించారు. అంటే అప్పటి మార్కెట్ ధరతో పోలిస్తే రూ.1,203.45 అదనంగా నిరుపేదల నుంచి వసూలు చేశారు. ప్రభుత్వం చేపట్టే నిర్మాణాలకు మార్కెట్ ధర కంటే తగ్గాల్సింది పోయి భారీగా పెంచేశారు. ఇలా తలపెట్టిన 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు చాలినంత భూమి లేదని 3.15 లక్షల ఇళ్లకే శ్రీకారం చుట్టింది. తొలి విడతగా 2,08,160 యూనిట్లను 7,42,01,820 చ.అ. విస్తీర్ణంలో నిర్మించేందుకు అనుమతులిచ్చి రూ.8,929.81 కోట్ల అవినీతికి పాల్పడింది. పేదలు 300 చ.అ. ఇంటికి బాబు ప్రభుత్వం రూ.7.20 లక్షల భారం మోపి, 20 ఏళ్ల పాటు వాయిదాలు కట్టాలని షరతు పెట్టింది. దీని ప్రకారం లబ్ధిదారులపై రూ.3,805 భారం మోపింది. ఇంకా 365 చ.అ. ఇంటికి రూ.50 వేలు, 430 చ.అ. ఇంటికి రూ.లక్ష వసూలు చేసింది.



కోర్టులనూ మోసం చేసిన టీడీపీ...

మహిళల పేరిటే ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఎందుకివ్వాలనే అభ్యంతరాలతో హైకోర్టులో తెనాలికి చెందిన పాదిలి శివమురళి, మరో 128 మంది పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం 2021లో ఇళ్ల నిర్మాణంపై స్టే ఇచ్చింది. కొద్ది రోజుల తర్వాత తాము కోర్టులో పిటిషన్ వేయలేదంటూ వారు వెల్లడించారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ దళారులు పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామంటూ ఆధార్, రేషన్ కార్డులతో పాటు, వారి సంతకాలు, రూ.5 వేల నుంచి రూ.40 వేల వరకూ డబ్బు వసూళ్లు చేశారు. ఇలా మా నుంచి తీసుకున్న ధ్రువపత్రాలతో మాకే తెలియకుండా కోర్టుల్లో టీడీపీ నాయకులే కేసులు వేశారంటూ అప్పట్లో పేదలు బయటకు వచ్చి చెప్పారు. యర్రజర్ల కాల్వ సమస్యకు ఫిర్యాదు చేద్దామంటూ బల్లి ప్రభాకర్‌రావు, జాజుల హరికృష్ణ అనే ఇద్దరు వ్యక్తుల నుంచి తెల్ల కాగితంపై సంతకం, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు తీసుకుని ఇళ్ల పట్టాల పంపిణీపైనా టీడీపీ నాయకులు కోర్టులో కేసులు వేశారు. తమను టీడీపీ నాయకులు మోసగించినదానిపై లిఖితపూర్వకంగా వివరించారు.




వెల్లటూరు లబ్ధిదారులు పూర్వం నివసించిన స్థలం

వైఎస్సార్ జగనన్న కాలనీలోని ఇళ్లు



బాబు చేతిలో దగాపడ్డ టిడ్కో లబ్ధిదారులకు అండగా

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 88 పట్టణ స్థానిక సంస్థల (యూఎల్బీ) పరిధిలోని 163 ప్రాంతాల్లో జీ+3 విధానంలో ప్రభుత్వం 2,62,212 టిడ్కో ఇళ్లను నిర్మిస్తోంది. పేదలకు కేటాయించిన 300 చ.అ. ఇంటిని ఉచితంగా (రూ.1కి) ఇవ్వడంతో 1,43,600 మంది లబ్ధిదారులకు ఈఎంఐ రూపంలో చెల్లించే రూ.10,339 కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తోంది. 365 చ.అ ఇళ్లలో 44,304 మంది లబ్ధిదారులు రూ.50 వేలు, 430 చ.అ. ఇళ్లలో 74,312 మంది లబ్ధిదారులు రూ. లక్ష చొప్పున వాటా చెల్లించాలనే నిబంధనలో సగానికి తగ్గించి, మిగతా సగం వాటా నగదు రూ.482.32 కోట్లను ఈ ప్రభుత్వమే చెల్లించింది. దీంతో రెండు, మూడు కేటగిరీల పేదలు గత ధరల ప్రకారం చెల్లించాల్సిన రూ.10,797 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఆ మొత్తం రూ.4,590 కోట్లకు ఈ సర్కారు తగ్గించింది. విద్యుత్, రోడ్లు వంటి అన్ని వసతుల కేటగిరీల ఇళ్ల లబ్ధిదారులకు సేల్‌డీడ్, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, యూజర్ చార్జీలు భరించడంతో లబ్ధిదారులు మొత్తం రూ.5,487.32 కోట్ల మేలు పొందారు. మొత్తం ఇళ్లలో ఫేజ్–1 కింద 1,51,298 ఇళ్లను నూరు శాతం నిర్మాణం పూర్తి చేసి, 1.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించింది.

వాళ్లిప్పుడు లక్షాధికారులు

ఒకప్పుడు అద్దె ఇళ్లలో, పూరిగుడిసెల్లో ఎన్నో అగచాట్లు, ఇబ్బందులు పడ్డ మహిళలు, నిరుపేద కుటుంబాలు సీఎం జగన్ చొరవతో లక్షాధికారులుగా మారారు. అది ఎలాగంటే... మహిళల పేరిట రూ.2.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ విలువ చేసే స్థలాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికీ సాయం చేశారు. స్థలం, ఇంటి రూపంలో ప్రతి పేదింటి అక్కచెల్లెమ్మ పేరిట ప్రాంతాన్ని బట్టి రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ మార్కెట్ విలువ చేసే స్థిరాస్తి సమకూరినట్లయింది. ఇలా రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల మేర సంపదను ప్రభుత్వం సృష్టించింది.

జగనన్న కాలనీల్లో శాశ్వత సదుపాయాల కల్పన వ్యయం రూ.కోట్లలో

అంశం	వ్యయం
నీటి సరఫరా	3,847.18
డ్రైన్లు	5,927.78
విద్యుత్	4,431.26
ఇంటర్నెట్	707.48
ఆర్చ్‌లు	347.34
ఇంకుడు గుంతలు	108
రోడ్లు	10,408
ఫేజ్ 2	7,131.96
మొత్తం	32,909


విశాఖ జిల్లాలో గృహప్రవేశం చేసుకుంటున్న దంపతులు

ప్రభుత్వం నుంచి ఇంటి స్థలాలు ఉచితంగా పొందిన వివిధ వర్గాల లబ్ధిదారుల వివరాలు ఇలా

వర్గం	శాతం
ఎస్సీలు	20
ఎస్టీలు	6
బీసీలు	54
ఇతరులు	20





సమాజంలో గౌరవం పెరిగింది.

నా భర్త భవన నిర్మాణ కార్మికుడు. మాకు సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంటిలో ఉంటున్నాము. ఓ వైపు పిల్లల చదువులు, మరోవైపు ఇంటి అద్దెలు. కుటుంబ పోషణ భారం. మా అద్దె ఇంటి కష్టాల నుంచి ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. ఎటువంటి సిఫార్సులు లేకుండా ఇంటి స్థలాన్ని ప్రభుత్వం కేటాయించి ఇంటిస్థలం రిజిస్ట్రేషన్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. జగనన్న దయతో సొంతింటి భాగ్యం కలిగింది. గతంలో మాకంటూ సొంతిల్లు లేదని బంధువులు, సన్నిహితుల్లో చిన్న చూపు ఉండేది. ప్రస్తుతం ఆ సమస్య లేదు. సమాజంలో మాకు గౌరవమూ పెరిగింది.

– మీసాల వనజాక్షి, వైఎస్సార్ జగనన్న కాలనీ, పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా



మాగోడు విన్న నేత సీఎం కావాలి

నా భర్త భానుప్రసాద్ పెయింటింగ్ పని చేస్తారు. మా ఇద్దరు పిల్లలతో కలిసి మా అత్తమ్మ వాళ్లింట్లో ఉండేవాళ్లం. ఒకే ఒక గది. ఆ గదిలోనే వంట చేసుకోవాలి. ఇరుకు ఇంట్లో ఉండడం వల్ల అనేక ఇబ్బందులు పడ్డాం. మా కష్టాలను సీఎం జగన్ ప్రభుత్వం ఆలకించింది. ఇంటి స్థలంతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల రుణమూ ఇచ్చింది. ఇప్పుడు మాకు రూ.15 లక్షలకు పైగా విలువైన సొంత ఆస్తి ఉంది. మా గూడు గోడు విని, గోడు తీర్చిన నేతనే సీఎంగా మళ్లీ కావాలి. ఆయన్ని మేం సీఎం చేసుకుని తీరుతాం.

– బుడితి బాలామణి, దగ్గులూరు, పశ్చిమగోదావరి జిల్లా